# జుమ్మా

కేంద్రసాహిత్య అకాడెమి
యువపురస్కారం
పొందిన కథలు

వేంపల్లె షరీఫ్



# జుమ్మా

కథలు

వేంపల్లె షరీఫ్

# JUMMA

*Collection of Short Stories*
*by*
**Vempalle Shariff**
shariffvempalli@gmail.com

© With Writer

**Sufi Prachuranalu**
C/o sabina parlapati,
6-3-582/4/a, Anand Nagar Colony,
Khairathabad, Hyderabad -04.
Cell : 96034 29366

First Edition: *August, 2011*
Second Edition: *February, 2014*

***Cover design***
**Lepakshi**

***Cover Title***
**Akbar**

***Copies available at***
**Visalandhra Book House,** Bank Street, Hyd. and its branches in A.P., **Prajashakti Book House,** Hyd. and its branches in A.P., **Navodaya Book House,** Kachiguda, Hyd., **Navodaya Publishers,** Eluru Road, Vijayawada.

E-book: www.kinige.com

*Composed & Designed at*
**Akshara Creators**
Hyderguda, Hyderabad-029. Ph.:23244088.

*Printed at*
**Charita Impressions**
Hyderabad. Ph.: 040-27678411

₹ **125.**



జేజికి...

# నా పాలిట దేవుడు మా మాబ్బాష మామ

అంతవరకు నన్ను మా ఇంట్లో ఓ మెంటలోడి కింద లెక్కకట్టేవాళ్లు.

ఉదయం, సాయంత్రం మిద్దెపైకెక్కి ఆకాశంలోకి చూస్తూ, ఆలోచిస్తూ, పేజీలకు పేజీలు ఏవేవో పిచ్చి రాతలు రాస్తూ అవే మహాకావ్యాలని మురిసిపోతున్న రోజులవి.

ఆలోచన మంచిదైనా, చెడ్డదైనా అనుకుంది వచ్చేంతవరకు రాజీ పడకుండా రాసి చూసుకునే అలవాటు అప్పటి నుంచే నాకుంది. రాసిందే పదిసార్లు రాసి.. రాసిందేదీ నచ్చక మిద్దెనిండా కాగితాలు చింపి పారేసేవాణ్ని.

“ఏమి ఈ మెంటలోడు.. రాచ్చాడు.. పారేచ్చాడు... రాచ్చాడు... పారేచ్చాడు... ఓరేయ్ మెంటలోడా... మిద్దె మింద కాగితాలు చింపి పారేసినావంటే చూసుకో... నీ డొక్క చించి పారేస్తాను..” అని అమ్మ అరిచేది కసువు నూకలేక.

సరిగ్గా ఆ టైంలోనే మా మాబ్బాష మామ నాకోసం దేవుడై వేముల నుంచి దిగినాడు.

ఎప్పుడు చూసినాడో కానీ గూట్లో పెట్టిన నా రాతల బుక్కు చూసి డంగై పోయాడు. ఆరోజే చాలా సీరియస్‌గా చెప్పేశాడు... ‘వీడు పెద్దయ్యాక రైటర్ అవుతాడ’ని.

“క్కో... వీణ్నేమనగాకుక్కా... వీడు పెద్దాయినాక. కాయంగా ఏదో అయి తాడు... అయి పెద్దగా లెక్క సంపాయిచ్చాడు..,” అన్నాడు మామ.

“ వీడా...?” అని నోరెళ్లబెట్టింది మా అమ్మ.

"ఆ..వీడే..! అబ్బబ్బా... ఏమి రాచ్చాండాడక్కా వీడు.., వీడి వయసుకి రాతలకి సమ్మoదమే లేదు. ఏదీ ఒకసారి సదివి వినిపిచ్చరా..." అన్నాడు మామ నన్ను ఆకాశానికెత్తేస్తూ.

గతుక్కుమన్నాను.

ఇన్నాళ్లు నాలో నేను రాసుకుని మురిసిపోయిందే కానీ ఇంకొక్కరికి పైకి చదివి వినిపించింది లేదు.

సరే... నా గురించి మా అమ్మోళ్లందరికీ ఇంతగా చెప్పిన మామ పరువు తీయకూడదనుకున్నాను.

రాసింది వినిపించే సరికి ఒక్కరికీ ఒక్క ముక్క అర్థమైతే ఒట్టు. కానీ ఏదో పెద్ద పెద్ద మాటలే రాశానని మాత్రం వాళ్లకు అర్థమైంది. నాకు మాత్రమే అర్థమయ్యే భాషలో నేను రాసుకున్నానని అంతవరకు నాకూ తెలీదు. ప్రతి మాటకి అర్థం వివరించి చెప్పేసరికి నిజంగానే నన్ను ఓ రేంజ్‌లో ఊహించుకుని ఆ తర్వాత నన్నూ, నా రాతల్ని ఎవరూ చిన్నచూపు చూడలేదు.

అలా మా ఇంట్లో అమాంతం నా స్థాయి పెంచేసి నాలో రచనాసక్తిని మరింత పెంచిన మహానుభావుడు మా మామ. మా మాబ్బాష మామే గనుక లేకుంటే మా వాళ్లు ఎప్పుడో నన్ను మెంటలాస్పత్రిలో చేర్చేసేవాళ్లనేది మాత్రం గ్యారెంటీ.

తర్వాత్తర్వాత ఇలాగే  ఓరోజు మా ఇంటికొచ్చిన మామ తన మనసులో మాట  చెప్పాడు-

"ఒరే మేనల్లుడా... నాగ్గుడక ఇలా రాయాలని ఉండాదిరా... సినిమా కథలు రాసి రైటర్ అవ్వాలని కోరిక. ఏమంటే దేవుడు పెద్దగా సదువియ్యక (రెండో తరగతి) నేను ఈడ్నే సిక్కుబడిపోయినాను. ఇన్నాళ్లకు నాకు నువ్వొకడివి దొరికినావు. నేను కాలేకపోయినా కానీ నువ్వు మాత్రం పెద్ద రైటర్ కావాల్రా..." అని.

అద్దె ఆటో తోలితే కానీ పూట గడవని మా మామ... నన్ను తీసుకెళ్లి మూణ్ణెల్లు ఇంట్లో ఉంచుకుని "నీకేం పని చెప్పను.. తింటూ ఉండు.. రాసుకుంటూ ఉండు. ఇక్కడ నీకెవరూ అడ్డు లేరు..." అని ఫుల్ స్వేచ్ఛనిచ్చాడు. నా రాతలంటే అంత గౌరవం... అంత నమ్మకం మామకు.

అప్పటికే పిల్లల కథలు రాయడం నేర్చుకున్న నేను అచ్చయిన వాటిని చూపించి మా మామని మరింత ఆశ్చర్యంలో, ఆనందంలో ముంచెత్తేవాణ్ణి. అచ్చులో నా పేరు చూసి నా మీద తన నమ్మకాన్ని మరింత పెంచుకున్నాడు మామ.

ఇంట్లో ఉంచుకుని తేరగా తిండి పెడుతోందే గాక సైలెంటుగా మా నాన్నమ్మకు తెలియకుండా సెకండ్ షో సినిమాలకు తీసుకెళ్లి వాటిమీద రేయంతా చర్చలు పెట్టేవాడు. బారెడు పొద్దెక్కాక నిద్రలేచి అప్పుడు ఆటో తీస్తే అద్దె డబ్బులు కూడా రావని మా నాన్నమ్మ నెత్తీ, నోరూ కొట్టుకునేది. సెపరేటుగా నన్నేమీ అనకపోయినా ఆ దోషంలో నాక్కూడా భాగముంది కాబట్టి తేలు కుట్టిన దొంగలా మౌనంగా ఉండిపోయేవాణ్ని.

నాకు పేపర్‌లో ఉద్యోగం కావాలంటే అది తనవల్ల కాని పని అని తెలిసి కూడా ఆ రెడ్డీ... ఈ రెడ్డీ కాళ్లు పట్టుకుని నా గురించి, నా రాతల గురించి గొప్పగా చెప్పి ఉద్యోగం ఇప్పించమని బతిమాలినాడు. ఆటోను బాడిగలకు తిప్పడం మానేసి నా కోసం తిప్పినాడు. ఆటో ఓనరుకు వారాల తరబడి బాడిగ అప్పు పడినాడు. ఆ దినాలు ఇంకా నా కళ్ల ముందే కదలాడుతుంటే... నేనెట్లా మా మాబ్బాష మామను మర్చిపోగలను. నేనివ్వాళ ఈ పుస్తకం వేసుకుంటున్నానంటే అందుకు మామ ఇచ్చిన ప్రోత్సాహమే కారణమని గర్వంగా చెప్పుకుంటున్నాను. మామ ప్రోత్సాహంతో నేను నాలుగు రాతలు నేర్చుకుని ఇప్పుడు ఉద్యోగం చేసుకుంటూ సుఖంగా ఉంటే- మా మామ మాత్రం ఇప్పటికీ అదే అద్దె ఆటో తోలుకుంటూ అదే సగం కడుపుతో పడుకుంటున్నాడు.

మామ మేలు గుర్తుంచుకుంటూనే- ఇవ్వాళ ఏ అక్షరాన్నయితే నమ్ముకుని నాలుగు ముద్దలు మింగుతున్నానో ఆ అక్షరం నేర్పిన మా రామిరెడ్డి అయ్యవారికి,

నన్ను మా రామిరెడ్డి అయ్యవారి దగ్గరికి తోలి తమకు లేని చదువు తమ బిడ్డకెందుకు అనుకోకుండా నాలుగు ముక్కలు చెప్పించిన అమ్మానాన్నలకి మనస్ఫూర్తిగా నమస్కారాలు తెలుపుకుంటున్నాను.

ఇంకా... బతుకుతెరువును వెతుక్కుంటూ హైదరాబాద్ వచ్చిన తర్వాత నా దారిని సరైన దిశకు మళ్లించి మంచి కథలు రాసేలా ఊతమిచ్చిన ఆంధ్రజ్యోతి ఫీచర్స్ ఎడిటర్ వేమన వసంతలక్ష్మి మేడమ్‌కి.., మహమ్మద్ ఖదీర్‌బాబు అన్నయ్యకి, ఎండి యాకూబ్ పాషాకి, మల్లంపల్లి సాంబశివరావుకి, అక్బర్‌కి, స్కైబాబాకి ప్రత్యేకంగా కృతజ్ఞతలు.

తప్పులు దిద్దిన టి. చంద్రశేఖరరెడ్డికి, శ్రేయోభిలాషి, మిత్రుడు షేక్ మహమూద్ బాషాకి, అడగ్గానే ముందుమాట రాసిన కేతు విశ్వనాథరెడ్డిగారికి, ఫోన్ల మీద ఫోన్లు చేసి విసిగించినా విసుక్కోకుండా నా కథల మీద నాలుగు ముక్కలు రాసిచ్చిన నాకెంతో ఇష్టమైన రచయిత దాదాహయాత్‌గారికి... షుక్రియా.

**వేంపల్లె షరీఫ్**

*1 ఆగస్టు 2011, హైదరాబాద్*

# నేల విడిచి సాము చెయ్యని కథలు

## కేతు విశ్వనాథరెడ్డి

2009 సెప్టెంబరులోనో, అక్టోబరులోనో అమెరికాలో ఉంటున్న ప్రముఖ పత్రికా రచయిత, సాహితీపరులు, అనువాదకులు దాసు కృష్ణమూర్తి ఫోన్ చేశారు. అప్పుడు వర్జీనియాలో నేను, మా ఆవిడ మా అబ్బాయి శశికాంత్ కుటుంబంతో ఉంటున్నాం. వేంపల్లె షరీఫ్ రాసిన 'దస్తగిరి చెట్టు'ను తాను ఇంగ్లీష్‌లోకి అనువదిస్తున్నట్టు చెప్పారు. అనువదించే సందర్భంలో ఎదురైన సమస్యల్ని చర్చించారు. ముఖ్యంగా దస్తగిరి చెట్టు అంటే ఏమిటి? అని అడిగారు. ఆ వివరణ ఇచ్చాను. కొన్ని ఉర్దూ మాటలకి అర్థాలు కూడా అడిగారు. అనువాదం పూర్తయిన తర్వాత ప్రతిని ఈమెయిల్ ద్వారా పంపిస్తానని, చూసి అభిప్రాయం చెప్పమన్నారు. అట్లాగే మరో వారంరోజుల్లో ఇంగ్లీష్ ప్రతిని పంపించారు. చూసి ఫోన్‌లోనే ఆ అనువాదం బావుందని చెప్పాను. ఆ సందర్భంలో ఆయన ఒక మాటన్నారు.

"మీరు సూచించిన రచయితల్లో ఎక్కువమంది మంచి కథలు రాస్తున్న వాళు ళ్ళ మీ ప్రాంతం వాళ్ళే ఉన్నట్టుందే," అని, "కథల నేపథ్య చిత్రణ, పాత్రల చిత్రణ, తీసుకునే ఇతివృత్తాన్ని బట్టి ఈ మాట అంటున్నా,"నని కూడా చెప్పారు.

ముఖ్యంగా కడప నుంచి కథలు రాస్తున్న సత్యాగ్ని (షేక్ హుస్సేన్), శశిశ్రీ, దాదాహయాత్, వేంపల్లె షరీఫ్ గుర్తుండి ఆ మాటలు అని ఉండవచ్చు. దాసు కృష్ణమూర్తిగారు అప్పుడు తెలుగు ముస్లిం కథకుల కథలను ఇంగ్లీషులోకి అనువ

దించే పనిలో ఉన్నారు. తర్వాత్తర్వాత వేంపల్లె షరీఫ్ 'పర్దా', 'రజాక్‌మియా సేద్యం'తో పాటు మరిన్ని కథల్ని కూడా ఆయన అనువదించారు.

దాసు కృష్ణమూర్తి వంటి ఎనభై ఏళ్ళు పైబడిన మంచి అనువాదకులు 'లిటరరీ వాయిసెస్ ఆఫ్ ఇండియా' అనే వెబ్‌సైట్ కోసం తాను ఎన్నుకున్న కథానువాదాల పథకంలో వర్ధమాన కథకుడైన షరీఫ్ చేరడం ఆశ్చర్యమూ కాదు సిఫారసుల మహిమా కాదు.

ఈనాటి వర్ధమాన కథకులు ఇంతవరకూ బలవంతంగా మూసిన బహు ముఖ సామాజిక జీవిత భవనానికున్న కిటికీలను తెరిచారు. గతంలో కంటే విస్తార మైన జీవన స్వేచ్ఛావాయువును ప్రసరింపజేసే వీలు కల్పించారు. ఈ మాటనే మరో రకంగా చెప్పాలంటే ఈనాడు సగటు సాహిత్య పాఠకుడికి మునుపటి కంటే వివిధ సముదాయాల జీవితం తెలిసి వస్తోంది. ఇది ఎంత విస్తృతంగా సాగితే మన సంస్కారం అంత ముందుకు వెళ్ళే అవకాశం ఉంటుంది.

వేంపల్లె షరీఫ్ కథల్లోని జీవితం తెలుగు జీవితం. భారతీయ సమాజంలోని ఒక సముదాయమైన గ్రామీణ పేద ముస్లిం పిల్లలు, యువతీ యువకులు, తల్లి దండ్రులు, నాన్నమ్మలు, అమ్మమ్మలు- వీళ్ళందరి అస్తిత్వవేదనను, ఘర్షణను, ఆకాంక్షలను, విఫల మనోరథాలను, భౌతిక మానసిక జీవితాలను చిత్రించడాన్ని ఈ కథల్లో చూడవచ్చు. ఈ కథల్లో సన్నకారు రైతుల కష్టనిష్ఠూరాలు, వృత్తి బాధలు, నిమ్మకాయల వ్యాపారంలాంటి వ్యాపారంలోని ఎగుడుదిగుళ్ళు, మతపరమైన కట్టు బాట్లు, ప్రధానంగా స్త్రీల అగచాట్లు కనిపిస్తాయి.

షరీఫ్ 'పర్దా', 'ఆకుపచ్చ ముగ్గు' కథల గురించి రెండు మాటలు- పర్దాలోని జేజి పల్లెటూరి అనుభవాలు, ఆమె పట్నానికి వొచ్చినప్పుడు కొడుకు కట్టుబాట్ల మధ్య కనిపించే అంతరం కేవలం 'పర్దా'కు సంబంధించినదే కాదు, అది గ్రామీణ జీవితం లో కట్టుబాట్లు లేని బాల్యం నుంచి బిడ్డ పస్తులున్నప్పుడు ఇల్లిల్లు తిరిగి ఏ ఘోషా లేకుండా అడుక్కొని బిడ్డ పస్తును తీర్చిన దారిద్ర్య జీవితమైన అంతర్మథనం నుంచి, వేదన నుంచి పుట్టినటువంటిది. గుమ్మానికున్న పర్దాను సర్ది పట్టుకొని నీళ్ళు నిండిన కళ్ళతో జేజి వైపు చూస్తుండిపోయిన ఈ కథలోని కథకుడిలాగే చదివే మనమందరం కూడా అంతులేని ఆవేదనకు, షాక్‌కు గురవుతాం.

కొన్ని దశాబ్దాల కిందట రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ నిగమశర్మ అక్క అనే వ్యాసాన్ని రాశారు. తెనాలి రామకృష్ణుడు రాసిన పాండురంగ మహాత్మ్యంలోని నిగమశర్మ అక్క వ్యక్తిత్వాన్ని గురించి, పాత్ర చిత్రణ గురించి ప్రశంసించిన వ్యాసం

ఇది. షరీఫ్ కథలోని కథకుడి అక్క నిగమశర్మ అక్క కంటే సంక్లిష్ట స్వభావం కలిగిన వివాహిత. అంతకంటే కష్టాల మంటల్లో తన బాధలను, అర్థం పర్థం లేని కట్టుబాట్ల లోని ఇబ్బందులను ఎదుర్కొని మానసిక హింసను అనుభవించిన వ్యక్తి. హిందువుల ఇళ్ళ మధ్య ఇంట్లో ఉంటూ, హిందూ బాలికల స్నేహం చేస్తూ, తెలుగు మీడియం లో చదువుకుంటూ బాల్యంలో ముగ్గుల మీద ప్రేమను పెంచుకున్న అక్క- ముస్లిముల ఇంటి ముందు ముగ్గులు వేయటం సంప్రదాయం కాదని తెలుసు కున్నప్పుడు, ఆ పిచ్చిని గోరింటాకులు పెట్టి తీర్చుకోవడం చూస్తే అంతులేని వ్యధ కలుగుతుంది.

"ముగ్గు ఇంటి ముందు వేస్తే తప్పు కానీ చేతిలో వేస్తే కాదు కదా...! ఒక మతానికి, మరో మతానికి మధ్య తేడా ఇంతేనా? ఇంతమాత్రం దానికేనా... దేశ వ్యాప్తంగా ఇన్ని మతఘర్షణలు జరుగుతుంటాయి?"

"నిజమే. ఒక సమాజంలో అనేక సమూహాలు కలిసి బతుకుతున్నప్పుడు ఒక సమూహం యొక్క సంస్కృతి ప్రభావం మరో సమూహంపై కచ్చితంగా ఉండి తీరుతుంది. మరి ఇన్ని విషయాలు తెలిసి కూడా అక్క ఆడపిల్లలు పుట్టినందుకు మాత్రం బాధపడాల్సి వస్తోంది"- కథలో వివిధ సందర్భాల్లోని ఈ మాటలు అక్కపట్ల కథకుడి సహానుభూతి నుంచి, వ్యధ నుంచి, ఘర్షణ నుంచి పుట్టినట్టు మనం గమనించవచ్చు.

అక్క వేసే ఆకుపచ్చ ముగ్గు లయగా ఇంట్లో రంజాన్‌రోజు ప్రాణం పోసు కున్నా కట్టుబాట్లలో ఇంట్లో అంతరాలు మనల్ని వెంటాడి వేధిస్తాయి.

షరీఫ్ సృష్టించిన జేజి ఒక తిరుగుబాటుకు సంకేతమైతే, ఆకుపచ్చ ముగ్గు లోని అక్క ఒక స్త్రీ బాల్యం నుంచి పడిన మానసిక హింసకు ప్రతీక. షరీఫ్ ఉత్తమ పురుషలో రాసిన ఈ కథల్లోని ఈ రెండు పాత్రలు చాలాకాలం పాఠకుల్ని వెంటాడు తూనే ఉంటాయి.

షరీఫ్ ఒక ముస్లిం సన్నకారు రైతు జీవితాన్ని, ఒక హిందూ సన్నకారు రైతు జీవితాన్ని రెండు కథల్లో చిత్రించాడు. అవి 'రజాక్‌మియా సేద్యం', 'జీపొచ్చింది.' మతాలు వేరు కానీ బడుగు జీవుల బాధల్లో పెద్దగా తేడాలేవీ ఉండవని చాటిచెప్పిన కథలు ఇవి రెండూ.

పిల్లలను గురించి రాసిన కథలు ఈ సంపుటంలో ఐదున్నాయి. అవి దస్తగిరి చెట్టు, రూపాయి కోడిపిల్ల, తెలుగోళ్ళ దేవుడు, అయ్యవారి చదువు, పలక పండగ.

పిల్లల మనస్తత్వాలను తీర్చిదిద్దవలసిన విద్యావ్యవస్థ ఏ రకంగా ఉండాలో ఆలోచింపజేసే కథలు 'తెలుగోళ్ళ దేవుడు', 'పలక పండగ.'

చదువుకూ, సరదాలకూ, ప్రతిబంధకమైన దేవుళ్ళనూ, దారిద్ర్యాన్ని ఎత్తి చూపే కథలు 'పలక పండగ', 'అయ్యవారి చదువు', 'దస్తగిరి చెట్టు.' మతాన్ని మించిన ఆపేక్షలు ఉన్నాయని, అమ్మ ద్వారా నిరూపించిన కథ 'జుమ్మా.'

షరీఫ్ కథల్లోని ఇతివృత్తాలను, నేపథ్యాన్ని, పాత్రలను, కంఠస్వరాన్ని, శైలిని నిశితంగా పరిశీలించినప్పుడు షరీఫ్ నేల మీద నిలబడి రాస్తున్న అచ్చమైన కథకుడని మనం గ్రహిస్తాం. ఆ నేల, ఆ గాలి, ఆ నీరు ఎక్కువగా తన అనుభవంలోని పల్లెపట్టు లవి. తన చుట్టుపక్కల మనుషులవి.

*హైదరాబాద్, 19 జూన్ 2011*

# నవాబు సాబుల గరీబు కథలు

## దాదాహయాత్

భారతదేశంలో ముస్లింల కథ దాదాపు వెయ్యేళ్ళనాటిది. ఈ వెయ్యేళ్ళకాలంలోనూ ముస్లింలకంటూ ఓ బతుకు వుండివుండకపోదు. అది ముందుగా గుర్తించింది అరేబియన్లు.

భారతదేశంలో జీవితం గురించి అరేబియన్లు అల్లుకున్న అభూతకల్పనే అరేబియన్ రాత్రుల కథలు. దురదృష్టవశాత్తూ భారతీయ ముస్లింల జీవితం గురించిన అవగాహన అరేబియన్ రాత్రుల స్థాయిని మించలేదు.

ఈ వెయ్యేళ్ళకాలంలోనూ తమ గోడు తాము రాసుకోవచ్చనే ఆలోచనే ఇక్కడి ముస్లిం రచయితకు అంతగా వచ్చినట్టులేదు. వైక్కం మహమ్మద్ బషీర్, ఖుర్రతు లైన్ హైదర్ వంటివారు కొందరు మాత్రమే అందుకు మినహాయింపు.

తెలుగులో మాత్రం ఇవాళ మైనార్టీ కథ పుష్కలంగా వస్తోంది. దీనికి దోవ తీసిన చారిత్రక, సామాజిక, రాజకీయ అంశాలను ఇక్కడ ప్రస్తావించడం చర్విత చర్వణమే అవుతుంది. ఏది ఏమైనప్పటికీ ఇవాళ ముస్లిం రచయిత తన కథ తాను రాసుకోవడానికి సందేహించడం లేదు. ఇవాళ తెలుగులో వస్తున్నన్ని మైనార్టీ కథలు ఇతర భారతీయ భాషల్లో వస్తున్నాయో లేదో అనుమానమే. మైనార్టీ కథ స్వరూప స్వభావాల గురించి మనకిప్పుడు ప్రత్యేక పరిచయం కూడా అవసరం లేదు. అలాంటి ప్రత్యేక పరిచయం అవసరంలేని కథారచయిత వేంపల్లె షరీఫ్.

నిజానికి వేంపల్లె షరీఫ్‌ను మైనార్టీ కథారచయితగా మాత్రమే వర్గీకరించడం కుదర్దు. 'జీపొచ్చింది'లాంటి సిసలైన రాయలసీమ కథ రాసిన షరీఫ్‌ను సీమకథా రచయితగా గుర్తించకుండా ఎలా వుండేది? షరీఫ్ రాసిన 'రజాక్‌మియా సేద్యం' అనేది మైనార్టీ కథ కావడంతోపాటు రాయలసీమ కథ కూడా. ఇటీవలి కాలంలో తెలుగుకథను గొప్పగా ప్రభావితం చేసిన రెండు జీవధారలు వేంపల్లె షరీఫ్ కథల్లో మమేకమవుతున్నాయి.

'జీపొచ్చింది' కథనే తీసుకుందాం. ఏ గొప్ప రాయలసీమ కథకూ ఇది ఎంత మాత్రం తీసిపోదు. రాజ్యస్వభావం ఈ కథలో కళ్ళకు కట్టినట్టు వ్యక్తమవు తుంది. దేశ వ్యాప్తంగా ఆర్థికసంస్కరణలనేవాటిని సామాన్యుడి నెత్తిన కుంకుడు కాయ రసంలా పాలక వర్గంవారు రుద్దుతున్న తొలిదశలో షరీఫ్ రాసిన కథ ఇది. ఆ కుంకుడుకాయ రసం కళ్ళలో పడ్డట్టు భగ్గున మండించే కథ. వ్యవసాయాన్నే నమ్ముకున్న వెంకట్రెడ్డి నానా అగచాట్లూ పడి భూమిలో బోరు వేయిస్తే అందులోంచి ఒంటేలంత జలధార మాత్రమే వెలికొచ్చింది. దాంతోనే ఎలాగో పైరు తడుపుకుందా మనుకున్నాడు. దానికి కావల్సిన కరెంటు స్టార్టరును కాపాడుకోవడం వెంకట్రెడ్డికి జీవన్మరణ సమస్య. ఆ స్టార్టరు దగ్గరే రాజ్యం కరెంటువాళ్ళ రూపంలో చావుదెబ్బ తీసింది వెంకట్రెడ్డిని. దేశంలో ఎక్కడపడితే అక్కడ విస్తారంగా రైతులు ఆత్మహత్య చేసుకుంటున్న సందర్భంలో వచ్చిన కథ ఇది. వెంకట్రెడ్డి ఆత్మహత్య చేసుకోలేదు గానీ అందుకు సమానమైన కరెంటు బోరు వేయించుకున్నాడు. వేంపల్లె షరీఫ్‌నుంచి ఇలాంటి శక్తివంతమైన సీమకథలు మరికొన్నైనా ఆశించవచ్చు.

రాయలసీమ కరువుప్రాంతంలో బతుకు ఒక తీరని దప్పిక. అది నిరూపిస్తూ ఎన్నో కథలొచ్చాయి. అదే కరువుసీమలో మైనార్టీబతుకైతే ఇక గోరుచుట్టుపైన రోకలిపోటు లాంటిదే. ముందే కరువుసీమ. ఆపైన మైనార్టీ బతుకు. ఆ విషాదం రెండింతలు. 'రజాక్‌మియా సేద్యం' అటు రాయలసీమ కథకూ ఇటు మైనార్టీ కథకూ మధ్య సయోధ్య కుదిర్చిన విశిష్టమైన కథ. "మొన్న మొలిచినట్టు లేదు. అప్పుడే సెనిక్కట్టె ఎండకు మలమలా మాడిపోతుండాది," అని మొదలవుతుందీ కథ. ఇది రాయలసీమ చిత్తరువు. అందులో రజాక్‌మియా మైనార్టీ మొహాన్ని గీసి చూపిస్తాడు రచయిత. నాలుగెకరాల భూమి వుండికూడా నూకలకోసం పెద్దరెడ్డిగారి దగ్గర అడుక్కుతినాల్సిన దీనస్థితి రజాక్‌మియాది. అయినా భూమిని వదులుకోవ డానికి ఇష్టపడని రైతుబిడ్డ అతను. అరమూట నూకలకు ఆ నాలుగెకరాలూ కాజేసే దురుద్దేశం రెడ్డిగారిది. రజాక్‌మియా భూమికి నీళ్ళు ఇదిగో ఇప్పుడిస్తాను

అప్పుడిస్తాను అని ఊరిస్తూనే చివరికి అదే భూమికి ఎసరుపెడతాడు రెడ్డి. భూమి చలమారెడ్డిదో మధురెడ్డిదో అయితే వాళ్ళకే వుంటుంది. అదే భూమి రజాక్‌మియా దైతే అతని భూమి అతనికి మిగల్దు. ఇది మైనార్టీ బతుకు.

'జుమ్మా' కథ ముస్లింల పేరుతో పెట్రేగుతున్న ఉగ్రవాదం నేపథ్యంలో అదే ముస్లిం బతుకు ఎలా అతలాకుతలమైందో తెలియజేస్తుంది. "సాయిబువై పుట్టినాక శుక్రవారానికొకసారైనా నమాజుకు వెళ్ళా"లని కొడుకుని సాధించే తల్లి జుమ్మారోజున మక్కామసీదులో బాంబుపేలుడు జరిగినప్పుడు, "నువ్వుగాని మసీదుకు వెళ్ళలేదు గదరా నాయనా!" అనాల్సివస్తుంది.

'దస్తగిరి చెట్టు' కథలోని పిల్లవాడికి సెలవులప్పుడు అమ్మమ్మవూరికి వెళ్ళి అక్కడ జెండాచెట్టుకింద ఆడుకోవాలనేది కూడా తీరనికోరిక. పేదరికం ఆపాటి కోరికను సైతం తీరనివ్వదు. స్కూల్లో మిగతా పిల్లలు ఆ సెలవుల్లో ఎక్కడెక్కడికో వెళ్తున్నారు. "నువ్వెక్కడికి వెళ్తున్నావు?" అనే మాస్టారి ప్రశ్న వెనక తెలియనితనం ముస్లిం జీవితం గురించి అందరికీగల అవగాహనారాహిత్యానికి ప్రతీక మాత్రమే.

'పలక-పండగ' చెహెూవ్‌ను తలపించే కథ. జహేరా తన కొడుకుని చదువు కోసం ఎలాగో అయ్యవారిదగ్గరైతే విడిచిపెట్టగలిగిందిగానీ వాడి చదువుకు అవసర మైన పలక మాత్రం కొనిపెట్టలేకపోయింది. పలకలేని జీవితం వ్యర్థంరా అను కున్నాడు మదారు. చివరికెలాగో ఓ పాత రేకుపలక సంపాయించి తెస్తే అది కాస్తా రాయకుండా పోయింది. కిండర్‌గార్టన్ స్థాయిలోనే పిల్లలకు ల్యాపుటాపు కొనివ్వా ల్సిందేననే వ్యాపార విద్య వెర్రితలలు వేస్తున్న కంప్యూటర్ యుగంలో ఒక్క క్షణం ఆగి సామాన్యుడు చదువుకోవడానికి నిజంగా ఏం కావాలో ఆలోచింపజేసే కథ 'పలక-పండగ'.

'పర్దా' కథ గురించి ఎంత చెప్పినా చాలదు. వేంపల్లె షరీఫ్ రాసిన మైనార్టీ కథల్లోకెల్లా ప్రత్యేకమైన కథ ఇది. ఇందులోని జేజిలాంటి జేజి వేంపల్లె షరీఫ్‌కు నిజంగా వుందోలేదో తెలీదుగానీ షరీఫ్ మాత్రం ఈ జేజిని ఎంతో దగ్గరగా చూశాడు. ఈ జేజికి కొడుకూ కోడళ్ళతో అందరు నాయనమ్మలకూ వుండే కష్టాలే వున్నాయి. కానీ ఈ జేజి మాత్రం కన్నీటి కొలను కాదు. ఈ జేజి ఓ గయ్యాళి. వయసు మీద పడ్డంతో ఈమెను కోడలు మూల కూర్చోబెట్టగలిగిందిగానీ లేకపోతే అంత సులువుగా లొంగేది కాదీ జేజి. ఇంట్లోని రెండుగదులకే పరిమితమై రాత్రిపూట తప్పనిచ్చి ముందుగదిలోకి రాలేని మనవరాలు, ఇంట్లోంచి బయటికి రాకపోవడమే ఆదర్శంగా

గల కోడలు, ఈ ఇద్దరికీ ఈ జేజి పూర్తిగా భిన్నం. ఈ జేజికున్న స్వతంత్రేచ్ఛ అద్వితీయం. కొడుకింట్లో పర్దా వెనకాల పడుండేకంటే పల్లెలో కాయకష్టం మేలనే స్వేచ్ఛాజీవి. ఈ కథలోని అంశాలన్నీ సూక్ష్మంగా గుర్తించి చెప్పాలంటే ప్రత్యేకించి ఓ ప్రకరణమే అవసరమవుతుందేమో.

'రూపాయి కోడిపిల్ల' కథలో అంజద్ కష్టపడి పెంచుకున్న కోడిపిల్లను కోసుకు తినాలంటాడు తండ్రి. అంజద్ అది పడనివ్వడు. చివరికదే కోడిపిల్ల జీపుకింద పడితే దాని ప్రాణం పోయేలోపల కోయించుకు రమ్మని పరిగెత్తిస్తాడు తండ్రి. ఇక్కడ జీపు కింద పడ్డది అంజద్ పసిమనసే.

'తెలుగోళ్ళ దేవుడు' కథ ఒకరి మతాన్ని మరొకరి మీద రుద్దడాన్ని నిరసిస్తుంది. 'అంజనం' కథ మూఢనమ్మకాల వ్యాప్తికి నిస్సహాయత ఎలా దోవతీస్తుందో తెలియ జేస్తుంది. 'అయ్యవారి సదువు' కథలో అవసరాలకూ చదువుకోవాలనే కోరికకూ పొత్తు కుదరకపోవడం చూస్తాం.

'ఆకుపచ్చ ముగ్గు' భిన్న సంస్కృతుల మధ్య ఇచ్చిపుచ్చుకోవడాలకు సంబంధించిన అందమైన కథ. ఈ కథలోని అక్కకు ముగ్గువేయాలని కోరిక. కానీ ముస్లిం కాబట్టి ముగ్గు వేయలేదు. అరచేతిలో గోరింటాకుతో ముగ్గు వేసింది.

వేంపల్లె షరీఫ్ రాసిన దాదాపు అన్ని కథల్లోనూ జీవితం తీరని కోరికగా వుండిపోవడం చూస్తాం. ఈ కోరికలు తీరకపోవడం చాలా చోట్ల నిత్యావసరాలు తీరకపోవడంగా వుంటాయి. ఆర్థిక అసమానతల్లో జీవితావసరాలు ఎంత సూక్ష్మంగా వుంటాయో, అవిగాని తీరకపోతే కాస్తంతకే బతుకు ఎలా తలకిందులవుతుందో ఈ కథల్లో చూడొచ్చు. 'రజాక్‌మియా సేద్యం' కథలో బోరు, 'జీపొచ్చింది' కథలో కరెంటు స్టార్టరు, 'పలక- పండగ' కథలో పలక, 'అయ్యవారి చదువు'లో దీపంబుడ్డీ అలాంటి సూక్ష్మమైన జీవితావసరాలే. జీవితంలో అంతర్లీనంగా వుండే విషాదం షరీఫ్ కథల్లో ద్యోతకమవుతుంది. మైనార్టీ బతుకులు అడుగునుంచి అట్టడుక్కి పడిపోవడం ఈ కథల్లో మనం చూస్తాం. ఇదొక వాస్తవిక దృశ్యం. ఈ పతనాన్ని సకాలంలో అడ్డుకోకపోతే ఆ బతుకులు అట్టడుగు నుంచి పాతాళానికి జారిపోక తప్పదని ఈ కథలు హెచ్చరిస్తాయి.

ఈ కథల్లో ఆత్మహత్య ఎక్కడా కనబడదు. అయితే ఈ కథల్లోని పాత్రలు ఎల్టీను తాగి చావడం గురించి తరచుగా మాట్లాడుతుంటాయి. రైతుల ఆత్మహత్యల కాలంలో రావడం వల్లనే ఎల్టీను పదం ఈ కథల్లో చోటు చేసుకుంది. చివరికో పిల్లవాడు కూడా ఓచోట ఎల్టీను తాగి చస్తానని బెదిరిస్తాడు. ఆర్థిక సంస్క

రణల కాలంలో వ్యవసాయం ఆత్మహత్యా సదృశం కావడాన్ని ఈ మాట అన్యాప దేశంగా సూచిస్తుంది.

వ్యవసాయంకన్నా ఎక్కువగా ఈ కథల్లో ప్రాధాన్యత సంతరించుకున్నది చదువు. ఈ కథల్లో నాలుగైదైనా చదువుగురించే కథలున్నాయి. ఇది యాదృచ్ఛికం కాదు. ఇవాళ అత్యంత వేగంగా ఓ క్రమపద్ధతిలో నానాటికీ చదువుకూ దూరమవు తున్న వారు మైనార్టీలు. ఇవాళ మైనార్టీ రచయిత, చదువు గురించి ఇంతగా ఎందుకు ఆలోచిస్తున్నాడో వేరే చెప్పనవసరంలేదు.

ఇక్కడ భాష గురించిన ప్రస్తావన కొంతవరకు అవసరం. మిగతా తెలుగు కథల నుంచి మైనార్టీ కథకున్న వైవిధ్యం భాషేనని ఇవాళ కొత్తగా అనుకోనవసరం లేదు. మైనార్టీకథ తెలుగుభాష విస్తృతిని పెంచింది. అయితే మిగతా మైనార్టీ కథ లకూ వేంపల్లె షరీఫ్ కథలకూ తేడా వుంది. వేంపల్లె షరీఫ్ రాయలసీమకు చెందిన రచయిత. ఇక్కడ ఉర్దూలో తెలుగు పదాలు దొర్లుతాయి. అందుకే వేంపల్లె షరీఫ్ తన కథల్లో చాలావాటికి ఉర్దూ పేర్లు పెట్టడు-తెలుగు పేర్లే పెడతాడు. కథలో కూడా ఉర్దూ పదాలు విస్తారంగా వాడడు. ఇది వైవిధ్యమేగానీ మిగతా మైనార్టీ కథల్తో వైరుధ్యం కాదనేది గమనించాల్సిన అంశం.

ఇవాళ మైనార్టీ కథ చిక్కబడిందనడానికి వేంపల్లె షరీఫ్ కథలు మచ్చు తునకలు.

*ప్రొద్దుటూరు, 2 ఆగస్టు 2011*

స్నేహానికి, సాహిత్యానికి ఎంతో విలువనిచ్చే
తోటి యువకథకుడు

**మహి బెజవాడకి**

కృతజ్ఞతలు.

# కథలు...

| | | | |
|---|---|---|---|
| 1. | పర్దా | ... | 19 |
| 2. | జుమ్మా | ... | 27 |
| 3. | ఆకుపచ్చ ముగ్గు | ... | 36 |
| 4. | దస్తగిరి చెట్టు | ... | 45 |
| 5. | రూపాయి కోడిపిల్ల | ... | 52 |
| 6. | రజాక్‌మియా సేద్యం | ... | 59 |
| 7. | అయ్యవారి చదువు | ... | 71 |
| 8. | జీపొచ్చింది | ... | 78 |
| 9. | పలక పండుగ | ... | 90 |
| 10. | అంజనం | ... | 94 |
| 11. | తెలుగోళ్ళ దేవుడు | ... | 100 |
| 12. | చాపరాయి | ... | 105 |
| | ఆకుపచ్చ సంతకం – డా॥ ఎ.కె. ప్రభాకర్ | ... | 112 |
| | జుమ్మా నాకు ఒక పునర్జన్మ – వేంపల్లె షరీఫ్ | ... | 122 |
| | జుమ్మా ముబారక్ | ... | 125 |
| | రేడియో అభిప్రాయాలు | ... | 129 |

# పర్దా

అది మా ఇల్లు.

మూడు గదులుంటాయి. మొదటి గది ఓపెన్. దానికి షెట్టర్ వేయించాలని అలాగే వదిలేశాడు మా నాయన. రెండో గది తలుపుకు ఓ పరదా ఉంటుంది. అది ఇంతకు ముందు లేదు, మా అక్క పెద్దమనిషి అయ్యాక వచ్చింది. ఆ తర్వాతే మా ఇంట్లో చాలా మార్పులు వచ్చాయి.

మూడో గది వంటగది.

మా అక్క తిన్నా తిరిగినా ఏం చేసినా ఈ రెండు గదుల్లోనే. మొదటి గదికి తలుపు లేదు కాబట్టి కేవలం రాత్రిపూట మాత్రమే ఆమెకు అందులో ఎంట్రీ. ఇంటికి పరాయివాళ్లు ఎవరొచ్చినా మొదటి గదిలో కూర్చోబెట్టి మాట్లాడి పంపించేవాడు మా నాయన. వాళ్లున్నంతసేపూ రెండో గది తలుపు వేసి పర్దాను పదేపదే జరిపేవాడు. ఒక్క మా నాయనే కాదు మా అమ్మ కూడా అంతే. అదే అలవాటు ఆ ఇంట్లో పిల్లవాడినైన నాకూ వచ్చేసింది.

ఒక్క మా జేజికే అది అలవాటు కాలేదు. ఆ వయసులో కూడా మా జేజిది తిరిగే కాలే. కట్టేసినా ఒక్కచోట ఉండే రకం కాదు. కాయకష్టం చేసిన కాళ్లవి. అటూ ఇటూ తిరక్కపోతే వాటికేం పాలుపోదు.

అలా తిరగడం మా అమ్మకు నచ్చదు. ముసలివాళ్లు అన్నాక 'అల్లా... బిస్మిల్లా' అనుకుంటూ ఓ మూల ఉండాలన్నది మా అమ్మ సిద్ధాంతం. ప్రపంచం కొట్టుకు పోయినా సరే కూర్చున్న చోటు నుంచి కదలకూడదు అంటుంది. అందుకు మా జేజి ససేమిరా అంటుంది. అటో ఇటో వెళుతుంది. లేదా ఆ ఇల్లూ... ఈ ఇల్లూ చుట్టేస్తుంది. కొంచెం పరిచయమైనా చాలు... గంటల తరబడి వాళ్లింట్లో తిష్ట వేస్తుంది. ఇది టౌను... ఇక్కడ ఇలాంటివన్నీ చేయకూడదంటే వినదు.

'ఇదేం ఊరు కాదా... వీళ్లేం మనుషులు కారా...?' అని ప్రశ్నిస్తుంది. మా జేజికి ఒంట్లో వయసుడిగింది కానీ నోటికి బిస తగ్గలేదు. కొడుతుందో... కొట్టించు కుంటుందో తర్వాత విషయం కానీ తేడా వస్తే మాత్రం ఎంతటి పోట్లాటకైనా సై అంటుంది. వాళ్లొకటంటే మా జేజి పది అంటుంది. వాళ్లు పది అంటే మా జేజి వంద అంటుంది. ఇక బూతు పురాణాలకైతే కొదవేలేదు. ఆమె మొరటు సామెతలు వదిలితే అవతల ఆడోళ్లకైనా, మగోళ్లకైనా సిగ్గుతో బట్టలూడిపోవాల్సిందే. అందుకే పల్లెలో మా జేజి నోటికి ఎవరూ ఎదురెళ్లరు.

అంతటి రౌడీ చరిత్ర ఉన్న మా జేజి ఒక్క మా అమ్మకు మాత్రమే భయపడు తుంది. కొడుతుందో, తిడుతుందో అని కాదు- టయానికి ఇంత బువ్వ పెట్టకుండా ఎగ్గొడుతుందని.

ఈ వీక్‌నెస్ ఉంది కాబట్టే మా జేజికి కొన్ని కష్టాలు వచ్చిపడ్డాయి. ఒంట్లో శక్తి ఉన్నన్నాళ్లూ ఆ వీక్‌నెస్ కూడా ఉండేది కాదు. మా అమ్మతో గొడవైతే మాటకు మాట, దెబ్బకు దెబ్బ తీసి తుర్రుమని బస్సెక్కి వెళ్లిపోయేది. అక్కడ కూలీ నాలీ చేసుకొనైనా బతుకుతుంది కానీ చాన్నాళ్ళ వరకు ఇటు తొంగి చూసేది కూడా కాదు. మా నాయన కూడా మా జేజిని పట్టించుకునేవాడు కాదు. ఈ అత్తా-కోడళ్ల పోరులో నలిగిపోవడం ఎందుకులే అన్నట్టుంటే వాడు. ఏ అమాస... పున్నానికో వెళ్లి బత్తెం పడేసేవాడు. మిగతా రోజుల్లో కాయకష్టమే మా జేజికి గతి.

అయినా జేజికి ఎందుకో ఆ జీవితమే బాగుందనిపిస్తుంది. పేరుకు కొడు కున్నాడు కానీ తన కష్టం-సుఖం పట్టించుకోడు. వీడి దగ్గరకొచ్చి తనింట్లో తాను దొంగ తిండి తినాల్సిన ఖర్మేమిటి? వీడికన్నా పరాయివాళ్లు మేలు. వెళ్లి కూర్చుంటే...

పెట్టే ఒకపూటైనా నోటికి మనస్ఫూర్తిగా ముద్ద అందిస్తారు. పోనీ... వీడి కడుపులో మంచి పిల్లోళ్లు అయినా పుట్టినారా... అంటే ఇద్దరికి ఇద్దరూ (అక్క, నేను) దొంగలే. అమ్మ బిడ్డలు. ఆయమ ఏమి చెబితే అది వింటారు. ఆయమ ఏది అంటే అది అంటారు. ఆ యమ దిక్కే మాట్లాడతారు. ఇక తనకెవరు దిక్కు? ఎందుకుండాలి ఇక్కడ?

ఇది జేజి మనసులోని మాట.

జేజి గత వారమే ఇక్కడికొచ్చింది. తట్టాబుట్టా సర్దుకుని ఏకంగా ఇక్కడ ఉండి పోవడానికే దిగింది. ఎలాంటి గొడవ లేకుండా కిక్కురుమనకుండా పడి వుండటానికి వచ్చింది. జేజిలో ఇంత రాజీ ధోరణి అంతకుముందు ఎప్పుడూ చూడలేదు. ఇక సొంతగా బతికే శక్తి ఆమెకు లేదు. పల్లెలో కూడా చాలామంది జేజిని తిట్టినారంట. 'ఇప్పుడైనా కొడుకు దగ్గరికి వెళ్లి మానంగా మట్టంగా బతుకు... ఇక్కడుంటే దిక్కులేని చావు చస్తావు' అనినారంట. గత్యంతరం లేని స్థితిలో ఇక్కడి కొచ్చి చిక్కుకుపోయింది జేజి.

"నేను మూయను... నువ్వు తీయను... నేను మూయను... నువ్వు తీయను... పొద్దుగూకులు నాకిదే పనైపోతాండాది... ఇంట్లో గోషా పెట్టిన ఆడపిల్ల ఉండాదన్న గ్యాపకం కూడా లేకపోతే ఎట్టా? అయినా ఏం పనుంటాది ఇంట్లోకి, బయటికి పదితూర్లు తిరగనీకి" గయ్యిమంది అమ్మ గొంతు.

ఏదో ఆలోచనల్లో ఉన్న మా జేజి ఉలిక్కిపడి వెనక్కి చూసింది. ఎప్పుడొచ్చిందో- అమ్మ వెనకాలే వచ్చి గుమ్మానికి పరదా సర్దుతోంది.

"పాడు పరదా... దేనికీ అడ్డే... వొచ్చినప్పటి నుంచి లచ్చతూర్లు తిట్టించింది. ఎంత జాగ్రత్తగా ఉన్నా ఈ ముసలిపానానికి గ్యాపకమే ఉండటంలా" మనసులో అనుకోబోయి పైకే అనేసింది జేజి.

అమ్మ మరింత రెచ్చిపోయింది.

"ఆ... గ్యాపకం ఉండదు. తిండానికేతే అన్నీ గుర్తుంటాయి. ఇంకా తొమ్మిది గూడ కాందే... నాష్టా అని వొచ్చావే... ఇది గూడా అట్టనే గుర్తు పెట్టుకోవాల..."

జేజి కడుపు కాలిపోయింది, తిరిగి ఏదో ఒకటి అనేదే కానీ మనసు కుదుట పర్చుకుంది. 'ఈ పరదా ఒక్కటీ గుర్తుంచుకుని వేస్తే పోలా...' అనుకుందేమో.

ఈ మధ్య జేజికి ఆకలి ఎక్కువవుతోంది. ఏవోవో తినాలనిపిస్తోంది. ముసలి మబ్బున ఇలాగే అనిపిస్తుందేమో. అందుకే ఏం పాలుపోక ఉట్టినే ఇంట్లోకి బయటికి

తిరుగుతుంది. మనిషిని చూసైనా గుర్తు తెచ్చుకుని ఇంట్లో ఉన్న పై తిండి ఏదైనా చేతిలో పెడతారేమోనని ఆమె ఆశ. తిండికి బదులు... తిట్లే కడుపు నింపుతున్నాయి.

మెల్లగా వంగి మొగసాల్లో కూర్చొని మళ్లీ ఓసారి పరదావైపు చూసింది జేజి. పూల పూల పరదా. దాని మధ్యలో మక్కాబొమ్మ ఉంది. గుమ్మానికి నిండుగా కప్పి ఉంది. జేజికి పల్లెలో ఈ బాధ లేదు. తన రెండంకణాల గుడిసెలో తానే మహారాణి. ఇంట్లోకి, బయటికి ఎన్నిసార్లయినా తిరగొచ్చు. తన మాటకు ఎవరూ ఎదురు చెప్పరు. తనను ఎవరూ అడ్డుకోరు.

"ఇక్కడే ఈ పరదాలు... అంతరాలు. ఒట్టి దాపరికపు మనుషులు. అసలు తమకు గోషా అనే మాటే తెలియదు. ముట్టయిన నాలుగు రోజులు ఆడపిల్లను ఓ మూల కూర్చోబెట్టి ఐదోరోజు చేతికి చింతబర్ర ఇచ్చి గొడ్ల కాడికి పంపిస్తారు కాపలాకు..." గొణుక్కుంది జేజి.

జేజికి అక్క మొహం గుర్తొచ్చినట్టుంది.

"అందరూ ఆ పిల్లను ఎర్రగా ఉందంటారు. అది ఎరుపు కాదు తెలుపు... ఎండ, గాలి తగలక పాలిపోయిన తెల్లమొఖం... ఊదుమొఖం..." పరదా మీద కోపం అక్క మీదికి మళ్లి తిట్టుకుంది జేజి.

"ఎందుకు పనికొస్తుందీ పిల్ల. రేపు పెళ్లయి ఒక కాన్పు అవుతానే కళ్లు నేల కేసి చచ్చుబడిపోతుంది. అదే మా కాలంలో అయితేనా ఆ వయసులో చెట్లు ఎక్కేసే వాళ్లం... చింత చిగురు జోలెనిండా తెచ్చేవాళ్లం. మొగోని మాదిరి గొడ్డలి చేతబట్టి కొండకెళ్తే గొడ్డలి దెబ్బకు కొండ ఓ... అని అర్సాల. సాయంత్రానికి కట్టెలన్నీ మోపుకట్టి నెత్తికెత్తుకుని ఊళ్లోకొస్తే... చూసేటోళ్లు ఓయమ్మా ... అని నోరెళ్లబెట్టాల. ఇప్పు డున్నారు ఎందుకు? పాడుపిల్లలు... గోషా అంట... గోషా... నీళ్ల బిందె సరిగా అందు కోలేదు... నైసు పాప..."

జేజి వొదురుకుంటూ ఉండగానే- నాయన హవాయి చెప్పులు కాళ్లకు కొట్టు కుంటూ యాడ్నుంచో ఎండబడి ఇంటికొచ్చాడు. చెప్పులు బయట్నే వొదిలి పడు కున్న పసిపాప మొహంపై కప్పిన బట్ట తీసినట్టు మెల్లగా గుమ్మానికున్న పర్దా తీసుకుని లోనికెళ్లాడు. అది చెక్కు చెదరలేదు. ఎలా ఉన్న పర్దా అలా వొచ్చి నిలబడి, ఇంట్లోకి తొంగి చూస్తున్న జేజి కళ్లకు అడ్డుపడింది.

జేజి కోపం ఈసారి నాయన మీదికి మళ్లింది.

"సన్...న్న బిడ్డ వీడు. కట్టుకోడానికి బట్ట కూడా లేకుండె నా బట్టకి. కొంగు పట్టుకుని యనకెనకాలే తిరిగేటోడు. ఎట్టాంటోడు ఎట్టా మారిపోయినాడు"

జేజి గతం తవ్వుకుంటూ ... నాయన్ని పెంచి పెద్ద చేయడానికి పడ్డ కష్టాలు గుర్తుకు తెచ్చుకుంది.

మా అబ్బకి రెండో పెళ్లాం మా జేజి. ఆ కాలంలో మొగుడికి ఆడోళ్లు చచ్చేంతగా భయపడేటోళ్లు. మా జేజి కూడా అబ్బ దెబ్బకి వాళ్ల అబ్బను గుర్తు తెచ్చుకునేదంట.

'మ్మే... నన్నీబు...' అంటే వణుకుతా వచ్చి నిలబడుకునేదట.

మొగుడు అంటే ఏంటో కూడా తెలియని చిన్నవయసులోనే రెండోపెళ్లోడికి ఇచ్చి చేశారు జేజిని. పుట్టింటి పేదరికాన్ని తిట్టుకుంటూ ఉండేది జేజి. "ఆ తాగుబోతోడికి, ఆ రోగిష్టికి ఇచ్చి చేసినారు. పిల్లోడు పురిట్లో ఉండగానే నేలకూలి చచ్చిపాయ పాడుమనిషి. అబ్బుడ్నుంచి ఒకటే కష్టాలు" అని బాధపడేది.

ఉండుండి మొహానికి ఏదో ఈగ కొట్టింది. "ఓసి దీని దుంపతెగ... ఇట్ట కొడతాంది మొఖానికి" గొణుక్కుంటూ రెండు చేతుల్ని మొహమ్మీద టప్పుమని పించింది. ఆ చప్పుడుకు ఈగ ఎటో పారిపోయింది.

"వసార్లోనే కూచోనుండాగాని... చూసీ చూడనట్టు పోతాండాడు. కనీసం ఏమ్మా ... నాష్టా తిన్నావా ... అని కూడా అడగలేదు ... మద్దెలో పోయే నా కొడుకు..." మళ్లీ నాయన మీద తిట్లు లంకించుకుంది.

"ఆడముండని... మొగోడు లేని ఆడదాన్ని... నేను బయపడ్లా వీణ్ణి పెంచడానికి ... వీడు బయపడతాండాడు... ఇంతింత మీసాలు పెట్టుకుని, ఇంత మొగోని మాదిరి ఎదిగి పిల్లకు పెండ్లి చేయడానికి వణకతాండాడు... కొజ్జా నాకొడుకు."

'పిల్లదాన్ని ఎందుకురా గోషా పెట్టినా'వని ఆమధ్య ఒకసారి జేజి మా నాయన్ని అడిగింది.

"యాన్నించి తెస్తావ్ లచ్చలు? లచ్చల్తో పని... గోషా లేకండా తిప్పితే మన్తో అయితాదా... అసలు తట్టుకుంటామా...? పిల్లదానికి పెండ్లి చేయడమంటే మాటలనుకుంటాండావా..? ఇంట్లో కూచోబెట్టి నాలుగు ఉర్దూ ముక్కలు చెప్పిస్తే ఎవరో ఒకరు వాళ్లే జేసకపోతారు... లెక్కదండిగా ఇయ్యకుంటే పాయ... పిల్లదాన్ని పరువుగానైనా పెంచిండారు గదా... అనుకుంటారు" అన్నాడు మా నాయన.

జేజికి నాయన ఉద్దేశ్యం అర్థమైంది. కట్నానికి భయపడి పిల్లదాన్ని గోషాపెట్టి వీధిలో పెద్ద పరువుగల్లోడు అనిపించుకుంటాండని.

"ఒక్క పిల్లదాన్ని గోషా పెట్టడంలో ఉన్న శ్రద్ధ మరేమిటికీ ఉండదు. కన్న తల్లిని ఎలా చూసుకోవాల... ఎంత మర్యాదగా మాట్లాడాల అనేది తెలీదు నా బట్టకు. యాడా అక్కరకు రాని పట్టింపులు ఒక్క పిల్లదాన్ని గోషా పెట్టడం దగ్గర్నే అక్కరకొచ్చినాయి యీనికి..."

ఈగ యాణ్ణుంచో వచ్చి మళ్లీ మొహానికి కొట్టింది. ఏదో చెరుపు జరుగు తుందని భయపడింది జేజి.

"దీన్నోట్లో మట్టికొట్టా... ఏమిటికి దీనికి ఇంత బయం లేదు..." అంటూ చేయి చాచి గాల్లో ఎగురుతున్న ఈగను గట్టిగా పట్టుకుంది. నలిపి ఇంటి ముందుకు విసిరింది. ఈగ కళ్లు తేలేసి వెల్లకిలా పడిపోయింది.

జేజి ఆణ్ణుంచి లేచి మెల్లగా ధర్మాసుపత్రి దావ పట్టింది. గుండెల్లో నొప్పిగా ఉండాదని ఇప్పటికి ఎన్నిసార్లు చెప్పిందో నాయన్తో. ఒకటికి రెండుసార్లు మాతర్లు తెచ్చిచ్చినాడు నాయన. ఆ తర్వాత పట్టించుకోలేదు. జేజి ఏం పాలుపోక ధర్మాసు పత్రికైనా వెళ్లొద్దామనుకుని లేచి నిలబడింది.

జేజి దుప్పటి కప్పుకోదు. భుజమ్మీద ఓ తెల్లటి పాతగుడ్డను టవల్లా వేసుకుని నడుస్తుంది. పల్లెలో కూడా జేజి అంతే.

ఆ దుప్పటి గుడ్డను తీసుకుందామని మెల్లగా పరదా జరిపి ఇంట్లోకి వెళ్ల బోయింది. మల్లా దుప్పటి బయట గూట్లోనే ఉన్న సంగతి గుర్తు కొచ్చి ఆగిపో యింది.

పరదా వేయకుండా తిరుగుతోందనే కోపంతో అమ్మనే జేజికి సంబంధించిన వస్తువులన్నిట్నీ బయట్నే పడేసింది. తనపై కోడలికున్న నిర్లక్ష్యానికి తిట్టుకుంటూనే జేజి మెల్లగా దుప్పటిని అందుకుంది. చంకలో పెట్టుకుని అరుగు మెట్లుదిగి రోడ్డు మీదికి నడిచింది. ఆ పొద్దు ఎందుకో దుప్పటిని కనీసం భుజమ్మీద కూడా వేసుకో బుద్ధి కానట్టుంది. 'ముసల్దాన్ని ఎట్ల తిరిగితే ఏముండాదిలే...' అనుకుందో ఏమో!

అరిగి, నవారు విరిగిన చెప్పులకు పిన్నీసు తగిలించుకుంది. గుండెల్లో నొప్పి ఆ పొద్దు ఇంకొంచెం ఎక్కువగా అనిపించిందో ఏమో వొంగిపోయి ముక్కుతా మూలుగుతా ఆస్పత్రికి పోయింది. జేజి పోవడం వీధిలో చెక్కపనాయప్ప చూసినాడు.

వాళ్ల చుట్టాలబ్బాయికి మా అక్కను అడుగుతున్నారు. ఆ యప్పకు మా ఇంటి గురించి బాగా తెలుసు. నిన్న సంబంధం మాటలు మాట్లాడుదామని ఇంటి కొచ్చినప్పుడు మా జేజిని కూడా చూసినాడు.

ఇప్పుడు మా జేజి ఇలా ఆస్పత్రికి వెళ్తూ ఆ యప్ప కంటపడింది. ఆ యప్ప ఊరకే ఉండకుండా "ఏమ్మా... యాడికో పోతాండవే..." అంటూ పలకరించినాడు. జేజి ఆగి గుర్తుపట్టి దారిలోనే మాటలు పెట్టుకుంది.

"దరమాస్పత్రికి పోతాండా కొడుకా... కొడుకు సూపిచ్చమంటే సూపిచ్చక పాయ... దరమాస్పత్రికైనా పోతే సూదేచ్చారు కదా అని పోతాండా..." అంది.

చక్కపనాయప్ప ఏమనుకున్నాడో ఏమో 'ఆస్పత్రికి ఎందుకు? ఏమిటికి?' అని కూడా అడగలా. నేరుగా ఇంటికొచ్చి అమ్మకు, నాయనకు ఆవేశంగా ఏదో చెప్పినాడు.

నాయన ఉడికిపోయినాడు. అమ్మ భగభగ మండిపోయింది. కొంచేపటికి జేజి మళ్లీ అలాగే దుప్పటిని చంకలో పెట్టుకుని ఇంటికొచ్చింది. జేజిని చూస్తూనే నాయన రగిలిపోయినాడు.

ఏమ్మా... యాడికి పోయినావే... అని కొడుకు అడుగుతాడేమో తనకొచ్చిన రోగం గురించి చెబుదాములే... అని ఆశపడిన జేజికి నిరాశే ఎదురైంది.

వచ్చీ రాంగానే జేజి మీదకి లేసుకున్నాడు నాయన.

"అడుక్కుతినేదాని మాదిరి... రోడ్డు మీదికి అట్టా సావకపోతే... పిల్లదానికి పెండ్లయ్యేదాకైనా దుప్పటి నిండుగా కప్పుకొని చావొచ్చుగదా..." అన్నాడు.

జేజికి నోటమాట రాలేదు. ఏం చెప్పాలో తెలీలా. ఒంట్లో శక్తినంతా కూడ గట్టుకుంది. వచ్చినప్పటి నుంచి కూడబెట్టుకున్న అక్కసునంతా వెళ్లగక్కింది.

"పెండ్లికూతుర్ని జేచ్చాండాది నన్నా... నీ కూతుర్నారా... నా కొడకా... నా వెంట పడినావు... ఇబ్బుడికే వొళ్లంతా పులిసిపోయి సచ్చాండా... డాక్టర్ ఇంతింత సూదులు వేసి ఇన్నిన్ని మాతర్లు రాయించినాడు. ఏం చేయాల్రా దేవుడా అని నేను ఉంటే నీ పాటుకేమిట్రా నాకు... వోరోరే... బాగైపోయింది ఈడికొచ్చి. మనిషిని తల్లాడనివ్వరు... మాట్లాడనివ్వరు... ఇంగేమిటికిరా మీరు బతకతాండేది? ఇబ్బుడిబ్బుడే సండ్లొ చ్చాండే పిల్లదాన్నయి దుప్పటి కప్పుకుని తిరుగుదునా... సెప్తాంటే రోంతన్నా సిగ్గుం డాల... ఎవరైనా వింటే మూచ్చారు... నాకొడకా... మొఖమ్మీద... ఛూ... అని" అంటూ నిజంగానే ఊసింది నాయన మీద ఉక్రోషం ఆపుకోలేక జేజి.

నాయన మరింతగా కాలిపోయినాడు. కూచున్నోడు గభేలున లేచి కసితీరా పిడికిలి బిగించి జేజిని ఒంగబెట్టి ఒక్క గుద్దు గుద్దబోయేంతలో "వాయమ్మో... సంపేసినాడే ముసల్దాన్ని..." అంటూ జేజి వలవలా ఏడ్చేసరికి వదిలేసినాడు.

వదిలేసినా కూడా జేజి అరుపులు ఆగలా. "ఆగిత్యందానా...ఎందుకు అట్లా అరుచ్చాండావే... నిన్నెవురైనా పొడ్సినారా... నోర్మూయ్..." గట్టిగా కేక పెట్టినాడు నాయన.

అయినా జేజి ఊరుకోలేదు. పైగా "పొడుచ్చావు... పొడవనిచ్చే మనిషివి" అంటా ఎత్తిపొడిచింది.

ఇంగ నాయన ఆవేశాన్ని ఆపడం ఎవరి తరం కాలేదు. పళ్లు పటపటా కొరుకుతూ మీదిమీదికి ఉరికురికి వెళ్లాడు. ఇంకాసేపు అక్కడుంటే ముసల్దాన్ని చంపేస్తాడే అనుకున్నాము. ఇంతలో టకటక పంచె ఎగ్గట్టి వీధిలోకొచ్చి నిలబడు కున్నాడు నాయన. చెప్పులేసుకుని అడ్డురోడ్డు వైపు వెళ్తా... "ఒరే సిన్నోడా... ఇంగోసారి ముసల్ది దుప్పటి లేకుండా బయటికెళ్తే సెప్పురా... సెప్తా దీని సంగతి..." అంటూ వార్నింగిచ్చినాడు.

జేజి వణికిపోయింది

"ఇదేం ఖర్మరా దేవుడా..." అంటూ ఏడ్చింది.

"వీడి సిన్నబ్బుడు ఊళ్లో కొట్లాలు కాలిపోతే నా బిడ్డ పచ్చుండాడని ఇల్లిల్లూ తిరిగి అడుక్కున్నా... అబ్బుడు గోషా, పరదా అనుకోనుంటే ఈ నా కొడుకు ఇంతోడు అయ్యేటోడా?" అంటూ శోకాలు పెట్టింది.

"మల్లా నాలుగిళ్లు అడుక్కున్నా పర్వాలా... నేనీడ ఉండలేను వెళ్లిపోతా..." అని సర్దుకోవడం మొదలుపెట్టింది.

నేను గుమ్మానికున్న పరదాను సర్ది పట్టుకుని నీళ్లు నిండిన కళ్లతో జేజి వైపే చూస్తుండిపోయాను నిస్సహాయంగా.

*ఆదివారం ఆంధ్రజ్యోతి, 10 జులై 2009*

*వర్తమాన కథ, 2009*

*మ్యూజ్ ఇండియా డాట్‌కామ్ (ఇంగ్లీష్ అనువాదం), మార్చి 2012*

*'జన్‌సత్తా' హిందీ దినపత్రిక, ఆదివారం అనుబంధం, 07 అక్టోబర్ 2012*

# జుమ్మా

నాకు కళ్లు మూసినా తెరిచినా మా అమ్మ అమాయకమైన ముఖమే గుర్తుకు వస్తోంది. ఆ ముఖంలో భయమే గుర్తుకు వస్తోంది. భయం భయంగా ఆమె అన్న మాటలే పదేపదే చెవుల్లో గింగిర్లు తిరుగుతున్నాయి. ఆరోజు శుక్రవారం. మక్కా మసీదు గుండెల్లో బాంబు బ్లాస్ట్ జరిగిన రోజు. సిటీ అంతా అల్లకల్లోలం. టీవీల గగ్గోలు. రాళ్ల వర్షం. భయానకం. బీభత్సం.

ఆఫీసులో బిజీగా ఉన్నాను. ఫోన్ మోగింది. తీశాను. అమ్మ నుంచి ఫోన్... ఆ టైంలో అమ్మ ఫోన్ హాయిగా అనిపించింది. ధైర్యంగా అనిపించింది.

“మా...” అన్నానో లేదో “నాయనా...” అంది మా అమ్మ ఆత్రంగా.

“ఈ విషయం తెలుసా మా...” అన్నాను.

“తెలిసింది నాయనా... ఇప్పుడే తెలిసింది... నువ్వు. జాగ్రత్త...! నువ్వు గాని మసీదుకు వెళ్లలేదు కదా, నాయనా...” అమ్మ భయంగా అంటోంది.

నేను మసీదుకు పోనందుకు జీవితంలో తొలిసారిగా సంతోషిస్తున్నట్టుంది. ఆ ఆలోచనే నా గుండెల్ని పిండేస్తోంది.

అమ్మేనా... ఇలా అంటోంది... అమ్మేనా ఇలా మాట్లాడుతోంది... అమ్మేనా ఇలా అడుగుతోంది.. అమ్మేనా ఇలా భయపడుతోంది...నా మెదడు ఆలోచనల పుట్టయి పగిలిపోయింది. జ్ఞాపకాల వరదలో కొట్టుకుపోతోంది.

❄

శుక్రవారం నమాజు అంటే మా అమ్మకు ప్రాణం. దేన్నయినా ఉపేక్షిస్తుంది కానీ శుక్రవారం నమాజుకు పోకపోతే మాత్రం ఇంట్లో ఉండనివ్వదు. మా నాయన క్కూడా అక్షింతలే. అంతటి మనిషే అమ్మ దెబ్బకు భయపడి మెల్లగా టోపీ తీసుకుని మసీదు దారి పడతాడు.

పని దొంగలు, ఇంటి దొంగలు, బడి దొంగలు ఉన్నట్టు మా ఇంట్లో నేను, మా నాయన మసీదు దొంగలం. శుక్రవారం నిద్ర లేచినప్పట్నుంచి 'నమాజుకు వెళ్లాల... నమాజుకు వెళ్లాల...'' అని అమ్మ ముందు పెద్దగా ఫోజులు కొట్టి తీరా నమాజు టైంలో 'ఆ పనుంది... ఈ పనుంది' అని డుమ్మా కొట్టేటోడు నాయన.

ఇక నేను 'అర్రే... ఇప్పుడేమ్మా... మర్సిపోయి దిబ్బలో ఉచ్చలు పోసినానే...' అనేటోణ్ణి తీరా నమాజుకు టైం అయ్యింది అన్నప్పుడు. అప్పుడు ఆ మాటంటే ఇక మా అమ్మకు వేరే దారి ఉండేది కాదు. అప్పటికప్పుడు మళ్లీ స్నానం చేయించి బట్టలుతికి నన్ను మసీదుకు పంపలేదు కదా...!

అందుకే ఆ కసిని అలాగే ఉంచుకుని తిట్టిన తిట్టు తిట్టకుండా కొట్టిన చోట కొట్టకుండా బర్రతో ఉతికి ఇంటి ముందు టోపీలతో పాటు ఆరేసేది.

ఆ దెబ్బల కన్నా శుక్రవారం నమాజే బెటర్ అనిపించేది. మసీదుకు వెళ్లేంత వరకే నాకు బద్ధకం. మసీదుకెళ్లాక ఎంచక్కా తోటి పిల్లలతో కలసిపోయేవాణ్ణి. 'మా నాయనకు దండిగా లెక్క రావల్లని... మా అమ్మకు ఆరోగ్యం బాగు కావాలని, నాకు సదువు బాగా రావాలని' నానా కోరికలు కోరుకునేవాణ్ని.

''కోరికలు కోరడానికి నమాజుకు వెళ్లకూడదు నాయనా.. మనం నమాజు చేయాల... అల్లా మీద నమ్మకం పెట్టాల... మన బాగోగులు అల్లానే చూసు కుంటాడు,'' అనేది.

మసీదులో మాట్లాడుతున్నానని తోటి పిల్లోళ్ళు మా అమ్మకొచ్చి చెబితే ''మసీదులో ఇతరులతో మాట్లాడకూడదు నాయనా... కనీసం వేరే ఆలోచన ఏదీ మనసులోకి రానివ్వకూడదు. ఎప్పుడూ అల్లా మీదే ధ్యాసపెట్టాలి. చివరికి పక్కన బాంబు పేలినా కదలకూడదు...'' అనేది.

ఇలా నిజంగానే పేలుతుందని అమ్మ అప్పుడు కల్లో కూడా ఊహించి వుండదు. అందుకే అంత ధైర్యంగా ఆ మాట అనగలిగింది. ఇప్పుడు నిజంగానే బాంబు పేలేసరికి అమ్మకు భయం తెలిసొస్తోంది.

ఆ బాధను తట్టుకోలేకపోతున్నాను. అమ్మ భయపడుతోంది. నమాజు అంటే భయపడుతోంది. అల్లా అంటే భయపడుతోంది.

"మా..." అన్నాను మళ్లీ ఆత్రంగా.

"నాయనా...' అంది అమ్మ.

"నువ్వు మసీదుకు వెళ్లలేదు కద నాయనా" అంది మళ్లీ.

నా గుండె నీరయింది. నోరు మూరు మాట్లాడలేకపోతోంది. గొంతు తడారి పోతోంది. ఆలోచనలు ఉప్పెనలా ఉరికొచ్చి మీద పడుతోంటే ఉక్కిరిబిక్కిరి అయ్యాను. వెనక్కి వెనక్కి లాగేయబడుతున్నాను.

❄

మసీదు నుంచి ఇంటికి వచ్చి మసీదులో జరిగిందంతా పూసగుచ్చినట్టు అమ్మకు చెప్పేవాణ్ణి. అమ్మ ముందు ఉత్తుత్తి నమాజు చేసి చూపించేవాణ్ణి. నేను చేతులు కట్టుకుని నమాజు చదువుతుంటే అమ్మ అమాంతం నన్ను గుండెలకు హత్తుకుని ముద్దుల వర్షం కురిపించేది. 'నా బిడ్డను అల్లా సల్లగా చూస్తాడు...' అనేది. అప్పుడు నా కనిపించేది ... బుద్ధుంటే ఇకముందు నమాజుకు ఎప్పుడూ డుమ్మా కొట్టకూడదని. అమ్మ శుక్రవారం మసీదు ప్రాధాన్యం గురించి ఎంతో బాగా చెప్పేది. ఆ రోజు దేవుని రోజని అందుకే తప్పకుండా నమాజుకు వెళ్లాలనేది. ఖురాన్ పుట్టిందే శుక్రవారం అనేది దేవుడు సచ్చిపోయి నోళ్ల తప్పొప్పులు లెక్క పెట్టేది శుక్రవారమేనట. ఈ లోకం ఖాళీ అయితే శుక్రవారమే అవుతుందట. ఇంకా ఏవేవో చెప్పేది.

శుక్రవారం సాయిబుల పవిత్రదినం ఎలా అయ్యిందో నా చిట్టి బుర్రకు ఇట్టే అర్థమైపోయేది.

పిల్లోల్లందరూ సచ్చినట్టు మధ్యాహ్నం దాక స్కూల్లో ఉంటే నేను మాత్రం మసీదు పేరుతో ఇంటర్వెల్‌లోనే అయ్యవార్ని అడిగి సంచి ఊపుకుంటూ ఇంటికి వచ్చేటోణ్ణి. అమ్మనే అయ్యవారితో మాట్లాడి ఆ ఏర్పాటు చేసింది.

ఇంటర్వెల్లోనే ఇంటికొచ్చే నన్ను చూసి తోటి పిల్లోళ్లు కుళ్ళుకునేటోళ్లు. మేము కూడా తురకోడిగా పుట్టింటే బాగుండు కదరా... అనుకునేటోళ్లు. వాళ్ల ముఖాలు చూసి నేను పకపకా నవ్వుకునేటోణ్ణి. ఏనుగెక్కినంత సంబరంగా స్కూల్ నుంచి ఇంటికొచ్చేటోణ్ణి.

అమ్మ వేడినీళ్ళు పెట్టి ఆగమేఘాల మీద నన్ను రెడీ చేసేది. కళ్లకు సుర్మా రాసేది. నుదుట వెంట్రుకలు కనబడకుండా టోపీ పెట్టేది. ఎప్పుడూ నిక్కర్లు తొడుక్కుని కనబడే నేను ఆరోజు మాత్రం తెల్లటి జుబ్బా-పైజామాలో తళతళ మెరిసిపోయి కనిపించేటోణ్ణి.

చూసిన ఆడోళ్లంతా 'శుక్రవారం వస్తే కళంతా నీ ముఖం మీదే ఉంటది కదరా' అని నా తల చుట్టూ చేతులు తిప్పుతూ దిష్టి తీసి వేళ్లు పటపటా విరిచే టోళ్లు.

ఇక శుక్రవారం సాయంత్రాలు చూడాలి... అందరిళ్లల్లో ఒకటే హడావిడి. దర్గా పటాలముందు దీపాలు వెలిగేవి. ఇళ్లనిండా అగరొత్తుల సువాసనలు అలుము కునేవి. అంగడింట్లో టెంకాయలకు గిరాకీ పెరిగేది.

ఆడోళ్లంతా నెత్తిన కొంగు కప్పుకుని ఇంట్లోకి, బయటికి తిరిగేటోళ్లు. ఇక మా ఇంట్లో సద్దింపుల తతంగం గురించి చెప్పుకుని తీరాలి.

నాయన  అడ్డరోడ్డుకెళ్లి మసీదులో హజ్రత్‌ని ఇంటికి పిలుచుకొచ్చేటోడు. మా నాయనకు సద్దింపులివ్వడం రాదు. నేర్చుకోమని అమ్మ పోరు పెట్టేది.

"కల్మా... గుసుల్ తెలియని మనిషివి... నీకిచ్చి పెళ్లి చేసినందుకు మా పుట్టిం టోళ్లను అనాల.. వాళ్లకు దిక్కుల్యాక నీకు కట్టబెట్టినారు... పిల్లోళ్లను కూడా అట్నే తయారుజేచ్చాండావు..." అని నాయన మీద గలాటా వేసుకునేది.

"దీనెమ్మ... దీని పోరు పెద్దదయ్యిందిరా..." అని నాయన వదురుకుంటా వెళ్లి మసీదులో హజ్రత్‌ను పిల్చుకొచ్చేటోడు.

హజ్రత్ వచ్చి కాళ్లు ముఖం కడుక్కుని సద్దింపులు ఇచ్చి బయట పరిచిన మంచం మీది కొచ్చి గడ్డాన్ని చేత్తో దువ్వుకుంటా ప్రశాంతంగా కూచునేటోడు.

అమ్మ ఇంట్లో పగలగొట్టిన కొబ్బరికాయలోంచి కొబ్బెరను జాగ్రత్తగా తీసి చక్కెరలో కలిపి బయట అందరికీ పంచి వచ్చేది. చివరిగా ఒకటి రెండు ముక్కలు నా కోసం మిగిలించుకొచ్చేది.

'నాకు ఇంతేనా?' అని నేనంటే "దేవుడి పేరుతో సద్దింపులిచ్చింది మనం తిన కూడదు నాయనా... మనకు లాకున్నా అందరికీ పంచాలా..." అనేది.

నాకు కొబ్బెర ముక్కలు లేవే... అనే బాధ అమ్మ మాటల్లోని తీయదనంతో ఎగిరిపోయేది. ఇక సద్దింపులిచ్చిన హజ్రత్‌తో మా నాయన తెలుగు మాటలు బాగా పొద్దుపోయేంత వరకూ సాగేవి. నేను జుబ్బా పైజామా తీసేసి మళ్లీ నా మామూలు

డ్రెస్సులోకి మారిపోయి మా ఇంటి దగ్గర్లో ఉన్న గునాదుల్లోకి పరిగెత్తేవాణ్ణి ఆడు కోడానికి.

ఇవన్నీ గుర్తొచ్చి నా కళ్లలో నీళ్లు తిరుగుతుంటే-

“నాయనా పలకవేమిరా... ఏమైందిరా... నాకు భయంగా ఉందిరా- పల కరా...” అంది అమ్మ.

“మా...” అన్నాను బలవంతం మీద గొంతు పెగుల్చుకుని. నేను హైదరా బాద్ వచ్చి మూడేళ్లవుతోంది. ఏ రోజూ నమాజు కెళ్లలేదు. రకరకాల షిఫ్టులతో ఉద్యోగం చేసే నేను నమాజు సంగతే మర్చిపోయాను. “హైదరాబాద్‌లో నేనెప్పుడు మసీదు కెళ్లానని మా... అంతగా భయపడతాండావు” అన్నాను.

మా అమ్మ హైదరాబాదుకు వచ్చిన తొలి రోజులు గుర్తుకు వచ్చాయి. అమ్మ నన్ను చూడ్డానికే వచ్చింది. నేను చూపిస్తే హైదరాబాద్ చూడ్డానికి వచ్చింది.

పైకి మాత్రం “నేను ఎక్కడికీ రాను నాయనా... ఊరికే డబ్బు ఖర్చు,” అంది...

అమ్మ మనసు నాకు తెలుసు. నన్ను కష్టపెట్టడం ఇష్టం లేకే అమ్మ అలా అంది కానీ నేను ఒప్పుకోలేదు. బలవంతంగా రూము నుంచి బయటికి తీసుకెళ్లాను. చెయ్యి పట్టుకుని రోడ్లు దాటించుకుంటూ తీసుకెళ్లాను. ఓసారి ఖైరతాబాద్ రోడ్డు దాటిస్తుంటే కన్నీళ్లు పెట్టుకుంది.

“ఎక్కడ పుట్టావు... ఎక్కడ పెరిగావు... ఎక్కడికి వచ్చావు... ఇంత సిటీలో ఎలా ఉంటున్నావు... ఎంతగా ఎదిగావు...” అని పలుపలు విధాలుగా తారీఫ్ చేసి ఏడ్చింది.

“చిన్నప్పుడు మీ నానమ్మ వాళ్ల ఊరికి నిన్ను తీసుకెళ్లేటప్పుడు రోడ్లపై ఎక్కడ తప్పిపోతావోనని నీ చెయ్యి పట్టుకుని జాగ్రత్తగా బస్సు ఎక్కించుకుని తీసుకెళ్లేదాన్ని. ఇప్పుడు నువ్వు నా చెయ్యి పట్టుకుని జాగ్రత్తగా బస్సు ఎక్కించుకుని తీసుకెళ్లే ఎత్తుకు ఎదిగావు” అని ఒక్కసారిగా వచ్చిన సంతోషం, దుఃఖంతో పొరబోయి అమ్మ ఉక్కిరిబిక్కిరైంది. ఊపిరాడటం కోసం ‘కస్...కస్’మని దగ్గి ఏడ్చింది.

గతం తలచుకుని నడిరోడ్డులో కన్నీళ్లు కారుస్తుంటే కళ్లు తుడిచి ఓదార్చాను.

“మా... బతుకు మీద కసితో వచ్చాను. ఎన్నో కష్టాలు ఓర్చుకున్నాను. నాకు నేనే ధైర్యం చెప్పుకున్నాను. జ్వరం వచ్చినా నాకు నేనే బరువుగా లేచి టాబ్లెట్ తెచ్చుకున్నాను. సూది వేయించుకున్నాను. అయినా, మా... నీ ఆశీస్సులుండబట్టే

కదా... ఇంత సిటీలో నా అన్నవాళ్లు ఎవరూ లేకపోయినా ఒంటరిననుకోకుండా బతుకుతున్నాను''.

అమ్మ ఏడుపు ఆపింది. ''నువ్వు నిండు నూరేళ్లు బతుకు నాయనా...'' అంది.

ఆ తర్వాతే మొదలైంది అమ్మకు నాకు పేచీ..

''శుక్కురారం... శుక్కురారం... నమాజుకు వెళ్తాండావారా...'' అంది.

''లేదమ్మా... యాడ వీలవుతుంది చెప్పు?'' అన్నాను.

''ఎప్పుడూ వీలవదు నాయనా! కానీ వెళ్లి రావాల. తప్పదు. సాయిబులై పుట్టినాక కనీసం వారానికొకసారైనా నమాజుకు వెళ్లాల'' అంది.

''గరీబ్, షావుకార్ అని తేడా లేకుండా అందరూ నమాజులో ఒక్కటవుతారు. భుజం భుజం కలిపి నమాజు చదువుతారు. ఆరోజు నమాజు ఎంతో పుణ్యం. పోతే తిరిగిరాదు. అందుకే పెద్ద పెద్దోళ్లు... లచ్చలతో యాపారం చేసేటోళ్లు కూడా అన్ని పనులు వదిలేసి ఆరోజు నమాజుకు వెళారు. అంగిడోళ్లు కూడా అంగడి మూసేసి, యాపారం- పోతుందనుకోకుండా నమాజుకి ఎలబారతారు. పూట గడవనోళ్లు కూడా ఆ పూట గడవలేదే అనే బెంగ లేకుండా నమాజు చేస్తారు'' అంది.

అమ్మ మళ్లీ పాతకథే ఎత్తుకునేసరికి భయమేసింది. ఆ విషయాన్ని మళ్లిద్దామనుకుని ''మా... ఇక్కడ పెద్ద మక్కా మసీదు ఉంది తెలుసా? నిజాం నవాబులు కట్టింది'' అన్నాను.

''అవునా! అక్కడికి తీసుకెళ్లవా?'' అంది అమ్మ.

''అక్కడికెళ్లాక మళ్లీ నమాజుకు వెళ్లమని తిట్టకూడదు.''

''ఒరేయ్... గలీజ్... నీ మంచి కోసమేరా చెప్పేది.''

''సర్లే... పదా '' అంటూ అట్నుంచటే బస్సెక్కి నేరుగా మక్కా మసీదు దగ్గరకు వెళ్లాం. మసీదు మినారు కన్నా ఎక్కువగా చార్మినార్ కనిపిస్తోంది. అమ్మ అటు చూసింది.

''మా అది చార్మినార్, ముందు అక్కడికి వెళ్దామా... మక్కా మసీదులోకి వెళ్దామా...'' అన్నాను.

''ఏముందిరా చార్మినార్ దగ్గర?''

''ఏమీ లేదమ్మా ... ఎటుపక్క నుంచి చూసినా ఇట్లే ఉంటుంది ... అయితే పైకి ఎక్కొచ్చు... ఎక్కితే మసీదు కూడా బాగా కనిపిస్తుంది... ఇప్పటికే సాయంత్రం అయిపోయింది. ఇంకోసారి చార్మినార్ చూద్దాం... ఇప్పటికి మసీదులోకి వెళదాం,'' అన్న నా మాటలకు అమ్మ ఒప్పుకుంది.

మసీదులోకి అడుగుపెట్టా. అక్కడ ప్రశాంతంగా ఉంది, హాయిగా ఉంది. చల్లగా ఉంది. విశాలంగా ఉంది. సందర్శకుల తాకిడి ఎక్కువగానే ఉంది. అమ్మ మసీదులోకి అడుగు పెట్టే ముందు సంశయించింది. ఆడోళ్లు మసీదులోకి ఎక్కువ గా రారు. కానీ అప్పటికే లోపలున్న కొన్ని బుర్ఖాలను చూసి అమ్మ ధైర్యంగా లోపలికి అడుగుపెట్టింది.

'నెత్తిమీదికి వెంటనే కొంగు తీసుకుంటూ నేను కూడా దుప్పటి తెచ్చుకుంటే బాగుండు కదరా...' అంది. అమ్మ నా గదిలోంచి బయల్దేరేముందు దుప్పటి తీసు కుందాం అంది. నేనే వద్దన్నాను. ఉన్న ఊర్లో ఎలాగూ తప్పదు... కనీసం కొత్త ఊర్లో అయినా అమ్మకు దుప్పటి బాధ తప్పిద్దామని. కానీ మసీదులో తోటి కులస్తుల మధ్య దుప్పటి లేనందుకు అమ్మ చర్మం లేని మనిషి అయిపోయింది. బిగుసుకు పోయి బితుకుబితుగ్గా నడుస్తుంటే దుప్పటి వద్దని తప్పు చేశానేమో అనిపించింది. కాని నన్ను నేను సమర్థించుకుంటూ "నాకేం తెలుసమ్మా ... మనం మసీదులోకి వస్తామని..." అన్నాను.

అమ్మ ఏమీ అనలేదు.

తర్వాత "పర్లేదు... రా" అంటూ లోపలికి తీసుకెళ్లాను. అమ్మ నన్ను అనుసరిం చింది. చెప్పులు ఒక వారగా గుర్తుగా వదిలాం. చాలామంది జనం మసీదు మెట్ల మీదే తిష్ట వేశారు. వారు పావురాలతో ఆడుకుంటున్నారు. గింజలు వేస్తున్నారు. కొన్ని పావురాలు ఎగిరిపోతున్నాయి... మళ్లీ వచ్చి వాలుతున్నాయి.

ఆ సన్నివేశం ఆహ్లాదంగా ఉంది. పక్కనే నీళ్ల తొట్టి, ఆ నీళ్ల తొట్టిమీద కూడా కొన్ని పావురాలు వాలి అటూ ఇటూ చూస్తున్నాయి. అమ్మ వాటివైపు అబ్బురంగా చూసింది. తర్వాత మెట్ల పైనున్న జనాన్ని దాటుకుని నేను అరుగుమీదికి వెళ్లాను. అమ్మ నా వెంట వచ్చింది. అరుగు పెద్దగా ఉంది. ఆ పెద్ద అరుగును చూసి "ఒకేసారి ఎంత మంది నమాజు చదవొచ్చురా ఈడ" అంది.

"నాకు తెలియదు మా... వేలమంది పడతారు. రంజాన్ రోజైతే చార్మినార్ వరకూ కూడా జనం నమాజు చదువుతుంటారు మా..." అన్నాను.

"అవును టీవీల్లో చూపిస్తుంటారు" అంది అమ్మ.

బాగానే గుర్తుపట్టింది అనుకున్నాను. కాసేపు అరుగుపై అటూ ఇటూ తిప్పి మసీదు వెనగ్గా తీసుకెళ్లాను. మసీదు వెనుక బండలన్నీ పావురాలు వేసిన రెట్టల మరకలతో మాసిపోయి ఉన్నాయి. మసీదు గోడల అరల్లో కొన్ని పావురాల స్థావరాలు కనిపించాయి.

అమ్మ మసీదు మినారు గోడను అపురూపంగా ముట్టుకుంది. కళ్లకద్దుకుంది. పులకించిపోయింది.

"ఇలాంటి చోట నమాజు చదివితే పుణ్యం నాయనా" అంది. నాకేం చిరాకు వేయలేదు.

'నిజమే ఒక్కసారి అయినా ఇందులో నమాజు చదవాలి' అనుకున్నాను.

నేనున్న రూము నుంచి మక్కామసీదు చాలా దూరం. శుక్రవారాలు, పండుగ దినాల్లో బస్సెక్కి ఇంత దూరం రావాలంటే చాలా కష్టం. అయినా ఈసారి తప్పకుండా నమాజు చదవాలి. వచ్చే శుక్రవారం ఇక్కడే నమాజు చదవాలి అనుకున్నాను..

"వచ్చే శుక్రవారం ఇక్కడికి నమాజు చదవడానికి వస్తానమ్మా..." అన్నాను. అమ్మ సంతోషించింది. నావైపు ఆప్యాయంగా చూసింది.

"ఇలాంటి చోట్ల నమాజు చదవడానికి ఎంతో పుణ్యం చేసుకుని ఉండాలి నాయనా" అంది మళ్లీ.

"ఎక్కడో ఉన్న మీ నాయన వాళ్లకు ఇక్కడికొచ్చి నమాజు సదవాలి అంటే అయితాదా? నువ్వు ఈ ఊర్లోనే ఉండావు... ఈడ నమాజు సదువు నాయన..." అంది. "ఈడ్నేకాదు... ఎక్కడ ఏ పాత మసీదు కనిపించినా నమాజు సదువు నాయనా... ఆడ ఎందరెందరో గొప్పోళ్లు నమాజు సదివి ఉంటారు. అలాంటి చోట్ల నమాజు సదివితే తిరుగుండదు. దేవుడు సల్లగా చూస్తాడు" అంది.

మసీదులో ఉన్నంతసేపు మంత్రం వేసినట్లు అయిపోయాను. అమ్మ చెప్పిన మాటలు పూసగుచ్చినట్టు విన్నాను.

మసీదు నుంచి బయటికొస్తూనే అన్నీ మర్చిపోయాను. మసీదుకెళ్తానని మాటిచ్చిన సంగతి పక్కన పెట్టాను. ఆరోజు సాయంత్రమే అమ్మను ఊరి బస్సు ఎక్కించి పంపించేశాను. ఆ తర్వాత రెండు శుక్రవారాలు వచ్చినా ఆరోజు శుక్రవారం అన్న సంగతే తెలియకుండా గడచిపోయాయి. తిరిగి ఇప్పుడు ఇలా జరిగే సరికి శుక్రవారం అంటే భయమేస్తోంది.

"ఇంతకీ ఏ మసీదులో బాంబు పేలిందో తెలుసా... మా" అన్నాను ఫోన్లో.

"ఏ మసీదులో నాయనా..." అంది అమ్మ.

"నువ్వు అప్పుడు ఒకసారి హైదరాబాద్ వచ్చినావే... అప్పుడు నిన్ను తీసుకెళ్లానే... మక్కామసీదు... పెద్ద మసీదు... పావురాలున్న మసీదు... ఆ మసీదు లోనే మా... బాంబు పేలింది... ఆ మసీదులోనే మా నెత్తురోడింది... ఆ మసీదులోనే మా... శవాలు లేచింది... నువ్వు నమాజు చదివితే పుణ్యం వస్తుంది అన్నావే... ఆ మసీదులోనే మా..." అన్నాను.

"సినసిన పిల్లోళ్లు మా... వళ్లంతా రక్తమే మా... పావురాలు కూడా చనిపోయి నాయి మా..." నాకు ఏడుపు ఆగకుండా వస్తోంది. బాత్‌రూమ్ దగ్గరికెళ్లి కళ్లు తుడుచుకున్నాను. నా ఏడుపుతో అమ్మ గుండె పగిలిపోయింది. అమ్మ కూడా ఏడ్వడం మొదలుపెట్టింది. "మా... ఏడ్వకే... నాయనోళ్లు... నాకేమైనా అయ్యిందను కుంటారు. నేను బావున్నానని చెప్పు..." అన్నాను.

ఇక ఫోన్ పెట్టేస్తాననుకుందేమో.

'ఫోన్ పెట్టకురా...' అంది ఏడుస్తూనే.

"చెప్పమ్మా... త్వరగా..." అన్నాను.

"నువ్వు వచ్చేయ్ నాయనా... ఊరికొచ్చేయ్ ... నా మాటిను," అంది.

"నాకేం కాదులే మా..."

"బయట తిరక్కు నాయనా."

"సరే మా..."

"ఆ మసీదుకల్లా పోకు నాయనా..."

నా గుండె మళ్లీ పొంగడానికి సిద్ధంగా ఉంది. వెంటనే ఫోన్ పెట్టేశాను. "నేనిక ఆ మసీదు దగ్గరికి వెళ్లను..." అని మాటిచ్చి ఫోన్ పెట్టేశాను.

కానీ ఆలోచనల పరంపర కొనసాగుతూనే ఉంది. ఎంత తేడా. నిన్నటికీ ఈరోజుకీ ఎంత మార్పు. అమ్మేనా ఇలా అంటోంది. అమ్మేనా ఇలా చెబుతోంది. అమ్మేనా నన్ను మసీదు వైపుకు వెళ్లొద్దంటోంది. కన్న పేగు తీపి ముందు దేవుడు చేదయ్యాడా? నమాజు కానిదైందా?... అల్లా క్షమించు... అల్లా మన్నించు...! ఇంకో శుక్రవారం ఎక్కడా నెత్తురోడకుండా చూడు... అవుజ్ బిల్లాహి... మి నషైతాన్... నిర్రజీం... బిస్మిల్లా ఇర్రహమా నిర్రహీం...!

*(మక్కా మసీదు పేలుడు తర్వాత మా అమ్మలా మారిన అమ్మలకి ...)*

*ఆదివారం ఆంధ్రజ్యోతి, 24 జూన్, 2007*
*కథావార్షిక 2007*
*మ్యూజ్ ఇండియా డాట్‌కామ్ (ఇంగ్లీష్ అనువాదం), నవంబర్ 2008*
*సాహిత్యనేత్రం (ఇంగ్లీష్ అనువాదం), డిసెంబర్ 2008*
*విదేహ ప్రత్యేక కథల సంచిక (బీహార్‌లోని మైథిలీ భాషలోకి అనువాదం), జనవరి 2009*
*'సమకాలీన భారతీయ సాహిత్య' (హిందీ అనువాదం, కేంద్ర సాహిత్య అకాడెమి ప్రచురణ) సెప్టెంబర్-అక్టోబరు 2012*
*'మయూర' సాహిత్య పత్రిక, (కన్నడ అనువాదం)జూన్, 2013*
*'రఖ్ణో' సాహిత్య మాసపత్రిక(కొంకణి అనువాదం) సెప్టెంబర్, 2013*

# ఆకుపచ్చ ముగ్గు

తెల్లారితే పండగంటున్నారు. కానీ కచ్చితమైన సమాచారం ఏదీ లేదు. కాసేపుంటే టీవీల్లో చెప్పేస్తారు.. రంజాన్ఎప్పుడన్నది?- అయినా కూడా ప్రాణం ఉండక మిద్దె క్కాను. ఒకసారి ఆకాశంలోకిచూశాను. ఎక్కడా చంద్రుడి జాడ లేదు. కనీసం చుక్కలు కూడా లేవు. అంతా ప్రశాంతంగా ఉంది. చల్లగాలి చెవులకు సోకుతోంది. 'ఇంగ పండగ మర్నాడే...'అనుకున్నాను. కానీ ఒక్కోసారి నమ్మడానికి లేదు. ఇక్కడ చంద్రుడు కనబడకపోయినా ఢిల్లీలో కనిపిస్తాడు. అక్కడ కనిపిస్తే ఇక దేశమంతా రేపే పండగ. ఆలోచించుకుంటూనే వచ్చి మిద్దె దిగాను. ఇంటి ముందు అరుగు మీద కొత్త చాప పరిచి ఉంది. అది "రా.. రమ్మని.." పిలుస్తున్నట్టుగా ఉంది. ఇలా సాయంత్రాలు చక్కగా అరుగు మీద కూర్చొని రోడ్డు మీద వచ్చే పోయేవాళ్లని గమనించడం నాకు భలే మంచి సరదా. అలా కూర్చునే తీరిక కూడా దొరక్క చాలా రోజులైంది. అందుకే మరేమీ ఆలోచించకుండా టక్కున కూర్చున్నాను. నా కోసమే చూస్తోందేమో.. అక్క ఇంట్లోంచి గోరింటాకు కోన్ పట్టుకుని వచ్చింది -"పత్రా.. గోరింటాకు పెడ్తా.." అంటూ.

నాకు గోరింటాకు పెట్టుకోవడం అంత ఇష్టం లేకపోయినా అక్క నోరు తెరిచి అలా అడిగితే మాత్రం కాదనలేను. నాకు మా అక్కంటే చాలా ఇష్టం. ఇప్పుడు ఈ పండగను అక్కతో కలిసి చేసుకుంటున్నందుకు లోలోన ఎంత సంతోషపడుతున్నానో మాటల్లో చెప్పలేను.

చిన్నప్పుడు "గోరింటాకు వొద్దుపో..." అని చిరాకు పడితే నేను పడుకునేదాక అక్క మేల్కొని ఉండి రాత్రికి రహస్యంగా చేతులకు గోరింటాకు పెట్టేది. తెల్లారే సరికి చేతులు ఆకుపచ్చగా మారిపోయేవి. నిద్దట్లో ఎక్కడ పడితే అక్కడ గోరింటాకు పూసేసుకుని బట్టలన్నీ పాడయ్యేవి. ముఖానికి, దుప్పటికి ఎక్కడ చూసినా గోరింటాకే అతుక్కుని ఉండేది. చేతులపై ఎండిపోయిన గోరింటాకును చిరాగ్గా కడుక్కుని చూస్తే కళ్లు తళుక్కుమని మెరిసేవి. ఆ ఎరుపుతో అక్క మీదున్న కోపం ఇట్టే మాయ మయ్యేది. అంతలోనే రాత్రంతా అంతగా గోరింటాకు పెడుతున్నా మెలకువ రాకుండా పడుకునందుకు సిగ్గుగా అనిపించేది.

ఇదంతా గుర్తొచ్చింది కాబట్టే.., అక్క అడిగిందే తడవుగా ఆమె ముందు చేయి చాచేసి, బుద్ధిగా బాసిమట్టం వేసుకుని కూచున్నాను. అక్కలో ఇప్పటికీ నాకింత ప్రేమగా గోరింటాకు పెట్టాలన్న కోరిక పోనందుకు మాత్రం మనసంతా గమ్మత్తుగా ఉంది. అక్క చాపపై కూర్చోని ఓ చేత్తో నా చేతిని పట్టుకుని కోన్‌తో ఆప్యాయంగా గోరింటాకు పెడుతుంటే నా ఆలోచనలు పచ్చ..పచ్చగా ముందుకు కదులుతున్నాయి.

అదేం ఓపికో కానీ తెల్లవార్లు మేలుకోనైనా ఇంట్లో ఒక్కొక్కరికీ గోరింటాకు పెడుతూ ఉంటుంది అక్క. ఒకరికి వేసిన డిజైన్ మరొకరికి వేయకుండా అందరికీ డిజైన్లు డిజైన్లుగా వేస్తుంది. చిన్నపిల్లలకైతే మరింత ఉత్సాహంగా వేస్తుంది. వాళ్ళు ఎర్రగా పండిన చేతుల్ని వీధుల్లో నలుగురికీ చూపించి 'జీనత్ అక్క పెట్టింద'ని ఆమె కీర్తిని నలుగురికీ తెలిసేలా చెబుతారు కదా.. అందుకని. ఇప్పుడంటే గోరింటాకు కోనులు వచ్చాయి కానీ అప్పుడెక్కడివి...?

మా ఇంటి వెనుక బీట్లో (మైదానంలో) తంతిలోళ్లాయమ్మ ఇల్లుంది. వాళ్లు తంతుల్తో తడికెలు అల్లి గొర్లోళ్లకు అమ్ముతారు. అందుకే వాళ్లను అందరూ తంతిలోళ్లు అంటారు. వాళ్ల పెరట్లో పేద్ద గోరింటాకు చెట్టుంది. ఆ చెట్టు ఎంతదంటే మా అక్క తన బుల్లి కాళ్లతో ఆ చెట్టెక్కి సాయంత్రం దాక ఆకు దూసుకుంటూ కూచూనేది. ఇక ఒక్కసారి గనక అక్క చెట్టు దిగిందంటే ఆ చెట్టుకున్న ఆకు సగం

ఖాళీ అయిపోయేది. ఏదో 'ఆకుపురుగు' కొట్టినట్టు అనిపించి ఆ చెట్టుగళ్లాయమ్మే చూసి దడుసుకునేది. "ఏమి మీ యమ్మికి ఇంత గోరింటాకు పిచ్చి..!" అని మా ఇంటికి వచ్చి అమ్మకు చెప్పుకుని ఆశ్చర్యపోయేది.

అప్పటికే అక్క పావడా నిండా తెచ్చిన గోరింటాకును రోట్లో వేసి నున్నగా రుబ్బే పనిలో మునిగి పోయేది. ఇళ్లంతా గుప్పుమని గోరింటాకు వాసన అలుము కునేది. ఒట్టి ఆకైతే తక్కువ పండుతుందని, అందులో కొంచెం కిరసనాయిలు, చింతపండు ఇంకా ఏవేవో కలిపేది అక్క. గోరింటాకు రుబ్బిన రోలును కడగలేక అమ్మ ఇంతెత్తు ఎగిరేది. అయినా అక్క అదేం పెద్ద పట్టించుకునేది కాదు. రాత్రి అందరూ అన్నాలు తినడం అయిపోయాక తీరిగ్గా రెడీ అయ్యేది.

ఒక చేత్తో వేలంత చీపురు పుల్ల, మరో చేత్తో చిన్న గోరింటాకు గిన్నె తీసుకుని ఒక్కొక్కరికీ పెట్టుకుంటూ వచ్చేది. వద్దని మొండి కేసిన వాళ్లను బతిమాలుకునేది. ఆ మాటలు ఈ మాటలు చెప్పి వాళ్లను ఐస్ చేసేసేది. ఎలాగోలాగా ..అందరి చేతులను ఎరుపెక్కించేసేది. అక్కకు గోరింటాకు పెట్టాలన్న ఇంత ఆశ ఎక్కడిదో? ఎందుకొచ్చిందో నాకు అప్పుడు అంతుపట్టేది కాదు. ఇప్పుడైనా అడిగేయాలని పించింది.

❄

రోడ్డు మీద సైకిల్ 'క్లింగ్..క్లింగ్.." అంటూ శబ్దం చేసుకుంటూ వెళ్తోంది. జనం ఎవరి హడావిడిలో వాళ్లు వెళ్తున్నారు. పండగ ఎప్పుడో తెలియని అయోమయ వాతావరణం ఆ సాయంత్రం అందరిలో స్పష్టంగా కనిపిస్తోంది. ఒక అక్కలో తప్ప. ఆమె ఈ లోకంలో లేదు. ఆమె దృష్టంతా నా చేతికి గోరింటాకు పెట్టడం మీదే ఉంది. నా దృష్టి మాత్రం పరిసరాలమీది నుంచి మెల్లగా అక్క ముఖం మీదికొచ్చి నిలిచిపోయింది.

ఈ అక్క అప్పటి అక్క కాదు.

అప్పటి అక్క అప్పుడే చెట్టు నుంచి కోసుకొచ్చిన బత్తాయిపండులా ఉండేది.

లావు లావు బుగ్గలు... చలాకీ కళ్లు. ఎంత... ముద్దుగా ఉండేదో?

ఆ రూపు రేఖలేవీ ఇప్పుడు అక్కలో కనిపించడం లేదు.

ముఖమంతా పీక్కుపోయింది. కళ్లన్నీ కళ తప్పాయి.

ఒంట్లో సరైన శక్తి లేక బుగ్గలు లొట్టపోయి ముందరి పళ్లు బైటపడ్డాయి. అక్క ముఖాన్ని అలా చూసేసరికి నాకు గుండెలో కలుక్కుమంది.

అక్కకి పెళ్లయి దాదాపు పదేళ్లు దాటిపోయింది. పెళ్లి చేసుకుని అక్క వెళ్లిపోయిన తర్వాత ఇళ్లంతా ఎంతో బోసిపోయి ఉండేది. ఏదో పోగొట్టుకున్న వెలితి స్పష్టంగా కనపడేది. ఆ యేడాదే నేను కూడా డిగ్రీ చదువును అర్థాంతరంగా ముగించేసి ఉద్యోగం వెతుక్కుంటూ హైదరాబాద్ వెళ్లాను. అక్కకు పెళ్లయిన తర్వాత మొదటి రంజాన్‌కి ఇంటికి పిలిచాం. అప్పుడు అక్క... బావ మోజులో నన్ను మర్చిపోతుందనుకున్నాను. లేదు... ముందు బావ చేతులకే గోరింటాకు పూసినా... తర్వాత నన్ను మాత్రం వదల్లేదు. ఎంత వద్దంటున్నా అదే మొండి పట్టుదలతో గోరింటాకు పెట్టింది. తెల్లారి ఎర్రటి చేతుల్తో నేను సేమ్యాలు తింటుంటే అక్క అన్న మాటలు నాకు ఇప్పటికీ గుర్తున్నాయి.

“సూడ్రా.. వూదుమొహమోడా... గోరింటాకు వొద్దంటావు... ఇప్పొడు సేమ్యాలు తింటుంటే నీ సేతులు సూడు...ఎంత అందంగా ఉండాయో..? ముద్దొచ్చాండాయి అట్నే...! నీకింకో మాట సెప్పనా.. సేతులు ఎంత ఎర్రంగా పండితే అంత అందంగా పెండ్లాం వొచ్చాదంట..!” ఆ మాటల్తో నాకు చచ్చేంత సిగ్గయ్యింది. లోపల్లోపలే మురిసిపోయి మెలికలు తిరిగిపోయాను.

ఆ పండగ తర్వాత రెండు మూడు పండగలకు నాకు ఊరికి రావడానికి వీలు పడలేదు. ఆ తర్వాత రెండు మూడు పండగలకి బావ అక్కను పుట్టింటికి పంపలేదు. అలా ఏదో ఒక కారణంతో అక్క , నేను పండగలకి కలవడం తగ్గింది. ఈలోపు అందాలరాశి షబానాతో నా పెళ్లి కూడా అయిపోయింది. నా పెళ్లయిన తర్వాత మొదటి పండగను విధిగా నేను అత్తారింట్లో చేసుకుంటే రెండో పండగ మాత్రం ఇంట్లోనే చేసుకోవాలని ముందే డిసైడ్ అయిపోయి పక్కా ప్లాన్‌తో అక్కను కూడా రప్పించుకుని- ఇదిగో ఇప్పుడిలా ఊర్లో తీరిగ్గా చక్కగా కూచోని ఆమెతోనే గోరింటాకు పెట్టించుకుంటున్నాను.

నా ఈ దర్జాను చూసి ఇంట్లో నుంచి మా ఆవిడ ఒకింత అసూయతోనే దగ్గుతోంది. నేనది గమనించినా పెద్దగా పట్టించుకోలేదు. నా ఆలోచనల్లో నేనున్నాను.

“ఇంగ కుడిచేయి పట్రా...” అని అక్క అనేసరికి ఈ లోకంలోకొచ్చాను.

“అప్పుడే ఎడం చేతికి పెట్టడం అయిపోయిందా...” అని చూసుకున్నాను.

ఏమాత్రం అక్క హస్తవాసి తగ్గలేదు. చిన్నప్పుడు ఎంత అందంగా, ఎంత ఓపిగ్గాచేతులకు గోరింటాకు పెట్టేదో.. అంతే అందంగా, అంతే ఓపిగ్గా తీగలు తీగలుగా గోరింటాకు పెట్టింది.

“శానా బావుండాదక్కా...” అన్నాను.

“ఆ... ఊరికే అంటాండావులే... నేను బాదపడతానని... ఈ మద్దెన గోరింటాకు పెట్టక అలవాటు పోయిందిబ్బీ...” అంది అక్క.

అవును నిజమే. అక్కకు ముగ్గురు ఆడపిల్లలు. మొదటి పాప పుట్టినప్పుడు ఎంతో సంతోషంగా ఉన్నింది. రెండోపాప పుట్టినప్పుడు కొంచెం సంతోషంగా ఉన్నింది. మూడోసారి కూడా ఆడపాప పుట్టాక అక్క సంతోషమంటేనే మర్చిపోయింది. ఆ ముగ్గురు పిల్లల్ని చూసుకుంటుంటే, వాళ్లు ఎదిగొస్తుంటే ఆమె భయంలోకి ఒదిగిపోతూ కాలం గడుపుతోంది. ఇక గోరింటాకు పెట్టే ఓపిక అక్కకు ఎక్కడిది?

“నా పిల్లోళ్లకు నీవే దిక్కబ్బీ..” అంటూ అక్క అప్పుడప్పుడు రాత్రిళ్లు ఫోన్ చేసి కన్నీళ్లు పెట్టుకుంటుంది. అలా కన్నీళ్లు పెట్టుకున్నప్పుడల్లా నాకు ఎవరో కడుపులో చేయి పెట్టి దేవినట్టవుతుంది.

నిన్నా మొన్నటి వరకు అక్క మా అందరికన్నా షావుకారి. స్థోమత లేకపోయినా మాంచి ఉద్యోగస్తున్ని చూసి పెళ్లి చేసి మా నాయన అక్కని షావుకారిని చేశాడు. నాయన మాత్రం ఇంటిని పోషించలేని పేదవాడైపోతే చదువు మానేసి నేను హైదరాబాద్ బయల్దేరాను. అక్కడ నేను నిలదొక్కుకునేంత వరకు- మళ్లీ బావకు తెలియకుండా పదో పరకో పంపి నన్ను ఆదుకుంది. అలాంటి అక్కే ఇప్పుడు వరుసగా ముగ్గురు ఆడపిల్లోళ్లు పుట్టేసరికి ఏదో వ్యాపారంలో లాసొచ్చినట్టు ఒక్కసారిగా డీలాపడిపోయి నా ముందు అర్థిస్తోంది.

అది తల్చుకుంటే నాకు ఈ హెచ్చుతగ్గుల జీవితం మీద, ఈ స్త్రీ పురుష తేడాల మీద ఎక్కడ లేని మంట పుట్టుకొస్తుంది.

“నువ్వేం దిగులు పడగాకు..., నీ పిల్లోళ్లను ఒక్కొక్కర్నీ ఒక్కో పూలందేవిని జేస్తాలే...” అని నేనంటే అక్క నవ్వి ఫోన్లో వాతావరణం తేలికపడేది.

నేను ఈ ఆలోచనల్లో ఉండి ఏమీ పలక్కపోయేసరికి, అక్క గోరింటాకు పెట్టడం ఆపి నావైపు చూసింది. నేనంతలోనే తేరుకుని “నిజ్జంగా అక్కా. గోరింటాకు బాగానే పెట్నావు... కావాల్నంటే ఎవుర్నయినా అడిగి కనుక్కో...” అన్నాను.

అక్క సంతృప్తిగా నవ్వి మళ్లీ గోరింటాకు పెట్టడంలో మునిగిపోయింది.

ఇక ఆలస్యం చేయడమెందుకు అడిగేద్దామని... “అక్కా.. గోరింటాకు పెట్టడమంటే ఎందుకే నీకంత ప్రెమ...”అని అడిగాను.

“ప్రెమనా...పాడా.. సిన్నప్పుడు నా తోడ్తా తిరిగే ఆడపిల్లోళ్లంతా ఇండ్లముందు ముగ్గులేసుకుంటాంద్రి గదా... సంక్రాంతప్పుడూ, మామూలప్పుడూ. నాగ్గూడా ముగ్గులు ఎయ్యాలని పిచ్చాండ్యా. నీకు తెలియందేముండాది సెప్పు అమ్మ

సంగతి... ఎయ్యనిచ్చాండేనా? అమ్మపోరు తట్టుకోలేకనే ఆ ముగ్గులపిచ్చిని ఇట్టా గోరింటాకులు పెట్టి తీర్చుకుంటాంటి. అది అట్టనే ఇబ్బుటికీ అలవాటైపోయి సచ్చిండాది,'' అంది అక్క చాలా సింపుల్‌గా.

నాకు ఎవరో చాచి చెంప మీద కొట్టినట్టయ్యింది.

“ముగ్గు ఇంటి ముందు వేస్తే తప్పు కానీ చేతిలో వేస్తే కాదుకదా..!! ఒక మతానికి మరో మతానికి మధ్య తేడా ఇంతేనా? ఇంత మాత్రం దానికేనా... ఇన్ని మత గొడవలు జరుగుతుంటాయి?''

నాకు ఆ క్షణం అక్క ఓ పెద్ద తత్వవేత్తలా అనిపించింది.

అక్కకి, ముగ్గులకి ఉన్న బంధం లీలగా కళ్లకు కట్టింది.

❄

అక్క తెలుగు మీడియం స్కూలు (నేనూ అదే స్కూలు). బళ్లో రాణి, సుబ్బమ్మంటే అక్కకి చాలా ఇష్టం. వాళ్లెంటే తిరిగేది- వాళ్ల ఆటలే ఆడేది. వాళ్లు చదువుతున్న స్కూల్లోనే అక్కను వొదిలిన అమ్మ వాళ్లతో మాత్రం తిరగొద్దని నిబంధన పెట్టేది. అది అన్యాయమని తెలిసినా పదేపదే అరుస్తూ ఉండేది. వాళ్ల వల్లే అక్కకి ముగ్గుల పిచ్చి పట్టుకుందని అమ్మ కంప్లయింట్. కానీ అక్క పట్టించు కునేది కాదు. అమ్మకు తెలియకుండానే వాళ్ల సావాసాన్ని కంటిన్యూ చేసేది.

సంక్రాంతి పండుగ వస్తే వాళ్ల ఇళ్ల ముందే వాలిపోయేది. వాళ్ల ముగ్గుల్లో కలసి పోయి, వాళ్ల రంగుల్లో తడిసిపోయి, వాళ్ల గొబ్బెమ్మలతో మురిసిపోయి ఏ తెల్లవారుజామునో ఇంటికొచ్చేది. అచ్చం వాళ్లలాగే మా ఇంటి ముందు కూడా ముగ్గులు వేయాలని కలలు కనేది.

మా వీధిలో మాది ఒక్కటే సాయిబుల ఇల్లు. అటు పక్కింటి ముందు ముగ్గు, ఇటు పక్కింటి ముందు ముగ్గు. మధ్యలో మా ఇల్లే బోసిపోయినట్టుగా ఉండేది. మేము సాయిబులమని తెలియని కొందరు “ఇదేందమ్మా పాడు.., పండగనాడు కూడా ఇంటి ముందు ముగ్గేసుకోకండా..'' అని బహిరంగంగానే మాట్లాడుకునే వాళ్లు. అప్పుడు అమ్మే కలుగజేసుకుని “మేము ముస్లింలములెక్కా.. అందుకే ఏసు కోలేదు..''అని సర్ది చెప్పుకునేది.

అప్పుడప్పుడు చాలాసేపు అరుగుమీదే కూర్చొని మా మొగసాలవైపే చూస్తుండేది అక్క. అక్క ఆలోచనలు అప్పట్లో నాకు పెద్దగా అర్థమయ్యేవి కావు.

అక్క మా ఇంటివెనుక కల్లెంలో ఉత్తుత్తి ముగ్గులు వేసేది. కానీ అక్కకి ముగ్గులేయడానికి ముగ్గుపిండి అవసరమయ్యేది. ఎవరిస్తారు ముగ్గుపిండి ?. వాళ్లిళ్ల ముందు ముగ్గులేయించుకోవడానికైతే ఇస్తారు..కానీ అక్క ఆడుకోవడానికి ఎందుకిస్తారు? మరేం చెయ్యాలి?..అందుకే ఆ పిచ్చిని ఏది దొరికితే దాంతో ముగ్గేస్తూ తీర్చుకునేది.

గునాదుల్లోకెళ్లి సన్నటి ఇసుకను నూర్పి తెచ్చి ఇంటి ముందే ముగ్గు వేసేది.

చేసేది లేక "మే..థూ..., నీకెన్ని తూర్లు సెప్పినా.. సిగ్గు రాదేమ్మే.. ఇంటి ముందు ఆడుకోకుమ్మే.. అట్టా కల్లంలో సావు పో.."అని అమ్మ గదురుకునేది. ముగ్గు వేయొద్దంటే ఎలాగో వినదు కాబట్టి కనీసం ఇంటి ముందైనా వేయకుండా అడ్డు కుందామన్నది అమ్మ ఆలోచన అయ్యిండొచ్చు.

ముగ్గురు నలుగుర్ని తనకంటే చిన్నపిల్లల్ని వెంటేసుకుని అక్క కల్లెంలోకెళ్లి ముగ్గుల్లో మునిగిపోయేది. సీకిసెట్టు పూత తెచ్చి పసుప్పచ్చ ముగ్గువేసేది. తల్లో వాడిపోయిన మల్లెపూలతో కాఫీపొడి రంగు ముగ్గు వేసేది. ఇసుక మీద పాదాన్ని గట్టిగా ఆనించి రౌండుగా తిరిగి 'ఈడ సూడు దోసెముగ్గు' అనేది. అక్క నోటు బుక్కులు తెరిస్తే ముగ్గుల బుక్కులను తలపించేవి. తమాషా ఏంటంటే బోరింకాడికి నీళ్లకని వెళ్తుందా... బిందెను తెచ్చి అరుగు మీదే పెట్టి కూర్చునేది. అందులో చూపుడు వేలు ముంచి దాంతో అరుగు మీద బండలపై తడిముగ్గు వేసేది. అది ఓవైపు నుంచి గాలికి ఆరుతూ వస్తుంటే మరోవైపు నుంచి వేస్తూ ఉండేది. ఇలా రకరకాలుగా అక్కలో ముగ్గుల కళ బయటపడేది. చివరికి ఆ కళే అక్క కళ్లకు చేటు తెచ్చింది. అదెలాగో చెబుతాను.

❄

మా నాయన నిమ్మకాయల వ్యాపారం చేస్తాడు. తోటల్లోంచి పచ్చి పచ్చి కాయలు కోసుకొచ్చి ఇంట్లో మాగబెడతాడు. ఓ మూలన తడిపిన వరిగడ్డి పరిచి, చక్కగా కాయలన్నింటినీ రాశిగా పోసి, వాటి మధ్యన చిన్నచిన్న గుడ్డల్లో కట్టిన మందు పొట్లాలు పెట్టి -మళ్లీ పైన వరిగెడ్డి కప్పి పెద్ద పెద్ద రాళ్లెత్తేవాడు. రెండు రోజులయ్యేసరికి మందు దెబ్బకు లోపల ఉడుకు పుట్టి నిమ్మకాయలన్నీ మాగి పోయి పసుపురంగులోకి మారిపోయేవి. నాయన పెట్టిన మందు అయితే వేడికి కరిగి పొట్లాల్లోనే తెల్లగా పొడి అయిపోయేది.

ఆ పొడే అక్కకి ముగ్గుపిండి. అది చాలా ప్రమాదం. కళ్లలో పడితే చూపు పోతుందని నాయన మమ్మల్ని ఎప్పుడూ ఆ మందుకు దూరంగా ఉంచేవాడు.

కానీ అక్క ఎలాగోలాగ నాయనికి మస్కా కొట్టి ఆ మందు పొడితో మాయమై కల్లెంలో తేలేది. ఒక్క వాసన తప్పితే ఆ పొడి అచ్చం ముగ్గుపిండిలాగే ఉంటుంది కాబట్టి దాంతో ముగ్గేస్తే అక్కకు సంతృప్తిగా ఉండేదనుకుంటా. ఆ పిండిని జాగ్రత్తగా తీసుకెళ్లి ఒక చోట కుప్పగా పోసి ఆడుకునేది.

కానీ ఒకరోజు అనుకున్నంత పనీ అయ్యింది. మందు పొడి కుడి కంట్లో పడి అక్క విలవిల్లాడింది. ఇంట్లో అమ్మకు చెబితే అరుస్తుందని చెప్పలేదు. తెల్లారి కన్ను వాసిపోయింది. నీరు కారి... కారి నీరుగడ్డ అయిపోయింది. ఏమి జరిగిందో తెలియక నాయన ఎంఆర్‌పి బాషా డాక్టరు దగ్గరికి తీసుకెళ్తే 'ఏదో దుమ్ముపడినట్టుంది. భయపడాల్సిన పనిలేదు' అని చెప్పినాడట. కానీ ఆ డాక్టర్‌క్కూడా తెలియని అసలు సంగతి పక్కింటి పాప పవిత్ర చెప్పింది. దీంతో అమ్మ అపర కాళిక అయ్యింది. బిడ్డ కన్నునొప్పితో బాధపడుతోందే అని కూడా చూడకుండా అక్కమీద విరుచుకుపడింది. గబగబా జుట్టు పట్టుకుని వంగబెట్టి వీపు మీద నాలుగు గుద్దులు గుద్ది వదిలేసింది.

"అరె అల్లా... ఇంగేం జేయాలా... ఆడముండనే..." అంటూ  శోకాలు పెట్టింది.

ఇటు అక్క.. అటు అమ్మ ఒకటే ఏడుపులు. నాయన ఇద్దరి మీదకి లేసుకున్నాడు.

"నోర్మొయ్యండహే... ఎవురైనా సచ్చిపోయినారా ఏంది... ఇంట్లో..." అని అప్పటికప్పుడు అక్కను బస్సెక్కించి తీసుకెళ్లి కడపలో పెద్ద డాక్టర్ పుత్త బాలిరెడ్డికి చూపించి, కొద్ది రోజులకే కన్ను నయం చేయించాడు. ఇక అప్పటి నుంచి ఇంట్లో ముగ్గు మాట బంద్. కానీ అక్క ఆ ముగ్గుల పిచ్చిని ఇలా గోరింటాకుల మీదికి మార్చుకుందని తెలియగానే నాకు జాలేసింది.

కావాలనే అక్కను ఉడికిద్దామని- "అమ్మ సిన్నప్పుడు నిన్ను అంటాండేది నిజమేనక్కా... నీకన్నీ కాఫిర్ బుద్దులే..." అన్నాను.

"నాయి కాదు కాఫిర్ బుద్దులు నీయి... నిలబడి వుచ్చలు పోసేటోనివి, నువ్వు... నాకు సెప్తాండావ్..." అంది అక్క.

నాకు ఫ్యూజులు ఎగిరిపోయాయి. ఇస్లాం ప్రకారం నిలబడి పాస్ పోయడం తప్పు. చిన్నప్పుడు ఎప్పుడో ఒకసారి బాత్‌రూమ్‌లో అలా పోస్తూ అక్కకు దొరికిపోయాను నేను. అప్పటినుంచి ఇలా సందర్భం దొరికినప్పుడల్లా రివేంజ్ తీర్చుకుంటోంది.

"అదిగాదక్కా... నీ మాటలు వింటే మిగతా మతమోళ్లు ఏమనుకుంటారు సెప్పు? సూడబ్బా మెహిందీ అంటే ఇష్టపడే సాయిబులంతా ఒకప్పుడు ముగ్గుల్ని ఇష్టపడినవాళ్లే అనుకోరు. అలా అనుకుంటే మన మతాన్ని మనమే తక్కువ చేసు కున్నట్టు కాదా..." అన్నాను.

"అట్టెందుకైతాదిరా. ఇబ్బుడు మనం పండగ జేసుకుంటాండాం. నువ్వు నీ స్నేహితులు సంటిగాడు, ఆ శెట్టిగారి పిల్లోడి పేరేంపేరు ఆ... లచ్చమన్‌ని అన్నానికి పిలుచ్చావ్. వాళ్లొచ్చి తింటారు. తిని బావుండాదంటారు. అంతమాత్రం దానికే వాళ్లు వాళ్ల మతాన్ని తక్కువ చేసుకున్నాట్టా. ఏంగాదుకదా. వాళ్ల మతం వాళ్లదే. మన మతం మనదే? కాకపోతే ఒకరి మతాల్లోని కొన్ని విషయాలు మరొకరి మతాల్లోని వాళ్లకు నచ్చుతాయి. అంతే," అందక్క.

నిజమే. ఒక సమాజంలో అనేక సమూహాలు కలసి బతుకుతున్నప్పుడు ఒక సమూహం యొక్క సంస్కృతి ప్రభావం మరో సమూహం పై కచ్చితంగా ఉండి తీరుతుంది.

నేనింకేదో మాట్లాడుదాం అనుకునేలోపు కరెక్టుగా అమ్మ ఇంట్లోంచి ఉరు ములా ఊడిపడింది -"మే ! రేపే అంట పండగ..." అంటూ.

పండగ అన్న మాట వినబడేసరికి ఆత్రం ఆపుకోలేక "టీవీలో సెప్పినారా?" అంటూ అడిగాం అక్క, నేను ఒకేసారి.

"అవును... ఇబ్బుడే సెప్పినారు... సందు ఢిల్లీలో కానచ్చిందంటా..." అంది అమ్మ గట్టిగా.

నా రెండో చేతికి కూడా గోరింటాకు పెట్టడం అయిపోయిందేమో అక్క లటుక్కున అమ్మ చేతిని అందుకుంది.

"అట్టయితే కూర్చో... నీక్కూడా గోరింటాకుపెడ్తా," అంటూ చాప మీదికి లాగింది.

అక్క సంగతి తెలుసుగా మరేం మాట్లాడకుండా అమ్మ చాపమీద కూర్చుంది.

మరో చేతిపై 'ఆకుపచ్చ ముగ్గు...' లయగా ప్రాణం పోసుకుంటోంది.

*సాక్షి ఫన్‌డే, 27 మార్చి 2011*

*'నయాపద్' హిందీ సాహిత్య త్రైమాసిక పత్రిక, జూలై-డిసెంబర్ 2013*

http://kendasampige.com *(కన్నడ అనువాదం) 2 జూన్ 2013*

*'తరంగ' కన్నడ సాహిత్య పత్రిక, ఉగాది ప్రత్యేక సంచిక 2013*

# దస్తగిరి చెట్టు

ఎండ. నేల పెనమై కాగుతాంది. ఇంటి ముందు కీలు రోడ్డు అద్దమై మెరుచ్చాంది. వేడిగాలి దావలో పోయేవాళ్ల మొకానికి ఈడ్చి ఈడ్చి కొడతాంది. తప్పించుకోలేని మనుషులు వగరిచ్చా నడుచ్చాండారు. అంతవరకు వాకిట్లో కొంగ మాదిరి ఒంటి కాలి మీద నిలబడుకోనున్న నేను ఏదో గుర్తొచ్చినోని మాదిరి ఇంట్లోకి నడిసినాను. నేరుగా పొయ్యి కాడున్న అమ్మీ దగ్గరికెళ్లి.

"అమ్మీ! నానీమా వాళ్ల ఊరు వెళతానే..." అన్నా దీనెంగా అప్పటికి ఆ మాదిరి- అడగటం పదోసారి.

పొయ్యి మీద నూకలన్నం దించి పైటతో మొకమ్మీద చెమట తుడుచుకుంటాండే అమ్మి ఆ మాటలకి నన్ను తినేసేలా చూశా- "నీకెన్ని తూర్లు చెప్పాలా అని."

ఆ సూపుకు నాకు ఏడుపు తన్నుకొచ్చేసింది.

నాకు మా అమ్మమ్మవోళ్ల వూరంటే చాలా ఇట్టం. ఇస్కూల్లో సెలవలిచ్చి అబ్బుటికే పదైద్దినాలైపాయ. దినాలు గడస్తా వుంటే నాలో మా అమ్మమ్మ వోళ్ల వూరికి

పోవాల్లనే ఆశ పెరిగిపోతా ఉండె. ఆ బాధ కాల్చేస్తా ఉండె. సెలవలైపోయాక మల్లా పోను కుదిరే పనేనా?

కానీ మా అమ్మీ పంపడం లేదు. పైగా పిల్లోడని కూడా సూడకుండా సెప్పిన మాట వినకుంటే కళ్లల్లో పచ్చికారం పెట్టి దండిచ్చాది. తలుపులు వేసి కొడతాది. అమ్మీ సూపుకు అవన్నీ గుర్తొచ్చి బరించలేక కండ్లనిండా నీండ్లు పెట్టేసినా. అమ్మీ కరిగిపోతుం దనుకుండాను గానీ ఆమె మరింత కోపంగా మారిపాయ.

''ఎండ ఎక్కువగాందే పొలం కాడికి అన్నం ఎత్తుకుపోవడం సూడు ముందు..'' అనె సీరెస్‌గా.

మా పొలం శానాదూరం. ఊరిడ్సి ఊరుకు పోతున్నట్టుంటాది. ముందే యెండలు. ఎండపొద్దున నడుసుకుంటా పోయి నాయనకు అన్నం ఇచ్చి రావల్లంటే మాటలు గాదు. మధ్యాహ్నం టైంలో నరమానెవడు ఎవ్వడూ ఆ దారిన తిరగడు. బిక్కుబిక్కుమంటా నేనొక్కడ్నే ఆ దారిన నడుచుకుంటా బోవల్ల. కాళ్లకు సెప్పులా వుండవు. ఒగటికి రెండు తూర్లు ఇంటిలో ఇప్పించినారు గానీ అవి నా సేతుల్లో శాన్నాళ్లు నిలవకుండా బాయ.

ఇదిట్టావుంటే ఎనకేటు ముందేటు అని మల్లా అన్నం గ్యారీ దాదేపు కేజిన్నర్రుంటాది. అంతదూరం దాన్ని బట్టుకొనెల్లేసరికి నా అరసేతులు ఎర్రగా అయిపోతాయి. బుజంమీద పెట్టుకుందామా అంటే యేడి యేడి అన్నమైపాయ. అందుకే ఆ చేయి ఈ చేయి మార్సుకుంటానే పొలంగాడికి జేరుకుంటాను. ఆడికి బోయేసరికి రెండు చేతుల్లో నెత్తురు తేల్తాది. మంట పుడుతాది. యింగ పొలం కాడికి ఎళ్లిన కాడ్నుంచి నామీద నాయన పెత్తనం ఒగటి.

నీండ్లు అందీరా. రాళ్లు ఏరేయ్‌రా, పిచ్చిచెట్లు పెరికేయ్‌రా... అంటా నానా పనులతో పానం తీసేచ్చాడు. సాయింతరం కాళ్లు ఒగటేమేనా పెరుకుతా వుంటాయి. వళ్లంతా పులిసి జరం కాసినట్టుంటాది. అమ్మీ యేడి నీల్లు పెట్టి స్నేనం జేయిస్తే హాయిగా నిద్రపడుతాది.

నేను అన్నం దీసుకబోనని మొండిగేసినానన్కో నాయన సేన్లో సాయింత్రం దాంక వచ్చుండి పన్జేయాల్సి వొస్తాది. అలా పన్జేసి ఆకలితో అలమటిస్తా ఇంటికొస్తే ఇంగేమైనా ఉండాదా. నన్ను బట్టుకొని మల్లా నాలుగు దన్నడూ. దన్నితే పర్వాలా. ఇంట్లో ఉండ నిస్తాడా. అయిన్నీ ఆలోసించినాక నాకు పొలంకాడికి బోడమే మంచి దనిపించినాది. మవునంగా తలొంచుకొని నిలబడుకుండాను.

కాసెబ్బుడికి అమ్మీ అన్నం గ్యారీ తెచ్చిచ్చా. దాన్ని దీసుకొని అమ్మీ వైపు దీనంగా జూస్తా పొలంకాడికి యెలబార్తి.

"ఎండ... దిక్కులు జూడకుండా బిరిక్కిన నడిసి ఎళ్లిపో..." ఎనక నుంచి పురమాయిస్తా అమ్మీ అన్నాది.

నేను ఎనక్కి తిరిగి జూడ్లా. అమ్మీ మాటలు వింటానే- దారిలో సుగాలోల్ల ఎద్దుల బండ్లు ఏమైనా పొతాండాయా అని ఎదురుజూస్తా పోబడ్తి. మా సేనికి అవతల సుగాలోళ్లు గుడిసెలు వేసుకొని ఉంటాండారు. సీటికీ మాటికీ ఆడ్నుంచి వోళ్లు ఊర్లోకి వచ్చాంటారు. పోతాంటారు. వాళ్లవి కాళ్లు కాదని ఇనుపరాడ్లని నాకని పిచ్చాంటాది. శానా మంది ఎడ్లబండ్ల మీద ఊర్లోకొచ్చి వెళ్తాంటారు. వాళ్లతోటి నేను 'నిమ్మకాయల రాజాసాబ్' కొడుకునని జెప్తే ఎవ్వరైనా నన్ను బండ్లో కూసోబెట్టు కుంటారు. ఆ మాటలు ఈ మాటలు చెప్తా నన్ను దీసుకబోయి సేనికాడ వొది లేస్తారు. మా నాయన అంత పేరు బోయినా డక్కడ.

కొందురు మాతరం గబ్బునాకొడుకులు ఎవరి కొడుకైతేంటని నోరు తెరిసి అడిగినా బండ్లో కూచ్చోబెట్టుకోరు. "అంతవరకు ఎక్కుంటా అన్నా" అంటా బంగ బోతే... "సెప్తె నీక్కాదా" అంటా కసురుకుంటారు. ఆ దినం సుగాలోళ్ల బండి ఒక్కటి కూడా అవుపించలేదు.

గంటదాక నడిసి సివరికి సేనికాడికి బోతి. సేన్లో నాయన గుంటక తోలుతా వుండె. నాయన్ను జూడగానే నాకు అమ్మమ్మవాళ్ల ఊరు గుర్తొచ్చి ముఖమంతా ఓ దిక్కుకు ఎట్టుకుంటి. నాయన నన్ను జూసి యీడంతేలే కుల్లుబోతునాకొడుకు అనుకుండాడేమో ఏమి పట్టించుకోలా. నాకు బాధగలిగి ఏడుపొచ్చి నాయన జూడ కుండా మల్లా ఒకసారి ఏడిస్తి. నా బాధ ఎవరూ పట్టించుకోడం లేదని కుల్లుకుంటా ఉంటే నాయన అయిన్ని బట్టించుకోకుండా సేన్లో పన్జేయించుకోబట్టినాడు. నేను ఆ ముఖెంతోనే కుల్లుకుంటా పన్జేస్తి. అట్నే సాయింతరం అయిపాయ. నాయన ముందు ఎద్దుల్ని దోలుకుంటా పోతా వుంటే నేను ఎనకాల్నే నడుసుకుంటా ఇల్లు జేరుకుంటి.

ఎళ్లేబ్బుడు నడిసి, వచ్చేబ్బుడు నడిసి నాకు కాళ్లు పట్టిపాయ. పానం అల్త పడితే అమ్మీ బొయ్యి కింద కందిపురక గబగబ దూర్సి నాకు నీండ్లు కాంచిచ్చా. నేను నీండ్లు బోసుకొని సాపతో మిద్దెక్కితి. బడుకొని ఆలోసన్లో పడితి.

ఇంకొద్ది దినాలు యిట్టే గడిసిపోతే సెలవలు రొన్నీ అయిపోతాయి. మళ్లా ఇస్కూలు దెరుస్తారు. రోజూ ఇస్కూలుకు పోతా- వస్తా ఇంటికాడ పనులు జేసు కోడానికే సరిపోతాది. ఇంగ అమ్మమ్మోళ్ల ఊరికి పోవాల్లనే కోరికె మాతరం అలాగే ఉండిపోతాది.

నా సావాసగాళ్లంతా సెలవల్లో శానా ఊర్లకు బోయినారు. కొంతమందైతే అబ్బుడే తిరప్తి, నంద్యాల, హైదరాబాదు అన్నీ తిరిగొచ్చినారు. నేను మాతరం ఇంగా ఇక్కడే ఉండాను.

ఒగసారి మా ఎక్కాల్సారు ఒక్కొక్కరిని లేపి "వేసవి సెలవల్లో నువ్వు యాడికి పోతా వుండావురా?... నువ్వు యాడికి పోతా వుండావురా...?" అని అందరినీ అడగబట్టె.

అందురూ ఎవరికి దోసిన పేర్లు వారు జెప్తా వుంటే నాకేం జెప్పాలో అర్తంగాక "మా అమ్మమ్మ వోళ్ల వూరిగెళ్తాన్సార్" అన్నా.

"అమ్మమ్మోళ్ల పూరికెళ్తే ఏమొస్తాదిరా నీ బొంద. మల్ల ఎబ్బుడన్నా అక్కడి గెల్దువుగానీ ఇబ్బుడికి ఎక్కడికైనా ఎళ్లి ఒగ మంచి పదేశం జూసిరా" అనె ఎక్కాల్సారు నవ్వుకుంటా.

ఆ సారుగేందెల్సు అక్కడల్లా పోవాల్లంటే శానా లెక్క గావల్లని. అమ్మీ, బాబా దగ్గెర అన్ని ఉండవని. అయినా నాకు మా నానీమా అంటేనే ఇట్టం. వోళ్ల ఊరంటేనే ఇట్టం. అక్కడల్లా బోవల్లని నాగేమాతరం లేదు.

మా నానీమా వోళ్ల ఊరు బలే బాగుంటాది. బొద కొట్టం. కొట్టం ముందు అరుగు. గిలకబాయి. అందులో నుంచి నీళ్లు తోడుకునే పిల్లా, పెద్ద. ఎగువ వీధిలో మసీదు. ఏళకు అందులో నుంచి అతి దగ్గరగా వినపడే అజా. దిగువీధిలో జెండా మాను.

జెండా మాను కింద సాయింత్రమైతానే జనం పిలపిలమంటా ఉంటారు. "రేయ్... నూరాఁ... కొడుకు వచ్చినాడ్రా..." అంటా అందురూ అభిమానెంగా ఎచ్చరిచ్చారు.

"మీ అమ్మ ఎలా ఉండాది... మీ నాయన ఎలా ఉన్నాడు... పంటలు ఎలా ఉండాయి" అని అన్నీ అడిగి తెల్సుకుంటారు. పెశ్నెలతో నన్ను ఊపిరి తీసుకో కండా జేచ్చారు. ఒక్కోసారి నేను పలక్కుండా బోతాంటే నానీమా అరుచ్చాంటాది- "పెద్దోళ్లు పలకరించినప్పుడు పలకల్ల నాయన" అంటాది. ఊ గొడ్తాను. అందరికీ

జవాబులిచ్చాను. యిచిత్రమేంటంటే నన్ను ఎవరూ అక్కడ రాజాసాబ్ కొడుకు అని పిలవరు. నూర్జహాన్ కొడుకనే పిలుచ్చారు. అదీగాదంటే మా నానీమా పేరుతో రంజాన్‌బీ మనవడు అంటారు. వోళ్లందురూ అలా పిలుచ్చాంటే చెవుల్లో చెక్కిలిగిలి పెట్టినట్టుండేది నాకు.

ఆ ఊర్లో పిల్లగోల్లు శానా మంచోళ్లు. ఏటుకు సావాసమైపోతారు. వాళ్లతో కలసి జెండామాను కింద ఎగుల్లాడేవాణ్ని.

జెండామాను కింద అరుగును ఎక్కడానికి ఎన్నో కట్టాలు పడేవాణ్ని. మోసేతులు దోక్కబోయేవి.

అరుగు మీద చిన్న దీపం గూడు ఉండేది. అందులో దీపం ఎబ్బుడూ సాయింత్రాలు.. సాయింత్రాలు వెలుగుతూ ఉంటాండేది. చెట్టు కింద ఉన్న అరుగు మీదికి చెప్పులతో ఎక్కకూడదని రూలు.

ఆడుండేది దస్తగిరి చెట్టు.

మొక్కుకుంటే మంచి జరుగుతుందంటా. మొక్కులు తీరతాయంటా. మొక్కుబడి ఉండేటోళ్లు దస్తగిరి పండుగకు మేళాలతో వచ్చి ఆ యాపచెట్టుకు పూలహారం కట్టి, జెండాలు కట్టేవారు. శుక్కురారం, శుక్కురారం చెట్టుకింద శానా మంది సద్దింపులిచ్చేటోళ్లు. అట్టా ఇచ్చినప్పుడు పిల్లలమందరం పిలపిలమంటా చుట్టుకొని చెక్కెరా, బెల్లం పెట్టించుకొని తినేవాళ్లం. బలే తీయంగా ఉండేది. ఉత్తప్పుడు ఆ జెండామాను కింద అరుగుపై కూచోని దెబ్బలకు రాణి- బొమ్మ ఆడుకునేటోళ్లం. అదీగాదంటే బారాకట్ట. అదీ గాదంటే అరుగుకింద నేలమీద గోలీలాట.

చెట్టుకింద ఆడుగోడం, పరిగెత్తుతాండటం.. తమాషాగా ఉండేది. సాయింత్రాలు గుంపులు గుంపులుగా కాకులు చెట్టుపై వాలేవి. కావ్‌కావ్ మంటూ అరుచ్చాండేటివి. కాకుల్తోబాటి మేము గూడా పిల్లలమందరం కట్టగట్టుకొని అరుచ్చాంటిమి.

చెట్టు మీద కాకులు. ఆ అరుపులకు ఎగిరిపోయేటివి. కొన్ని తిరిగొచ్చి మల్లా గూళ్లలో కూచేనేటివి. వాటిని చూసుకుంటా గోలీలాట ఎత్తిపెట్టి కాకి కతల్లోకి దిగేవాళ్లం.

అయినీ్న గుర్తొచ్చి మల్లా కండ్లల్లో నీండ్లు నిండాయి.

ఈతూరి మాతరం ఎట్టతిరిగి ఎళ్లిరావాల్సిందే అనుకుంటే అమ్మీ ‘‘ఇబ్బుడొద్దులే... ఇబ్బుడొద్దులే... మల్లెబ్బుడైన ఎళ్దువుగాని...’’ అంటా ఉండాది. దినాలు ఎళ్లిపోతానే ఉండాయి. నా బాధ ఎవరికి జెప్పుకోవాలో అర్థంగాక ఒకటేమేనా ఏడ్సబడ్తి.

ఏడ్సి ఏడ్సి ముక్కులు బిగుసుకుపాయా. సివరికి దేర్నం జేసుకొని ఏదైదే అదైంది పారా అనుకుంటి. నేరుగా లేసి మిద్దె దిగి అమ్మీ దగ్గరికెల్తి.

అమ్మీ ఇంట్లో బనులతో అలిసిపోయినట్టుండాది. 'దరగా' పటాలకు పక్కనే బొంత బర్సుకొని పడుకొని ఉండాది. ఎళ్లి అమ్మి పక్కలో కూలబడ్తి. అమ్మీని వాటేసు కుంటి. నేను జెప్పాలనుకున్నది జెబ్దామనుకుంటాంటే ఏడుపు గొంతుకు అడ్డమొస్తా ఉండాది. ఏడుస్తాండానుగానీ మాటలు రావడంలా.

అమ్మీ అది గమనించి నన్ను ఓదార్సే పెయత్నంజేస్తా రెండు కండ్ల నీండ్లను తుడుస్తా ఉండాది. శానా జేపు తరవాత నాకు గొంతు తెరుపిచ్చింది.

"నన్ను అమ్మమ్మోళ్ల ఊరికి పంపమంటే పంపించకబోతివి. రేపు జూడు. పొలం కాడికి పోయి పురుగుల మందు తాగి జావకపోతే తూ నా కొడుక అను".

అమ్మీ కండ్లల్లో జివ్వున నీళ్లూరినాయి. అమ్మీ ఏడుస్తాండాది. నన్ను గట్టిగా గుండెలకు అత్తుకొని ఏడుస్తాండాది.

'నై బేటే... నువ్వు సావకూడదురా నేనే... నేనే సచ్చిపోవాల్ల. నిన్ను అమ్మమ్మోళ్ల ఊరికి పంపలేకపోతుండాను జూడూ... అందుకు నేనే సచ్చిపోవాల్లా" అంటా అమ్మీ ఏడస్తాండాది.

మళ్లా అంది- "అమ్మమ్మోళ్లు పేదోళ్లు... వాళ్లకే తిండికి లేక పచ్చులు ఛస్తాం డారు. ఇబ్బుడు నీవు బోయి వోళ్ల పానాలమీద బడితే వోళ్లు నీకెక్కడ్నుంచి తీసుకొచ్చి బెడతారు జెప్పు? నీవు జేసే అల్లరికి పనీపాట ఇడిసిపెట్టి కాపల ఉండల్లంటే ఐతాదా. నానీమావోళ్లు పద్దనబోయి సాయింతరంగానీ ఇంటికి రారు. వోళ్లు శనిక్కాయలు వల్చడానికి పోతుండారు. నాతోపాటి పుట్టిన ఆడపిల్లోల్లు ఇంకా ఇద్దరుండి సచ్చి నారు గదా ఆ యింట్లో. మా నాయన మేము సిన్నప్పుడే పీకలదాక తాగి సచ్చిపోతే ముసల్ది- నానీమా ఒక్కతే రెక్కలు ముక్కలు చేసుకొని కట్టపడతాండాది. నిన్ను వాళ్లు జూసుకోలేర్రా. అక్కడ పరిస్థితి దెల్సి గూడా నిన్నక్కడికి పంపీ వోళ్లను బాధ పెట్టలేను. అరె మేరె మాలిక్! నాకు బుట్టిల్లు బాగుంటే నా బిడ్డలకీ గతి పట్టేది కాదు గదా" అని గుండెలు బాదుకోబట్టె. నాగేమర్తం గాలా. కాసెబ్బుడికీ మళ్లీ అమ్మీ మాట్లాడబట్టే.

"పోనీ ఇక్కడ్నుంచేదైనా యిచ్చి పంపిద్దామంటే యిక్కడ నీకు దెలీకుండా ఏముండాది జెప్పు? ఇక్కడ కూడా ఏమీ బర్కత్ లేకపోయా- ఏమి లేకపోయినా

నీ దాదీమా (నానమ్మ) నా మీద లేనిబోని అభాండాలన్నీ ఏస్తా వుండాది. ఇక్కడ్నుంచి ఏవేవో దీసుకెళ్లి నీ నానీమా వోళ్లకు యిస్తుండానని మీ నాయనతో అంటాండాది. అయినా ఏముండాదనిరా ఆపేద్దానికాడ. ఎబ్బుడూ నానీమా... నానీమా అంటా ఉండావు. ఎళ్లి ఉప్పుకారం తిని రావాలి నాయాలా.. అంతే గదా?'' ఏడస్తాండాది.

ఆ నీండ్లు ఇబ్బుడిబ్బుడే ఆగేటట్టు లేవు. తుడసడానికి పెయత్నిస్తా వుంటే నా జేతులు తడిసి ముద్దయిబోతాండాయి. నాక్కూడా ఏడుపొచ్చింది. ఏడచ్చా ఏడచ్చా మనసులో గట్టిగా ఒకటి అనుకుండాను -

''యాల్లా.. మా అమ్మమ్మ వోళ్లు బీదోళ్లనే గదా అమ్మీ నన్నక్కడికి పంప నంటాండాది. మా అమ్మమ్మ వోళ్లకు దండిగా లెక్క ఇవ్వు సోమి. అల్లాగే మా నాయ నోళ్లకుగ్గూడా దండిగా యివ్వుదంట్రీ! అట్ట జేస్తే పెతి సెలవలకి నేను మా నానీమా వాళ్ల ఊరికి వెళ్లొచ్చు దేవుడా...''

దువా కోసం తెరిసిన నా అరచేతుల్లో మా నానీమా వాళ్ల ఊరూ ఆ ఊరిలోని దస్తగిరి చెట్టూ కనిపిచ్చా ఉంది.

నా మొక్కును పదిలంగా ఆ చెట్టుకు కట్టుకున్నాను.

*నవ్య వీక్లీ, 31 మే 2006*
*లిటరరీ వాయిస్ ఆఫ్ ఇండియా డాట్‌కామ్ (ఇంగ్లీష్ అనువాదం)*
*మే-జూన్ 2010*

# రూపాయి కోడిపిల్ల

"కోడిపిల్లలమ్మా. కోడిపిల్లల్. రూపాయికొకటి కోడిపిల్ల. రెండు రూపాయలకు రెండు. ముద్దు ముద్దు కోడిపిల్లల్"

అంజద్‌గాడికి వళ్లు పులకరించింది. కళ్ళు మిలమిలా కోడిపిల్లలై మెరిశాయి. మాదిగోళ్ల పిల్లోడు గంగన్నతో చెట్టాపట్టాలేసుకుని ఆడుకునేటోడు ఒక్క సారిగా "ఆటలేదు. పాట లేదు. ఉండు కోడిపిల్లలొచ్చినాయ్" అంటా కోడిపిల్లలాయప్ప వెనకాలకు పరిగెత్తాడు. వాడితోపాటు గంగన్న.

వాళ్లకు కోడిపిల్లల్ని చూడాలనుంది. ఒక్కసారి కోడిపిల్లలాయప్ప గంప దించి కోడిపిల్లల్ని చూపిస్తేనేమీ... అనుకున్నారు మనసులో.

గంపలోంచి కుచుక్.. కుచుక్ మంటా కోడిపిల్లల అరుపులు సన్నగా విన పడుతున్నాయి. ఒక్కొక్కటే ఒక్కో కోడిగుడ్డులోంచి వచ్చినాయి. ఇప్పుడు అన్ని పిల్లలు కలిపి ఒకే గంపగుడ్డులో ఉన్నాయి.

"ఓప్పో... ఇట్రా" ఎవరో కోడిపిల్ల లాయప్పను పిల్చినారు. పిలుపు వినబడ్డ వైపు చూశారిద్దరు.

వొడ్డోలాయప్ప వెంకటరవణ. ఆయనిల్లు పై వీధిలో. అంజద్, గంగన్నకు అతను బాగా తెలుసు. అయప్ప కోడిపిల్లలాయప్పను పిలుస్తానే వీరి మనసు ఆనంద మైంది. ఇప్పుడు కోడిపిల్లలాయప్ప అరుగు మీద గంప దించుతాడు. బుజ్జి ముండలు. ముద్దు ముద్దొచ్చే కోడిపిల్లల్ని చూపిస్తాడు. వీరు ఆలోచించుకునేలోపలే గంప దించాడు కోడిపిల్లలాయప్ప.

విశాలమైన గంప అది. పాములోని బుట్టలాగుంది. గంప తెరిచాడు. ఆకాశం లో నక్షత్రాలు ఒక్కసారిగా మెరిసినట్లయింది. వెలుగు మీదపడేసరికి మోయలేక కోడిపిల్లలు మూలిగాయి. భయంభయంగా కిచుక్... కిచుక్‌మని మరింతగా అరిచాయి.

ఎన్ని కోడిపిల్లలో.. గంపనిండాకు కోడిపిల్లలు. ఎరుపు, పచ్చ, పసుపు, నలుపు, కుంకుమరంగు కోడిపిల్లలు... అబ్బబ్బా... చెప్పనలవి కాదు. అన్నీ ఒకటొకటి పొడుచుకుంటా గంపలో ఇరుక్కుని- ఒకదానిమీద ఒకటి ఎక్కుతా తోసుకుంటా, పడుకుంటా, లేసుకుంటా ఉన్నాయి. వాటి కళ్లు సన్నని గోళీల్లా మెరుస్తున్నాయి. అంజద్ రెండు చేతులూ బుగ్గలకు ఆనించుకుని చూస్తుండి పోయాడు.

అతనికి కోడిపిల్లల మీద మనసు పడింది. ఆ వొడ్డోళ్లాయప్ప బొమ్మల్లాంటి రెండు కోడిపిల్లల్ని రెండు రూపాయి బిళ్లలిచ్చి కొనుక్కోని ఆనందంగా ఇంటికెళు తున్నాడు. అదే వొడ్డోళ్లాయప్పతో సాయం పట్టించుకోని గంప నెత్తిన పెట్టుకున్న కోడిపిల్లలాయప్ప ఎల్లబారిపోతున్నాడు.

"కోడిపిల్లలో... కోడిపిల్లలమ్మో... కోడిపిల్లల్... రూపాయికొక్కటి," అరుచు కుంటా వెళ్తున్నాడు.

అంజద్‌కు ఎవరో అప్తుడు దూరమవుతున్నట్టు అనిపించింది. గంగన్న వాడి బాధ పట్టించుకోకుండా "ఆడుకుందాం రా," అన్నాడు.

అంజద్ "ఛా! తెరికీ... క్యాక్..." అంటా కక్కరించుకున్నాడు.

గంగన్న తన గుడిసెకల్ల దోవపట్టి ఎలబారిపోయినాడు. నిజానికి గంగన్నకు కూడా కోడిపిల్లల మీద మనసుంది. కానీ డబ్బులెక్కడ్నుంచి వస్తాయి. అంజద్‌లా మనసు పాడుచేసుకోకుండా కుదుటపర్చుకుని వెళ్లిపోయినాడు- తెలివైనోడు కాబట్టి.

కోరిక కష్టాలను కొనితెస్తుంది. ప్రేమ విషాదాన్ని మిగిలిస్తుంది. అంజద్ చిట్టి బుర్రకు ఇలాంటి పెద్దపెద్ద అంశాలు అర్థంకాలేదు. కోడిపిల్లలాయప్ప దూర మయ్యే కొద్దీ అంజద్‌కు కోడిపిల్లలే కళ్లలో కదుల్తాండయి. కోడిపిల్లలాయప్ప అరుపులే చెవుల్లో మెదుల్తాండాయి.

అంజద్‌కు కోడిపిల్లలంటే చాలా ఇష్టం. అంతకుముందు సమచ్చరం కూడా రెండు కోడిపిల్లల్ని కొన్నాడు. అరచి, గీపెట్టి పోరు చేసి మరీ వాళ్లమ్మతో రెండు అన్న దమ్ముల్లాంటి కోడిపిల్లల్ని, అక్కాచెల్లెల్లాంటి కోడిపిల్లల్ని, కవల పిల్లల్లాంటి కోడి పిల్లల్ని కొనిపించుకున్నాడు.

అపురూపంగా పెంచుకున్నాడు. చివరికి ఏమైంది? ఒకదాన్ని గద్ద తన్నుకు పోయింది. ఇంకొకటి ఆ దిగుల్తో సచ్చిపోయింది. అదంతా మర్చిపోయిన అంజద్‌కు మళ్లీ కోడిపిల్లల మీద మనసైంది. ఏమైనా కానీ ఇంటికి పరిగెత్తాడు అంజద్.

"మా... కోడి పిల్లలమ్మా... ముద్దు ముద్దు కోడిపిల్లలు. రంగు రంగుల కోడిపిల్ల లమ్మా. సీతాకోకచిలుకల్లాంటి కోడిపిల్లలమ్మా" అన్నాడు వంటింట్లో ఉన్న వాళ్లమ్మ తో ఊపిరి పీల్చుకోకుండా టకటకా.

"ఏం కోడిపిల్లల్రా... అయి బతుకుతాయా.. పొడా.. మిసన్‌తో పొదిగితే పుట్టి నేటివి. లెక్క దుబారా... ఊరుకో..." అనబోయింది తల్లి మాహుబ్బీ. కానీ ఆమెక్కూడా మనసైంది.

"రూపాయికొక్కటంటే చాలా అగ్గవకదా కోడిపిల్లలు. పైగా పిల్లగాని కోరిక తీర్చినట్టయితాది. తీసుకునే రెండు పిల్లల్లో ఒకటి బతికి బట్టకట్టినా బాగానే గిట్టు బాటైతాది.." అని ఆలోచించిందామె.

"యాడ.. కోడిపిల్లలాయప్ప. ఎళ్లి పిల్సు పో తీయిస్తాను" అని పురమాయిం చింది.

అంతే పిట్టలా రెక్కలు కట్టుకుని మళ్లీ వీధిలో కొచ్చి వాలాడు అంజద్.

"ఓన్నా.. ఓన్నా.." అంటా కోడిపిల్లలాయప్ప ఎంట పడినాడు. శానాదూరం పొయినాకగానీ కోడిపిల్లలాయప్ప ఎనక్కి తిరిగి చూడ్లా. యాడ ఆయప్ప వినిపించు కోకుండా పోతాడో అని శానా భయపడి పోయినాడు అంజద్. చివరికి ఆయప్ప నిలబడి వెనక్కి తిరిగి చూసేసరికి ఊపిరి పీల్చుకున్నాడు.

"ఏం బ్బీ!" అన్నాడు కోడిపిల్లలాయప్ప నిలబడి.

"మా అమ్మ పిలుచ్చాంది. మాకు రెండు కోడి పిల్లలు గావాల రా" అంటా వెనక్కి మళ్లినాడు అంజద్ కళ్లు చక్రాల్లా తిప్పి.

ఆయప్ప రాకుండా "శానా దూరమా?" అని అనుమానపడ్తా అడిగినాడు.

దూరమంటే యాడ రాకుండా వెళ్లిపోతాడో అని "ఈణ్నే... ఈణ్నే" అంటా ఇంటికి పీల్చుకుని వచ్చినాడు అంజద్.

అడవులకెళ్లి పులులను వెంటేసుకుని వచ్చినట్టు ముఖం పెట్టినాడు వాళ్లమ్మ ముందర.

"ఈణ్నే... ఈణ్నే... అంటా ఇంతదూరం తీసుకొచ్చినావే. వార్నీ పాసుగాల. ఎన్ని తెల్వితేటలున్నాయి ఈ వగిసులోనే నీకు" అంటా నిష్ఠూరకపోయినాడు కోడిపిల్లలాయప్ప.

అంతలోనే మాహుబ్బిని చూసి "అసాధ్యుడు గదమ్మా నీ పిల్లోడు" అంటా గంప దింపినాడు.

ఉన్నవాటిల్లోనే రెండు పెద్ద పిల్లల్ని, హుషారైన పిల్లల్ని చూసి కొనుక్కుంది మాహుబ్బి.

ఒకటి ఎరుపు, రెండోది పసుపు పచ్చ. రెండింటినీ రెండు చేతుల్లోకి తీసుకుని ముద్దెట్టుకున్నాడు అంజద్. ఇంగ అక్కడ ఒక్క నిమిషం కూడా నిలబడ్లా. ఇంట్లోకి పరిగెత్తాడు. ఇంట్లో వాటిని వదిలి తలుపువేసి ఆడుకోవడం మొదలుపెట్టినాడు.

అవి అప్పుడే కాళ్లొచ్చినట్టు గునగునా పరిగెత్తాయి. లేడిపిల్లల్లా అటు ఇటూ ఇటూ అటూ పరిగెత్తి అంజద్‌తో చెడుగుడు ఆడుకున్నాయి. ఇసుమంత రెట్టవేసి ముద్దుగా వళ్లు విరుచుకున్నాయి.

బయటున్న మాహుబ్బి కొంగుముడి విప్పి రెండు రూపాయల నోటు కోడిపిల్ల లాయప్పచేతిలో పెట్టింది. ఆయప్ప కళ్లకద్దుకుని జేబులో వేసుకున్నాడు.

"రోంత గంప పట్టుమ్మా" అంటా అడిగినాడు. మాహుబ్బి గంప ఎత్తింది. ఆయప్ప వెళ్లిపోయినాడు.

ఆపొద్దుట్నుంచి అంజద్‌కు పగలూ రాత్రీ ఆ కోడిపిల్లలే. కూచున్నా, నిల్చున్నా తన చేతుల్లో, కౌగిల్లో వాటిని ఉంచుకుని తిరుగుతున్నాడు.

"గొంతు పట్టుకోవద్దు అవి సచ్చిపోతాయి. మెల్లగా పట్టుకో. కాళ్లు విరిగి పోతాయి" అని మాహుబ్బి హెచ్చరిస్తోంది అప్పుడప్పుడు.

"ఎప్పుడూ ఆడుకోవడమేనా? కొన్ని గింజలు వేస్తావా" అని దెప్పి పొడుస్తోంది.

దగ్గరుండి వాటి ముందు బియ్యపు నూకలు చల్లి అవి తినకపోతే పట్టుకుని నోరు తెరిచి దూర్చి, ముక్కులో కొన్ని, నోట్లో కొన్ని నీళ్లు పోసి ఊపిరాడకుండా చేసేవాడు. వాటి గొంతు కింద పొట్టనిండిందో లేదో అని పదే పదే తడిమి చూసే టోడు.

కోడిపిల్లలు రోజు రోజుకూ పెద్దవవుతున్నాయి. ఆటి తోక ఎనకాలే అంజద్ కాలం పరిగెడతాంది.

ఒక రోజు స్కూలు నుంచి ఇంటికొచ్చినాడు అంజద్. "బ్బ..బ్బ..బ్బా.." అంటూ నూకలు చల్లి కోడిపిల్లల్ని పిల్చినాడు.

ఒక కోడిపిల్ల ఎరుపురంగుది కంపచెట్ల మధ్యలోంచి బయటికొచ్చింది. దాని జతలో కోడిపిల్ల ఏమైందో దానికి పట్టలా. ఆబగా అంజద్ చల్లుతాండే నూకల్ని తింటాంది. ఇంకో కోడిపిల్ల కోసం చూసిన అంజద్‌కు నిరాశే ఎదురైంది. చాలాసేపు పిల్చినాడు.

"బ్బ..బ్బ..బ్బా.." అని అరిచి అలసి విసిగిపోయినాడు.

అంజద్ గుండెలు నీళ్లయినాయి. అటూ ఇటూ చూసి నూకలు చల్లడం ఆపి ఇంట్లోకి పరిగెత్తినాడు.

"మా... ఇంకో కోడిపిల్ల కనబడ్లా... మ్మా..." అన్నాడు వాళ్లమ్మతో.

వాళ్లమ్మ నమ్మలా. "ఆగిత్యం నాబట్టా..." అని వొదురుతానే బయటి కొచ్చింది. నిజమే ఇంకో కోడిపిల్ల కనపడ్లా. పసుపుపచ్చ కోడిపిల్ల... కంపచెట్లన్నీ వెతికింది మాహుబ్బి.

"ఇందాకనే ఉండా్ౖౖరా రెండు కోడిపిల్లలు. నేను చూసినా" అంటా. ఎందాకా చూసినా పసుపుపచ్చ కోడిపిల్ల జాడలేదు. "యాడ సచ్చిపోయిందో.. ఏ గద్ద ఎత్తుకు పోయిందో... ఎవరు కండ్లల్లో నిప్పులు పోసుకున్నారో..." అని యాష్ట పడతా పిల్లోడు తప్పిపోయిన తల్లి మాదిరి ఆ వీధిలో ఇల్లిల్లూ తిరుగుతూ అడిగింది. చివరికి ఇక లాభం లేదనుకుని సల్లబడిపోయింది.

తనను బడికి పంపించి గంపకింద ఉండే పిల్లల్ని గంప కింద ఉన్నిచ్చకుండా గాలికి వదిలి కంపచెట్లలోకి తోలేసిన వాళ్లమ్మ మీద అంజద్‌కు కోపమొచ్చింది.

వాళ్లమ్మను నోటి కొచ్చినట్టు తిట్టుకుంటూ ఊరుకుండిపోయినాడు.

ఒంటరిగా మిగిలిన ఆ ఎరుపు రంగు కోడిపిల్లని దగ్గరకు తీసుకుని తల నిమిరి నాడు. గుండెలకు హత్తుకున్నాడు. ఈ కోడిపిల్ల కూడా దిగుల్తో యాడ సచ్చి పోతుందో అని భయపడినాడు.

కానీ అలా జరగలా. అది దాని ఆయుష్షు కూడా పోసుకుని పులిపిల్ల మాదిరి తిరగడం మొదలుపెట్టింది. ఆ కోడిపిల్లలోనే పసుపురంగు కోడిపిల్లను కూడా చూసు కుంటా ఉన్నాడు అంజద్.

రోజులు గడుస్తున్నాయి. పుల్లిపిల్ల పెరిగి పెద్దదవుతోంది. పెద్దయ్యేకొద్దీ దాని ఈకల రంగు వెలిసిపోయింది. ఎరుపురంగు పోయి దాని అసలు రంగులోకి వచ్చే

సింది. ఇప్పుడు ఆ కోడిపిల్ల కొంగ మాదిరి తెల్లగా వుంది. ఆడపిల్ల పెద్దమనిషైనట్లు చూస్తుండగానే ఆ కోడిపిల్ల అరకేజీ కోడై కూచుంది.

ఆ అరకేజి కోడిమీద అంజద్ వాళ్ల నాయన కన్నుపడింది.

"కోచ్చారా... కోడిని" అన్నాడు ఒకరోజు.

"అమ్మో.. ఇంగేమైనా ఉందా.." పరిగెత్తుకుంటూ వెళ్లి కోడిని అదుము కున్నాడు అంజద్.

"తన పానం పోయినా కోడిని కోయనివ్వను" అన్నాడు.

కాసేపు అంజద్ మనసు కరిగించడానికి ప్రయత్నించినాడు వాళ్ల నాయన. వినక పోయేసరికి చివరికి "వాని మాట కాదనడం ఎందుకులే" అనుకుని రాజీపడి ఓ పూట ఓ అరకేజీ మాంసం తెచ్చుకుని వండించుకుని తిని, నీసు తినాలనే కోరికను చల్లార్చుకున్నాడు ఆ యప్ప.

ఆ కోడి, అంజద్ కాలం ఇట్టా నడుస్తుంటే ఓ రోజు ఓ చెడ్డ గడియ వచ్చి పడింది.

ఈమధ్యే వేసిన నల్లటి రోడ్డు పక్కన జెండా మాను కింద ఆడుకుంటున్నాడు అంజద్. ఎండ నడినెత్తిమీదికెక్కి తైతక్కలాడ్తాంది. మధ్యాహ్నం, నమాజు టైం కూడా అయిపోయింది.

ఉన్నట్టుండి రోడ్డుమీద కీసురుమంటా ఓ జీపు అరిచింది. వాహనాల అరుపులు చాలా భయంకరంగా ఉంటాయి. అవి అలా అరవకుండానే ఉండాలి. అరిచాయా. ఎవరి శాల్తో లేచినట్టే. నిజమే అలాగే జరిగింది. అంజద్ కోడి, ముద్దుల కోడి, కొంగలాంటి కోడి జీపు టైరుకిందపడి టపటప, పటపటా- రెక్కలు, రెప్పలు కొట్టుకుంటోంది.

జోరుగా వస్తున్న జీపుకు అడ్డంగా పోయిందట. మధ్యలోకి వెళ్లి ఎటు పరిగెత్తాలో తెలియక జీపు కిందికి ఉరికిందట. అంతే తొక్కిచ్చిన జీపు తిరిగి చూడ కుండా సర్రున పోయింది.

నెత్తురోడుతున్న కోడిని పరిగెత్తుకుంటా వచ్చి చేతుల్లోకి తీసుకున్నాడు అంజద్. వాళ్ల నాయన కూడా గుడిసెలోంచి బయటికొచ్చినాడు. అసలే కోడి సచ్చి పోతాందే అన్న బాధలో ఉన్న అంజద్ పై తిట్ల పురాణం ఎత్తుకున్నాడు. పరిగెత్తు కుంటూ పోయి జుట్టు పట్టుకుని, వంగబెట్టి గబగబా నాలుగు గుద్దులు గుద్ది, ఎడమకాలితో డొక్కలో తన్నబోయాడు.

“పిల్లగాన్ని సంపేచ్చావా ఏంది? ఆ కోడి గాచారం బాగలేక జీపు కింద పడితే వీడేం జేచ్చాడు” అంటా అడ్డుకున్నారు అక్కడ గుమికూడినోల్లు.

“పరిగెత్తరా... నాకొడకా పరిగెత్తు. నిలబడి అట్టా జూచ్చావేందిరా ముండ మోపి నాకొడకా. పరిగెత్తు. బంగారట్టా కోడిని కోచ్చామంటే వినకపోతివి. ఇప్పుడు జూడు ఎవురికీ గాకుండా జేచ్చాండవు. పరిగెత్తు. కోడి సావక ముందే మసీదులో హజ్రత్ ఉంటాడు కోసకరా పో” అంటా ఒంటికాలి మీద లేచినాడు వాళ్ల నాయన. గబగబా జేబులు వెతికి రూపాయి బిళ్ల తీసి అంజద్ చేతిలో పెట్టినాడు. అదెక్కడ కొనూపిరి వదిలేచ్చాదో అని అతనిలో ఆత్రం.

అంజద్‌కు దిక్కు తెలియలా. మసీదుకల్ల పరుగందుకున్నాడు. చేతిలో కోడి నెత్తురు గక్కుతాంది. అంజద్ కళ్లు కన్నీళ్లు కక్కుతున్నాయి.

*నవ్య వీక్లీ, 2 నవంబర్ 2005*

# రజాక్‌మియా సేద్యం

'మన్న మొలిచినట్టు లేదు అప్పుడే సెనిక్కట్టె ఎండకు ఎర్రగా మలమలా మాడి పోతాండాది. నిన్న తెచ్చినట్టు లేదు అప్పుడే ఇంట్లో నూకల మూటె దినదినానికి కరిగిపోతాండాది... ఏందిరా ఈ బతుకు?' అనుకున్నాడు రజాక్‌మియా నడి పొలం లో కూర్చోని సరస్వతి బీడి తాగతా.

అతనికి మనసంతా ఇంట్లో అయిపోవచ్చిన నూకలమూటె మీద, సావుకొచ్చి తన కండ్ల ముందు కనబడుతున్న సెనిక్కట్టె మీద ఉంది. పంటను కాపాడుకోవాల- అప్పులోల్ల దగ్గర మానం నిలబెట్టుకోవాల. నూకల మూటె తెచ్చుకోవాల- ప్రాణాలు నిలబెట్టుకోవాల. ఇదే ఆలోచన అతనికి.

ఎండకు నూనె పూసిన నెత్తి చరచరా అంది. లేచి నీడ కోసం చూశాడు. చలమాడ్డి (చలమారెడ్డి) తోట్లో పొద్దు తిరుగుడు పంట ఇంతింత పూలతో హాయిగా ఊగతా పచ్చగా ఎలిగిపోతా ఉంది. రెడ్డికి మోటారుంది. ఆ పంట అలా ఉండడం లో ఆశ్చర్యమనిపించ లేదు రజాక్‌మియాకి. మన్ననే బోరెత్తిపోతే మల్లా ఏయించాడు.

భూముల మీద పెట్టుబడి పిచ్చపిచ్చగా పెడుతున్నాడు. వంద ట్రాక్టర్ల ఇసుక తోలించాడు. రాజకీయంగా మంచి పలుకుబడుంది.

'అంత లెక్క నా దగ్గరుంటేనా? సొంత కష్టంతో నా ఐదెకరాల పొలాన్ని రెడ్డి కన్నా బాగా బొమ్మను చేద్దుం.' ఆ ఆలోచనకి మనసులోనే ముసిముసిగా నవ్వుకున్నాడు- రజాక్‌మియా.

చలమాడ్డి పొలానికి గట్టునే పెద్ద యాపచెట్టు. అది విశాలమైన నీడతో తనని రమ్మని పిలుస్తున్నట్లుంది. ప్రేమగా దాని వైపు చూస్తా కదిలాడు. అసలు ఆ చెట్టు బాగా గమనిస్తే ఒకప్పుడు రజాక్‌మియా పొలంలో ఉండేది. చలమాడ్డి రోజురోజుకు తన కూలోళ్ళతో సరిహద్దు గెనాన్ని జరుపుకుంటా వచ్చి సిన్నగా సెట్టు తన పొలంలోకి వచ్చేట్టు చేసుకున్నాడు. ఇప్పుడైనా సర్వేరును పిలిపించి కొలతలు ఏపిస్తే సెట్టు తనకు రాకుండా పోదు. కాని దాని మూలంగా శానా గొడవలవుతాయి.

'ఇప్పుడు రెడ్లతో ఎందుకులే' అని ఎప్పటికప్పుడు సరిపెట్టుకుంటా వస్తున్నాడు రజాక్‌మియా. యాపసెట్టు కిందికి సేరుకునే సరికి గొర్లోల్ల పిల్లోడు అంజిగాడు అక్కడే కూసోనున్నాడు. వాడు చలమాడ్డి పొలానికి కాపలా.

"ఏం మామా. ఎండ పొద్దున యిట్టా ఎల్లబారినావు" కులమతాలతో సంబంధం లేకుండా (ఒక్క రెడ్డోళ్లను తప్పితే) అందర్నీ వరసలు పెట్టి పిలిచే అంజిగాడంటే అందరికీ ఇష్టం.

ఆ ఇష్టమే రజాక్‌మియాకు ఆ క్షణం కలిగింది. అంజిగాడి పలకరింపు యాపసెట్టు నీడ కన్నా సల్లగా అనిపించింది. తన గోడు ఆ పసివాన్తోనైనా కాసేపు పంచుకుందామనుకున్నాడు.

"లేలేత మొలకల్రా అంజిగా. కళ్ళ ముందే నీండ్లు ల్యాక సచ్చిపోతాన్నా యిరా. చలమాడ్డి తొట్లో ఉన్నట్లు ఉండాల్సింది పంట. సివరికి ఎల్టీన్ తాగాల్నో ఏమో" దీనంగా అన్నాడు రజాక్‌మియా.

అంజిగాడు కాసేపుండి నిట్టూర్చి "సాయిబులు మీకెందుకు మామా సేద్యం. అమ్మి పారేసి ఏ దుబాయికో, కోయిటుకో పోకండా" అన్నాడు.

రజాక్‌మియాకి బొటబొటా కన్నీళ్లొచ్చేసినాయి. "అవును కరెక్టే. దుబాయికి పోవాల. కనీసం నా కొడుకునన్నా అంపాలా. పంటొస్తే అదే చేద్దామనుకుంటూండాను."

“పంటొస్తే కాదు మామా పంటలొస్తే దుబాయికి ఎందుకు పోవాల సెప్పు. బూమమ్మేంయ్ మామ. నువ్వెట్టా బోరేయలేవు. పంట తీలేవు. ఎందుకు దీన్ని నమ్ము కుంటావు చెప్పు. కాపోళ్ళంటే యాడాడ్నో తిప్పలు పడుకుంటా ఉంటారు.”

“నిజమేరా సిన్నా. కాకపోతే భూమమ్మాలంటేనే ఇదిగా ఉందిరా. ఇది మా నాయన సంపాదించింది. మా నాయనా, మలకోలపల్లి రెడ్డి భలే సవాసగాళ్ళు. మా నాయన అప్పుడు కుట్టుపని చేసేటోడు. ఆడోళ్ళ రైగ్గుడ్డలు కుట్టుకున్నా మా నాయన వొడి రకరకాల తిండి గింజలతో నిండిపోయేదంటా.

ఒకనాడు మా నాయన్ను మలకోలపల్లి రెడ్డి పిలుసకపోయి ‘పిల్లల గల్లోనివి ఎందుకురా కష్టపడతావు. బతుక్కోఫో...’ అని ఉత్తపుణ్యానికే నాలుగెకరాల పొలం రాయించినాడంటా. ఆ పొలమేరా ఇది. ఆ పొలంలోనేరా సెనిక్కాయ ఎండగాలి పోతాండేది. ఏమంటే దీనికి ఒక ఎకరా ఎగాస్టా చేసి మా నాయన నా సేతిలో పెట్టి సచ్చిపోయినాడు. మా నాయన నన్ను ఎప్పుడూ దండిచ్చేటోడు. ‘ఆ మలకోలపల్లి రెడ్డి లాకపోతే నీకు బతుకెక్కడిదిరా నా కొడకా.’

మహానుబావుడు ఏ కల్మషం లేనోడు కాబట్టే మనింట్లో దీపం పెట్టినాడు అని మా నాయన ఇరవై నాలుగ్గంటలూ ఆ రెడ్డిని పొగుడుకుంటూ ఉంటే మా క్కూడా ఆ మహానుభావుడు దేవుడిలా కనిపిస్తాండె. ఇప్పుడు ఆ రెడ్లు లేరులే.

ఆడికి మా నాయనా అన్నాడంటా. ‘సాయిబూని, నాకెందుకు రెడ్డీ భూమి. చేసుకోను సేతైతదా, పాడా’ అని.

‘భూములు రెడ్లు, కాపోళ్లే సేయల్లని యాడన్నా రాసిపెట్నారా ఏంది’ అని గదురుకున్నాడంటా ఆ రెడ్డి.

‘ఈ బూమమ్మ తల్లికి అలాంటి బేదాలుండవురా. నాల్రోజులు మడక పట్నావంటే అన్ని పనులూ నీకే సేతవుతాయి’ అన్నాడంటా.

మా నాయన మల్లా ఎప్పుడు కుట్టుపనికి పోలా. రైతైపోయినాడు. ఎప్పుడూ ఆలోసన్లు. ఏ అదునుకు ఏదెయ్యాల అని ఆలోసించుకుంటా, పక్క రైతులతో తర్కించుకుంటా, రెడ్డితో సలహాలు తీసుకుంటా గడుపుతాండె. అప్పుడి రైతులు ఇప్పుడు లేరులే. సిన్నగా ఆ పనీ నేను కూడా నేర్చుకుంటి. ఇప్పుడు నేను దీన్ని అమ్మలేనురా. దుబాయిగ్గాదుకదా. మక్కాకు పోవాలన్నా అమ్మనురా. అదీగాకా ఇది నా సొమ్ము కాదురా” సివరిగా అన్నాడు రజాక్‌మియా.

"నువ్వలాగే అనుకుంటా అప్పులు జేస్తా ఉండు మామా. ఎప్పుడో ఒకసారి అప్పులోల్లొచ్చి దీన్ని రాయించుకొని పోతారు. అప్పుడు తెలుస్తాది నీకు."

సిన్నవాడైనా గొప్పమాటన్నాడు అంజిగాడు. యింగేం మాటాల్యాకపోయాడు రజాక్‌మియా. సివరిసారి తన ఎండిపోయిన సెనిగిసెట్లను నిరాసగా చూసుకుంటా "ఇంటిగన్నా పోదాం రా, ఈడుండి ఏం జేయాల" అంటా కదిల్నాడు.

అంతలో అంజిగాడు దేవున్లా ఒక్కమాటన్నాడు.

"మారెడ్డిని అడక్కపోయినావా... ఒక తడవ నీళ్లిస్తాడేమో."

అంతే రజాక్‌మియాకి కాళ్లు నిలవలా.

"మంచి ఐడియా ఇచ్చినావురా..." అంటా అంజిగాని పొగుడుకుంటా తన పంట పచ్చగైనట్లు ఊహించుకుంటా ఊర్లోకి పరుగందుకున్నాడు.

చలమారెడ్డి అంటే ఎవరు? మధురెడ్డి బావ. ఇంట్లో నూకలైపోతే రజాక్ మియా ముందు మధురెడ్డి కాళ్లనే పడేది.

పరుగెత్తుతున్నవాడల్లా ఆగిపోయి నడవడం మొదలుపెట్టాడు రజాక్‌మియా. అతనితో పాటు ఆలోచనలు కూడా సిన్నగా నడకందుకున్నాయి. నూకల మూటె అయిపోయినప్పుడు మధురెడ్డి అతనికి పెట్టే బాధలు తలుచుకుంటే వొళ్లు గుగుర్పొడుస్తుంది.

❉

ఉదయాన్నే పోయి మధురెడ్డి ఇంటి పంచలో కాపలా కూచ్చుంటాడు రజాక్ మియా. మధురెడ్డికి కొత్తగా పెళ్లయింది. పెండ్లాంతో కలిసి పడుకున్నాడంటే ఎప్పటికి నిద్రలేస్తాడో తెలీదు. నిద్రలేసినా ఏ మూడులో ఉంటాడో.

'ఏందిరా నీ గోల. నీ ఇంట్లో బియ్యం అయిపోతే నన్నేం చేయమంటావు?" అని కసురుకుంటాడు బయటికొచ్చి.

'అది కాదు రెడ్డీ...' అని నసుగుతాడు రజాక్‌మియా.

"'ఏది కాదు. నీది పెద్ద పీకులాటైపోయిందే నాకు..." మధురెడ్డి గొంతు గయ్యి మంటాది.

రజాక్‌మియా చిన్నగా నోరు విప్పుతాడు. ఈసారి కూడా "అదికాదు రెడ్డీ..." అంటా మొదలుపెడతాడు.

"ముందు పంట బాగొచ్చాదనుకుంటే రాకుండా బాయా. సరిగా రాలా. నువ్వు కూడా చెప్తివిగదా పంట చూసి, యిసారి నూరు మూటెలకు తక్కువగావు శెనిక్కాయలు అని. సాయిబుగాడు లక్షాధికారైపోయినట్టే అని పరాసికాలు కూడా ఆడితివి. ఏంజేయాల రెడ్డీ నా ఖరమ అట్టుండాది. తీరా నోటికాడి కొచ్చినాక వరదలొచ్చా. నా కొంప ముంచిపాయ. బిడ్డలు గలోన్ని అన్నీ తెలిసిన నువ్వు కూడా నన్ను దయ జూపకపోతే ఏం తినాల రెడ్డీ. మా వోడా బడి నుంచి వచ్చానే అన్నం లాకుంటే తట్టుకోలేడు. ఎట్టోకట్టా ఈ నాన్నాళ్లు ఆదుకున్నా వంటే ఈసారి పంటలో అంతా ఇచ్చేత్తా నీ రుణం ఉంచుకోను."

"అబ్బబ్బా చెబితే వినవుగదా. నీ గోడు నీదే. సాయంత్రం రోడ్డు పైకొచ్చాఫో. పులివెందుల రోడ్డులో ఉండు." అంటా గుభిల్లున వాకిలేసుకొని మల్లా పెండ్లాం పక్కలోకెళ్లి పండుకుంటాడు మధురెడ్డి. రజాక్‌మియా ఊపిరి పీల్చుకొని సాయంత్రం పులివెందుల రోడ్డులోకెళ్లి అర్ధరాత్రి వరకూ ఎదురుచూస్తా కూచుంటాడు. మధురెడ్డి ఎప్పటికీ రాడు.

తెల్లారి కండ్లు ఎర్రగా పెట్టుకొని రజాక్‌మియా మల్లా మధురెడ్డి ఇంటి ముందుకెళ్ళి నిలబడుతాడు.

"అబ్బా మర్సిపోయినా సాయిబు" అంటాడు సులభంగా మధురెడ్డి. ఆ మాటలకు రజాక్‌మియా కండ్లల్లో నీళ్లూరిపోతాయి. అది మధురెడ్డి పసిగట్టకుండా తలకాయ నేలకు వంచుకుంటాడు.

"ఈరోజు ఎట్ట తిరిగి వచ్చా ఉండుపో" అని మల్లా ఇంట్లోకెళ్ళి వాకిలేసుకుంటాడు మధురెడ్డి.

ఆ రోజు సాయంత్రం మల్లా పులివెందుల రోడ్డులో పడిగాపులు కాస్తాడు. చాలా పొద్దుపోయాక బండి మీద డుగ్‌డుగ్ అనుకుంటా వచ్చి కనపడి మధురెడ్డి "ఇప్పుడు పోతే సెట్టిగాడు యాడుంటాడు. అంగిడి మూసేసుంటాడు. రేపు ఉదయానే పోదాంపో. చెప్తాను తీసుకెల్దువుగానీ" అనేసి ఎళ్ళిపోతాడు.

అక్కడ్నుంచి ఇంటికి తిరిగి రాబుద్దికాదు రజాక్‌మియాకి. అక్కడ్నుంచి అట్నే ఎక్కడికైనా ఎళ్లిపోదామనిపిస్తాది. మధురెడ్డి బియ్యం ఇప్పించినాకే ఇంటికి తిరిగిస్తామనిపిస్తాది. కాని ఎక్కడికెళ్తాడు. ఎన్నాళైంది జేబులో డబ్బులు పెట్టుకొని.

మౌనంగా ఏవేవో ఆలోసించుకుంటా వచ్చి ఇంట్లో పెండ్లాం నూరుక్కూడా విషయం చెప్పకుండా ఆరుబయటే వున్న నులకమంచాన్ని వాల్చుకొని ఎల్లెలికల

పడుకొని ఆకలి కడుపు పైకేసుకుంటాడు. విషయం అర్థమైన నూరు బయటిక్కూడా రాదు. కొడుకు షాబీర్‌ని తీసుకొని దేవుని మూల ముడుక్కోనుండిపోతాది.

మల్లా తెల్లారి కాళ్లీడ్సుకుంటా మధురెడ్డి ఇంటి పంచకు పోయి కూచ్చుంటే చాలాసేపటికి అతని పెండ్లాం బయటికొచ్చి, "అరే! ఇప్పుడే పనుందని కడపకు పోయాడే!" అంటాది.

ఆ దెబ్బకు మళ్లీ లేవబుద్ధి కాదు రజాక్‌మియాకి. "ఆ అరుగుమీదే పడుకో నుండిపోతే ఎప్పుడో ఒకసారి ఇంటికి వచ్చిన మధురెడ్డి తనని చూసి అయ్యో పాప మని లేపి బియ్యం మూటె ఇప్పించకపోడు కదా." అనుకుంటాడు. కాని అభిమానం అడ్డొస్తుంది. ముష్టోడికి తనకి పెద్ద తేడా ఉండదనిపించి అతికష్టం మీద అక్కడ్నుంచి లేచొచ్చి ఇంట్లో పడతాడు.

ఇంట్లో ఇనుపసామాన్లుంటే ఇనుపసామాన్లు, పాత వస్తువులుంటే పాత వస్తువులు అప్పటికి ఏవి అక్కరకు రాకుండా ఉంటే వాటిని ఎంతకు పడితే అంతకు అమ్ముకొని ఓ రెండు మూడు కేజీలు నూకలు కొనుక్కొచ్చి ఇంట్లో పడేస్తాడు.

చిటికెల మీద వాట్నందుకొని పొయ్యి మండిస్తుంది నూరు. నూకలు ఎప్ప డెప్పుడు ఉడుకుతాయా గెలికేద్దామా అని ఎదురుచూస్తా గిన్నెలో ఒట్టి చాపల కారం పిసికేస్తాది. నూకలవగానే గబగబా రేకుల్లో పడితే రేకుల్లో, మూతల్లో పడితే మూతల్లో రాగిపిండి కూడా వేయకుండా గెలికి ముద్దలు చేసి ఏసేస్తాది. ఆ పూట అందరూ ఆవురావురంటా తిని పాణాలు నిలబెట్టుకుంటారు.

అది తిని హాయిగా చాన్నాళ్ళుంచి లేని కునుకు ఒకటి తీసి సాయంత్రంగా మల్లా మధురెడ్డి వేటలో పడతాడు రజాక్‌మియా. ఏ దుకాణంలోనో బాతాఖానీ కొడతా, యవ్వా రాలు చేస్తా మధ్య మధ్యలో "అ...హ్వా...హ్వా..." అంటా పెదపెద్దగా నవ్వుతా కనిపిస్తాడు మధురెడ్డి.

ఎళ్లి మధ్యలో డిస్టర్బ్ చేస్తే యాడ మల్లా అసలుకే ఎసరొస్తాదోనని బిక్కు బిక్కుమంటూ ముందుకెళ్ళి నిలబడుతాడు రజాక్‌మియా.

మధురెడ్డి గమనించి "ఎక్కడికి పోయావయ్యా, ఇప్పుడే నీ కోసం రోడ్డంతా తిరిగి వస్తాన్నా" అంటాడు ఊరికల్లా.

"ఆ శెట్టిగానికి చెప్పినాగానీ ఎళ్లి ఒక మూటె తెచ్చుకో పో" అంటాడు మల్లా సివరిగా.

"హమ్మయ్య మధురెడ్డి పదికాలాలు సల్లగా ఉండాలా" ఆ మాటలకి అంత వరకు అతను పెట్టిన కష్టాలన్నీ మర్చిపోయి అనుకుంటా ఇంటికొచ్చి షాబీర్ను తన ఫ్రెండుది సైకిల్ తీసుకురమ్మని చెప్పి పురమాయిస్తాడు రజాక్‌మియా.

చిటికెల్లో షాబీర్ సైకిల్‌తో రెడీ అయిపోతాడు. ఇద్దరూ ఆ సైకిల్‌ని దొబ్బు కుంటూ పోయి అడ్డరోడ్డులో వెంకటేశ్వరహాలు దగ్గరున్న సెట్టి అంగడి ముందర ఆగుతారు.

రజాక్‌మియా గబాగబా వచ్చిపోయే మనుషులతో బిజీగా ఉన్న సెట్టి దగ్గరి కెళ్ళి సిన్నంగా "సెట్టీ! మధురెడ్డి చెప్పినాడు ఒక మూటె నూకల బియ్యం గావల్లా."

సెట్టి యాపారం రద్దీలో వినుకోడో, కావాలనే అలా చేస్తాడో విననట్టే వుంటాడు. అలా ఒక పదిసార్ల వరకూ రజాక్‌మియా చెవి దగ్గర మొత్తుకుంటే సెట్టి గాడు "ఆ...ఆ... చెప్పినాడు లేవయ్యా. కాసేపుండరాదా. ఉద్దరక్యూడా తొందరే" అంటాడు.

"ఉంటాను. నీవు విన్నావో లేదో అని" గొనుక్కుంటూ ఎళ్ళి అంగడికి ఒక పక్కగా అంటరానివాడిలా నిల్చుంటాడు రజాక్‌మియా.

ఎప్పుడు తీరికైతే అప్పుడు సెట్టి "యింగరా" అంటా గోడౌన్లోకి తీసుకెళ్ళి మూటె జూపిస్తే షాబీర్, రజాక్‌మియా జాగ్రత్తగా దాన్ని ఎత్తుకోనొచ్చి సైకిల్ బార్ల పెట్టుకుంటారు.

"సెట్టిగాని అంగిట్లో ఎన్ని బియ్యం మూటెలు...!" అని ఒకరి ముఖాలు ఒకరు చూసుకుంటా...

"ఇంగ వచ్చాం సెట్టి" అంటా అక్కడ్నుంచి బయటపడతారు.

ఆ మాటకు సెట్టిగాడూ ఉలకడు పలకడు.

❊

అదీ కథ. ఇదంతా గుర్తొచ్చి రజాక్‌మియాకు వొళ్ళంతా తేళ్లూ, జర్రులు పాకి నట్లయింది. 'ఏందిరా ఈ ముష్టి బతుకు' అనుకున్నాడు.

ఒకేసారి నాలుగైదు నూకల మూటెలు వేసుకుందామంటే మధురెడ్డి ఒప్పుకోడు.

సెట్టిగాడు అప్పివ్వడని దొంగ మాటలు చెబుతాడు. సెట్టిగాడు మధురెడ్డి ఇద్దరూ ఒక్కటే. మధురెడ్డి చెబితే చాలు. సెట్టిగాడు ఎన్ని బియ్యం అయినా అప్పు

యిస్తాడు. వారిద్దరి మధ్య వున్న లింకు రజాక్‌మియాకు తెలియంది కాదు. కాని నోరు మెదపలేని పరిస్థితి. ఊరుకుండిపోతాడు.

ఇప్పుడు మధురెడ్డి బావ చలమాడ్డి దగ్గరికి నీళ్ళు కావల అని ఎళితే ఉత్త పుణ్యానికే వేసుకోమంటాడా. ఎంతో కొంత వెలడుగుతాడు. తన దగ్గరేముంది. వాళ్ళ నాయన కుట్టే మిషను కూడా యిన్నాళ్లు గుర్తుగా పెట్టుకొని ఈమధ్యే తిండి గింజలకు నకనకలాడతా అమ్ముకున్నాడు.

నీరుగారిపోయాడు రజాక్‌మియా. అతినికి దారి నడవ బుద్ధి కావడంలేదు. ఎండకు నీరసంగా అడుగులు పడుతున్నాయి. అన్నం తినే యాలైంది. ఆకలి. దారి లో ఆడుతున్న ఒక మోటారు దగ్గర ఆగి నీళ్లు తాగినాడు.

ఒకవేళ చలమాడ్డి మధురెడ్డి అంత జాచ్చొడు గాదేమోలే. అదృష్టం బాగుండి ''ఏసుకోపోరా సాయిబూగా'' అంటే నా కష్టాలు తీరినట్టే.

''యా అల్లా. శత్రువు మనసైనా మనం కష్టాల్లో ఉన్నప్పుడు మారుతుం దంటారు. కనుకరించు తండ్రీ...'' అని ధైర్యం తీసుకున్నాడో లేదో అతను నీళ్ళు తాగిన మోటారు దగ్గరికే ఒక ట్రాక్టరు పెద్దగా శబ్దం చేసుకుంటా వచ్చి ఆగింది. అది చలమారెడ్డిదే. ఆ రూట్లో ఎవరికన్నా బాడెక్కోల్లిందేమో అనుకున్నాడు.

అందులోంచి కూలోళ్లు వచ్చి మోటారు దగ్గరే నీళ్ళు తాగుతుంటే ''ఈ ట్రాక్టర్ చలమారెడ్డిదే కదా'' అన్నాడు అనుమానాన్ని సరిచేసుకుందామని.

వాళ్లు ''అవును'' అన్నారు.

రజాక్‌మియా ''అన్నన్నా... నేనొస్తాన్నా అయితే, రెడ్డితో రోంత పనుండాది'' అంటా ట్రాక్టర్ ఎక్కి కూర్చున్నాడు. డ్రైవరు ఏమన్లేదు.

అరగంటలో కాపుటీదిలో ఉన్న చలమాడ్డి ఇంటి ముందు ఆగింది ట్రాక్టరు. రజాక్‌మియా ట్రాక్టర్ దిగాడు. గుండె డబ్‌డబ్ మంటూ కొట్టుకుంటాంది. ఆ శబ్దం అతనికి బాగా వినపడతాంది.

చలమారెడ్డి ఇళ్ళు విశాలంగా ఉంది. తను దిగిన ట్రాక్టరును డ్రైవరు సైడుగా పెట్టుకుంటున్నాడు. ఆ శబ్దం కూడా వినపడతాంది.

రెడ్డి ఇంటి ముందు ఇంకా నలుగురు మనుషులున్నారు. వాళ్లూ రైతులన్నట్లే ఉన్నారు. రెడ్డితో వాళ్ళక్కూడా ఏమైనా పని పడిందేమో అనుకున్నాడు.

బిక్కుబిక్కుమంటా రెండడుగులు ముందుకేశాడు.

ఏదో కొంపలంటుకుంటున్నట్టు, పిచ్చికుక్క ఏదో ఇంట్లోకి జొరబడుతున్న ప్రమాదాన్ని పసిగట్టినట్టు ఎక్కడ్నుంచో ఒక మనిషి పరుగెత్తుకుంటూ వచ్చి "ఎవరు కావల్ల" అంటూ గడప దగ్గరే అడ్డుకున్నాడు.

"రెడ్డి..."

"రెడ్డి అన్నం తింటాండాడు. కాసేపుండు. బయటికే వస్తాడు."

రజాక్‌మియా కూడా అక్కడున్న రైతుల్లో కల్సి రెడ్డి కోసం ఎదురు చూడ సాగాడు. అతనిక్కూడా అన్నం తినాలని ఉంది. రెడ్డితో మాట్లాడ్డం అయిపోయాక ఇంటికెళ్ళి తిందాంలే అనుకున్నాడు.

❉

కాసేపటికి బనీను మీదున్న రెడ్డి చెయ్యి టవలుకు తుడుచుకుంటూ 'బ్రేవ్' మని తేన్చుకుంటా బయటికొచ్చాడు. చేతినిండా ఉంగరాలే. మెళ్లో చైను. మీసాలు పెంచి గంభీరంగా ఉన్నాడు. అక్కడే విశాలంగా ఉన్న అరుగుమీద కూర్చున్నాడు.

అంతదాకా అక్కడున్న నలుగురు రైతులు పరుగెత్తుకుంటా వెళ్ళి తమ గోడేదో విన్నవించుకున్నారు. నిల్చున్న చోటు నుంచే వాళ్ళను గమనిస్తాండాడు రజాక్‌మియా, కాసేపటికి వాళ్ళ పనైందేమో వాళ్ళు సంతోషంగా ఒకర్నొకరు మాట్లాడు కుంటా, నవ్వుకుంటా అక్కడ్నుంచి వెళ్ళిపోయారు.

చలమారెడ్డి దృష్టి ఇక మిగులున్న రజాక్‌మియాపై పడింది. రజాక్‌మియా చేతులు కట్టుకున్నాడు. వినయంగా ముందుకెళ్ళి "నేను రెడ్డి. రజాక్‌ని. నీ పొలం పక్కనే నా పొలం."

తెలుసన్నట్టు టకటకా తలూపాడు చలమారెడ్డి, తర్వాత రజాక్‌మియా చెప్పబోయే మాటలేంటో అని.

రజాక్‌మియా "ఏడేండ్లయితాంది రెడ్డీ మా నాయన సచ్చిపోయి. అప్పుడు చూసిందే కండ్లనిండా సేన్లో పంట. మల్లెప్పుడూ సూల్లా. ఆ పొలం కూడా ఏదో మీలాంటోళ్లు మా నాయనకు దానం చేసిందే. దాన్ని నమ్ముకొని బతుకుతాండాను రెడ్డీ నేను.

ఈసారి ఇత్తనాలు సెరివాళ్ళకు తీసుకొని సెనిక్కాయ విత్తినా రెడ్డీ. ఏదో నాలుగు సినుకులు రాలి, అందరూ ఆశగా పదునైందని విత్తులు విత్తున్నారు చూడు. అప్పుడు రెడ్డీ. నీకు తెలీందేముండాది ఇంతవరకూ ఒక్క వాన లేదు.

నీవు జూసినావో లేదో రెడ్డీ సేన్లో సన్నబిడ్డలెక్క సెనిక్కాయ సెట్లు ప్రాణాలు అరసేతిలో పెట్టుకోనుండాయి రెడ్డీ, ఇంగ నాన్నాళ్లు ఇట్టాగే ఉంటే నా పెళ్లాం బిడ్డల కష్టమంతా నాశనమైతాది రెడ్డీ.''

రజాక్‌మియా గొంతు గద్గదమైంది.

''రెండ్రోజులు.. రెండే రోండు రోజులు... నీ మోటారు నీళ్లు ఇచ్చినావంటే ఇప్పుడే ఎళ్లి నీ తోట్లోంచి కాలువ తొక్కుంటా. నా సెనిక్కాయ సెట్లను బతికించు కుంటా, యియ్యి చేతులు కావు రెడ్డీ, కాదనొద్దు. నాకు నుయ్యో గొయ్యో తప్పితే ఏరే దారి లేదు.''

కాసేపు ఏం అనలేదు చలమారెడ్డి. మౌనంగా ఉన్నాడు. రజాక్‌మియాలో ఆవేదన తగ్గింది.

అప్పుడు భుజం మీద చెయ్యేసి చెప్పడం మొదలుపెట్టాడు చలమారెడ్డి. ''చూడు రజాక్‌మియా. ఇలా బాధపడ్డంవల్ల లాభం ఏంది చెప్పు. ఇప్పుడు నీ బాధను చూసి నేను కాదనకుండా నా మోటారు నీళ్లను యిస్తానే అనుకో. నువ్వు పారగొట్టు కుంటావు. బయటపడతావు. అబ్బా అంటే ఏ యాభై మూటలో సెనిక్కాయలైతాయి. దాంతో నీవు నా బామ్మర్ది దగ్గర చేసిన అప్పు తీర్చడానికే సరిపోతుంది.

మల్లా పంటేస్తావ్. ఇప్పుడు పడని వర్షాలు అప్పుడు మాత్రం పడతాయా. అప్పుడు నువ్వు మల్లా నా దగ్గర కొస్తావ్. నీకు ఇక చుట్టుపక్కల నీళ్లున్న బూములు ఎవరివీ లేవు. ఎందుకొచ్చిన కష్టాలు చెప్పు. నీకున్న పొలానికి వెలకడదాం. పెద్ద మనుషులతో కూర్చొని పంచాయతీ పెడతాం. నా బామ్మర్ది అప్పుపోను నీకెంతొస్తే అంత నేనిస్తా. బాండు మీద సంతకాలు పడడమే ఆలస్యం.

లేదు నా సావు నేను సస్తానంటావా. నా బామ్మర్దిగానికి చెప్పినా. వాడు ఇంగ నీకు ఒక్కపైసా కూడా అప్పివ్వడు. పైగా ఉన్న బాకీ ఎట్టైగైనా ఇప్పుడే కట్టమంటాడు. ఇంగ ఇంతకన్నా మంచిగా నీకు చెప్పేటోళ్ళు లేరు. నీ కోసమే చెప్తాండా. నా మాటిని ఇంటికెళ్ళి బాగా ఆలోసించుకో. యా మాట మల్లా నాకు వారంలో చెప్పాలా. ఆ తర్వాత నీ పొలాన్ని ఉత్త పుణ్యానికే ఇస్తానన్నా నేను తీసుకోను. ఇది గుడా ముందే చెప్తాండా.''

రజాక్‌మియాకు గుండెలో పిడుగు పడ్డట్టయ్యింది. యింత విషం దాసుకొని బావ, బావమరుదులు నాటకమాడతాండారా. యింత కుట్ర పెట్టుకొని మధురెడ్డి తనకు నూకల మూటె ఇప్పిస్తాన్నాడా. పోయిపోయి తురుకోని బూమ్మీద వాళ్ల కన్ను

పడిందా. ఇంగెట్ట చేసేది దేవుడా! ముఖమంతా నల్లగా చేసుకొని రజాక్‌మియా అక్కడ్నుంచి ఇంటి దారి పట్టాడు. ఇక తన పరిస్థితి పిల్లి నోటికి చిక్కిన ఎలకలా అయిపోయింది. పొద్దన ఆ గొర్లోల్ల అంజిగాడన్నట్లు అతనిక ఊరిడ్సాల్సిందే. దుబాయికి, కోయిటుకు కాదు. ఏ బాయిలోనన్నా దూకి కాటికి పోవాల్సిందే.

నీళ్లు లేవని, ఎందుకూ పనికీరాదని, ఏవేవో సాకులు పెట్టి, నన్ను ఇరుకులో నెట్టి ఏ అనాపైసాకో భూమిని బేరం చేసి అప్పులోకే సరిపోయిందంటే ఏంటి పరిస్థితి. కాగితాలపై సంతకాలు చేసేసి ఒట్టి చేతల్తో తిరిగి రావాల్సిందేనా. మా నాయన సంపాదించింది నా పిల్లలకు ప్రాప్తం లేదా.

నడుసుకుంటా నాలుగు రోడ్ల కూడలిలోకి వచ్చాడు రజాక్‌మియా. అక్కడ ఒక్కటే జనం. అంతా డాక్టర్ బాష హాస్పిటల్లోకి పరుగెత్తుతున్నారు.

"నంది మండలం కాడ యాక్సిడెంట్ అయ్యిందంటా. సాయిబూలాయమ ఎవరో ట్యాక్సీ నుంచి కింద పడిపోయిందంటా. నెత్తంతా ఒక పక్క చీలిపోయింది. చూల్లేకున్నాం సామి"

ఆ వార్త వినగానే రజాక్‌మియాకు మనసంతా మరింత చేదైపోయింది. హాస్పిటల్లోకి వెళ్లాలనుకొని మల్లా వెనక్కు వచ్చాడు. తను కూడా రేపో మాపో అలా కాకపోతే ఇంకోలా... అనుకుంటూ మెల్లగా ఇంటి వైపుకు అడుగులు వేస్తున్నాడు.

దారిలో జనం మాటలు అతని చెవుల్లో పడుతూనే వున్నాయి.

"పనికి పోయి సాయంత్రం తిరిగొచ్చేటప్పుడు ట్యాక్సీలో స్థలం లేదంటా. మొగోళ్లంతా పైకెక్కినారు. ఆడోళ్లందరూ ముందే ఎక్కి కూర్చున్నారు. ఇంకా కొందరు ఆడోళ్లు డోర్లో కడ్డీలు పట్టుకొని యాలాడుతాండారంటా. ఈ సాయిబులాయమ కూడా యాలబడిందంటా.

యిళ్ళకు దుప్పట్లుంటాయి కదా అంటిపెట్టుకొని యాడికిపోయినా. ఆడికి ఒకాయమ అనిందంటా. దుప్పటి నా చేతికిచ్చేయమ్మా అని. ఆమె వినలేదంటా. అట్టనే యాలబడుకోనుంది. ట్యాక్సీ జోరందుకున్నాక దుప్పటి గాలికి బోతాండాదని రెండు చేతులు వదిలేసిందంటా. ఇంగేముండాది.

నెత్తంతా రక్తం. 'వాయమ్మ! పడిపాయనే' అంటా కూలోల్లంతా అరుపులు, కేకలు పెట్టేసరికి ట్యాక్సీ అరకిలో మీటరు దూరం వెళ్లి ఆగిందంట. కొనూపిరిలో ఉంటే కూలోళ్లు తలా ఒక చెయ్యి వేసి ఆ యమను బాష హాస్పిటల్‌కు తీసుకొచ్చి నారు. అప్పటికే సచ్చిపోయింది."

ఇంటికొచ్చాడు రజాక్‌మియా, ఏవేవో ఆలోచనలు అతని మనసును తొలిచేస్తున్నాయి. అతని ఎడమ కన్ను అదురుతాండాది. వాతావరణం చూస్తుంటే రజాక్ మియా క్కూడా ఏదో అనుమానం వస్తోంది. రజాక్‌మియా దర్గా పటాలున్న గూడు పక్కకు దృష్టి సారించాడు. అక్కడేదో వెలితి కనిపించింది.

"ఒరే షాబీరా!" అంటా గట్టిగా  అరిచాడు.

"ఏంది నాయనా," అంటూ షాబీర్ ఉలిక్కిపడ్డాడు.

"యీడ సంచిలో నూకలుండాల్నే ఏమయ్యాయిరా..."

"ఇంగా యాడియబ్బా. రాత్రే అయిపాయనే."

"అప్పుడే ఎట్టా అయిపోతాయిరా... నిన్ననే కదరా చూస్తాండాను. ఇంగా రెండ్రోజులొచ్చాయని కూడా అనుకుంటే."

"రేతిరి సిన్నమ్మోళ్ళు వొచ్చిండ్లేదేమబ్బా. వోళ్లకు వొండి పెట్టింది అమ్మ."

"ఇంతకీ నీ అమ్మేదిరా" దాదాపు ఏడుస్తున్న గొంతుతో అన్నాడు రజాక్ మియా. అతనిలో ఏదో చిరాకు. అసహనం. దుఃఖం.

"మగోళ్లెవరూ ఉండరు. అందరూ ఆడోళ్లే అని, ఏ రోజు లెక్క ఆ రోజే ఇచ్చేస్తారని గుట్టమీద మల్లమ్మ ఒగటేమైన బంగపోతాంటే ట్యాక్సీలో నంది మండలానికి పనికి బోయిందబ్బా..." షాబీర్ యింగా ఏదో చెబుతుండగానే రజాక్‌మియా కుప్పకూలి పోయాడు.

*ప్రస్థానం, అక్టోబర్-డిసెంబర్ 2003*
*కథాప్రస్థానం, 2004*
*వతన్- ముస్లిం కథా సంకలనం, 2004*

# అయ్యవారి చదువు

"చదువుకోవడమంటే నాకు చాలా భయమేసేది తెలుసా?" అన్నాను అతనిలో ఉత్కంఠ కలిగిస్తూ.

"ఎందుకు...?" అన్నాడు ఆ పిల్లాడు.

"ఇంటి దగ్గరికి నిత్యం అప్పులవాళ్లు తిరిగేవాళ్లు. మా అమ్మా నాయన మాత్రం నన్ను క్షణం కూడా ఇల్లు వదిలి వెళ్లనిచ్చే వాళ్లు కాదు. ఎప్పుడూ ఇంటి ముందు వసారాలో కూర్చుని పుస్తకం తిరగేస్తూ వుండేవాడిని.

అప్పులోళ్లు వచ్చి "మీ నాయన ఏడీబ్బీ..." అని అడిగేటోళ్లు... వాళ్లకు సమాధానం చెప్పుకోలేక చచ్చేటోణ్ని... ఒకరోజు...

❄

"బీ... మీ నాయనుండాడా..." అనే మాటకు తలెత్తి చూశాను.

ఎదురుగా మల్లారెడ్డి. గబగబా పుస్తకం పక్కన పడేసి వినయంగా అతని బైకు దగ్గరికిపోయి "లేడన్నా...సేనికాడికి పోయినాడు... సాయింత్రమొస్తాడు..." అన్నాను.

"నేను వచ్చిన్నానని చెప్పు..."

"సరేన్నా...!"

అతను వెళ్లిపోయినాడు. మళ్లీ పుస్తకం దగ్గరికొచ్చి కూర్చున్నాను. మనసంతా దిగులు ముసిరింది. మల్లారెడ్డి ఎందుకు వచ్చినాడో నాకు బాగా తెలుసు. అతను వడ్డీకి లెక్క తిప్పుతాడు. నాయన అప్పు తెచ్చింటాడు... అందుకే వచ్చినాడు. ఇప్పుడు ఇంట్లో లెక్క ఉండాదా అంటే లేదు. మరెట్ట తీరుస్తాడు నాయన అప్పు...? ఏమో...? నేను బాగా సంపాదించాలి. ఇంటి కష్టాలు తీర్చాలి. చదువు మానేసైనా ఏదైనా పనిచేయాలి. దిగు వీధిలోని చంటిగాడి మాదిరి ఎర్రగుంట్ల సిమెంటు ఫ్యాక్టరీలో నైనా చేరాలి- లేదు లేదు చదువుకోవాలి. చదువు మానేయకూడదు. మన్నే నాయన ఎంత కష్టపడి ఇంటర్ ఫీజు కట్టాడు?

మా నాయన నా ఫీజుకోసం పడ్డ కష్టాలన్నీ గుర్తుకు వచ్చాయి. దిబ్బలో ఎరువు అమ్మేశాడు నాయన. ఈసారి యాడైనా పెట్టుబడి దొరికితే సేన్లో పంట పెట్టేముందు ఆ ఎరువు సల్లాలనుకున్నాడు. రైతన్నోడు ఎవడూ, పొలమున్నోడు ఎవ్వడూ దిబ్బలో ఎరువు అమ్ముకోడు. మా నాయన అమ్మాడు. నా కోసం అమ్మాడు. నా చదువుకోసం అమ్మాడు. ఇప్పుడు చదువు మానేస్తే... డబ్బులన్నీ వేస్టయిపోతాయి. సంవత్సరమంతా పడ్డ కష్టమంతా వృథా అయిపోతుంది. నాకు నేను కర్తవ్యాన్ని బోధించుకున్నాను. ముందు ఆలోచనలు కట్టిపెట్టి క్వశ్చన్ బ్యాంక్‌లోని ప్రశ్న బట్టీ కొట్టాలనే ఆలోచనకు వచ్చాను.

మళ్లీ పుస్తకంలో తల దూర్చాను. లీనమైపోయాను. మొదటి పేరా పూర్తి చేశాను. ఇంకొంచెం కష్టపడితే రెండోపేరా అయిపోతుంది. అంతలో...

"బాబూ... మీ నాయన... ఉండాడా..." అన్న కేక.

తలెత్తాను.

'గొళ్లోళ్ల మల్లమ్మ'

"లేడుగదమ్మా... సేనికాడికి పోయినాడు... సాయింత్రమొస్తాడు. వచ్చానే చెబుతాలే... నువ్వొచ్చిపోయినావని..." అన్నాను.

"చెప్పుబ్బీ... పనిచేయించుకున్నాక కూలోళ్లు లెక్కకు ఇన్నాళ్లు ఉంటారా... ఏ పూటకాపూట తెచ్చుకుని తినేటోళ్లు. పేదోళ్లు. మర్నాడు శుక్కురారం. సంత, రేపు సాయింత్రం వచ్చా... లెక్క ఇంట్లో ఇచ్చేసి పొమ్మను..." అందామె.

"సరే..." అన్నాను.

ఆమె వెళ్లిపోయింది.

మళ్లీ పుస్తకంతో కుస్తీకి సిద్ధమయ్యాను. రెండో పేరాలో రెండు లైన్లు బట్టీ కొట్టాను. ముందు నేర్చుకుంది గుర్తుందో లేదోనని మళ్లీ ఒకసారి పరీక్షించు కుంటుండగా -

"అమ్మా... రొంత అన్నముంటే పెట్టండమ్మా..." అన్న కేక. కోపం నశాలాని కెక్కింది. కాసేపు కూడా చదువుకోనివ్వరు. అసలు నేను ఇంటి ముందు మంచం వేసుకుని చదువుకోవడానికి కూర్చోవడమే శానాతప్పు. లక్ష్మణ్ వాళ్లింటికైనా వెళ్లి, వాళ్లింటిపైన అన్నా కూర్చుని చదువుకుంటే బాగుంటుంది.

"ఏం లేదుపో... పెద్దాయన..." అని కసురుకున్నాను.

వాడు మళ్లీ అదే అరుపు అరిచాడు. ఒట్టి చేతల్తో వెళ్లడానికి నసిగాడు.

"ఒక్కసారి లేదన్నాక అయిపాయ... ఇనేసి వెళ్లిపోవాల... నేనీడ సదూకుంటాండా గదా... నువ్వాడ దీర్ఘాలు దీచ్చాంటే ఎట్టా...?" అన్నాను చిరాగ్గా. ఇక తప్ప దనుకున్నాడేమో... ముష్టోడు భారంగా కదిలి ఇంటిముందు నుంచి వెళ్లి పోయాడు. వాడు పక్కింటి ముందు అరుస్తున్నాడు. నా ఇంటిముందైతే లేదని చెప్పి వెళ్లగొట్టాను కానీ పక్కింటి ముందు నుంచి వెళ్లగొట్టే హక్కు నాకెక్కడిది?- అదే ఆలోచించి ఊరుకున్నాను

పక్కింట్లో ఉండేది పాలాయమ. దాదాపు ఆమె ఏరోజు ఎవ్వరికీ దానం చేయదు. ఆరోజెందుకో ఇంట్లో అన్నం మిగిలిందేమో... ముష్టోడికి వేసింది. ఆ గాజుల శబ్దం మంచం పై కూర్చున్న నాకు బాగా వినిపిస్తోంది. కానీ తలపైకెత్తి చూడ లేదు. ఆ ముష్టివాడు అలాగే అరుచుకుంటూ వెళ్లిపోయాడు. పద్దన పరీక్ష ఉన్న విషయం గుర్తుకు తెచ్చుకుని మళ్లీ చదవడం మొదలుపెట్టాను. కానీ ముందు న్నంత శ్రద్ధ ఇప్పుడు లేకుండాపోయింది. నాకేదో ముళ్ల మీద కూర్చుని చదువు కుంటున్నట్లుగా ఉంది. అర్జంటుగా స్థలం మార్చాలన్న ఆలోచన వచ్చింది. అమ్మో... ఇంటికాడ ఎవరూ లేరే...?

"పిల్లోణ్ణి గన్నా సుగంలా. ఏందన్నా అవసరమొచ్చే ప్రతి సిన్నపనికి నేనే కాళ్లీడ్చు కుంటా సిన్నపిల్లదాని మాదిరి తిరగాల. వీధిలో మూచ్చాండారు. చేతికొచ్చిన పిల్లోణ్ని ఇంట్లో పెట్టుకుని ఎందుకు నువ్వు అట్ట తిరుగుతాండావే... అని. ఇంటికాడుండి సదూకుంటేనేమి... వీధులంబడీ తిరక్కుండా..

ఒక బిందె నీళ్లు గావాలన్నా... కూర్లోకి ఉప్పు, మెరపగాయ లేకపోయినా, సివరికి పానం పోకండా మాత్రలోకి టీ తెచ్చుకోవాలన్నా ఇంటికాడ... ఒక్క నిమిషం సావడు..."- అమ్మ ఎత్తుకునే తిట్ల పారాయణం గుర్తుకు వచ్చింది.

ఇష్టం లేకపోయినా అయిష్టంగా ఉన్న మనసును అధీనంలోకి తెచ్చుకుని అక్కడే కూర్చోని చదవడం మొదలుపెట్టాను. మొదటిపేరా మరోసారి వల్లెవేసి రెండో పేరా కంప్లీట్ చేశాను.

❊

టయం నాలుగవుతాంది. నాయన సేనికాంచి వస్తాడు. వస్తానే బండి విప్పి ఎద్ద లకు కడుగునీళ్లు పెట్టమంటాడు. వామికాంచి వరిగెడ్డి కొంత... చనిక్కట్టె కొంత జొల్లలో తీసుకొచ్చి గొడ్లకు వెయ్యాలి. దొడ్లోకెళ్లి కాళ్లూ ముఖం కడుక్కోనొచ్చిన నాయన 'తొట్లో నీళ్లు అయిపోయినాయి కదరా... రెండు బిందెలు తీసుకురాపో... పద్దనాంచి ఎట్ల పొద్దు పోతాందిరా... నీకు...' అంటాడు.

బోరింగ్ దగ్గరికెళ్లాలి. నీళ్లు తేవాలి. తర్వాత అమ్మ ఆ రాత్రి ఇంట్లోకి 'అవి లేవు... ఇవిలేవు...' అంటుంది.

నాయన రొంజుకుంటా పది కాగితమో ఐదు కాగితమో చొక్కా వెనక జేబు లోంచి తీసి చేతికిస్తాడు. నేను తేవాలి. తర్వాత నాయనకు మంచం పరిచి బొంత వెయ్యాలి. దోమతెర పట్టాలి. ఇన్నీ చేశాలుకు పొద్దు గునుకుతాది. బుడ్డి ఉండేది ఒక్కటే ఇంట్లో.

శానారోజుల్నుంచి అనుకుంటున్నాను. నా కోసం సపరేటుగా ఒక బుడ్డి తయారుచేసుకోవాలని. వీలుపడటంలా. రాత్రిళ్లు సదువుకోనీకి వీలులాకుండా ఉంది.

బుడ్డికి చిన్న సీసా కావాలి. సీసా మూతకి బొరక పెట్టాలి. ఒత్తి తొడగాలి. అమ్మనో, నాయన్నో అడిగి రూపాయిప్పించుకోవాలి. బుడ్డిలో కిరసనాయిలు పోసి ముట్టించాలి. తర్వాత హాయిగా ఒక మూల కూర్చుని చదువుకోవాలి. అది కలగానే మిగిలిపోతోంది.

అమ్మనడిగితే రూపాయ్యివ్వదు. 'ఆడోళ్ల దగ్గర లెక్కలు ఎట్లొచ్చాయిరా... నేన్నీ కోసం లంజరికం జేయాల... అబ్బుడ్నొదిలి నా దగ్గర అడగటానికి సిగ్గన్నా ఉండాల...' అంటాది. ఏమిచ్చినా నాయనే ఇయ్యాల. అయితే సీసా దొరకడంలా. అంతకుముందు నాకు సుస్తీ చేసినప్పుడు కడప డాక్టరు టానిక్కు రాయిచ్చినాడు. ఆ సీసా కూడా కనబడ్డంలా. ఎక్కడున్నాదో. ఇళ్లంతా వెతికినా. ఇప్పుడున్న పలంగా సీసా కావాలని ఎవుర్ని అడగాలో అర్థం గావడంలా.

ఉన్న ఒక్క బుడ్డి అమ్మ ఇంట్లో కోళ్లు మూయడానికి, నాయనకు అన్నం పెట్టడానికి వాడుతుంది. సివరగా "సిన్నోడా... అన్నం తిందూరా... తొర్వాత పెట్టమన్న

పెట్టను...'' అంటాది. తింటా. తొమ్మిదవుతాది. కళ్లు మూతలు పడతాయి. అంతా పక్కలేస్తారు. నేను ఓపిక చేసుకుని చదూకుందామంటే 'పొద్దన్నాంచి గాడుదులు కాసి నా కొడుకు ఇప్పుడు సదువుకోవడానికి కూచుంటానాడు... కిరసనాయిలు అయి పోగొట్టనీకి...' అని అమ్మ వొదురు... ఏమనలాకా ఏడ్సుకుంటా మంచమెక్కడం నా డ్యూటీ. ఇయన్నీ గుర్తుకొచ్చాలుకు వొళ్లు గగుర్పొడిచింది. టకటకా పుస్తకం చూసి చదవడం మొదలుపెట్టినాను. ఎట్టతిరిగి నాయన వచ్చేలోపు ఆ క్వశ్చన్ అయిపో జెయ్యాలనుకుని. కానీ ఏం లాభం. నిరాశే ఎదురైంది.

❊

'ఓబ్బా... ఓబ్బా...' అంటా నాయనా ఎద్దుల పగ్గాలు లాగి ఇంటిముందు బండి నిలబెట్టినాడు.

తిడతాడని గబగబా పొయ్యి బండిని ఒక వారగా పోనిచ్చి ఎద్దులిప్పినాను. వాటిని కొట్టం దగ్గరికి తీసుకపొయ్యి గాట్లో కట్టేసినాను. ఇంట్లో పగిలిపోయిన బిందెలో ఏసిన కచ్చు తీసుకొచ్చి పాత బకెట్లో పోసి ఎద్దుల ముందుంచినాను. నాయన చెప్పందే బోరింగ్ కాడికి పోయి టకటకా రెండు బిందెలు నీళ్లు తెచ్చినాను. అన్ని పనులూ ముగించుకునే సరికి సీకటిపడింది. మనసంతా దిగులు ముసిరింది. నాయన అన్నం తిని బయటికొచ్చాక అమ్మ నన్ను పిలిచింది. వెళ్లి బుడ్డి దగ్గర కూర్చున్నాను. దానికల్లే తీక్షణంగా చూస్తున్నాను. అమ్మ సంగటి, ఒట్టి కారం తీసు కొచ్చింది. చూడగానే నీళ్లూరాయి.

'కాల్తాంది. నిదానంగా తిను...' అంది అమ్మ. నాకు దిగులంతా పొయ్యి తిండి మీదికి ధ్యాస మళ్లింది. నా ముద్ద నేను తిని లేచేసరికి వళ్లంతా చెమట పట్టింది. తొరగా బయటికొచ్చి గాలికి నిలబడాలనే ఆత్రం పెరిగింది. చెయ్యి కడుక్కో వడమే ఆలస్యం తల్లైకాంచి గబిక్కిన లేసి బయటికి రాబోయినాను. కానీ కాలికి బుడ్డి తగిలింది. అది టబుక్కుమని కిందపడింది. కిరసనాయిలు బండల మీద పాకింది. అమ్మ లోపల ఎంగిలిగిన్నెలు కడుక్కుంటోంది. ఉన్నట్టుండి ఇంట్లో మంట పెద్దదయ్యేసరికి అమ్మ గుండెలు నీళ్లయిపోయినాయి. పరిగెత్తుకుంటూ వచ్చింది. నేలపాలైన కిరసనాయిలును చూసి వీపున ఒక గుద్దు గుద్దింది.

బుడ్డి కిందపడ్డమే ఆలస్యం నేను భయంభయంగానే దాన్ని లేవనెత్తి యధా ప్రకారంగా పెట్టాను. చుట్టూ ఉన్న మంటలను ఆర్పేసినాను. అమ్మ కొట్టిన దెబ్బకి కడుపులోంచి ఏడుపు తన్నుకొచ్చింది. తిన్న అన్నం వంటపట్టదని దిగమింగు కున్నాను.

'సాయింత్రమే వేసుకొస్తున్నాను. రూపాయిన్నరది కిరసనాయిలు. అబ్బుడ్నే పొట్టన పెట్టుకున్నావు...' అంటూ అమ్మ బుడ్డికున్న మూత సర్దబోయింది. కాలిం దేమో మరో దెబ్బ కొట్టబోయింది. పెరిగెత్తుకుంటూ బయటికొచ్చేసినాను. నేనింత వరకు గబగబా పనులు చేసిందీ... మా అమ్మ దగ్గర ముదిగారంగా 'ఓమ్మా...పొద్దన పరీచ్చ ఉంది. కాసేపు బుడ్డిపెట్టుకుని సదువుకుంటానే...' అని అడగటానికి. నిండుగా ఉన్న కిరసనాయిలు నా కాలిదెబ్బకు సగం అయిపోయింది. మళ్లీ ఏ ముఖం పెట్టుకుని బుడ్డి దగ్గర కూర్చుని సదువుకోను. మా అమ్మను అడిగి మనసు కరిగించను.

'నా ఖర్మ...!' అనుకున్నాను. ఇంగా నయం సీసా పగిలిపోలేదు. ఇంగా గిన్నెలు కడగాల్సినవి బోలెడున్నాయి ఇంట్లో. మబ్బులో కడుక్కోలేక మా అమ్మ రాగమెత్తుకునేది. గొడవ పెద్దదైపోయేది. మా నాయన గుడక నాలుగు తగిలించే టోడు. అన్నం తిన్న వెంటనే మా నాయన షఫీ వాళ్ల అంగడికి పోయి ఆడ్నే మాటలు పెట్టుకుని కూచోనుండాడు. నాకు ఎంత వద్దనుకున్నా ఏడుపు వచ్చేసింది. 'ఇప్పు డెట్లా..? సదువుకోలేదే... పద్దన పరీక్ష ఉందే...!' ఆలోచనల్లో మునిగిపోయి ఏడ్సు కుంటా గత్యంతరం లేక మంచమెక్కినాను...

❄

ఇంగ కథ ఇంతటితో ఆపేస్తాననుకున్నాడేమో ఆ పిల్లాడు 'ఆ తర్వాత...?' అన్నాడు ఆత్రంగా. అతని శ్రద్ధకు నాకు అబ్బురమేసింది. ''తర్వాత ఏముంది...? ఇన్ని కష్టాల మధ్య నాకు మళ్లొకసారి చదువుమీద విరక్తి కలిగింది... నాకు చదువు కోవాలనిపించలేదు. చదువు మానేయాలనుకున్నాను... కానీ ఆరోజు రాత్రి...'' అంటూ మళ్లీ కథలోకి వెళ్లాను. ఆ పిల్లాడు అంతే శ్రద్ధగా వింటున్నాడు. ''ఆరోజు రాత్రి... నాకు ఎంతసేపటికీ నిద్రపట్టలేదు. బాగా పొద్దుపోయాక అమ్మ, నాయన్ను వెతుక్కుంటూ షఫీ వాళ్ల అంగడికాడికి పోయింది. ఆడ ఎంకార్రెడ్డి ఉన్నాడు.

ఎంకార్రెడ్డి అంటే మా పక్కవీధిలో ఉండే మనిషి. నాయన ఆయనక్కూడా లెక్క బాకీ ఉండాడు. ఎంకార్రెడ్డి ముందూ వెనక సూడకుండా నాయన్ను అప్పు అడిగాడు. నాయనకు ఏం చెప్పాలో తోచలా...! తోచక తన బాధనే బయట పెట్టాడు...

''రెడ్డీ... నీకు తెలీందేముండాది... సేన్లో ఏం పండకపోయినా ఆడికిపోయి తల దాసుకుంటాండ... పరువు కాపాడుకుంటాండా... ఏ పని లేకపోయినా ఊరికే ఎద్దల్ని మేపుకుని వచ్చాండా...ఇంటికాడుంటే... అప్పులోళ్లు అడగతారని దాంకోని

తిరగతాండాననుకో... సేనికోసమే అప్పు సేసినా... ఇప్పుడు ఆ సేనికాడికే ఎళ్లి దాక్కుం టాండా...! ఆసేనా?... దూరం... ఆ సేనికాడికి ఎవురూ రాలేరని ధైర్నం- ఇంకా ఆడిగ్గూడా అప్పు లోళ్లు వచ్చినాపొద్దు ఆ కష్టాలేదో నేను పడుకుంటా.

కానీ రెడ్డీ... సిన్నప్పుడు కలసిమెలసి తిరిగినోళ్లం... మా ఇంట్లో పండక్కి మీరు- మీ ఇంట్లో పండక్కి మేము తిన్నోళ్లం... నిన్ను చూసి కూడా నేను దాక్కోలేను రెడ్డీ... అందుకే చెప్తాండా.. నీ అప్పు అణాపైసాతో సహా తీరుస్తా... కొన్నాళ్లు ఓపికపట్టు రెడ్డీ. ముందు నా బిడ్డ సదువు కాపాడుకోవాల.సేను ఎలాగో బొందుబోయింది వాడి సదువు మాత్రం బొందుబోకూడదు రెడ్డీ.

మా వోడా..బంగారం రెడ్డీ... మట్టిలో మాణిక్యం...ఎన్ని పనులన్నా చెప్పు- లేదనకుండా జేచ్చాడు బిడ్డా... మల్లా వాడి టయానికేమో వాడు సదువుకోని రెడీ అయిపోతాడు. మాకే ఉసిల్యాక వాడికి సరైన సౌకర్యాలు కల్పించలేకపోతాండాం రెడ్డీ... లేకపోతే నా బిడ్డ స్టేటు ఫస్టు వస్తాడు... స్టేటు ఫస్టు...'' రేతిరి కావడంతో ఆ మాటలు నా చెవుల్లో పూసగుచ్చినట్టు వొచ్చి పడతాండాయి. నిజమైన ఏడుపు నాకు అప్పుడు మొదలైంది. కళ్లలో నీళ్లు కట్టలు తెంచుకున్నాయి. ఆ క్షణమే నాకు తెల్లా రితే బాగుండు అనిపించింది. ఎప్పుడెప్పుడు తెల్లారుతుందా అని ఎదురుచూస్తూ గడిపాను.

❉

తెల్లారింది. సూర్యకిరణాలు అప్పుడప్పుడే నేలను తాకుతాండాయి. దొడ్లో కూర్చొని పూనకం వచ్చినోని మాదిరి సదువుతున్నాను. మా ఇంట్లో కష్టాలు తల్చు కుని సదువుతున్నాను. మా నాయన అగచాట్లు తల్చుకుని చదువుతున్నాను.. గట్టిగా గుండెలు పగిలేలా చదువుతున్నాను. గొంతుకు దుఃఖం అడ్డు పడుతుంటే చదువుతున్నాను.

❉

“ఆ తర్వాత...'' అని ఆ పిల్లాడు అడగలేదు. భారంగా నిట్టూర్చి అక్కడ్నుంచి వెళ్లిపోయాడు. ఆ తర్వాత కథ ఆ పిల్లాడికి అర్థమైనట్టుంది. ఎందుకంటే ఇప్పుడు నేను అతనికి అయ్యవారిని.

*ఆదివారం వార్త, 11 నవంబర్ 2007*
*నవతరం కథ, 2008*
*టీచర్ కథ-కమామిషు-ఆగస్టు 2012*

# జీపొచ్చింది

మిట్టమధ్యాహ్నం ఒంటి గంటయ్యింది. మూడెకరాల నల్లరేగడి నేల నీళ్లు లేక మలమలమాడిపోతోంది. దొంగపూత కొచ్చిన శెనిక్కాయ చెట్లు మెలి గుడ్లేసుకుంటు న్నాయి. పొలంవారగా ఉన్న ఒక చిన్న స్టార్టరు పెట్టె ఎండకు చరచరా కాలిపోతూ గుయ్యిమని శబ్దంచేస్తూ... ఉన్నాయా లేవా అన్నట్టున్న బోరుపైపులోని నీళ్లను బయటకు లాగుతోంది. బయటికొచ్చిన నీళ్లు సన్నగా కారి కాలువలో పడి తాబేల్లా పాకుతున్నాయి. కాలువ్వార చెట్లన్నీ సల్లగా పచ్చదనాన్ని పులుముకోనున్నాయి.

'పొలమంతా అలా అయ్యేదెప్పుడు?' వందోసారి అనుకున్నాడు వెంకట్రెడ్డి. కాళ్లు కాలకుండా అతను కాలువలో నిలబడుకున్నాడు. నెత్తికి తడి టవాల చుట్టు కున్నాడు. చేతిలో పార.

అతని మనసంతా అదోలా ఉంది. ఒకవైపు ఎండుతున్న పంట. మరోవైపు బోరులోంచి వస్తున్న ఒంటేలు ధారలాంటి నీరు.

దానికి తోడు పోతూ వస్తున్న కరెంటు.

ఆ రొన్ని నీళ్లతో కాలవ పారేదానికే గంట పడుతుంది. ఇక పంటెప్పుడు తడుపుకోవాలి?

వెంకట్రెడ్డి మనసులో అనుకుంటుండగానే తుస్సుమంటా కరెంటుపోయింది. ఆడుతున్న స్టార్టరు కాస్తా ఆగిపోయింది. బోరుపైపులోంచి వచ్చే ఆ కొద్దినీళ్లు ఆగి పోయాయి.

"థూ... దీనెమ్మె..." తిట్టుకున్నాడు వెంకట్రెడ్డి. యింక ఒక్క నిమిషం కూడా అతనికి పొలంలో ఉండబుద్ధి కాలేదు. కడుపులో చరచరమని కాలుతున్నా తెచ్చు కున్న అన్నం తినబుద్ధి కావడంలేదు. పయ్యంతా అలసటగా ఉండడం వల్లనేమో ఇంటికెళ్లి కాసేపు సల్లగా పడుకుందామనిపించింది. తెచ్చుకొన్న సద్దిని ఎనక్కి తీసు కొని, పోయిన కరెంటును తిట్టుకుంటా మెల్లగా కాలిదావ పట్టి ఊర్లోకొచ్చాడు.

కాళ్లీడ్చుకుంటా అంతదూరం నుంచి ఊరికి చేరేసరికి ఆడంత గోలగోలగా వుంది.

"ఏందిరా వెంకట్రెడ్డి ఇంకా ఇక్కడే ఉండావు. ఉరికెత్తురా... పొలాల్లోకి కరెంటోలెల్నారు. కరెంటోళ్ల జీపెల్లింది. ఉరికి స్టాటరు పెట్టె దాసుకోపో... ఉరుకూ" వెంకట్రెడ్డిని చూసి మల్లన్న అరిచాడు.

వెంకట్రెడ్డికి మొదట అర్థం కాలేదు. అర్థం అయ్యాక గుండె జారిపోయింది. కరెంటు మామూలుగా పోలేదు, కరెంటోళ్లే లైన్ ఆఫ్ చేసి పొలాల మీద పడ్డారని తెలిశాక వళ్లంతా చమట పట్టింది.

ఊర్లో సగంమందికి పైగా కరెంటు బిల్లులు కట్టని, కట్టలేని రైతులే. అందరూ ఎక్కడోళ్లక్కడ పరిగెత్తుతున్నారు. కంగారు కంగారుగా హడావుడి పడుతున్నారు.

వెంకట్రెడ్డికి ఏం చేయాలో తోచలేదు. అట్నుంచే అటే ఎనక్కి పరుగందు కున్నాడు. చేతిలో సద్ది ఎప్పుడో నేలకూలింది. కడుపులో ఆకలి, నీరసం. అయినా అతనికి కళ్లు మూసినా తెరిసినా పొలంలో ఒంటరిగా వున్న స్టార్టరు పెట్టే కనిపిస్తోంది. స్టార్టరిప్పుడు అతనికి ప్రాణం. అది లేకుంటే అతనికి నిజంగానే బతుకులేదు. అదుంటేనే బోర్లో ఉన్న ఆ కొద్దినీళ్లైనా బయటకొస్తాయి- సగం పంటైనా బతుకు తుంది.

"ఒరె దేవుడా! నేనెళ్లేలోపల కరెంటోళ్లు నా పొలంకాడికి రాకుండా చూడు సోమి. వాళ్లొచ్చేలోపల నేనెళ్లి నా స్టాటరు దాచుకుంటా" మనసులో ప్రార్థించు కున్నాడు వెంకట్రెడ్డి.

అంతలోనే అతడికి స్టార్టరు పెట్టెకున్న అతుకులు గుర్తొచ్చాయి.

“స్టాటరూడదీసెటప్పుడు జాగ్రెత్తగా ఉండాలా... అసలే ఫీజు గడ్డలు పగిలి పోయి ఉండాయి. ఫీజుకడ్డీ పాడూ తగిలితే పాణానికే సేటు. పాణం పోయినా పరవాలా. ఇప్పుడుగన కరెంటు తగిలి కాలో, సేయో పడిపోతే దిక్కెవరు? అప్పు లెవరు తీరుస్తారు? దప్పికై ఉన్న పైరుకు నీళ్లెవరు పారగొడతారు?”

వెంకట్రెడ్డికి అతడి భార్య గంగాదేవి గుర్తుకొచ్చింది.

“పని విషయంలో గంగాదేవిని ఆడమనిషి అనుకోకూడదు. కొంగు బిగించి పని లోకి దిగితే పదిమంది పని ఒక్కతే సులబంగా చేసేయగలదు... కానీ అది ఇప్పుడు సన్నబిడ్డ తల్లే” మనసులో అనుకున్నాడు.

“అయినా ఇప్పుడు కరెంట్లేదుగా” మళ్లీ వెంకట్రెడ్డి ఆలోచనలు పొలం మీదికి మళ్లాయి.

“ఏమో ఉండొచ్చేమో? మన ఖరమ. కరెంటు లాకపోతే స్టాటరు పెట్టెలు పెరికేసి మూడు నిమిసాల్లో దాసేస్తామని కరెంటోళ్లు మళ్లీ కరెంటు వదలనైనా వది లిండొచ్చు. మన జాగ్రెత్తలో మనముండాల. మన్నట్టనే కదా పక్కపొలం సంటి గాడు పాణాలు పోగొట్టుకుంది. పొలాల్లోకి వస్తున్న సొసైటోళ్ల జీపు చూసి కరెంటోళ్ల జీపను కొని బిత్తరపోయినాడు. ఎట్టరా దేవుడా చేసేదని సచ్చా బతుకుతా పోయి మోటారు ఆడతండంగానే స్టార్టర్ పెట్టెను పట్టుకొని పెరికినాడు. పీజులూడబీకలేదు. అసలే నాసిరకం వైర్లాయా. యాడ చూసినా అతుకులే. గుడ్డపీలికలు కూడా సుట్టుకోలేక పోయినాడు నాయాళ్లు. కరెంటు తగిలి ఆడికాడే గొంతు కోసిన కోడిలాగా గిలగిలా కొట్టుకొని పాణాలు వొదిలేసినాడు. ఇంటి దిక్కుపోతే వాడి పెళ్లాం పిల్లల్లో ఒకటే బాధ. ఇప్పటిక్కూడా నెత్తి నోరు కొట్టుకుంటున్నారు. ఒకవేళ నేనెళ్లేసరికి జరగాల్సిం దంతా జరిగిపోతే...” ఆ ఊహకు భయపడిపోయాడు వెంకట్రెడ్డి.

కరెంటు బిల్లు రెండు వేలు దాకా ఉంది. ఇప్పుడు దాన్ని కట్టి స్టార్టరు విడి పించుకోవడం వెంకట్రెడ్డికి సాధ్యమయ్యేపని కాదు. వెంకట్రెడ్డికి గతం ఒక్కసారిగా కళ్లముందు కదలాడింది.

అతడికి ముచ్చటగా మూడెకరాల పొలం ఉంది. అదీ ఎక్కడో ఊరికి దూరంగా ఓ మూలగ ఉంది. అక్కడికెల్తే రాలేరు, వస్తే పోలేరు బండి ఉంటే తప్ప. అలాంటి పొలాన్ని నమ్ముకొని కాలినడకతోనే ఈదుకొస్తున్నాడు వెంకట్రెడ్డి. దాని చరిత్ర అమాంతం కష్టాలు, కన్నీళ్లు, నష్టాలు, అప్పులు. మొన్నకు మొన్నే చుక్కలు చూసి చెమ్మకోసం బోరేశాడు వెంకట్రెడ్డి.

అసలే విపరీతమైన కరువుకాలం. ఈ కాలంలో బోరేయడానికి పూనుకోవడ మంటే మాటలుకాదు. అసలు ఆ ఆలోచనే వెంకట్రెడ్డికి లేదు.

"బంగారట్ట బూమెట్టుకొని ఎందుకురా కట్టపడతావు. అదే బూమి మాకుం టేనా? ఈపాటికి యిరగదీసేవాళ్లం. మా మాటిని అప్పో, సప్పో చేసి బోరేయరా. నీ కట్టాలన్నీ పారిపోతాయి. ఎన్ని దినాలని రాని వానకోసం ఎదురు సూస్తూ పంట లేస్తా వుంటావు. లెక్కుంటే పొలంలోనే వర్సం కురిపించొచ్చు. పాతాళగెంగను బయటికి తీసుకురావచ్చు. ఒకసారి ఆలోసించు. అడుక్కుతిని అయినా ఓ యాభై వేలు సంపాదించుకున్నావనుకో. నీ జాత్కమే మారిపోతాది" ఏ కొంచెం కష్టం కలిగినా తరచూ మిత్రులనే మాటలు వెంకట్రెడ్డి చెవుల్లో పదేపదే గుయ్యిమన సాగాయి. ఆ మాటలు అతని హృదయాంతరాల్లో ఎక్కడో ఓ మూల ఆశలు రేపాయి.

నీరు పడితే అతని బతుకుపూల వనం. లేకపోతే అప్పుల కాష్టం. రకరకాలుగా ఆలోచించాడు. అధైర్యపడ్డాడు. అందరినీ సలహాలు అడిగాడు. "అప్పుసేసి అంత పని సేయటం మాబోటోళ్లకు మంచిది కాదురా" అన్నారు కొందరు వెంకట్రెడ్డిని కలుపుకొని. 'ప్రయత్నించి చూడు ఆపై దేవుడున్నాడ'ని దీవించారు మరికొందరు.

అయినా వెంకట్రెడ్డి ధైర్యం చేయలేకపోయాడు. ఆ ఆలోచనను అలాగే మనసులో ఉంచుకొని కాలం గడుపుతుంటే ఓరోజు వెంకట్రెడ్డి భార్య గంగాదేవి నోరు తెరిచి "మావా ఎక్కడ్నుంచో ఒకసోట్నుంచి లెక్కతెచ్చి బోరేద్దాం మావా. నాకెం దుకో మన పొలంలో నీళ్లు పడ్తాయి. మన కట్టాలు తీర్తాయి అనిపిస్తాంది మావా " అంటూ వెంకట్రెడ్డిలో ఆశలు రేపింది.

ఇక ఊరుకోలేకపోయాడు వెంకట్రెడ్డి. తన ఇల్లాలు ఏదైనా చెబితే అది కచ్చితంగా జరిగి తీరుతుందని వెంకట్రెడ్డికి ఒక చిన్న నమ్మకం. వెంకట్రెడ్డికి గంగా దేవి మీద ఎనలేని అభిమానం. ప్రేమ. తన మామకు ఎప్పుడు ఏంకావాలో అడగందే తెలుసుకొని అందించే నైజం గంగాదేవిది.

అందుకే ఆరోజు ఏదైతే అదైందని గుండెల నిండా ఊపిరిపీల్చుకున్నాడు. వెంటనే ఆ ఊర్లో ఓ పెద్దమనిషి దగ్గర అప్పు కోసం వెళ్లాడు. వడ్డీ ఎక్కువన్నా నెరవ లేదు. డబ్బు తీసుకున్నాడు. నోటు రాయించాడు. "నీళ్లు పడితే పొలం నాది. పడక పోతే అప్పిచ్చిన ఆసామిది" కళ్లు మూసుకొని మనసులో గట్టిగా పదిసార్లు అను కున్నాడు.

మరుసటిరోజే బోరు బండి వెంకట్రెడ్డి పొలంలోకి అడుగుపెట్టింది. కాటు రామయ్యను పిలిపించి ఒకటికి రెండుసార్లు అంజనం వేయించాడు వెంకట్రెడ్డి.

అంజనంలో ఎక్కడా టెంకాయ గుండ్రంగా తిరగలేదు. చివరికి మనసు గుటకలు మింగుతూ ఉంటే పొలమంతా కలియతిరిగి వెంకట్రెడ్డే ఒకచోటు చూపించి రామయ్యను అంజనం తిప్పమన్నాడు. అంతే టెంకాయ గిర్రున తిరిగింది. బోరు వెయ్యందే నీళ్లు పడ్డట్టు వెంకట్రెడ్డి ముఖం ఆనందంతో వెలిగిపోయింది.

కాటురామయ్య అంజనం వేసి కొబ్బరికాయ తిప్పితే ఇక సందేహమే లేదు. అక్కడ నీళ్లు పడ్డట్టే. అందుకే ఎక్కడున్నా వెతికి గాలించి పట్టుకొని "నాకు పనుంది, కుదరదు" అన్నా వినిపించుకోకుండా "వంద రూపాయలు ఎక్కువిస్తా"నని చెప్పి మరీ బతిమాలి పిలుచుకున్నాడు కాటు రామయ్యని వెంకట్రెడ్డి.

కొబ్బరికాయ తిరగడం చూసి కాటు రామయ్య "ఇక్కడ ఖచ్చితంగా నీళ్లు పడతా యయ్యా" అని పసుపు, కుంకుమ చల్లి తిరిగిన టెంకాయనే టప్పుమని రాతికేసి కొట్టి 'శుభం' పలికాడు. అంతే బోరు బండి చెవులు మ్రోగిపోయేలా శబ్దం అందుకుంది. కాటు రామయ్య ఆనందంగా జేబులు తడుముకుంటూ వెళ్లి పోయాడు.

బోరుబండోడికి అడ్వాన్సు, కూలీలకు అన్నాలు, మామూళ్లు. మధ్య మధ్యలో వారికి కాఫీలు, టీలు, మంచినీళ్లు... వెంకట్రెడ్డి దంపతులు వారి సేవలో మునిగి పోయారు. బోరు పొలంలోనే వేస్తున్నా అది వెంకట్రెడ్డి గుండెల్లో అన్నట్టుంది పరిస్థితి. ఒక రేయి, ఒక పగలు పొలంలో బోరు బండి గొంతు చించుకొని అరిచింది. ఒట్టి సుద్ద పొగ ఎగుర్తోంది తప్పితే మూడువందల అడుగులు దాటినా బోరు రాడ్డుకు చెమ్మ తగల్లేదు.

వెంకట్రెడ్డి దంపతుల ముఖాలు  దిగులుగా మారిపోయాయి. వారి శరీరాల్లో రక్తం ఇమిరిపోయింది. అడుక్కింత బోరుబండికి రేటు పెరిగిపోతోంది. కూలీలు, బోరు బండి యజమానితో సహా అందరూ పెదవి విరిచేశారు. యింక ఎంత లోతు బోరు వేసినా డబ్బులు వృథా, శ్రమ తప్పితే నీరు పడవు తర్వాత మీ ఇష్టం అని చెప్పారు.

ఏం మాట్లాడాలో తెలీక బిక్కచచ్చిన వెంకట్రెడ్డి బోరు బండికి ఆనుకొని కూలబడిపోయాడు. అతని ముఖంలో కన్నీళ్లొక్కటే తక్కువయ్యాయి. బోరు వేయడం ఆపించి వెంకట్రెడ్డి సమాధానం కోసం కాసేపు ఎదురుచూశాడు బోరు యజమాని. వెంకట్రెడ్డి ఏం పలక్కపోయే సరికి రివర్స్ గేర్ వేయమని కూలీలను ఆజ్ఞాపించాడు. అంతలో గంగాదేవి మెల్లగా నోరు విప్పింది.

"అయ్యింకాడికయ్యింది. ఇంకో యాభై అడుగులేయండి. ఇప్పుడు మాను కుంటే మీకు ఆ యాభై అడుగుల డబ్బులైనా మిగులుతాయి. లేకపోతే అంతా నష్టమే," అన్నాడు బోరు యజమాని.

గంగాదేవి ఒప్పుకోలేదు. వెంకట్రెడ్డితో చెప్పి ఒప్పించింది. వెంకట్రెడ్డి అప్రయత్నంగానే ఊకొట్టాడు. బోరు బండి మళ్లీ ముందుకు శబ్దం అందుకుంది. అందరూ బోరు వైపే చూస్తున్నారు. 'దేముడా! ఈ గండాన్ని గట్టెక్కించు తండ్రీ. ఏదైనా నీరు పడకుంటే నా మావ బతకడు. అదే జరిగితే అందుకు కారణం నేనే. నేను నా పిల్లలం... కూడా బతకం. నేను ఆశపెట్టినందుకైనా మా పొలంలో నీళ్లు పుట్టించి. నా మావను బతికించు తండ్రీ' మనసులో అనుకొని కన్నీళ్ల పర్యంత మవుతూ బోరుగుంత వైపే చూస్తోంది గంగాదేవి.

బోరుబోరున శబ్దం చేస్తూనే ఉంది. అప్పుడప్పుడు రాళ్లు పడిన శబ్దం. వెంకట్రెడ్డి పొలమంతా ఎర్రటి ధూళి మేఘాలు నిండుకున్నాయి. అంతలోనే బోరు రాడ్డు పాతాళంలో చెమ్మను తాకింది. ఎర్రటి నీళ్లు, ధూళితో నిండిన నీళ్లు. బోరు బండి గుండెల్నిండా గట్టిగా గాలి పీల్చి వదిలింది. ఆ గాల్లోంచి నీళ్లెగిరి పైకి చిమ్మాయి. అదిగో నీళ్లు. వెంకట్రెడ్డి ముఖంలో రక్తం ఏమూలగా వెళ్లిపోయిందో అప్పుడే వచ్చి చేరుకుంది. గంగాదేవి ఆనందంగా కన్నీళ్లు తుడుచుకుంది.

అక్కడున్న కూలీల్లో కూడా ఏదో తెలీని పరవశం. బోరు యజమాని కూడా కాస్తంత ఉత్కంఠ తర్వాత అప్పుడే ఊపిరి పీల్చుకున్నాడు. అయితే -

"నీళ్లు చాలా లోతులో పడ్డాయి. ఒకటిన్నర యించు కన్నా ఎక్కువ రావు... అవి కూడా ఎప్పుడుంటాయో ఎన్నాళ్లుంటాయో చెప్పలేం వెంకట్రెడ్డి. నీకు తెలుసుగా ఇప్పటికే వరసగా మూడేళ్లవుతోంది సరిగా వర్షాల్లేవు. ఈ సంవత్సరం కూడా కురుస్తాయని నమ్మకాల్లేవు. నీళ్లున్నంత కాలం నీ అదృష్టం అనుకో."

మొత్తం నాలుగువందలు అడుగుల వరకు బోరు దించి డబ్బులు చేతికి తీసుకుంటూ చివరిగా బోరు యజమాని అన్న మాటలవి.

నీళ్లు పడ్డాయన్న సంతోషం తప్పితే అవి ఎంత పడ్డాయి? ఎన్నాళ్లుంటా యన్నది వెంకట్రెడ్డి కెక్కలేదు. అతని బుర్రంతా ఇక మోటారెలా తేవాలా, ఎప్పుడు మోటారు పొలంలో ఆడించాలా, తన పొలంలో నీళ్లు బోర్లోంచి పాల నురగలా తెల్లగా దుముకుతుంటే చూసి ఎప్పుడు ఆనందించాలా... అని ఆలోచిస్తోంది.

“కొన్నాళ్ల బోరాడించనీకి మోటార్ని అద్దెకు తెచ్చుకుందాం మావా. తరవాత కావాలంటే నిదానంగా సొంత మోటార్ని కొనుక్కోవచ్చు” మెల్లగా అంది గంగాదేవి మోటారు కోసమే ఆలోచిస్తున్న వెంకట్రెడ్డితో.

“లేదే పిచ్చి మొఖమా. అద్దెకని తీసుకుంటే పది దినాలకొకసారి మోటారికి లెక్క కడుతూనే ఉండాల. మనం ఆడించుకున్నది లేన్ది ఎవరూ పట్టించుకోరు. కరెంటున్నా లాకున్నా...”

కరెంటు మాట వచ్చేసరికి వెంకట్రెడ్డి ముఖం ఒక్కసారిగా, ఉన్నపళంగా కలల సౌధం నుంచి కూలిపడింది.

“అవును కరెంటు కావుద్దు. కరెంటు లాకుండానే మోటరాడుతాదా ఏంది? కరెంటు మహా పిర్రెం. కరెంటోళ్లు కరెంటు కన్నా పిశేచం. అప్పుడెప్పుడో గుడిసెలో సిన్న కరెంటు బుడ్డి ఏసుకున్న పాపానికి వచ్చి సానా రాద్దేంతం సేసినారు. దేసానికి సెరుపు తెచ్చినట్టు మండిపోయినారు. వీధిన అంతా మానం తీసినారు. బంగారెట్ల వైరు లాక్కుపోయినారు. నాయనా నాయనా మీకు పుణ్ణెం ఉంటది, పిల్లోళ్లు రాతిళ్లు నేలమీద పడుంటారు, పురుగు పుట్రా వస్తాయని గంగాదేవి బతిమాల్తే ఆడ కూతురని కూడా సూడకుండా తిట్నారు. ఇట్టమొచ్చినట్టు సేసి పోయినారు. ఇంకో సారి ఇలాజేస్తే కేసెడతామని బెదిరించినారు” గుర్తు చేసుకొని మనసులో గజగజ వణికిపోయాడు వెంకట్రెడ్డి.

తన మామలోని భావాలను పసిగట్టింది గంగాదేవి. “అందుకే నా మాటిను మావా” అంది బుజ్జగింపుగా- మారు మాట్లాడ్లేదు వెంకట్రెడ్డి. అచ్చం గంగాదేవి చెప్పినట్లు చేయడానికి సిద్ధమయ్యాడు.

వెంటనే గాలి సుదర్శనాన్ని కలిశాడు. మోటారు అద్దెకు కావాలని అడిగాడు. సుదర్శనం సవాలక్ష షరతులు చెప్పాడు. తల తిరిగిపోయింది వెంకట్రెడ్డికి.

“మోటారు బోర్లోకి దించేటప్పుడు తీసేటప్పుడు ఇరుక్కుపోతే బాధ్యత నీదే, చెక్ చేసేటప్పుడు కరెంటు వల్ల స్టార్టరు కాలిపోయినా, మోటారు మాడిపోయినా యింకా ఏ ప్రమాదాలు జరిగినా నష్టం నీవే భరించాలి. నా దగ్గరైతే ప్రస్తుతం మోటారు రెడీగా లేదు. శంకర్ రెడ్డి తోటలో బోరెండిపోయింది. మోటారు తెచ్చివ్వమంటే ఈరోజు, రేపు అంటున్నాడు. గట్టిగా మాట్లాడదామంటే పెద్ద మనిషి, ఎప్పుడు తెచ్చిస్తే అప్పుడు తీసుకోవాలి. లేదా అవసరమనుకుంటే మనమే మధ్యలో పోయి తెచ్చు కోవాలి. ఇప్పుడు నీకవసరం అంటున్నావు కాబట్టీ నీవే నీ సొంత ఖర్చులతో వెళ్లి ఆ

బోరులోని మోటారును నీ బోరులోకి మార్చుకో. మూడు నెలల అడ్వాన్సు ముందే ఇవ్వాల. అలా ఇష్టమైతే సెప్పు లేకపోతే వదిలేయ్'' తీరిగ్గా అన్నాడు గాలి సుదర్శనం.

షరతులకు తలూపి సుదర్శనంకు డబ్బు కట్టడం తప్పితే వేరే మార్గం లేక పోయింది వెంకట్రెడ్డికి. వెంకట్రెడ్డిని నమ్మి అంత విలువైన మోటారు అద్దెకిచ్చే వాళ్లు ఆ ఊర్లో మరెవరూ లేరు. అందుకే సుదర్శనం ఎన్ని షరతులు పెట్టినా తిరిగి మాట్లాడలేకపోయాడు వెంకట్రెడ్డి.

అక్కడ్నుంచి పది కిలోమీటర్లు దూరంలో ఉంది శంకర్‌రెడ్డి పొలం. మెకానిక్ కూలీలతో అక్కడికి చేరుకున్నాడు వెంకట్రెడ్డి. మూడు పొడవాటి ఇనుప స్తంభాలను గోపురంలా నిలబెట్టి చైన్‌తో బర్‌బర్‌మని ఆరు గంటలసేపు లాగి మెకానిక్కు, కూలీలు ఎండిన బోర్లోంచి మోటారును బయటికి తీశారు. వారికి కూలి చెల్లించి వారి సామాన్లను వారి స్వస్థలాలకు చేర్చి శంకర్‌రెడ్డి పొలంలోని మోటారును తన పొలంలోకి తీసుకెళ్లేసరికి తల పానం తోక కొచ్చింది వెంకట్రెడ్డికి. ఏ అర్ధరాత్రో ఇంటికి చేరుకున్నాడు కానీ నిద్ర పట్టడం లేదు.

''ఉన్న లెక్కంతా బోరుకు, అద్దె మోటారుకు, సేతి ఖర్సులకే అయిపాయ. ఇంకాస్త ఎగేస్తే కాని మిగిలింది కరెంటోళ్లకు కట్టనీకి సరిపాదు. బోరైతే ఏసినా. నీళ్లైతే పడ్డాయి. పాతాళంలో ఉన్న గెంగను బయటికి తియ్యడమెట్లా? నా వల్ల అవు తుందా? అనెవసరంగా శక్తికి మించిన పని సేయడానికి పడ్డానే. దారి సూపు తండ్రి'' ప్రతిక్షణం వెంకట్రెడ్డిలో ఆందోళన.

ఏదో తెలీని భయం, పిరికితనం కీడును తలపిస్తూ వెంకట్రెడ్డిని దయ్యంలా పట్టి పీడుస్తున్నాయి. అయినా ఎప్పటికప్పుడు ధైర్యం తెచ్చుకుంటూ చేయాల్సిన పనులకు సిద్ధం అవుతూనే ఉన్నాడు వెంకట్రెడ్డి.

''కరెంటుకు లెక్క కట్టాలా? ఎలా కట్టాలా? ఎక్కెడ్నుంచి తేవాలా?'' గుడిసెన కాల దొడ్లోకి వెళ్లాడు వెంకట్రెడ్డి. ఇంటికి పెద్ద దిక్కులాంటి కర్రెటి ఎనుము. మిల మిల మెరిసిపోతోంది. తనింటి కల్పతరువు. మౌనంగా తల వంచుకొని గడ్డి మేస్తోంది. గంగాదేవి ప్రతిరోజూ దానికి నీళ్లుపోసి పరిశుభ్రంగా ఉంచుతుంది.

ఆ దృశ్యం చూడగానే బొటబొటా వెంకట్రెడ్డి కన్నుల్లోంచి నీళ్లు... ఒక్కసారిగా బోరుమన్నాడు వెంకట్రెడ్డి. ఎనుము కాళ్లు పట్టుకొని పసివాడిలా ఏడ్చాడు. తనను క్షమించమన్నట్లు వేడుకున్నాడు.

పనులున్నా, లేకపోయినా, పంటలు పండినా పండకపోయినా పూటకింత పాలిస్తూ తనని తన పిల్లల్ని రోడ్డున పడకుండా కాపాడుకొస్తున్న ఎనుము. రుణపడి

ఉండాల్సింది పోయి దాన్ని సంతకు తరలించాల్సి వస్తున్నందుకు వెంకట్రెడ్డి గుండె నోరుకొట్టుకుంటోంది.

ఆ పొలం వొద్దు... నీళ్లొద్దు.. ఈ ప్రపంచమే తనకొద్దు. తనకు, తనింటికి ఎంతో ఇష్టమైన ఆ ఎనుమొకటి తోడుంటే సాలు అనుకున్నాడు. కాని ఆచరించలేని నిస్సహాయత అతణ్ణి ఒక్కసారిగా కమ్మేసింది. పొలాన్ని నమ్ముకొని తనకున్న ఒకా నొక ఆధారాన్ని అమ్ముకోవడానికి సిద్ధపడ్డాడు వెంకట్రెడ్డి.

పక్కనే రెండు పల్లెలు దాటిపోతే సంత. ఆ రాత్రి ఎనుమును సంతకు తోలుకుపోయాడు. అనుకున్న రేటుకు ఎవరూ ముందుకు రాలేదు. కాని అవసరం. అడిగినంతకిచ్చేసి వెనక్కు తిరిగి చూడకుండా ఇంటికొచ్చాడు వెంకట్రెడ్డి. ఆ రోజంతా ఏదో కోల్పోయినట్లు బాధపడుతూనే గడిపాడు.

మరుసటిరోజు అన్యమనస్కంగానే కరెంటు ఆఫీసుకు బయలుదేరాడు. కొత్త కనెక్షన్ కావాలని అప్లికేషన్ రాయించుకెళ్లి యిచ్చాడు. వారం పదిరోజుల వరకూ అవి లేవు ఇవి లేవని ఏవోవో కారణాలు చెప్పి ఒకటికి పదిసార్లు వెంకట్రెడ్డిని తిప్పారు. అతని సహనాన్ని పరీక్షించి చివరికి పరికరాలతో పనిలోకి దిగారు. చేతి వాటం ప్రదర్శించి మామూళ్లన్నారు. కూళ్లన్నారు. టిఫెన్లన్నారు. భోజనాలన్నారు. సామాన్ల న్నారు. వెంకట్రెడ్డిని పీల్చి పిప్పి చేసి వదిలారు. చివరికి మెకానిక్ దగ్గరి కెళ్తుంటే అమ్మోరు ముందు బలికెళుతున్నట్లు అనిపించి విషాదంగా నవ్వుకున్నాడు వెంకట్రెడ్డి.

మిగిలింది నేరుగా మెకానిక్ చేతిలో పెట్టి నువ్వేడిపించడానికి నా దగ్గరేమి మిగల్లేదనే భావంతో చేతులు ముడుచుకొని దీనంగా నిలబడ్డాడు. మెకానిక్ వెంకట్రెడ్డి వాలకం చూసి ఏమీ మాట్లాడలేకపోయాడు. రంగంలోకి దిగి మోటారును బోర్లోకి దించాడు. స్టార్టరుకు కరెంటు కనెక్షన్ యిచ్చి పచ్చ బటన్ నొక్కాడు. అది చూసి వెంకట్రెడ్డి మనసు 'ఏడుకొండలోడా వెంకట్రమణ' అనుకుంది.

మోటరు బొడక్... బొడక్‌మని రెండుసార్లు అరిచింది కాని నీళ్లు పైకి రాలేదు. వెంకట్రెడ్డిలో అతృత. నేలతల్లి కడుపులోంచి తన పొలంలో నీళ్లు దూకుతుంటే చూడాలని ఆశ. అవి తన పొలంలో దూకితే తను సంపన్నుడైనట్లే. అతని కష్టాలు తీరినట్లే. బోరు నోరు వైపే కన్నార్పకుండా చూస్తున్నాడు వెంకట్రెడ్డి.

కాసేపటి తర్వాత మెకానిక్ మళ్లీ బోర్లో వైర్లతో బిగించిన మోటారును కదిలించాడు. ఈసారి మాత్రం నీళ్లు. పసిపిల్లలు ఒంటికి పోస్తున్నట్లు... బోరు గొట్టంలోంచి సన్నగా...

ఇక దూకుతాయి, ఇంకా దూకుతాయి, నీళ్లు... దూకుతాయి.... అల్లంత దూరంలో ఎగిరిపడతాయి. తనెన్నిసోట్ల సూల్లేదూ... తన పొలంలో కూడా నీళ్ల అలా అల్లంతా దూరంలో ఎగిరిపడాలని కోరుకోలేదూ... మరి దూకలేదే?... అను మానంగా మెకానిక్ వైపు చూశాడు, మరేదైనా చేసి నీళ్లు రప్పిస్తున్నాడేమో అని.

మెకానిక్ తన పనంతా అయిపోయినట్టు సామాన్లు సర్దుకుంటున్నాడు. తన పొలంలో నీళ్లు యింతకన్నా ముందుకు దూకలేవని తెలిసిపోయింది వెంకట్రెడ్డికి. మాట పడిపోయింది. "ఈ నీళ్లకోసమేనా యింతగా కష్టపడింది. యిన్నాళ్లు కలలు కనింది." అతనిలో బాధ, ఆవేశం, నిరాశ, నిస్పృహ. ఏడుద్దామనుకున్నాడు. ఏడవ బుద్ధి కాలేదు. నీళ్లులేని కళ్లతో మెకానిక్ వైపే చూస్తుండిపోయాడు.

పరిగెత్తుతున్న వాడల్లా ఒక్కసారిగ నడి పొలాల్లో మోకాళ్లమీద కూలిపోయి వెక్కివెక్కి ఏడ్చుకున్నాడు వెంకట్రెడ్డి గతాన్ని తల్చుకొని- అప్పటికే ఆలస్యమైపోతోంది. మళ్లీ స్టాటరు మీది మమకారం అతన్ని పరుగందుకునేలా చేసింది. కన్నీళ్లు మాత్రం చెంపలపై నుంచి ధారాళంగా కారిపోతూనే ఉన్నాయి. మనసు ఒకవైపు దేవుణ్ణి వేడు కుంటూనే ఉంది. అతనితోపాటు ఆలోచనలు కూడా మళ్లీ గతంలోకి పరుగందు కున్నాయి.

ఊర్లో అందరికీ తెలిసిపోయింది.

"వెంకట్రెడ్డి బోరు ఎత్తిపోయిందని. యించి నీళ్లైనా వస్తాయనుకుంటే అందులో సగం కూడా రావడంలేదని. అవి కూడా ఏ క్షణంలోనైనా అయిపోయి బోరు గుండె ఆగిపోవచ్చని, వెంకట్రెడ్డి కూడా ఇక తమ మధ్య చాలారోజులు మెదిలే సూచనలు కనిపించడంలేదని".

"సచ్చిపోయేదెట్టా?" అని ఆలోచిస్తూనే మూడునెలలు బతికాడు వెంకట్రెడ్డి. అంజిగాని దగ్గరికెళ్లి గడ్డం పట్టుకున్నాడు. అతని పెళ్లాం, పిల్లల్ని ఒప్పించి ఎద్దుల్ని ప్పించుకున్నాడు. ఎంత దూరమైనాసరే వెళ్లి టయానికింత పచ్చగడ్డి కోసుకొచ్చి మేపు తానని, ఎలా ఉండే ఎద్దుల్ని అలా తిరిగి అప్పజెప్పుతానని మాటిచ్చాడు.

ఆ సుక్కసుక్క నీళ్లనే జాగ్రత్తగా పోగు చేసుకొని పొలం తడుపుకున్నాడు. దినమంతా పారగొట్టినా తడిసేది మూడు బోదెలే. అయినా ఓపికపట్టాడు. అలాగే కష్టపడ్డాడు. ఆ నీళ్లున్నంత వరకైనా ఒక పంట చేతికి తీసుకుంటే తను తిన్నా, తినక పోయినా వచ్చిందాంతో అప్పుభారం సగమైనా తీర్చుకుందామనుకున్నాడు. రేయి పగలు రెక్కలు ముక్కలు చేసుకొని పొలంపై విరుచుకుపడ్డాడు. సేద్యాలు పూర్త

య్యాయి. అంజిగాడి ఎద్దుల్ని జాగ్రత్తగా అన్నమాట ప్రకారం తిరిగి అప్పజెప్పాడు. సెరివాళ్లకు (బదులు) అక్కడినీ్న, ఇక్కడినీ్న గింజలు అడుక్కోని పొలంలో వేసు కున్నాడు. రోజులు గడుస్తున్నాయి.

ఒకవైపు రోజు రోజుకు పెరిగిపోతున్న కరెంటు ఛార్జీలు, మరో వైపు నిర్బంధ వసూళ్లు రైతుల్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఎక్కడ చూసినా కరెంటోళ్ల దాడులు. పొలాలపై పడి నిర్దాక్షిణ్యంగా వైర్లు, స్టార్టర్లు ఎత్తుకుపోతున్నారు. ఏ మాత్రం జాలి, దయ, కరుణ చూపడం లేదు. బ్రిటీషోళ్లు పన్నులు వసూలు చేస్తున్నట్లుంది పరిస్థితి.

ఎప్పుడు ఎవరి స్టార్టరు ఎత్తుకు పోతారో, ఎప్పుడు ఎవరి గుండె పగిలిపో తుందో తెలీదు. ఒక్కొక్కరు వేలతో కరెంటు బాకీలున్నారు. అందరూ స్టార్టర్లనే గుండెలు చేసుకొని బతుకుతున్నారు. ముందు జాగ్రత్తతో కరెంటు పోగానే స్టార్టర్లను తీసి దాసేసి ఇళ్లకు వస్తున్నారు. కొందరు పొలాల్లోనే కాపలా కాసుక్కూర్చున్నారు. ఇలాంటి పరిస్థితిల్లో వెంకట్రెడ్డి ఆరోజే కొంచెం నిర్లక్ష్యం చేసి స్టార్టరును పొలంలో ఒంటరిగా వదిలేసి ఇంటికొచ్చాడు. అదే అతని ప్రాణాల మీదికి తెచ్చింది.

పాణాలకు వేలాడుతూ ఆయాసపోతూ, వగరుస్తూ మబ్బులొస్తున్న కళ్లను మూస్తూ, తెరుస్తూ పొలం చేరుకున్నాడు వెంకట్రెడ్డి.

అయిపోయింది. అంతా అయిపోయింది. తనేదైతే జరక్కూడదని ఇంత వరకూ కలలు కంటూ, పడుతూ, లేస్తూ, చస్తూ -బతుకుతూ వచ్చాడో అదే జరిగి పోయింది. అల్లంతా దూరం నుంచే తన పొలంలో స్టార్టరును ఊడదీస్తున్న కరెం టోళ్లను గుర్తించాడు వెంకట్రెడ్డి.

‘‘యింగెట్ల చేసేదిరా దేవుడా’’- పరుగుపరుగున వెళ్లి వారి కాళ్లందుకున్నాడు. ‘‘సార్... అద్దె మోటార్సార్... ఎండగాలుతున్న పైరు సార్... సుక్కాసుక్కా నీళ్లు సార్...’’

వాళ్ళు విన్లేదు. వెంకట్రెడ్డి అరిచాడు. గీపెట్టాడు. మొత్తుకున్నాడు. తల బాదు కున్నాడు. శక్తి కొద్దీ ఏడ్చి వారి కాళ్లు తడిపాడు. అయినా కరగలేదు వాళ్లు. వెంకట్రెడ్డి కాళ్లు వదలనేలేదు. తీగలా అల్లుకుపోయాడు.

‘‘స్టాటరెత్తుకుపోతే నేను, నా పెళ్లాం ఎల్టీన్ తాగాల్సార్ - పుణ్ణెం ఉంటాది సార్...’’

జాలి బదులు విసుగొచ్చింది వాళ్లకు. కోపంతో మండిపోయారు. అమ్మనా బూతులు తిట్టారు.‘‘కరెంటేమైనా నీ అబ్బ సొమ్మనుకున్నావురా బిల్లులు కట్టకుండా మోటరాడించుకోనీకి...’’

"లేద్సార్... పంటొస్తానే అంతా కట్టేస్తా... టైమియ్యండ్సార్..."

"ఆలోగా మా ఉద్యోగాలు పోవాలనా" పళ్లు పటపటా కొరికారు వాళ్లు. పురుగును విదిల్చినట్లు కాళ్లకు చుట్టుకున్న వెంకట్రెడ్డిని గట్టిగా విదిల్చికొట్టారు. అల్లంత దూరంలో పడ్డ వెంకట్రెడ్డి మళ్లీ వచ్చి కాళ్లకు చుట్టుకున్నాడు. వారు మళ్లీ విదిల్చికొట్టారు. వెంకట్రెడ్డి మళ్లీ వచ్చాడు.

వీడు సామాన్యంగా వదిలేలా లేడు అనుకున్నారు వాళ్లు. ఈసారి లేవలేని విధంగా దొబ్బాలనుకున్నారు. దొబ్బి వదిలేశారు. ఎగిరి గెనుంపై పడ్డ వెంకట్రెడ్డి మళ్లీ లేవలేదు. అంతా నిర్మానుష్యం.

వారు వడివడిగా అడుగేలేసుకుంటూ వెళ్లి స్టార్టరుతో జీపెక్కి కూర్చున్నారు. జీపు స్టార్టయ్యింది. ఇప్పుడు వారికి, వారి జీపుకు అడ్డు ఎవరూలేరు. జీపు ముందుకు కదిలింది. దుమ్ము లేపుకుంటూ వెళ్తున్న ఆ జీపు వెంకట్రెడ్డి ప్రాణాన్ని తీసుకెళుతున్న యముని వాహనంలా ఉంది.

*ఆదివారం ఆంధ్రజ్యోతి, 18 మే 2003*
*కడప కథ*
*'రైతు కథలు' సంకలనం -2012*

# పలక పండుగ

మోకాళ్ళపై మోచేతులు పెట్టుకొని అరచేతుల్లో గడ్డాన్ని అన్చుకొని పీటపై దిగులుగా కూర్చోనున్నాడు మదారు. పొయ్యిమీద అన్నంపెట్టి, చింత పులుసును చేత్తో పిసుకుతా "ఏమైందిరా? ఇప్పుడో కాసేపటికో సచ్చిపోయేని లెక్క ఉండావు?" అంది కసిగా జహేర- ప్రతిదానికి ఈ పిల్లనాయలి అలక ఒగటి. ఉప్పు కారానికే ఎట్టరా అని సస్తాంటే అని గొనుక్కుంటా.

'రేపు యినాయకమయ పండగ".

"అయితే".

"పలగ్గావాల. నాయనకు చెబతావుంటే పిల్లాటలెక్క ఉండాది. నాకు సదుకోనికి పలక లేకున్నా పర్వాలా. పలక పూజకు మాతరం గావాల. లేదంటే మానం పోతాది. బళ్ళో అందరూ రకరకాల పలకల్లో రకరకాల ముగ్గులు ఏసుకొస్తారు. నేను ఏసకపోకపోతే ఎట్టా ఉంటాది."

"ముగ్గులా ఎందుకు? నువ్వేమన్నా ఆడపిల్లగానివా?"

"అక్కడ ఆడపిల్ల, మగపిల్ల అని లా. అందరూ పలకల్లో ముగ్గులు ఏసుకు పోవాలా. లేదంటే కుంకుమతో 'ఓం' అని రాసుకుపోవాల. అదిగాదంటే 'శ్రీ' అని రాయాలంటా. అలా రాసుకుపోయి యినాయకమయ ముందు పెడితే సల్లగా చదువొస్తాది" అన్నాడు మరింత దీనంగా ఏడుపు మొఖం పెట్టి.

జహేరాకు ఏం జేయాలో అర్థం కాలా. ఇంటికాడుండి అయిగావాల యియి గావాల అని యీదిలో పోయే తిండి వస్తువులన్నిటికి ఏలు చూపించి నలుగురిలో మానం తీస్తాన్నాడని రామకృష్ణ సారు ఒకసారి అనుకోకుండా బోరింకాడ కనిపడితే అడిగింది జహేరా.

"మావోన్ని వొదులుతా సార్. వోనికి బడి అలవాటై వోడు ఏడ్వకుండా దినాము బడికి వత్తాంటే అప్పుడు పీజిస్తా" అనింది.

ఇరవై పిల్లల్లో వీడు వొకడు. నాలుగు అక్షరాలు రాసిచ్చి దిద్దిస్తే అయిచూసి వొళ్ళమ్మ వొద్దన్నా పీజిస్తాదిలే అనుకున్నాడు రామకృష్ణ సారు. బడికి అంపిస్తుంది కానీ రాయించడానికి పలక లేకుండా చేస్తుందని తనకేం తెలుసు?

"సరేనమ్మా" అన్నాడు.

జహేరా పిల్లోన్ని మొదటిరోజు స్కూల్లో వొదిలి "సారు ఇప్పుడే యీనికి పలకెందుకు సారు. పక్కపిల్లోళ్లు రాసుకుంటా, చూసుకుంటా ఉంటే వానిక్కూడా కొంచెం బుద్దొస్తాది. అప్పుడు పలకిప్పిస్తే పనికొస్తాది" అని చెప్పింది.

రామకృష్ణ సారు ఏమనలేకుండా నోరెళ్ళబెట్టాడు. అప్పట్నుంచి రెండు నెలలు గావస్తున్నా పలకలా, బలపంలా.

మదారుగాడు పక్కపిల్లోళ్లు కొనుక్కొని తినే చిరుతిళ్ళను ఏమాత్రం అదురు బెదురు లేకుండా అడుక్కొని తినడం మొదలు పెట్టినాడు. బళ్ళో అందరూ సదూ కుంటాంటే వీడు ఇంటర్వెల్ ఎప్పుడు వొదుల్తారా జగ్రిపిట్టుగాడు, సెట్టోళ్ళ పిల్లోడు గౌతమ్‌గాడు ఎప్పుడు కొనుక్కుంటాడా అడిగి తిందామా అని ఎదురుచూస్తా కూర్చుంటున్నాడు.

రామకృష్ణ మాష్టారు వోన్ని పలక లేకుండా బడికి రావొద్దురా అని వొందసార్లు చెప్పింటాడు. వోడు వినకుండా వస్తానే వున్నాడు. ఇంటర్వెల్ అయిపోతానే ఎల్లిపో తున్నాడు. ఇంటికి పోయి చెబుదామంటే అబ్బడం లేదు.

కాలమిట్టా కలిసి పోతాంటే మధ్యలో యినాయక చవితి వచ్చింది. పలక గురించి దాని గొప్పతనం గురించి రామకృష్ణ సారు ఎన్నిసార్లు చెప్పినా మదారుగాడి

లేతమనసుకు ఎక్కలేదుగానీ సాటి పిల్లోళ్ళు సెప్పేసరికి 'పలకలేని జీవితం వ్యర్థంరా' అనుకున్నాడు.

సరాసరి రామకృష్ణ సారు వచ్చి "పిల్లాడికి పలకిప్పించంది బడికి పంపొద్దని" చెప్పినా ఏ మాత్రం తొనక్కుండా ఏదో ఒకటి చెప్పి రామకృష్ణ సారును వచ్చిన దారిపట్టేలా చేసేది జహేరా. కానీ తను ఎప్పుడూ ఊహించంది మదారుగాడు పలక్కావాలని అడుగుతూ ఏడుస్తుండేసరికి జహేరాకు ఆశ్చర్యం వేసింది. ఒకవైపు బాధేసింది. కర్తవ్యం తెలీక పొయ్యి మీద అన్నం దించేసి ఇంటింటికిపోయింది ఎవరివైనా పాత పలకలున్నా యేమో అని.

అసలు మదారుగాన్ని సదివించేది జహేరా ఉద్దేశం కాదు. యింకొంత వయసొచ్చే వరకు ఓపిక పడితే వోన్ని వోళ్ళ మామ దగ్గర వొదిలిపెడితే ఏదో మెకానిక్ పని నేర్చు కుంటాడు అనుకుంది. అలాంటప్పుడు వోనికి పలకెందుకు దండగ్గదా. సివరికి పాత సామాన్ల యాపారం చేసుకునే బక్షు దగ్గర ఒక పాత పలక దొరికింది జహేరాకు. దాంట్లో అక్కడక్కడ కొంత నలుపురంగు తప్పితే అంతా చిలుంపట్టిన రేకే. దాన్ని పలకనాలంటే జహేరాక్కూడా మనసొప్పలేదు.

'ఆఁ... ఏదో ఒకట్లే' అనుకుంది. ఇంటికొస్తుంటే బక్షన్న, "అక్కా అదెందుకు పనికొస్తాదక్కా నా దగ్గరన్నా ఉంటే తూకానికొస్తాది. పిల్లోడికి కొత్త పలకిప్పించలేక పోయావా" అన్నాడు ఊరుకుండలేక.

ఆ మాటలు జహేరాకు కొంత ఇబ్బందనిపించినా ఏదో ఒకటి మాట్లాడాలని "ఎందుకన్నా వోడు బడికిపోతాడా పాడా. యిప్పించినా నాలుగు రోజులున్నివ్వడు" అనుకుంటా పలకతో ఇంటికొచ్చింది.

"ఇదిగోరా పలక. ఎవ్వరింట్లో అడిగినా లేదన్నారు. బక్షన్న ఇంట్లో ఇది దొరికింది. నీకేం కావాలంటే అది రాసుకొని రేపు బడికెళ్లు" అంది.

పాత పలకే మదారుకు బంగారమైంది.

"మరి బలపం" అన్నాడు.

పది పైసలు చేతిలో పెట్టి "కొనుక్కో పో" అంది.

ఇంగ మదారుకు తెగ సంబరమైంది. కోమిటోళ్ళ పిల్లోడు గౌతం దగ్గరకు వెళ్ళాడు. ముగ్గు ఏసివ్వమన్నాడు.

యినాయకసవితికి ముగ్గులేసుకుపోవాలని మదారుకు చెప్పింది గౌతమే. మదారు పలక చూసి గౌతమ్ పకపక నవ్వాడు. "ఈ పలక రాయదు పో" అంటా కసురుకున్నాడు.

"రాయదా..." అని అనుమానంగా పలక వైపు చూసుకుంటా బలపంతో గీకాడు. వొళ్ళు జలదరించింది కాని పలక రాయలేదు. వోడు దిగాలుగా తిరిగి ఇంటికొచ్చాడు.

జహేరాను చూస్తూనే వోనికి కోపం వచ్చింది. పలకను జహేరా ముఖం మీదకు విసిరికొట్టాడు. ముందే అంచుల్లేని రేకు పలక అది. దానిమీద రాస్తే రాయకపోవచ్చు కాని దాంతో కొడితే దెబ్బ తగులుతుందని వాడికి తెలీదు. జహేరా ముక్కు పగిలిపోయింది. రక్తం కారబట్టింది.

కోపంతో ఊగిపోయిన జహేరా వాడి వీపు వాయగొట్టింది.

"ఆ నా కొడుకు చూస్తే అట్టా. నువ్విట్టా. వాడు తాక్కుండా ఇంటికి రాడు. నీ గోడు పట్టించుకోడు" అని మొగుణ్ణి తిట్టబట్టింది. మదారు ఏడ్సుకుంటా ఏడ్సు కుంటా అట్టే పడుకున్నాడు. వాడికి కల్లో, వోళ్ళ నాయన మాబ్బాష తాగకుండా ఇంటికొచ్చినాడు. ఏడుస్తున్న మదారును ఎందుకురా ఏడుస్తున్నావు అని దగ్గరకు తీసుకున్నాడు. మదారు విషయం చెప్పగానే మదారును కొట్టినందుకు జహేరాను కసురుకున్నాడు. వేలు పట్టుకొని తీసుకొనిపోయి బంపరంగట్లో కొత్త పలక తీయిం చాడు.

తెల్లారింది. బళ్ళో యీనాయకమయ విగ్రహం ముందు కొత్త పలకతో మదారు చిందులే చిందులు.

*ఆదివారం వార్త, 26 సెప్టెంబర్ 2004*

# అంజనం

పైన ఫ్యాను తిరుగుతోంది. తిరిగేది చిన్నగే అయినా కిటకిటామంటూ శబ్దం పెద్దగా వస్తోంది. ఆ ఫ్యాను గాలిని ఏమాత్రం లెక్కచేయకుండా, ఈగలు బొయ్యిమంటూ అటూ ఇటూ తిరుగుతున్నాయి. నట్టింట్లో కాళ్ళు బార్లా చాపుకుని దిగాలుగా కూచోనుంది జమ్రూత్.

“పెద్దోడు తిరిగొచ్చాడని పెద్దాసుండ్యా” అంది ఉన్నట్టుండి.

‘ఇప్పుడు ఆ ఆసకు ఏమైంది?’ అన్నట్టు చూశాడు పక్కనే ఎర్రటి వైరు మంచంపై కూర్చోని ఆమె రెండో కొడుకు గౌస్.

“ ఆ పావురం వొచ్చినట్టే నా బిడ్డ కూడా వొచ్చాడనుకుంటి” అంది మళ్లీ జమ్రూత్.

గౌస్‌కి బాధేసింది.

“ఏమి ఈ పిచ్చాయమ. అదేదో పావురం ఒకటి దారి తప్పి ఇంటికొచ్చిందని... దాంతోపాటే అన్న కూడా వొచ్చాడనుకుంటే ఎట్టా? అన్న ఇంటి నుంచి వెళ్లి

పోయి ఎన్ని దినాలైతాంది ఏమి కత? ఎబ్బుడో ఎనిమిదేండ్ల కిందట మనసులో ఏం పురుగు పుట్టిందో... అందర్నీ కాదనుకుని వెళ్లిపోయినోడు, ఇంతవరకు సుతిల్యా... గతిల్యా...! సచ్చినాడో బతికినాడో కూడా తెలీదు. బతికుంటే ఒకతూరి కాకపోయిన ఒకతూరైనా ఎవురో ఒకరు గుర్తొచ్చి, ఇంటికి ఎందుకు తిరిగిరాడు. బతికున్నాడో లేదో తెలీనివోడి గురించి ఎందుకు దినామూ దిగులు పడకుంటా ఉండేది?

అసలు ఈయమ్మను ఎవురు అంజనాలకు పొమ్మన్నింది? ఎవడ్నో ఒకడ్ని వెళ్లి అంజనాలు అడిగేది, వాడు ఏది చెబితే అది నమ్మేది... ఇలా బుర్ర పాడు చేసుకునేది. మొన్నకు మొన్న అన్న ఎక్కడో తిరప్తిలో ఉన్నాడని వాడేవడో చెబితే, అదే పనిగా నాయన్ను పంపించి ఎతికించింది. ఏమిటి లాభం? లెక్క నట్టం తప్ప. వాడు దొరకడు పాడుల్యా... ఈయమ్మ మారుదూ ఏమిల్యా?''... మనసులోనే చిరాగ్గా అనుకున్నాడు గౌస్. పైకి మాత్రం ఏమీ అనలేదు.

ఎంత కాదనుకున్నా తల్లి మనసు గదా. మరింత బాధపడుతుందని, లోపలున్న చిరాకునంతా లోపల్నే అణచుకున్నాడు.

కానీ అతనిక్కూడా నిన్నటిదాక ఇంట్లో సందడి సందడిగా తిరిగిన మచ్చల మచ్చల పావురమే గుర్తొస్తోంది.

మాంచి పావురమది. తెల్లటి రంగులో, అక్కడక్కడ నల్లటి మచ్చలతో కళకళ లాడుతూ ఉండేది. ఆరోజు జమ్రూత్ ఇంట్లో తన మటుకు తాను గిన్నెలు తోము కుంటోంది. ఆ పావురం నేరుగా ఇంట్లోకి వచ్చి నిలబడింది. ఏదో అలవాటున్న ఇల్లులాగా దర్జాగా నిలబడుకుని, ఏమాత్రం అదురుబెదురు లేకుండా అటూ ఇటూ చూసింది.

దాన్ని చూసిన జమ్రూత్‌కి ముచ్చటేసింది. అది చేతులతో తోలుతున్నా ఎగిరి పోలేదు. అక్కడక్కడే తిరుగుతోంది.

'అయ్యయ్యో... సిన్న పావురమే' అనుకుంది.

అట్టే చేతుల్తో గబిక్కన పట్టుకుంది. బయట చూస్తే వాన. ఎప్పుడు మొదలైందో కూడా ఆమెకు తెలీదు.

'పాపం ఈ వానలో ఈ పావురం ఏ చెట్టుమీది నుంచో దారితప్పి వొచ్చింది' అనుకుంది. అక్కున చేర్చుకుంది. దాన్ని పెంచుకోవడం మొదలుపెట్టింది. దాని కోసం ఇంట్లోని  ఓ గాజు అల్మారా ఖాళీ చేసింది.

వేళకు తిండి గింజలు వేసింది. నీళ్ల గిన్నె పెట్టింది. ఎన్ని పనులున్నా దాని మీద ఒక కన్నేసి పెట్టింది. ఏ మాత్రం సమయమున్నా, దాంతో చిన్నపిల్లలా ఆడు కుంటూ కనబడేది. ఆ పావురానికి కూడా తొందర్లోనే ఆ ఇల్లు అలవాటైంది. మనుషుల మధ్య రయ్యిన తిరుగుతూ, ఎగురుతూ... భుజాల మీద కూర్చోవడం మొదలుపెట్టింది. దానికి ఒక 'తోడు పావురం' కూడా తీసుకురావాలి అనుకుంది. కానీ అంతలోనే ఇలా జరుగుతుందని ఆమె కల్లో కూడా ఊహించలేదు.

నిన్న సాయంత్రం గౌస్ ఇంటికొచ్చేసరికి దిగాలు ముఖం పెట్టుకుని కూర్చుంది జమ్రూత్.

ఏమైందని అడిగితే... చిన్నపిల్లలా తన ముద్దుల పావురం తనకు దూరమైన సంగతి గురించి చెప్పుకొచ్చింది.

"పావురానికి ఇల్లు బాగా అలవాటైంది. తీసుకెళ్ళి రోడ్డుకవతలి వైపు వదిలినా, నేరుగా ఇంట్లోకే వచ్చేస్తాంది. ఈ పొద్దు కూడా అట్టనే తీసుకునెళ్లి పావురాన్ని వదుల్తాంటే ఎప్పుడు చూసినాడో ఆ గుడ్డాలాయప్ప కొడుకు సిన్నోడు 'ఆ పావురం నాది గదుమ్మా..' అంటా వొచ్చినాడు.

ఆ మాటంటానే నాకు గుండె దడుత్తుకునింది.

'ఈ పావురం నీది అనడానికి ఏమిటి ఆనవాళ్లు ?' అని అడిగినా.

ఆ పిల్లోడు అన్నీ కరెక్టుగానే చెప్పినాడు. నెలరోజుల కిందట వాన వొచ్చి నప్పుడు, ఆ పావురం బెదిరిపోయి, వాళ్లింట్లోంచి బయటికి గెంతుకుంటా వొచ్చిం దంట. అలా అక్కడ గెంతిన పావురం, ఇలా మనింట్లో కొచ్చి వాలిందని అప్పుడు నాకేం తెలుసు? అందుకే పానానికి పానంగా సాక్కున్నా. కానీ ఆ పిల్లోడు అంతగా 'ఆ పావరం నాది... నాది...' అంటాంటే ఎట్టా ఇయ్యకుండా ఉండాలా? అందులో ఒకరి సొమ్ము మనకెందుకు?" అనింది.

నిజాయితీగా ఆ పావురాన్ని ఆ పిల్లోడికి ఇచ్చెయ్యనైతే ఇచ్చేసింది కానీ, ఆమె మనసు మాత్రం మనసులో నిలవడం లేదు. అన్నం, నీళ్లు మానేసి ఇలా డీలా పడిపోయింది.

ఎందరు ఏమన్నా తన బిడ్డ బతికే ఉన్నాడని, ఏదో ఒకరోజు తిరిగి వస్తాడని, ఎంతో నమ్మకంగా చెప్పే జమ్రూత్, ఆ రోజు మాత్రం 'ఇంగ రాడు నా బిడ్డ' అని కళ్ల నీళ్లు పెట్టుకుంది.

ఆమె ఏడుపు చూశాక, గౌస్‌కి మరింత చిరాకు వేసింది.

ఆ పావురాన్ని ఆ పిల్లోడు తీసుకెళ్లడానికి, ఎప్పుడో వెళ్లిపోయిన తన బిడ్డ ఇక రాడని ఆమె అంత గట్టిగా నమ్మడానికి ఉన్న లింకేంటో అతనికి అర్థం కాలేదు.

'ఎవ్వరికి చేయి చూపించొద్దు. జోస్యాన్ని నమ్మొద్దు. ఎలా జరగాల్సి వుంటే అలా జరుగుతుంది. అనవసరంగా జరగబోయేది తెలుసుకుని, దాని గురించి బెంగపెట్టు కోవద్దు' అని చిన్నప్పటి నుంచి నీతులు చెప్పిన తల్లే ఇప్పుడిలా మారి పోవడం, అతనికి ఆశ్చర్యమనిపించింది.

అంతేకాదు, పక్కా మత పద్ధతులు పాటించే తల్లి, ఇప్పుడు బుర్ఖా కప్పుకుని అంజనాల పేరుతో స్వాములు, సాధువుల వెంట తిరుగుతోంది.

'అనవసరంగా అంజనాలు అవీ ఇవీ అని తిరిగి, వాళ్లు చెప్పిందల్లా విని, లెక్కంతా పాడు చేసుకుని, పానానికి ఎత తెచ్చుకోకమ్మా' అని చాలాసార్లు చెప్పి చూశాడు గౌస్.

ఆమె వింటే కదా. అప్పటికి విననట్టే ఉంటుంది కానీ గుట్టు చప్పుడు కాకుండా మళ్లీ వీళ్ల వెంట, వాళ్ల వెంట అంజనాలకు వెళ్లేసి వస్తుంది. వాళ్లు చెప్పిం దల్లా చేస్తుంది. బిడ్డ కోసం ఎక్కడెక్కడో వెతికిస్తుంది.

ఎప్పుడో కొన్నేళ్ల కిందట వెళ్లిపోయిన వ్యక్తిని, ఇంట్లో వాళ్లంతా మర్చి పోతున్నా, ఆమెక్కొటే గుర్తుంచుకుని ఇలా తిరిగి అందరికీ గుర్తుచేసి బాధను రగిలిస్తుంటుంది.

కానీ 'దీనికి అంతు ఎప్పుడు?' అనేదే అతని బాధ.

"ఏందమ్మా నీ పిచ్చి... అన్న రావాల్సినోడైతే ఈ పావురం లేనంత మాత్రాన రాకుండా పోతాడా? రాకుండా ఉండాల్సినోడైతే ఆ పావురం ఉన్నంత మాత్రాన వొస్తాడా? అయినా నీకెవరుమ్మా... మల్లా అంజనం అడిగేదానికి పొమ్మని చెప్పింది?" గట్టిగానే అన్నాడు గౌస్.

"నేనెవర్నీ అంజనం అడగలా" అందామె సన్న గొంతుతో.

"మరెందుకు నీకా పిచ్చి నమ్మకం... ఆ పావురం ఉంటే అన్న వొస్తాడని..." అడిగాడు.

"చెబుతా విను. ఎనిమిదేళ్ల కిందట మనం పల్లెలో ఉన్నామా?"

"అవును."

"ఆ పల్లెలో కూడా అంతే. ఆ దినం వాన పడతాంది. నేను కాపుటీధిలోకి (కాపువీధి) గిన్నె పట్టుకుని పాలకోసం పోతాండా. ఎక్కడున్నిందో కాకి... గోధుమ రంగు కాకి రయ్యిన వొచ్చింది. నెత్తిన అట్టే తన్నిపోయింది.

'షూ... షూ...' అంటాన్నే వినలా. మళ్లా మీది మీదికి వొచ్చాండాది.

'ఏందీ కాకి ఈయమ్మను అట్ట కొడతాండాది' అని అందరూ తలా ఓ రాయి ఏసేసరికి, అది అట్నుంచట్నే ఎళ్లిపోయింది.

'ఏందీ కాకి... ఇట్టా కొట్టింది నెత్తిన... ఏం దరిద్రం తగులుకుంటాదోనే' అని దిగులు పట్టుకునింది.

ఇదంతా చూసిన పాల సుబ్బమ్మ గిన్నెలో పాలు పోసి, 'అయ్యో బీబి. దెరిద్రం కదా... కాకి అట్టా నెత్తిన కొడితే... ఏం జరిగి సచ్చాదోనే... జాగ్రెత్తగా వుండ మన్లా... ఓ పనిజెయ్యి. ఇంటికి బోయి సల్లనీళ్లతో స్నానం జెయ్యి. తొర్వాత ఎట్టయితే అట్టయితాది..." అని సలహా ఇచ్చింది.

'సరేమ్మా' అంటా పాలు పోయించుకుని ఇంటికొచ్చేసినా. ఆదరాబాదరాగా బిందె తీసుకుని, సక్కంగా బోరింగ్ కాడికి పోయి, సల్లనీళ్ళు తెచ్చుకుని కట్టుగుడ్డల మీదే స్నానం చేసినా. అయినా దరిద్రం పోలా. ఆ తెల్లారే, నీ అన్న మాబ్బాష కనిపించ కుండా పోయినాడు.

ఆ దినం అట్ట ఆ కాకితో వొచ్చిన దరిద్రం, ఇట్టా ఈ పావురంతో పోతుంది అనుకున్నా...! అందుకే పావురం మీద అంత బ్రెమ పెంచుకున్నా. పావురం వొచ్చినట్టే మీ అన్న కూడా వొచ్చాడనుకున్యా...!" అని కళ్ళొత్తుకుని చెప్పింది జమ్రూత్.

గౌస్‌కి కడుపులో కవ్వమేసి కెలికినట్టయ్యింది. దేన్నుంచి దేనికో అన్వయించు కుని బాధపడుతున్న ఆమె అమాయకత్వాన్ని చూసి, అతనికి జాలేసింది. అంజనాలు అడిగీ అడిగీ... వాటిని నమ్మీ నమ్మీ... తిరిగీ తిరిగీ... చివరికి ఆమే సొంతంగా కొన్ని నమ్మకాలు ఏర్పరచుకునే స్థాయికి దిగజారింది. బిడ్డ మీద ప్రేమ ఆమెనెంత నిస్స హాయంగా మార్చేసిందో తల్చుకుంటేనే అతని గుండె తరుక్కుపోయింది.

"అన్న బతికిలేడని నా అనుమానమమ్మా. ఉంటే ఎందుకు తిరిగి రాడు చెప్పు?" అన్నాడు గొంతు తగ్గించి, బుజ్జగిస్తున్నట్లుగా.

"అట్టనకు నాయన. నేను తట్టుకోలేను..." అందామె మరింతగా కన్నీళ్లు పెట్టుకుంటూ.

“మరేమనుకోవాలమ్మా. మనిషనేటోడైతే వాడు ఒక ఫోనైనా చేయడా? ఇంటికి రాకుంటే మానే. ఫలానా చోట సలక్షణంగా ఉన్నా అని ఒక ఉత్తరం ముక్క యిన రాయడా?”

“వాడు తిక్కోడు నాయనా. వాడికి అన్ని తెలివితేటలు లేవు...”

“మరేం జేయాలా? ఏవేవో నమ్మి అంజనాలు చూపించుకుంటా కూచుంటే అయితాదా?” అన్నాడు కటువుగా.

“ఏదో, అంజనం చూపిస్తే పానం కొంచెం కుదుటగా ఉంటాది. వాళ్లు సెప్పేది అపద్దమో, నిజమో - వింటే మనసుకు రోంత నిమ్మతిగా ఉంటాది. మనిషి మీద ఏదో ఒక ఆశ మందులా పనిచేసి, కాసేపు హుశారుగా తల్లాడేలా చేస్తాది.

అన్నట్లు నీకు చెప్పడం మర్చిపోయినా. మొన్న ప్రొద్దుటూరు పోయినప్పుడు, నీ సిన్నమ్మను వెంటేసుకుని జమ్మలమడుగు బోయినా. ఆడ ఓ సామి చెప్పినాడు... అన్న హిందూపురంలో ఉన్నాడంట. కచ్చితంగా చెబుతాండాడు. ఈ పావురం ఆస ఎట్టాగో లేకుండా పోయింది. ఇంగ ఆడ ఒక్క సోట చూసొస్తే చాలు” అనింది.

అలా తిరిగి ఇలా తిరిగి మళ్లీ అంతలోనే అంజనం దగ్గరికి వచ్చేసరికి గౌస్ తలపట్టుకున్నాడు. ఇక ఆమెను మార్చడం సాధ్యం కాదనుకున్నాడు.

ఎలాగోలాగా తల్లితో ఏడుపు మాన్పించడమే లక్ష్యంగా ఓ మాటన్నాడు.

“సర్లే... నువ్వు ఏడ్వొద్దు. ఈసారి నేనే స్వయంగా వెళ్లేసి, అన్న కోసం వెతికొస్తా. సరేనా...?”

ఆ మాటతో ఆమె ముఖంలో బాధ మాయమై, చిర్నవ్వు మెరిసింది.

అంజనం యొక్క ఉపయోగం అతనికి అప్పుడు బోధపడింది. ఈ దేశంలో స్వాములు, బాబాలకు ఎందుకింత గిరాకీ ఉందో కూడా అవలీలగా తెలిసొచ్చింది.

*సాక్షి ఫన్‌డే, 24 అక్టోబర్ 2010*
*కథాజగత్ డాట్‌కామ్, 2011*

# తెలుగోళ్ళ దేవుడు

"ఏంది తెలుగోళ్ల దేవుణ్ణి... ఆడ బెట్టినారే... దూదేకులోళ్లా... ఏంది మీరు..." అంది పాలు పోయడానికి వచ్చిన పక్కింటి పార్వతమ్మ టీవీ మీద ఉన్న వెండి బొమ్మను చూసి.

"అవును నిజమే అది తెలుగోళ్ల దేవుడే..."

అంతకుమునుపు గౌసియా వాళ్లమ్మ కూడా వచ్చి అర్చిపోయింది. "మానంగా, మట్టంగా ఆ బొమ్మను అణ్ణుంచి తీ... లేదంటే మర్యాద పోతుంది..."- అని.

గౌసియ పట్టించుకోలేదు. ఆ బొమ్మలో అందరికీ 'తెలుగోళ్ల దేవుడు' కనబడు తుంటే గౌసియాకు మాత్రం తన ఆరేళ్ల కూతురు మున్నీ కనబడుతోంది. కానీ పార్వతమ్మ దూదేకులోళ్లతో పోల్చేసరికి గౌసియాకు కోపం వచ్చింది. సాయిబులు దూదేకులోళ్లను తక్కువగా చూస్తారు. దాన్ని ఆసరా చేసుకుని పార్వతమ్మలాంటి వాళ్లు సెటైర్లు వదిలి ఆనందిస్తుంటారు. అది తెలియని సాయిబులు ఇలా రోషం తెచ్చుకుంటారు.

"మేము దూదేకులమైంది... సాయిబులమైంది... తెలీదా నీకు చిన్నప్ప ట్నుంచి చూచ్చాండావే..." అంది కసురుకున్నట్టుగా గౌసియా పాలగిన్నె అందుకుని.

"నాకు తెల్సులే గౌసియా! ఊరికే అంటాండాగానీ... ఆ వెండిబొమ్మ నీ కూతురు స్కూల్లో గెల్చిందికదూ..." అంటా నవ్వుకుంటూ వెళ్లిపోయింది పార్వతమ్మ.

సూదితో పొడ్సినట్టే పొడ్సి మళ్లా పైకి ఏమీ తెలీనట్టుగా 'అబ్బ... నొప్పి పుడుతాండాదా...' అని వెక్కిరించినట్టుగా అయింది పార్వతమ్మ వాలకం గౌసియాకి. పాలగిన్నె వంటగదిలో పెట్టింది. నిజానికి కాఫీ పెట్టుకుని తాగాలనుకుంది. కానీ మనసు ఒప్ప లేదు. తిరిగి హాల్లోకి వచ్చింది. టీవీపై ఉన్న వెండి బొమ్మను తదేకంగా చూసింది. అందులో తెలుగోళ్ల దేవుడు నింపాదిగా కూర్చోని వెక్కిరిస్తున్నట్టుగా అనిపించింది.

దేవుడు ఎవరికైనా దేవుడే కానీ ఈ బహుమతుల మీద కూడా దేవుళ్ల బొమ్మలు ఎందుకో- ఆమెకు అర్థంకాలేదు. అసలు మున్నీని తెలుగోళ్ల బళ్లో చేర్చడమే తప్పేమో అనుకుంది.

ఇంతవరకూ ఎప్పుడూ ఆమె అలా అనుకోలేదు. పైగా ఆమెకు తెలుగంటే అభిమానం. ప్రాణం. టీవీలో వచ్చే తెలుగు అక్షరాలను చదవాలని ఆత్రం. తెలుగు రానందుకు బాధ కలిగేది.

గౌసియా ఉర్దూ చదువుకుంది. స్కూలుకెళ్లి కాదు. వాళ్ల వీధిలోని వస్తాద్‌బీ దగ్గర. ఆ మహానుభావురాలు గౌసియాతో అంట్లు తోమించేది. ఇల్లు ఊడిపించేది. అన్ని పనులూ చేయించుకుని ఆలీఫ్-బే లు చెప్పి పంపించేది. వచ్చేటప్పుడు బుర్ఖా, వెళ్లేటప్పుడు బుర్ఖా. బుర్ఖా కళ్లకు నల్లగా అడ్డు తగిలేది. అందమైన ప్రపంచాన్ని అందమైన వెలుగుని స్పష్టంగా చూడనిచ్చేది కాదు. తల కూడా కుడి, ఎడమలకు తిరిగేది కాదు.

వెంట తమ్ముడుండేవాడు. ఇంటి నుంచి తోడ్కోని వస్తాద్‌బీ దగ్గర వదిలేవాడు. ఆమె చదువు అయిపోయాక తిరిగి వెంట తీసుకొచ్చేవాడు. ఆమె ఉర్దూ చదువు అలా సాగింది. ఏదో ఒకటి చదువుకుంది - మంచిదైంది కదా... అనుకుందామంటే ఇంటా-బయట అంతా తెలుగు, లేదంటే ఇంగ్లీష్- ఉర్దూతో ఏం పని? అన్నట్టు తయారైంది పరిస్థితి. చివరికి పేపర్ ముక్క కూడా ఉర్దూలో చదవడానికి రాయలసీమలోని చాలా టౌన్లలో దొరకదు. చదువుకున్నా కూడా గౌసియాలాంటి వాళ్లు నిరక్షరాస్యులుగా వుండిపోవాల్సిందే.

తన గతి తన కూతురు మున్నీకి పట్టకూడదనుకుంది గౌసియా. టీవీలో పేర్లు ఎంత వేగంగా వెళ్లినా టకటకా చదివేలా తన కూతురిని తయారుచేయాలనుకుంది. బస్సు బోర్డులు కూడా తన కూతురు ఊది పారేయాలనుకుంది. తెలుగులో

చదివి, ఇంగ్లీష్‌లో మాట్లాడి ఊళ్లేలాలనుకుంది. లేక లేక పుట్టిన కూతురు మున్నీ. ఆమె అభ్యున్నతిని అంతగా ఆశించడంలో తల్లిగా ఆమె తప్పుకాదు.

భర్త చాన్‌బాషాను ఒప్పించి ఎట్టకేలకు తన మున్నీని దగ్గర్లో ఉన్న 'వెంక టేశ్వర విద్యామందిర్'లో చేర్పించింది. పేరు ఏదైతేనేమి తన బిడ్డకు చదువు రావాలను కుంది గౌసియా. ఒక్క మున్నీనే కాదు- గౌసియాలాగా ఆలోచించేవాళ్లెందరి పిల్లలో తెలుగు స్కూళ్లలో చదువుకుంటున్నారు. వాళ్లు ఇచ్చే డ్రెస్సులు వేసుకుని, వాళ్లిచ్చే బెల్టులు పెట్టుకుని సరస్వతిమాత వళ్లో బీబీలై కదుల్తున్నారు.

స్కూల్లో చేర్చిన నాలుగు రోజులకే "అమ్మీ... ఇస్కూల్ డ్రెస్..." అంది మున్నీ. మారుమాట్లాడకుండా చాన్‌బాషాకు చెప్పి రెండు స్కూలు డ్రెస్సులు కుట్టించింది. స్కూలు డ్రెస్సులో కళకళలాడుతూ తోటి పిల్లలతో కలసి మున్నీ వెళ్తుంటే గౌసియా చూసి ఎంతో ఆనందించింది. తన ఆశలు అప్పుడే నెరవేరినట్టుగా ముచ్చటపడింది. ముద్దుల మున్నీపై మరిన్ని ముద్దులు కురిపించింది.

స్కూలు వాళ్లు ఇచ్చిన ఐడెంటిటీ కార్డులో వేంకటేశ్వరుని బొమ్మ ఉంది. ఎవరూ అభ్యంతరం చెప్పలేదు. స్కూలువాళ్లు యిచ్చిన బెల్టులో వేంకటేశ్వరుని బొమ్మ ఉంది. ఎవరికీ తప్పనిపించలేదు. అసలు స్కూలు పేరే తెలుగుదేవుడు పేరైనప్పుడు- చదివే చదువే తెలుగైనప్పుడు ఇలాంటి చిన్నచిన్నవన్నీ ఎవరు పట్టించుకుంటారు. అందుకే ఎవరూ పట్టించుకోలేదు.

కానీ చివరికి వాళ్ళిచ్చే బహుమతుల్లో కూడా దేవుళ్ల బొమ్మలు కనిపిస్తుంటే గౌసియాకు బాధ కలిగింది.

మొన్న ఆగస్టు పదిహేను రోజు స్కూల్లో చాక్లెట్లు పంచారు. ఆ చాక్లెట్‌పై మాత్రం దేవుళ్ల బొమ్మలు లేవు. సంతోషం- అనుకుంది.

అంతకు ముందు పెట్టిన పరుగుల పోటీల్లో మున్నీ ఫస్ట్ వచ్చింది. ఆటల్లో కూడా మున్నీ బెస్ట్ అవుతున్నందుకు గౌసియా సంతోషించింది. మున్నీకొచ్చిన బహుమతిని టీవీ మీద అందంగా పెట్టి వచ్చిన వాళ్ళందరికీ తన కూతురు ప్రతిభ గురించి చాటింది.

ఒకరిద్దరి కామెంట్లు వినేంతవరకు కూడా బహుమతిగా ఇచ్చిన మెమెంటోలో ఉన్న వేంకటేశ్వరుడి బొమ్మ ఆమెను అంతగా బాధించలేదు. బహుమతి- బహు మతే. తన కూతురి ప్రతిభను మెచ్చి ఒక చిన్న చెంచా ఇచ్చినా గౌసియా సంతోషం గా స్వీకరించేది. కానీ దేవుని బొమ్మ ఉన్న మెమెంటో ఇచ్చి తెగ ఇబ్బంది పెడు తున్నారు అనుకుంది.

అదే వీధిలోని జైతూన్‌బీ ఆపా కూతురు రుబీనా కూడా అదే స్కూల్లో మున్నీతోపాటే చదువుకుంటోంది. రుబీనా కూడా చాలా తెలివైన పిల్ల. అప్పుడే ఎక్కాలన్నీ ఒప్పజెప్పేస్తోంది. సుమారైన తెలుగు పేర్లు పలికేస్తోంది. ఆ- రుబీనాకు కూడా మొన్న స్కూల్లో పాట పాడినందుకు బహుమతిచ్చారు. కానీ జైతూన్‌బీ ఆపా దాన్ని ఎప్పుడూ బయటపెట్ట లేదు. లోపల బీరువాలో పెట్టేసింది. మున్నీకొచ్చిన బహుమతిని తాను టీవీపై పెట్టడం చూసి రుబీనా కూడా తన బహుమతిని షోకేస్ లో పెట్టమని ఒక్కటే గోల చేస్తోందట. జైతూన్‌బీ ఆపా ఫోన్ చేసి మొన్న విషయం చెప్పింది. అప్పటికీ గౌసియాకు 'బుడ్డి' వెలగలేదు. ఇప్పుడర్థమైంది. స్పష్టంగా అర్థమైంది. జైతూన్‌బీ ఆపా రుబీనా కొచ్చిన బహుమతిని బీరువాలో ఎందుకు పెట్టిందో...! ఇంకా నయం పడేయలేదు- మెంటల్ది- అంతపనైనా చేయగలదు. రుబీనా ఇంకా మొండిపట్టు పడితే దానికి నాలుగు తగిలించి బిస్కెట్టయినా ఇప్పిస్తుందేమో కానీ ఆ బహుమతి విషయంలో మాత్రం రాజీపడేలా లేదు- అవున్లే తానైనా ఎన్నిసార్లు రాజీపడుతుంది. ఎన్నింటికి రాజీపడుతుంది- చాన్‌బాషా వచ్చాక విషయమంతా వివరించాలనుకుంది గౌసియా. ఆ నిర్ణయంతో మనసు కాస్త కుదుటపడేసరికి వెళ్లి కాఫీ పెట్టుకుని తాగింది.

❊

సాయంత్రం ఆరుగంటలైంది. ట్యూషన్ నుంచి మున్నీని తీసుకుని ఇంటి కొచ్చాడు చాన్‌బాషా. అప్రయత్నంగానే టీవీ మీద కళ్లేసి 'వెండిబొమ్మ ఏదీ?' అన్నాడు.

"తీసి పడేశాను..."- అంది గౌసియా కసిగా.

"తీసి పడేశావా? ఎక్కడా?"- అరిచినంతపని చేశాడు చాన్‌బాషా.

"కంగారుపడకండీ... బీరువాలో పెట్టాలెండీ...!"- అంది మళ్లీ కొంచెం గొంతు తగ్గించి. సావధానంగా మాట్లాడటమే మంచిదనుకుంది గౌసియా.

"ఏం ఎందుకని...! అది చూస్తే ఏడుస్తుందేమో...!"- అన్నాడు చాన్‌బాషా మున్నీని ఉద్దేశించి. మున్నీ తండ్రితో ఇంట్లోకి వచ్చినట్లే వచ్చి మళ్లీ బయటికి పరిగెత్తింది ఆడుకోవడానికి.

"ఏడిస్తే నాలుగు తగిలించేది" అంది గౌసియా.

"ఏం... ఎందుకొచ్చిందంటా... అంత కష్టం-" అన్నాడు చాన్‌బాషా.

"ఏం మీకు తెలియదా... దానిమీద తెలుగోళ్ల దేవుని బొమ్మ ఉంది. అందరూ అరుచ్చాండారు. మొన్న మా అమ్మ అరిచింది. ఇప్పుడు పక్కింటి పొలాయమ్మ పార్వతమ్మ అర్చింది..." అంది.

"ఎవరైనా సాయిబులు ఇంటికొస్తే ఏమనుకుంటారు" అంది మళ్లీ- తానే సమస్య తీవ్రత చాన్‌బాషాకు అర్థం కావాలని.

"కరెక్టే... కానీ ఏం చేయలేం కదా" అన్నాడు చాన్‌బాషా.

"ఏం చేయలేం ఏంటీ... ఆ స్కూల్లో కేవలం తెలుగోళ్ల పిల్లోళ్లకే సదువు సెబ్తాండారా... సాయిబులకూ చెప్పడం లేదా... సాయిబులు కూడా తెలుగు నేర్చు కుంటాండారు కదా. మళ్ల సాయిబుల పేర్లు ఎందుకు పెట్టరు. చివరికి సాయిబుల టీచర్ స్కూలు నడుపుతాన్నా గూడా... ఏ తెలుగు పేరో పెట్టుకోవాలా... లేదంటే స్కూలు జరగదు. స్కూలుకు పిల్లల్ని పంపరు. ఇయన్నీ ఎందుకండీ... అందరూ కల్సి చదువుకునే స్కూళ్లకు- దేవుళ్ల పేర్లు లేకుండా ఏ మామూలు పేర్లో పెట్టొచ్చు కదా... మతాన్ని తెలిపే పేర్లు ఎందుకు. చదువుకి లేని మతం ఆ చదువు చెప్పే స్కూళ్లకు ఎందుకుండాలి. పువ్వుల పేర్లు, చెట్ల పేర్లు, ప్రకృతి పేర్లు స్కూళ్లకు పెట్టి వాళ్లిచ్చే బెల్టుల్లో, స్కూలు డ్రస్సుల్లో, బహుమతుల్లో అచ్చెయ్యొచ్చు కదా...! ఎక్కడ చూసినా ఈ దేవుళ్లగోల ఏంటి?"- గౌసియా ఆవేశంగా చెప్పుకుంటా వెళ్తోంది.

చాన్‌బాషా ఆలోచనలో పడ్డాడు. గౌసియా ఎంత తెలివిగా ఆలోచిస్తోంది. గౌసియాకున్న బుద్ధి చదువుకున్న వాళ్లకు, చదువు చెప్పేవాళ్లకు ఎందుకు లేదు. స్కూలు వాళ్లు ఇచ్చే వస్తువుల్లో మతాలు తెలిపే గుర్తులు లేకుండా జాగ్రత్తపడమని వెంకటేశ్వర విద్యామందిర్‌లో పనిచేసే తన స్నేహితుడు రామిరెడ్డికి చెప్పాల. రామిరెడ్డి మంచోడు. తన మాట వింటాడు.

"ఆపు ఇక నీ సోది. రేపెల్లి నేను స్కూల్లో మాట్లాడతా..." - అన్నాడు చాన్ బాషా ఆరుబయటకు నడుస్తూ.

"మీరొక్కరే వెళ్తే వింటారా... ఏంటి?... ఆ స్కూల్లో ఎవరెవరు సాయిబుల పిల్లకాయలు చదువుకుంటాండారో... వాళ్ల పెద్దలందర్నీ తోడు తీసుకెళ్లండి..." అంది గౌసియా.

"మళ్లీ చాకులాంటి సలహా ఇచ్చిందిది..." అని ఆశ్చర్యపోయాడు చాన్‌బాషా. అవును ఒకరు చెప్పిన మాట కంటే పదుగురు చెప్పిన మాటకే విలువ ఎక్కువ.

"ఇలా బహుమతుల్ని, పిల్లల ప్రతిభల్ని బీరువాల్లో పెట్టి బిగించిన తల్లి దండ్రులూ... మేల్కోండి... వస్తున్నా...!" అనుకుంటూ మొదట జైతూన్‌బి ఆపా ఇంటికే నడిచాడు చాన్‌బాషా.

*అరుణతార, జనవరి-ఫిబ్రవరి 2007*

# చాపరాయి

అక్కడ ఆ బోర్డు చూసి నాకు దిమ్మ తిరిగిపోయింది.

“ఇది కూడా వృత్తిగా మారిందా? మనుషుల్లో ఇంత వ్యాపార సంస్కృతా?” అని. కాసేపు జీర్ణించుకోలేకపోయాను. అది అరకులోయలోని చాపరాయి ప్రాంతం. ఎక్కడ చూసినా రాళ్ళు విశాలంగా వరుసగా చాపలు పరిచినట్లుగా ఉన్నాయి. వాటిని చూస్తే ఎంతో ముచ్చటేస్తుంది. అసలు ఆ ప్రాంతానికి ఆ పేరెందుకు వచ్చిందో ఆ రాళ్ళను చూస్తే ఇట్టే అర్థమైపోతుంది.

కొండలు దాటాం... కోనలు దాటాం... సిటీ జీవితానికి దూరంగా ఓ మూడు రోజులు హాయిగా గడుపుదామని నేను, సరిత ఇద్దరం అరకు బయల్దేరి వచ్చాము. బొడ్డోడికి ఏడు నెలలే. ప్రయాణం చేయడం మంచిది కాదని ఇరుగుపొరుగు వారు చెబుతున్నా వినకుండా వెంటేసుకొచ్చాం. ఇంకా పాలు కూడా మరవనివాణ్ణి ఎక్కడని వదుల్తాం. అందుకే వాణ్ని బేబీ క్యారియర్‌లో కుక్కుకుని మెడకు తగిలించుకుని తిరుగుతున్నాం. అరుకులో లాడ్జిలో దిగి ఫ్రెష్ అయి ఆటో మాట్లాడుకున్నాం. అరకులో ఉండే రెండు రోజులూ అక్కడి అన్ని ప్రాంతాలకు తిప్పడానికి ఆటోవాడు

బేరం కుదుర్చుకున్నాడు. ఆ వెంటనే అతను మొట్టమొదటగా, 'షూటింగ్ స్పాట్... చాపరాయి' చూపిస్తానని ఇక్కడికి తీసుకొచ్చాడు.

ప్రాంతం బావుంది. విశాలమైన రాళ్ళ మధ్య ఎక్కడి నుంచి వస్తున్నాయో నీళ్ళు సన్నగా ఆకాశం రంగులో ప్రవహిస్తున్నాయి. అయితే ఒకటే బాధ.

హైదరాబాద్‌లోని చార్మినార్, గోల్కొండ కోట లాంటి చారిత్రక కట్టడాలకే కాదు ఇలా ఎక్కడో దూరంగా అడవుల్లో సహజసిద్ధంగా పుట్టిన రాళ్ళకు కూడా ఆకతాయి రాతల నుంచి రక్షణ కరువైంది. ఇందాక ఆటోవాడు చెప్పినట్టు ఇది షూటింగ్ స్పాట్‌ని కాదు లవర్ స్పాట్‌ని తలపిస్తోంది. ఎక్కడ చూసినా రాళ్ళ మీద ప్రేయసీ ప్రియుల పేర్లు... ప్రేమ గుర్తులూ ఉన్నాయి. అది కూడా రకరకాల రంగుల్తో. వాటిని చూడగానే మనసు చివుక్కుమంది. ప్రేమించడం తప్పు కాదు... కానీ ప్రేమ పేరుతో ప్రకృతి సంపదను నాశనం చేయడం తప్పు. నాకు ఎఫ్.ఎమ్.లో రేడియో జాకీగా పనిచేసినప్పటి రోజులు గుర్తుకొచ్చాయి. అప్పట్లో ఆ టాపిక్ మీద పెద్ద చర్చే పెట్టి శ్రోతల అభిప్రాయాలు కోరాను నేను.

'ప్రేమ ఎక్కడపడితే అక్కడ తమ ఉనికిని చాటుకోవడానికి ప్రయత్నిస్తుందని' కొంతమంది యువ శ్రోతలు చెప్పారు. మరికొంతమంది, 'ఎంత దాచినా దాగకుండా పైపైకి ఉప్పొంగి ఇలా రాతల రూపంలో బయటపడుతుంద'ని వాదించారు.

ఇంకొంతమంది శ్రోతలు, 'ఈ రాళ్ళల్లో ఈ ఇసుకల్లో తమ పేర్లు శాశ్వతంగా ఉండాలని ప్రేమికులు కోరుకుంటారు. అందుకే ఇలా ఎక్కడ పడితే అక్కడ రాసి సంతృప్తి పడతారని' చెప్పారు.

ప్రేమ శాశ్వతం కావాలంటే హృదయాంతరాల్లో బలంగా ముద్రించుకోవాలి కానీ ఇలా చేతుల మీద, కాళ్ళ మీద, చెట్ల మీద, రాళ్ళ మీద, ప్రకృతి కట్టడాల మీద, బాత్‌రూమ్ గోడల మీద, బస్సులో లేడీస్ సీట్లకు వెనకాల రాసినంత మాత్రాన శాశ్వతం కాదని నా వాదన. కొంతమంది విభేదించారు. కొంతమంది సమర్థించారు. 'లేడీస్ సీట్ల వెనకాల పేర్లు రాసే ఆకతాయిలతో పవిత్ర ప్రేమికులమైన మమ్మల్ని పోలుస్తావా...?' అని మరికొంతమంది ఆగ్రహించారు. ఏమైతేనేమి ఆరోజు నా అభిప్రాయంతో చాలామంది ఏకీభవించారు. ఒక్క ఎఫ్.ఎమ్‌లోనే కాదు ఆ తర్వాత ఒకటి రెండు పత్రికల్లో కూడా ఇదే టాపిక్ పై వ్యాసాలు రాసి మెప్పించాను. ప్రేమ పేరుతో ఉన్మాద రాతలు రాసే వాళ్ళ ఆట కట్టించడానికి ప్రయత్నించాను.

అంతటి కరడు కట్టిన ప్రకృతి ఆరాధకుణ్ణయిన నాకు ఆ బోర్డు ఎంతగా షాకిచ్చిందంటే సదరు బోర్డుదారుణ్ణి పట్టుకుని తన్నాలన్నంతగా.

కానీ 'కోపం వలదు. శాంతమే అన్ని వేళలా జయము... జయము...' అని మా ఆవిడ తరచూ అనే మాటలు గుర్తొచ్చి ఊరుకున్నాను. మరోసారి ఆ బోర్డు వైపు చూశాను.

'రాళ్ళ మీద పేర్లు రాయబడును... పేరు ఒక్కింటికి రూ. 60' అని ఉంది. అది బోర్డు అంటే బోర్డు కూడా కాదు. ఒక అట్టముక్క మీద అక్షరాలు రాసి దాన్ని ఓ పొడుగాటి కట్టెకి కట్టి, ఆ కట్టెని కొంచెం ఏటవాలుగా ఉన్న ఓ చాపరాయి మీద మట్టిపెళ్ళలకు ఆనించి నిలబెట్టారు. ఆ బోర్డు కిందే ఓ వ్యక్తి కొన్ని రంగు డబ్బాలతో కూర్చొని ఉన్నాడు.

అరకులాంటి టూరిస్టు ప్లేసుల్లో ఇలాంటివి సహజమేమో కానీ... నేను చూడటం మాత్రం ఇదే మొదటిసారి. ఇదేదో మామూలు విషయమైనట్టు మిగతా వాళ్ళు ఎవరూ ఆ బోర్డు గురించి పట్టించుకోలేదు. 'పట్టించుకోనుంటే, వాళ్ళకు ఆ స్పృహే కనుక ఉంటే ఈ రాళ్ళెందుకు ఇలా పాడయ్యేవి...?' అనిపించింది.

మొదట రాళ్ళ మీద ప్రేమికుల పేర్లు చూసి స్వయంగా కుర్రాళ్లే ఇక్కడికొచ్చి ఇలా రాసుకున్నారేమో అనుకుని వాళ్ళ మీద కోపం కలిగింది.

కానీ ఇది ఏకంగా ఓ వృత్తిగానే అవతరించిందని తెలిసి కడుపు మండింది.

ఈ అడవుల్లో ఇంత అందంగా పుట్టిన సహజసిద్ధమైన చాపరాళ్ళను చూడ్డానికి నిత్యం అనేకమంది యువతీయువకులు వస్తుంటారు. వాళ్ళకు ఈ రాళ్ళ మీద పేర్లు రాసుకోవాలని బుద్ధి పుడుతుంది. ఆ బుద్ధినే క్యాష్ చేసుకోవాలనుకుంటున్నారు ఇలాంటి వాళ్ళు. అందుకే ఎంచక్కా రెండు రంగు డబ్బాలు, ఒక పెయింట్ బ్రెష్షు తీసుకుని రెడీ అయిపోయారు. టూరిస్టులను, ముఖ్యంగా యువతీ యువకులను కదిలించి వాళ్ళను కన్విన్స్ చేసి, వాళ్ళకు ఆ ఆలోచన లేకపోయినా ప్రేరేపించి వాళ్ళ పేర్లను రాళ్ళ మీద పెయింటుతో రాసి డబ్బులు వసూలు చేస్తున్నారు. 'ఎంత అన్యాయం? ఈ పవిత్ర భారతదేశంలో ప్రతి మూలకి బ్రిటీషోళ్ళ వ్యాపారసూత్రం బాగా పాకిపోయింది' అనుకున్నాను. పైగా ఈ వృత్తికి కాసింత ఇంగ్లీషు, కాసింత తెలుగు తెలుసుంటే చాలు... హాయిగా బతికేయొచ్చు.

ఇక్కడ రాళ్ళ మీద రాసిన పేర్లలో అక్షర దోషాలు ఏమైనా కనిపిస్తాయేమోనని దూరంగా చూశాను. ఎంతైనా జర్నలిస్టును కదా... నా దృష్టి నాకుంది. ఆ దృష్టితోనే చూశాను కానీ ఎక్కడా తప్పులు కనిపించలేదు. అయినా తమ పేర్లు తెలుగులో,

ఇంగ్లీషులో ఎలా రాయాలో టూరిస్టులే ఒక కాగితం మీద రాసిస్తారు... కాబట్టి తప్పుల్లేకుండా రాయడం ఇలాంటి పెయింటర్లకు పెద్ద కష్టమేమీ కాదు.

'కానీ ఇక్కడ ఇంత జరుగుతుంటే పర్యాటకశాఖ అధికారులు ఏమి చేస్తున్నట్టు? 'చారిత్రక కట్టడాల దగ్గర గోడల మీద పేర్లు రాయడం నేరం' అనే ఓ హెచ్చరిక బోర్డు పెట్టి చేతులు దులుపుకునే వీళ్ళు కనీసం ఆ పని కూడా ఇక్కడ ఎందుకు చేయలేదు? అంటే వీరి దృష్టిలో సహజసిద్ధంగా పుట్టిన ఈ రాళ్ళకు విలువ లేదేమో?'

ఆలోచించుకుంటూనే మెల్లగా సదరు బోర్డుదారుని దగ్గరికి వెళ్ళాను. నా వెంటే సరిత కూడా నడిచొచ్చింది. ఆ వ్యక్తికి ముప్ఫై... ముప్ఫై రెండేళ్ళుంటాయి. గడ్డం పెరిగింది. నెత్తికి ఓ పాత టవలు చుట్టుకున్నాడు. పొడుగాటి చారల చొక్కా నల్లటి ప్యాంటు వేసుకోనున్నాడు. చేతిలో రెండు రకాల రంగుడబ్బాలున్నాయి. ఒకటి పసుపు, మరొకటి ఎరుపు. మరోచేతిలో ఓ నల్లటి బ్రెష్షు ఉంది.

అతని కళ్ళల్లోకి సూటిగా చూస్తూనే... నవ్వు మొహం పెట్టాను.

అతను కూడా నవ్వాడు.

"పేర్లు రాయాలా సారూ..." అన్నాడు కూర్చొనే.

"అక్కర్లేదు..." అన్నాను.

"ఇలా రాళ్ళపై పేర్లు రాసి రోజుకెంత సంపాదిస్తావేంటి?" అని అడిగాను మెల్లగా మాటల్లోకి లాగుదామని.

"ఎంత సారూ... మీలాంటి మారాజులు దయతలిస్తే రోజుకు ఐదారు వందలు అంతే. మీరు కూడా పేర్లు రాయించుకోండి సారూ. మీ పేరు, మేడమ్ పేరు అదిగో అక్కడ కనిపిస్తున్న ఆ కొండ మీది రాతిపై అందంగా రాస్తాను..." అన్నాడతను.

నాకు మరింత బాధేసింది.

"నువ్వు చెప్పేది బాగానే ఉంది కానీ నేనో మాట చెబుతాను, ఏమనుకోవు కదా..." అన్నాను శాంతంగా.

"చెప్పండి సారు..." అన్నాడు.

"ప్రకృతి సిద్ధంగా పుట్టిన అందమైన రాళ్ళని ఇలా పేర్ల పేరుతో పాడు చేయడం తప్పు కదా..." అన్నాను.

అతనికేం మాట్లాడాలో అర్థం కాలేదు. ఓ అయోమయ నవ్వును ముఖానికి తగిలించుకున్నాడు.

"అసలు ఏం పేరు నీ పేరు?" అడిగాను మళ్ళీ.

"రామారావు సార్..." అన్నాడు.

"అబ్బో ఎన్టీఆర్ పేరు పెట్టుకున్నావే... ఆయన సినిమాలంటే ఇష్టమా..."

"అవును సార్..." ఈసారి అతను మనస్ఫూర్తిగా నవ్వాడు.

అతని దృష్టి నా పొట్ట మీద బేబీ క్యారియర్‌కి వేలాడుతున్న మా బొడ్డోడి మీద పడింది.

ఏమనుకున్నాడో ఏమో ఎదురు ప్రశ్న వేశాడు.

"సార్... పొట్టకూటి కోసం రాళ్ళ మీద పేర్లు రాస్తుంటేనే మీరు నన్నింతగా అంటున్నారు... మరి మీరుచేస్తోందేంటి సార్... హాయిగా ఆడుతూ పాడుతూ తిర గాల్సిన పిల్లాడ్ని ఇలా చెట్టుకు ఉరేసినట్టు వేలాడేసుకుని తిరగడం తప్పు కదా సార్..." అన్నాడు.

నాకు షాక్ తగిలినట్లయింది.

వీడెబ్బ ఏం ప్రశ్న వేశాడు వీడు...? అసలు నాకాలోచనే రాలేదు. ఇందా కట్నుంచి నాతోనే తిరుగుతున్న మా ఆవిడ కూడా తన పొట్టన పుట్టిన బిడ్డపై జరుగు తున్న హింసను గుర్తించలేకపోయింది. బేబీ క్యారియర్‌లో బాబును వేలాడేసుకుని కొద్దిసేపటి క్రితమే ఓ అందమైన పూలమొక్క దగ్గర నిలబడి ఫోటోకి ఫోజు కూడా ఇచ్చాను.

డిజిటల్ కెమెరా ప్రివ్యూలో ఆ ఫోటోను చూసుకుని మురిసిపోయాను. "బిడ్డ నెత్తుకొని అచ్చం ఆస్ట్రేలియాలో కంగారూలా ఉన్నావని..." మా ఆవిడ అంది. నా కళ్ళకు కూడా అలాగే అనిపించింది కానీ ఇలా చెట్టుకు ఉరేసినట్టుగా అనిపించలేదు. ఇప్పుడు రామారావు కళ్ళతో చూస్తే నాక్కూడా అలాగే అనిపిస్తోంది.

నిజమే... ఈ అందమైన ప్రకృతి, పచ్చదనం, రాళ్ళు, నీళ్ళు, గాలి... పిల్లాడిని కాసేపు కింద వదిలితే కదా వాడు వీటిని ఆస్వాదించి ఆడుకునేది. ఇక్కడికొచ్చింది ఒక్క నా కోసం... మా ఆవిడ కోసమే కాదు కదా... పిల్లాడి కోసం కూడా...! వాడికి కూడా ఓ ప్రాణం ఉందని గుర్తించాలి కదా... నాకు తెలియకుండానే నా వల్ల ఎంత హింస జరిగిపోతోంది... అల్లాడిపోయాను.

ఏం చెప్పాలో తెలియక... "పిల్లాడిని ఎత్తుకుని తిరగాలంటే బరువు కదా... అందుకే ఈ కేరి బ్యాగ్..." అన్నాను.

"పిల్లాడు బరువేంది సార్. చెట్టుకు కాయ ఎక్కడైనా బరువైతాదా? నేను మావాణ్ణి పొద్దునే భుజాల మీదికి ఎక్కించుకుని పొలాలన్నీ తిరిగేసొస్తాను. ఆ తర్వాతే ఈ వృత్తిలోకి వస్తాను..." అన్నాడతను.

నిజమే... చెట్టుకు కాయ బరువవుతోంది. సరితకి నార్మల్ డెలివరీ కష్టమై సిజేరియన్ అయ్యింది. అసలే బక్కగా ఉండే ఆ మనిషి మరింత బక్కగా మారింది. ఎంతగా అంటే బాబును ఎత్తుకోవడానికి కూడా తెగ ఆయాసపడిపోయేంతగా. ఎప్పుడు బయటికెళ్ళినా బాబు బరువంతా నామీదే పడిపోతుంది. అసలు ఇంటి నుంచి బయల్దేరాలనే ఆలోచన రావడమే ఆలస్యం, 'బాబును ఎవరెత్తుకుంటారు?' అనే ప్రశ్న ఉదయిస్తోంది.

అంతకుముందు మేము ఫ్రీ బర్డ్స్. ఎక్కడికెళ్ళాలన్నా క్షణాల్లో తేలిపోయే వాళ్ళం. ఇప్పుడలా లేదు పరిస్థితి. ఒకటికి రెండుసార్లు ఆలోచించి బయటికి అడుగు పెట్టాల్సి వస్తోంది. అసలే నాకు కొంచెం మెంటల్... చిరాగ్గా అనిపిస్తే ఎత్తుకోలేదని తెలిసి కూడా ఎత్తుకోమని సరితను పోరుతాను. గొడవ పెట్టుకుంటాను. ఆమె బాబును ఎత్తుకోలేదేమో కానీ గొడవ మాత్రం బాగానే పడుతుంది. మాటా మాటా పెరుగుతుంది. చివరికి ప్రోగ్రామే క్యాన్సిల్ అయిపోతుంది. ఒక్కోసారి వంతులు వేసుకుని కూడా పిల్లాణ్ణి ఎత్తుకుని తిరిగిన సందర్భాలున్నాయి.

చివరికి టూర్లో కూడా ఈ బాధలు పడలేమని అప్పటికప్పుడు బంజారాహిల్స్ లోని 'లిల్లిపుట్' షాప్‌కెళ్ళి రెండు వేల రూపాయలు పెట్టి ఈ బేబీ క్యారియర్ తీసుకుని రెడీ అయి వచ్చాము. దీనివల్ల సైడ్ ఎఫెక్ట్స్ కూడా ఉంటాయట. నెట్‌లో చదివాను. పిల్లలకు బ్యాక్‌పెయిన్ వచ్చే అవకాశం ఉందట. కానీ సైంటిఫిగ్గా, ఎక్కడా ప్రూవ్ కాలేదన్న ధైర్యంతో బాబును బేబీ క్యారియర్‌కి పరిమితం చేసి తిరుగుతున్నాను.

అప్పుడప్పుడు వాడు ఆ బేబీ క్యారియర్ నుంచి దింపమన్నట్టుగా అసౌకర్యంగా మెదులుతున్నాడు. ఉన్నట్టుండి ఏడుస్తున్నాడు... మళ్ళీ ఊరుకుంటున్నాడు. అది కూడా నేను గమనంలోకి తీసుకోలేదు.

'అందమైన రాళ్ళను పేర్లు రాసి పాడుచేస్తున్న రామారావు నేరస్తుడైతే, నా సౌకర్యం కోసం పసిప్రాణాన్ని బేబీ క్యారియర్‌లో పెట్టి బంధించిన నేనెవర్ని?'

రామారావు మీద కోపం పోయి అభిమానం కలిగింది.

అతని మాట తీరుకి, మేధస్సుకి ముచ్చటేసింది.

"సరే రామారావూ... నా తప్పు నేను తెలుసుకున్నాను. ఈ మాటని నేను ఎలాంటి భేషజం లేకుండా చెబుతున్నాను. మంచి మాట ఎవరు చెప్పినా వినాలి. నీ మాట విని బాబును కిందికి దింపడంలో నాకెలాంటి అభ్యంతరమూ లేదు," అంటూ నేను బేబీ క్యారియర్ నుంచి బాబును తీసి చాపరాయి మీద కూర్చో బెట్టాను. ఆ స్వేచ్ఛ కోసమే ఎదురు చూస్తున్నట్లు మావాడు కిలకిలా నవ్వాడు.

రెండు చేతులు రాయికేసి దబీదబీమని కొట్టాడు. పైకి మా అందరి ముఖాల వైపు చూసి చప్పట్లు కొట్టాడు. రెక్కల్లేవు కానీ ఒక రకంగా ఎగిరే సీతాకోకచిలుకే అయ్యాడు. మా ఆవిడ వెంటనే వాణ్ణి ఎత్తి పక్కనే ప్రవహిస్తున్న నీటిలో నిలబెట్టింది. కాళ్ళకు నీళ్ళు గిలిగింతలు పెడుతున్నాయేమో... మావాడు మరింతగా నవ్వి ముత్యాలరాశి పోశాడు. ఆటోమేటిగ్గా అక్కడున్న వారందరి దృష్టి మావాడి నవ్వు మీద పడింది.

నేను తీరిగ్గా రామారావు వైపు చూశాను. రామారావు కూడా నవ్వుతున్నాడు.

"ఇక నీ సంగతి చెప్పు. నేను నా తప్పు తెలుసుకుని సరిదిద్దుకున్నట్టే... నీవు కూడా నీ తప్పు తెలుసుకుని రాళ్ళపై రాయడం మానుకుంటావా...?" అని అడిగాను.

అతను ఏమాత్రం తడుముకోకుండా, "లేద్సార్... మానుకోను..." అన్నాడు.

నేను క్వశ్చన్‌మార్కు ఫేసు పెట్టాను.

అతను తీరిగ్గా అన్నాడు.

"నేను పెయింటింగ్ వేయనంత మాత్రాన ఇక్కడి రాళ్ళు పాడవకుండా ఉండవు. ఆ ప్రేమికులు తమ పేర్లు రాయకుండా ఉండరు. పైగా దేంతో పడితే దాంతో గీకి, బరికి ఇక్కడి అందాన్ని పర్మినెంట్‌గా పాడు చేస్తారు. అదే ఈ పెయింట్ తో పేర్లు రాస్తే నాకు బతుకూ గడుస్తుంది. రాళ్ళపై పేర్లు చూసుకుని మురిసి పోవాలనుకునే ప్రేమికుల కోరికా తీరుతుంది. అంతేకాదు వాళ్ళు అలా వెళ్ళగానే నేను ఇలా కిరసనాయిలు పెట్టి పెయింటు తుడిచేస్తాను కాబట్టి ఎలా ఉన్న రాళ్ళ అందం అలాగే ఉంటుంది. మళ్ళీ చెబుతున్నాను సార్... ఈ కిరసనాయిలు పెట్టి తుడిచేస్తే పెయింట్ పోతుంది... కానీ పిల్లల్ని హింసిస్తే ఆ పాపం తరతరాలకూ్కడా పోదు," చివర్లో శాపం పెడుతున్నట్లుగా అన్నాడతను.

శ్రీకృష్ణుడి ముందు గర్వభంగమైన అర్జునుడిలా అయ్యింది నా పరిస్థితి.

మౌనంగా ఉండటం తప్ప నాకు మరో గత్యంతరం లేకపోయింది.

*జూన్ 2011*

# ఆకుపచ్చ సంతకం

## డా॥ ఎ.కె. ప్రభాకర్

అస్తిత్వవాద సాహిత్య సృజన ఊపందుకున్నాక స్వీయ జీవితానుభావాలను రికార్డు చేయడం దగ్గర ఆగిపోయిన రచయితల్ని చూస్తే జాలేస్తుంది. ఎవరి అస్తిత్వ వేదనలు వాళ్లవే - ఎవరి సమస్యలు వాళ్లవే - ఎవరి పోరాటాలు వాళ్లవే -ఎవరి కథలు వాళ్లే రాసుకోవాలి అన్న ఆలోచన పాదుకొన్నాక మాత్రమే సమాజంలోని భిన్న సముదాయాల బహుముఖీన జీవనపార్శ్వాలు, ఆయా సామాజిక వర్గాల్లోంచి ఎదిగొచ్చిన రచయితల వైవిధ్యభరితమైన భాషా, వ్యక్తీకరణ రీతులు సాహిత్యంలోకి ఎక్కి వచ్చిన మాట వాస్తవమే కానీ ఇన్‌సైడర్స్ -అవుట్ సైడర్స్ అన్న విభజన యేర్పడ్డంతో కొత్త నష్టాలు కూడా సంభవించాయి. కేవలం స్వీయానుభావాల్ని అక్షరీకరించడంతో రచయితలకు పరిమితులు ఏర్పడ్డాయి. చాలామంది కుదించుకు పోయారు. తమ దృష్టిని విశాలం చేసుకోవడంలో విఫలమయ్యారు. ప్రతిభా వంతుడైన రచయిత ఏదో ఒక స్థాయిలో సొంత అనుభవాల పరిధిని అధిగమించి బయటి అంశాల్ని సానుభూతితోనో, సహానుభూతితోనో ఇతి వృత్తాలుగా స్వీకరించవలసి ఉంటుంది. తనకు తెలిసిన జీవితాన్ని గురించి రాయడంలో వెసులుబాటు ఉంటుంది. రచనకు ప్రామాణికతని సాధించ వచ్చు. అయినప్పటికీ రచయిత తన అనుభవాల పరిధిని విస్తరించుకోవాలి. తానెరుగని లోతుల్లోకి చూపుని ప్రసరింపజేయగలగాలి. అధ్యయనం ద్వారా,

తమని తాము డికాస్ట్, డిక్లాస్ చేసుకోవడం ద్వారా తమది కాని ప్రపంచంలోకి చొచ్చుకు వెళ్లి ఉత్తమ రచనలు అందించిన వారెందరో ఉన్నారు.

ఆ కారణంగానే ఓబయ్య (వేలూరి శివరామశాస్త్రి), కొత్త చెప్పులు (కరుణ కుమార్), వేర్లు (కేతు విశ్వనాథరెడ్డి), ఎల్లి (అరుణ), రాగో (సాధన), ఆమె ఇల్లు (కవనశర్మ), పహెచాన్ (గీతాంజలి) వంటి ఎన్నో ఉత్తమ రచనలు మనకు లభించాయి (ఈ లిస్టు కేవలం ఉదాహరణకు మాత్రమే).

స్వీయానుభావాల్ని సాహిత్యీకరించడంలో ఉన్న సాధకబాధకాల గురించి కూడా విస్తృతంగా చర్చ జరగాల్సే ఉంది. ఒడ్డున కూర్చున్న వాళ్లకి లోతు తెలీనప్పటికీ గజయీతగాళ్లు కూడా తమ సొంత సమాజం సంక్లిష్టతల లోతు ల్లోకి వెళ్లి- మునుగీత వచ్చినప్పటికీ- వుక్కిరిబిక్కిరి అయిన సందర్భా లున్నాయి. అందుకు కారణాలు ఎన్నయినా చెప్పుకోవచ్చు. కానీ ప్రధాన కారణం- సరైన ప్రాపంచిక దృక్పథం లేకపోవడమే. ఒక దృక్పథం కలిగి ఉండటం, సైద్ధాంతిక నిబద్ధతకి అంకితం కావడం కూడా నేరమేనన్న భావన ఆధునికానంతర సాహిత్య ధోరణిగా చెలామణి అవుతోన్న నేపథ్యంలో దృక్పథ రాహిత్యాన్ని సాహిత్య సృజనకు, రచయిత ఎదుగుదలకు ఆటంకం గా పేర్కొంటున్నందుకు ఎవరైనా తప్పుబట్టవచ్చు. కానీ తెలిసిన /తెలియని జీవితాన్ని అధ్యయనం చేయడానికి, అవగాహన చేసుకోవడానికి ప్రాపంచిక దృక్పథం తోడ్పడుతుంది. లేకుంటే చీకట్లో వెతుకులాటలా ఆగమ్యగోచరం గా ఉంటుంది. దృక్పథ రాహిత్యంతో కేవలం వాస్తవిక చిత్రణ వరకు ఆగి పోయిన రచయితలకీ యథాతథ వాదులకీ పెద్ద తేడా లేకపోవచ్చు. రచయితకుండే ప్రాపంచిక దృక్పథం అతని చూపుని విశాలం చేయాలి. రచనని తాత్వికస్థాయికి తీసుకుని వెళ్లగలగాలి. అది కళాత్మకంగా వ్యక్తం కావాలి. అంతిమంగా అది సమాజ పురోగతికి దోహదం చేయాలి.

పతంజలి 'పిలకతిరుగుడు పువ్వు' కథలో ఎస్.కోట మేజిస్ట్రేటు ఆలమండ దొమ్మికేసు పూర్వాపరాలు విచారణ చేశాక తీర్పునిస్తూ జీవితంలోకి తొంగి చూడకుండా వుండలేనట్టు - నేను కూడా వేంపల్లె షరీఫ్ 'జుమ్మా' కథలు చదివాక పై విషయాలు ముచ్చటించకుండా ఉండలేకపోయా.

ఎందుకంటే షరీఫ్ తన వైయక్తిక అనుభవాలను యథాతథంగా కథగా మలచడు. వాటిని పురోగామి చైతన్యంతో గతి తార్కికంగా విశ్లేషిస్తాడు. వాటికి సామాజిక వాస్తవికతని జోడించి సాధారణీకరిస్తాడు. అంతటితో

ఆగిపోక పాఠకుడిలో ఉత్తమ సంస్కారాన్ని ప్రేరేపింపజేయడానికి కళాత్మకం గా తీర్చిదిద్దుతాడు. ఉదాత్తమైన మానవీయ విలువల్ని పెంపొందించడానికి అతను కథనొక సాధనంగా ఎన్నుకున్నాడు. చిన్న వయస్సులోనే షరీఫ్ ఇంత పరిణతని సాధించడమే అబ్బురం. అతను తన జీవితాన్ని కథలకు వస్తువులుగా స్వీకరించాడు. తన సీమ నేల మీదే నిలబడి ఈ కథలన్నీ చెప్పాడు. తన ఇంటి భాషనే వాటిల్లో చెక్కాడు (ఒక్క 'చాపరాయి' మాత్రమే బయటి కథ- అందులో కూడా తానొక పాత్ర- అదీ ప్రకృతిని ప్రేమించే పాత్ర). అందుకే షరీఫ్‌ని 'నేల విడిచి సాము చేయని' రచయితగా కేతు మాష్టారు గుర్తించారు.

అమ్మ - అక్క- నాయన- జేజి-తాను, తన పేదరికపు బాల్యం- చదువు- తన చుట్టుపక్కల మనుషులు- యీ పరిధిని దాటిపోనప్పటికీ యీ పాత్ర లను అతను సార్వజనీనం చేశాడు. పసిపిల్లాడు చేతులకంటిన మట్టిని అందరికీ పూసినట్టు- యీ పాత్రలు మనందరి మనసుల్ని స్పృశించేలా చూశాడు. అతను కథలకు ముడి ఖనిజాన్ని ముస్లిం కమ్యూనిటీ నుంచే తవ్వి తీసినప్పటికీ దానికి సానబెట్టి మెరుగులు దిద్ది మానవీయ సంవేదనలు అద్దేటప్పటికీ అది కేవలం రాయలసీమ రత్నంగా మిగిలిపోక యీ నేలంతా కాంతులు చిమ్ముతోంది.

షరీఫ్ కథల్లో ఎక్కువ భాగం ఆత్మాశ్రయంగానే నడుస్తాయి. అయితే అతని ఆత్మే మన అందరిదీనూ. అతని బాల్యమే మనందరిదీనూ- అన్న భ్రమని కలిగిస్తాడు. అత్యంత నిరాడంబర కథనంతో తనతోపాటు మనల్ని తన ఊరికి, ఇంటికీ తీసుకుపోతాడు. అక్కడి మనుషుల్ని రక్తమాంసాలతో - మనో ధర్మాలతో పరిచయం చేస్తాడు. మనం ఆ కుటుంబంలో భాగమై పోతాం. ఆ జీవితాల్తో మమేకమైపోతాం. ఆత్మీయమైన శైలి ద్వారా, సాదా సీదా శిల్పం ద్వారా అతను ఈ అద్భుతాన్ని సాధించాడు.

షరీఫ్ కథలన్నింట్లో బలమైన జీవిత సంఘర్షణ ఉంది. ఆ ఘర్షణలో గెలు పోటములు ఉన్నాయి. ఆశ నిరాశలున్నాయి. కలలున్నాయి -కన్నీళ్లున్నాయి. దుర్భర దారిద్ర్యం ఉంది- అది పంచిన అంతులేని ఆవేదనలున్నాయి. వాటి నుంచి బయటపడాలనే పెనుగులాట ఉంది. వీటన్నింటినీ అధిగ మించడానికి మనుషుల మధ్య మమతలున్నాయి - నిష్కల్మషమైన

ప్రేమలున్నాయి. ఆచారాల్ని మించిన అనురాగాలున్నాయి. మతాన్ని మించిన మానవత్వం ఉంది.

షరీఫ్ కథల్లో ఎక్కడా సంక్లిష్టతకి చోటు లేదు. జీవితంలో ఉన్న సంక్లిష్టతని సైతం అతను తన కథల ద్వారా సరళం చేస్తాడు. అతని కథల్లో ఎక్కువ భాగం సింగిల్ పాయింటు మీదే నడుస్తాయి. వొక నిర్దిష్ట ప్రతిపాద్యాంశాన్ని ఆవిష్కరించడానికే ఉద్దేశించినవి. అయితే ఆ అంశాన్ని బలంగా చెప్పి తాత్త్వికస్థాయికి తీసుకెళ్లగల కళానైపుణ్యం అతనిలో నిండుగా ఉంది. ఎంతో సాదాసీదాగా ఉండే సాధారణ వ్యక్తుల జీవితాల ద్వారానే అతను అసాధారణ జీవిత సత్యాల్ని అందజేస్తాడు. 'పర్దా' కథలో జేజి, 'జుమ్మా' కథలో అమ్మ, 'ఆకుపచ్చ ముగ్గు'లో అక్క, 'తెలుగోళ్ల దేవుడు'లో గౌసియా ఇందుకు ఉదాహరణలు. ఈ పాత్రలు ముస్లిం మతం లోపలా బయట కూడా ఎదుర్కొంటున్న అనేకరూపాల అణచివేతలకి తమ తమ స్థాయిల్లో నిరసన తెలియజేస్తాయి.

మనిషి ముఖాలకు, ఇంటి గుమ్మాలకు పర్దాలు కట్టి గోషాపాటించే ఆచారం పనిపాట్లు చేసి పొట్టనింపుకునే పేద ముస్లింకి అక్కర లేదని, శ్రమ సౌందర్యానికి పర్దా అడ్డయి మనుషుల్ని 'పనికిరాని వాళ్లని' చేస్తుందనీ, పర్దా మనుషుల మధ్య దాపరికాల్ని సృష్టిస్తుందని కథలో జేజి ముఖమ్మీద కొట్టినట్టు చెప్పి కంటిచూపుకు అడ్డంగా కట్టిన సంప్రదాయం పర్దాని తొలగించింది. పర్దా వేసుకొని కొడుకు పంచన బతికే కన్నా 'నాలుగిళ్లు అడుక్కున్నా పర్వాలా' అని ధిక్కరించి గొప్పస్వేచ్ఛనీ, ఆత్మ విశ్వాసాన్ని ప్రకటించింది. పర్దా ఒక లేనిపోని భేషజం తప్ప కూటికీ గుడ్డకీ అక్కర వచ్చేది కాదని జేజి చేసిన యుద్ధ ప్రకటన ఆమె కొడుకుపైన కాదు- స్త్రీని అణచి ఉంచిన ముస్లిం పురుషాధిపత్య సమాజం మొత్తం పైన. నిజానికి అది వొక్క జేజిగొంతు మాత్రమే కాదు - పర్దాల చాటున మగ్గిపోతున్న కోట్లాది స్త్రీలది.

బురఖాకి వ్యతిరేకంగా బలమైన కవిత్వం ఇంతకుముందు వచ్చింది గానీ షరీఫ్ పర్దా కథలో జేజి ముఖత: వాడిన తార్కికభాష ఎదుటి మనిషిని నోరు తెరవనివ్వదు. పర్దాని చించి పోగులు పెట్టాలనిపిస్తుంది. కానీ 'గుమ్మానికున్న పర్దాని సర్దిపట్టుకుని నీళ్లు నిండిన కళ్లతో నిస్సహాయంగా చూస్తూ ఉండిపోయే' పరిస్థితే ఇంకా చాలాచోట్ల. అయితే -మనిషికి మనిషికి మధ్య

పరదాలు కట్టి గోషా పాటించే బుర్రల్లో (అది యే మతమైనా) ఆలోచనల ప్రకంపనల్ని సృష్టించడమే రచయిత ఉద్దేశ్యం. అది నూటికి నూరు పాళ్లు సఫలమైంది.

'జుమ్మా' కథ మరింత ఉద్వేగభరితమైంది. 'ఎటువంటి కోరికలు లేకుండా, ప్రతి శుక్రవారం మసీదుకు పోయి, నమాజు చేసి, పక్కన బాంబు పేలినా అల్లా మీదే ధ్యాస పెట్టి ప్రార్థించాలని కొడుక్కి హితబోధ చేసే తల్లే- మక్కా మసీదులో బాంబు పేలిందని విని- 'ఆ మసీదు కల్లా పోకు నాయినా' అని దీనంగా బతిమాలుతుంది. ఈ దేశంలో సగటు మనిషిని ఇంత అభద్రతకు, దయనీయమైన పరిస్థితికి నెట్టివేసిన పరిస్థితుల మీద వెగటు పుట్టించేలా షరీఫ్ రాసిన యీ కథ గుండెను కలచివేస్తుంది. కథలో తల్లీ కొడుకుల దు:ఖం వారిద్దరిది మాత్రమే కాదు మనసున్న ప్రతి పౌరుడిది. మమతున్న ప్రతి వ్యక్తిదీ. 'కన్నపేగు ముందు దేవుడు చేదయ్యాడన్న వాస్తవం వొక కోణం అయితే- బాంబుల సంస్కృతిని ప్రధాన కార్యాచరణగా మార్చుకున్న మతోన్మాదం మానవీయతకు పెనుసవాలుగా పరిణమించిన వైనం క్రోధాన్ని కలిగిస్తుంది. షరీఫ్ ఎంతో సంయమనంతో రాసిన ఈ కథ సాధించదల్చుకున్న ప్రయోజనం కూడా అదే. రక్తసిక్తమైన చరిత్ర పుట్టల్లోంచి వినిపించే తల్లి గోసని అర్థం చేసుకుంటే- ఎక్కడ వొక తుపాకీ తూటా పేలినా, బాంబు బద్దలైనా గాయం అయ్యేది తల్లి గుండెకే అని అమ్మ కడుపున పుట్టిన ప్రతి ఒక్కరూ అనుకుంటే- మతం పేరున జరిగే పవిత్రయుద్ధాలు, క్రూసైడులూ, భజరంగబలులూ ఉండవు కదా- అని కథ చదివాక అనుకోకుండా ఉండలేం.

వేంపల్లె గల్లీల తల్లి వొడి నుంచి ఎదిగి చార్మినార్ బురుజుల్ని ఎక్కిలోకం చూస్తున్న షరీఫ్ ఇన్ సైడర్‌గా మతాచారాల్లోని డొల్లతనాన్ని- అవుట్ సైడర్‌గా స్త్రీ హృదయాంతరాళాల్లోని కల్లోలాన్నీ, మతాల మధ్య నిలువునా గీసిన గీత మీద మనిషిగా నిలబడి మతపరమైన సాంస్కృతిక వైరుధ్యాల్లోని అసమంజసతనీ ఏకకాలంలో ఆవిష్కరించిన కథ- ఆకుపచ్చ ముగ్గు.

ముస్లిం కుటుంబంలో వాకిట ముగ్గులేయడం తప్పు. కానీ జీనత్ చదివేది తెలుగుబడిలో. ఉండేది హిందువుల ఇళ్ల మధ్య. ఆంక్షలు, నిషేధాల మధ్య ఇసుకలో, నీళ్లలో, గాల్లో ముగ్గులు చెక్కే జీనత్ చివరికి ఆచారానికి తలవొగ్గి

వాకిట్లో వేసే ముగ్గు డిజైన్లని అరచేతిలోకి గోరింటాకు డిజైన్లలోకి 'తర్జుమా' చేసుకుని కళాతృష్ణ ని తీర్చుకుంది.

'ముగ్గు ఇంటిముందు వేస్తే తప్పు కానీ చేతిలో వేస్తే కాదుకదా...! ఒక మతానికి మరో మతానికి మధ్య తేడా ఇంతేనా? ఇంత మాత్రం దానికేనా... ఇన్ని మత ఘర్షణలు జరుగుతుంటాయి?'

అని అమాయకంగా ప్రశ్నించిన జీనత్‌లో గొప్ప తత్త్వవేత్తని చూస్తాం. మత వైరుధ్యాన్ని ఎంత తేలికగా పరిష్కరించాడు షరీఫ్! అతనిలో ఈ తార్కికత ఎక్కడ నుంచి వచ్చింది- ఈ తర్కాన్ని కథగా మలిచే కళా వైదగ్ధ్యం ఎలా అలవడింది- సాంస్కృతిక ఆదాన ప్రదానాలకు సంబంధించిన ఎంతో సంక్లిష్ట మైన అంశాన్ని యింత సరళంగా సూటిగా తేల్చి చెప్పే చాతుర్యం ఎక్కడ అబ్బింది- ఇలా ఆశ్చర్యంతో కూడిన ప్రశ్నలు మనకు కలిగినప్పటికీ వాటన్ని టినీ మించి- 'నిజమే.. ఇన్ని కొట్లాటలు.. ఇంత హింస.. ఇంత ఉన్మాదం.. యిన్ని యుద్ధాలు అవసరమా?' అన్న ప్రధానమైన ప్రశ్న మనసులో నాటు కుంటుంది. ఎన్ని ఆంక్షలు విధించినా కళ దాని వ్యక్తీకరణకు దారులు వెతు క్కుంటుంది- అన్న మరొక పొర కూడా ఈ కథలో దాగి ఉంది. కళ మీద, కళాకారుడి మీద నిషేధాలు విధించి మాతృదేశానికి దూరం చేసిన మత మౌఢ్యంపట్ల, మతాల మధ్య లేని వైరుధ్యాలు సృష్టించి- చిచ్చు రగిల్చి ఆ మంటలో చలి కాచుకునే దుర్మార్గం పట్ల సిగ్గుపడేలా చేస్తుంది. ఆకాశమంత రాజకీయ- సాంస్కృతిక తాత్త్వికతని అరచేతిలోకి ఆకుపచ్చ ముగ్గుగా వొంపిన షరీఫ్ నేర్పు చూసి ముచ్చట పడకుండా ఉండలేం.

*'విష్ణుభక్తులెల్ల వెలిబూది పాలైరి*
*వాదమేల మత విభేదమేల?*
*తెలియలింగధరులు తిరుమంటిపాలైరి*
*విశ్వదాభిరామ వినురవేమ!'*

దైనందిన ఆచార వ్యవహారాల నుంచి, విధి నిషేధాల నుంచి, వైషమ్యాలను పెంచి పోషించే కుహనా మత సంస్కారాల నుంచి వొక తర్కాన్ని సాధించి దాన్ని తాత్త్విక స్థాయికి తీసుకెళ్లి జీవనసత్యాన్ని నిర్వచనంగా ఆవిష్కరించిన వేమన తిరుగాడిన నేల మీద కలంపట్టిన షరీఫ్ ఆ వారసత్వాన్ని అంది పుచ్చుకుని కొనసాగిస్తున్నాడనిపించింది.

షరీఫ్ కథల్లో ఎక్కువ భాగం ఏకాంశ ప్రతిపాదనోద్దిష్టాలని ఇంతకుముందు చెప్పుకున్నాం కానీ 'ఆకుపచ్చముగ్గు' అందుకు భిన్నంగా బహుముఖీనంగా సాగుతుంది. పెళ్లికి ముందు -'లావు లావు బుగ్గలు -చలాకీ కళ్లు - అప్పుడే చెట్టునుంచి కోసుకొచ్చిన బత్తాయి పండులా' ఉండే జీనత్ పెళ్లయి ముగ్గు రాడపిల్లల తల్లయి 'వాళ్లు ఎదిగొస్తుంటే తాను భయంలోకి ఒదిగిపోతూ కాలం గడుపుతూ' ముఖమంతా పీక్కుపోయి, కళ్లన్నీ కళతప్పి డీలా పడిపో వడానికి కారణాలేంటని స్త్రీ దృక్కోణం నుంచి ఆలోచింపజేసే మరో పొర, దాంతోపాటు ఆ కుటుంబంలోని వ్యక్తుల మధ్య సున్నితంగా అల్లుకున్న ఆత్మీయ సంబంధాలు మన మెదడుకు, మనసుకు పని చెబుతాయి.

'తెలుగోళ్ల దేవుడు' కథ కూడా అలాగే ఆలోచింపజేస్తుంది. 'అన్ని మతాల వాళ్లు కలసి చదువుకునే స్కూళ్లకు దేవుళ్ల పేర్లు, మతాన్ని తెలిపే పేర్లు కాకుండా పువ్వుల పేర్లు, చెట్ల పేర్లు, ప్రకృతి పేర్లు పెట్టి వాళ్లిచ్చే బెల్టుల్లో, స్కూలుడ్రెస్సుల్లో, బహుమతుల్లో అచ్చెయ్యెచ్చు కదా'అన్న గౌసియా ఆవేశంతో కూడిన ఆవేదన వినేదెవరు? చిన్నారుల ప్రతిభను గుర్తించి ఇచ్చిన బహుమతుల్ని బిడియంతో బీరువాల్లో దాచిపెట్టుకునే పరిస్థితి కల్పించే విద్యావ్యవస్థలోకి సెక్యులర్ భావన ప్రవేశపెట్టాల్సిన కర్తవ్యాన్ని బోధించిన కథ ఇది. అయితే మార్పు- గౌసియా, చాన్‌బాషా, రామిరెడ్డిలాంటి వ్యక్తులు మాత్రమే పూనుకుంటే రాదు- అదొక సామూహిక చైతన్యంతోనే సాధ్యమవు తుందన్న సూచనతో ఈ కథ ముగుస్తుంది.

'చదువుకి లేని మతం ఆ చదువు చెప్పే స్కూళ్లకెందుకుండాలి?'- అన్నది గౌసియా ప్రశ్న. నిజానికి మన చదువులు కూడా మతం గబ్బుకొడ్తూనే ఉన్నాయి. నాబోటివాడు తరగతి గదుల్లో బోధించే పాఠ్యపుస్తకాలు అశాస్త్రీ యాంశాల్తో నిండి మోరీల్లా ఉన్నాయి. పాఠశాలల్లో చిన్నారులు వేసే ప్రతి అడుగులోనూ ఏదో వొక రూపంతో మతం జడలు విచ్చుకుని నడయాడు తూనే ఉంది. కొన్ని కాన్వెంట్లు -ప్రత్యేక శిశు మందిరాలైతే పేరు- ఊరు- అడ్రస్- పాఠం- పాట అంతా మత విష మందిరాలుగా పాతుకుపోయాయి. కొన్ని సందర్భాల్లో, స్వయం ప్రతిపత్తితో విర్ర వీగుతున్నాయి. శాస్త్రీయ దృష్టితో కూడిన ప్రత్యామ్నాయ పాఠ్యప్రణాళికల్ని తయారుచేసుకోవడంలో కానీ, లౌకిక ప్రజాస్వామిక విద్యావ్యవస్థని ఏర్పరచుకోవడంలో కానీ ప్రగతిశీల ఉద్యమాలు విఫలమయ్యాయన్న విషాదం గుండెనుకోస్తుంది.

అందుకే- కలలో గానీ పావలా డబ్బులిచ్చి పండక్కి కూడా పలక కొనుక్కోలేని పసివాళ్ల దైన్యం (పలక పండుగ), వేసవి సెలవులకి విహారయాత్రల సంగతేమో కానీ అమ్మమ్మ ఇంటికి వెళ్లి సరదాగా గడపలేని పేదల నిస్సహాయత (దస్తగిరి చెట్టు), దీపం బుడ్డిలోకి కిరోసిన్ కొనుక్కోలేక 'చదువుకోవడమంటే భయమేసే' విద్యార్థుల బాల్యం (అయ్యవారి చదువు) - ఇటువంటి యథార్థ వ్యథార్త గాథలు ఇంకా మనల్ని నిత్యం కలవరపరుస్తూనే ఉన్నాయి. ఈ దుస్థితులన్నీ షరీఫ్ బాల్యంలోని చదువుల పర్వంలో వివిధ అధ్యాయాలే. సోషలిస్ట్, సెక్యూలర్ పునాదుల మీద నిర్మించామని చెప్పుకునే ఈ దేశంలో పేదరికం, మతం చదువుకు ఎంత విఘాతంగా తయారయ్యేయో తెలియజెప్పడానికే షరీఫ్ వాటికి కథారూపం కల్పించాడు.

కథారచనలో రచయిత పాటించాల్సిన తాటస్థ్యం గురించి, పొందాల్సిన తాదాత్మ్యం గురించి తెలుసుకోవడానికి ఈ కథలు ఎంతగానో తోడ్పడుతాయి. స్వీయ జీవితానుభావాలకే కథారూపం కల్పిస్తున్నప్పటికీ -షరీఫ్ ఎత్తి చూపిన అంశాలు కేవలం వైయక్తికమైనవికావు। మొత్తం వ్యవస్థకంతటికీ సంబంధించినవి. వైయక్తికతని సాధారణీకరించడంలో షరీఫ్ పాటించిన సంయమనం వల్ల అతని కంఠస్వరం ఎక్కడా దారి తప్పలేదు- కళాత్మక విలువల్ని మర్చిపోలేదు. తనది కాని జీవితాన్ని విశ్లేషించి కథలుగా మల్చగల నేర్పు షరీఫ్‌లో నిండుగా వుందనీ- ఆ దిశగా ముందు ముందు అతను దృష్టి పెట్టాలని ఈ కథలు చదివాక ఆశించకుండా ఉండలేం.

నిజానికి షరీఫ్ తొలిదశలో తన చుట్టూ ఉన్న జీవితాల్నే- తనను కల్లోల పరచిన సంఘటనల్నే తన కథలకు వస్తువులుగా స్వీకరించాడు. సీమ కడపలో పుట్టిన వర్ధమాన కథకుడిగా అతనికి గుర్తింపు తెచ్చిన 'జీపొచ్చింది' కథ (2003) కరువుసీమలో కరెంటు బాధితుడైన రైతు జీవితమే.

ప్రకృతి, ప్రభుత్వాలు కలసి కక్ష గట్టి సీమ రైతు జీవితంతో ఎలా చెలగాట మాడుతున్నాయో కళ్లకు కట్టినట్టు చిత్రించిన ఈ కథలో వెంకట్రెడ్డి మూడెకరాల శెనిక్కాయ చెట్ల ప్రాణం నిలపడానికి పడిన పాట్లు ఇంతకుముందు సీమ రచయితలు చెప్పినవే. ఒక విధంగా చూస్తే సీమ రైతుల సేద్యం చరిత్ర అంతా ఒకటే. కష్టాలు, కన్నీళ్లు, నష్టాలు, అప్పులు. దీన్ని ఎవరు రాస్తున్నారు- ఎవరు మారుస్తారు అన్నదే ప్రశ్న.

చుక్కలు చూసి చెమ్మకోసం బోరేసి, పూటకిన్ని పాలిస్తూ కుటుంబాన్ని రోడ్డున పడకుండా కాపాడుకొస్తున్న ఎనుమును తెగనమ్మి కరెంటుమోటరు పెట్టు కుంటే బిల్లు కట్టలేదని మీటర్ స్టార్టర్ని వెంకట్రెడ్డి ప్రాణాల్తో సహా కరెంటోళ్లు పీక్కు పోయిన చరిత్రనైతే హృదయవిదారకంగా వర్ణించాడు షరీఫ్. కథ ఎత్తుగడ-ముగింపు, కథనం- నిర్వహణ, అందులో వాడిన భాషా అన్నింటిలో చేయి తిరిగిన రచయిత మాత్రమే సాధించగల మెలకువ కని పిస్తుంది. దీంతో షరీఫ్‌కి 'జీపొచ్చింది షరీఫ్'గా పేరొచ్చింది.

దాదాపు అదే కాలంలో రాసిన 'రజాక్ మియా సేద్యం' కూడా రైతు జీవితమే. అయితే ఈ రైతు తిండికి నూకల్ని కూడా కాపోళ్ల వద్ద దీనంగా అప్పుతెచ్చు కునే నిరుపేద ముస్లిం. ఏ దుబాయికో, కోయిటుకో పోయి నౌకరినో చాకిరీనో చేసుకుని బతకాల్సిన సాయిబు- నాయన నుంచి సంక్రమించిన భూమిని నమ్ముకుంటాడు. కానీ దానికి నీళ్లకోసం ఏ రెడ్డినో ఆశ్రయిం చాల్సిందే.

'ఉద్ధతుల మధ్య పేదలకుండతరమా?' అన్న పద్యపాదం పుట్టిన సీమలో ఇద్దరు రెడ్ల- పెద్ద వ్యవసాయాల మధ్య పేద రజాక్‌మియా సేద్యం సాగు తుందా! దాదాహయాత్ చెప్పినట్టు- తెలుగుకథను గొప్పగా ప్రభావితం చేసిన రెండు జీవధారలు (సీమ -మైనార్టీ) యీ కథలో సంగమించాయి. (ఈరెండు కథల్ని షరీఫ్ విషాదాంతాలుగా మలిచాడు. 'రజాక్ మియా సేద్యం'లో అతని భార్యని చంపే ముగింపు అవసరంలేదేమో అని నాకనిపిం చింది. విషాదం గుండెను బలంగా తాకి నాలుగు కాలాలు గుర్తుంటుందని రచయిత భావించి ఉండవచ్చు. ఆ ముగింపు అనుభూతి ఐక్యతని కూడా దెబ్బతీసింది)

'రజాక్ మియా' కథలో కథనం కోసం కూడా షరీఫ్ అచ్చమైన కడప భాషనే వాడాడు. అది కథకు అపురూపమైన నిసర్గమైన అందాన్నిచ్చింది. 'తీగ సాగి పూలు పూచినట్టు అతని కథలు ఇప్పుడు గుబాళిస్తున్నాయి' -అని సౌభాగ్య ముచ్చటపడటానికి యీ భాష కూడా వొక కారణమేమో!

కథల్లోని నిరాడంబర శైలి, శిల్ప సౌకుమార్యం, భాషా సౌందర్యాలతోపాటు, కథల్లో ప్రధానంగా ప్రత్యక్షరంలోనూ పరుచుకుని ఉన్న కాలుష్యమంటని కరుణ, పదేపదే పల్లవించే మానవత్వం, మనుషుల మధ్య పెనవేసుకున్న

మమతానురాగాలు, వాటిని వ్యక్తం చేయడానికి పలికిన దయార్ద్ర స్వరం పాఠకుల్ని కదిలిస్తాయి.

మతాల్లేని, మతాల్లో పర్దాల్లేని, దారిద్ర్య పరివేదనల్లేని, ఆకల్లేని, అసమానతల్లేని ఒక కలని ఆకుపచ్చముగ్గుగా పాఠకుల అరచేతుల్లో అద్దుతున్నాడు షరీఫ్. అతని కథల్లో గొప్ప ఆర్తి ఉంది. అది మనలోకి డైరెక్టుగా ప్రవహిస్తుంది. అలా ప్రవహింపజేసే అద్భుతమైన రచనా కౌశలం షరీఫ్‌లో మెండుగా ఉందని అతని ప్రతి కథా నిరూపిస్తోంది.

తెలుగు కథ పుటల్లో ఇప్పుడు షరీఫ్ చేస్తున్న ఆకుపచ్చ సంతకం లయగా ప్రాణం పోసుకుంటోంది. అది బాగా 'పండి' ఎర్రెర్రగా మెరుస్తుందని ఆశంస.

*హైదరాబాద్, 14 ఏప్రిల్ 2012*
*(బాబా సాహెబ్ పుట్టినరోజు)*

*'వేంపల్లె షరీఫ్ కథలు - సౌభాగ్య పరామర్శ' పుస్తకానికి ముందుమాట*
*24 జులై 2013, ఆంధ్రభూమి (దిన) సాహితిలో ప్రచురితం*
*'సమకాలీనం' - కథావిమర్శ పుస్తకం నుంచి*

*( 22 మార్చి 2013, శుక్రవారం రోజున గౌహతిలో జరిగిన కేంద్రసాహిత్య అకాడెమి యువ పురస్కారాల ప్రదానోత్సవ సభలో చదివిన ప్రసంగం)*

# 'జుమ్మా' నాకు ఒక పునర్జన్మ

## వేంపల్లె షరీఫ్

మీ అందరికీ తెల్సిందే..'జుమ్మా' అంటే శుక్రవారం. శుక్రవారం అని పేరున్న నా పుస్తకానికి వచ్చిన అవార్డు శుక్రవారం రోజే అందుకోవడం నాకెంతో సంతోషాన్ని కలిగించింది. నిజానికి నాకు శుక్రవారమంటే భయం. చిన్నప్పటి నుంచి మా ఇంట్లో 'ఫ్రైడే సెంటిమెంట్' బలంగా ఉంది.

ఆ రోజు అల్లా దినం. అల్లా పని తప్ప ఏ పనిచేసినా కలసి రాదని భయం. పైగా కీడు జరుగుతుందని ఆందోళన. 'జుమ్మా' రోజు ఏడిస్తే మళ్లీ 'జుమ్మా' వచ్చే వరకు ఏడుస్తూనే ఉంటామని ఒక పిచ్చి నమ్మకం. అందుకే అప్పుడప్పుడు మా అమ్మ, నాన్న మీద చిరాకు పడేది. ''జుమ్మా రోజు ఏడిపిస్తావా.. బండరాయిూ..'' అని తిట్టేది.

అందరూ శుభకార్యాలు జుమ్మా రోజు చేస్తే మా ఇంట్లో మాత్రం చేసేవారు కాదు. ఒకవేళ అత్యవసరమై చేయాల్సి వొచ్చినా 'జుమ్మా సమయం' దాటి అంటే మధ్యాహ్న నమాజు సమయం దాటాక చేసేవాళ్లం. మధ్యాహ్నం నమాజు పూర్తయ్యేదాక జుమ్మా రోజు  అక్షరాలా ఏ పనీ చేసేవాళ్లం కాదు. అంతేకాదు జుమ్మా రోజు ఇంట్లో ఏవైనా వస్తువులు కింద పడ్డా అపశకునమని బాధపడేవాళ్లం. పొరపాటున గాజులు పగిలిపోతే అమ్మ తన గుండె పగిలినంతగా  బాధపడేది.

"శుక్రవారం పూట గాజులు పగిలిపోయాయి... ఇంకా ఏమేం పగిలి పోతాయో.." అని ఆందోళన చెందేది.

చిన్నపాటి నిమ్మకాయల వ్యాపారి అయిన మా నాయన మధ్యాహ్నం నమాజు పూర్తవనిదే ఎంత పనున్నా తోట దగ్గరికెళ్లేవాడు కాదు. ఇలాంటి నమ్మకాల మధ్య పెరిగిన నన్ను కొన్నాళ్లు ఓ పీడకల వెంటాడేది.

భయంకరమైన నీళ్లు ...భూమి ఆకాశాలను తలకిందులు చేస్తూ వచ్చి నన్ను ముంచేసేవి. దాంతో నాలో ఒక భయం గూడుకట్టుకుని ఉండి పోయింది. నాకు చావు వస్తే అది శుక్రవారమే వస్తుందని అది కూడా నీళ్ల ద్వారే వస్తుందని నాలో ఎక్కడో ఏదో మూల ఒక చిన్న అనుమానం.

ఆ అనుమానం, ఆ భయానికి తోడు ఒక జుమ్మా రోజున హైదరాబాద్‌లో ఉండగా మక్కామసీదులో బాంబు బ్లాస్ట్ జరిగింది. ప్రశాంతమైన నమాజులో తెల్లటి జుబ్బాలు నెత్తురోడాయి. చిన్న పిల్లలు చనిపోయారు. నోరు లేని పావురాలు చాలావరకు చనిపోయాయి. ఆ బాధ.. భయం.. అమ్మ.. అన్నీ గుర్తుకొచ్చి రాసిన కథ జుమ్మా. మతానికి మించిన ఆప్యాయతలు ఇంకా ఈ భూమ్మీద చాలా ఉన్నాయని బలంగా చెప్పాలనిపించింది. జుమ్మా కథ రాశాను. ఈ కథ ఈ మధ్యే హిందీలోకి అనువాదమై కేంద్ర సాహిత్య అకాడెమి వాళ్ల ప్రతిష్టాత్మక ద్వైమాస పత్రిక 'సమకాలీన భారతీయ సాహిత్య' లో ప్రచురితమైంది. ఆ సంతోషం అలా ఉండగానే నాకు జుమ్మా కథల సంకలనానికి యువ పురస్కారం ప్రకటించారు.

ఆ అవార్డు తీసుకున్నాక నాకు జుమ్మా అంటే భయం పోయింది. జుమ్మా అంటే చావు కాదు పునర్జన్మ అని నమ్మకం కలుగుతోంది.

జుమ్మాలో పన్నెండు కథలున్నాయి. వాటిని రాయడానికి పదేళ్లు కష్టపడ్డాను. నేను చాలా స్లో రైటర్‌ని. దీనికేదో అవార్డు వస్తుందని నేను రాయలేదు. నాకు బాధ కలిగినప్పుడు ఊరట రచన. దు:ఖం కలిగినప్పుడు ఓదార్పు రచన. నా అశాంతికి ప్రశాంతత రచన. అన్ని సాహిత్య ప్రక్రియల్లోకెల్లా కథా ప్రక్రియ అంటే నాకు చాలా ఇష్టం. జీవిత శకలాన్ని పరిపూర్ణంగా కథలో చెప్పగలమనేది నానమ్మకం.

ఆంధ్రప్రదేశ్‌లో వెనుకబడ్డ ప్రాంతమైన కడపజిల్లాలో ఒక ముస్లిం కుటుంబం లో పుట్టాను నేను. మా నాన్నకు చదువు లేదు. అమ్మకూడా చదువు

లేదు. అమ్మతరపు బంధువులకు కానీ, నాన్న తరపు బంధువులకు కానీ చదువు లేదు. చదువు నా నుంచి మా తరంలో మొదలైంది.

సైకిల్ షాపుల్లో పంచర్లు వేసుకోవడం దగ్గరి నుంచి, టీకొట్టుల్లో పనిచేయడం దగ్గర్నుంచి, కుట్టుమిషన్ నడుపుకోవడం దగ్గర్నుంచి, గల్ఫ్ కంట్రీస్‌కి వలస పోవడం దగ్గర్నుంచి, చిన్నచిన్న వ్యాపారాలు చేసుకోవడం దగ్గర్నుంచి బయట పడి ఇప్పుడిప్పుడే నా కుటుంబం అక్షరం వైపుకు పయనిస్తోంది.

సాహిత్యమంటే ఏంటో మావాళ్లకు తెలీదు. ఎలాంటి అక్షర నేపథ్యం నాకు లేదు. నేను కథ రాస్తే 'తిక్కోడు' అన్నారు మావాళ్లు. నేను ఏ అమ్మ గురించి కథ రాశానో ఆ అమ్మకే తెలియదు నేనేం రాశానో. వాళ్లూ వీళ్లూ చెప్పగా విని, "మా అమ్మముండ ..నాక్కూడా చదువు చెప్పించి ఉంటే నా బిడ్డ రాసిన కథ నేను కూడా చదువుకుని ఉందును కదా.." అని బాధపడేది.

అలాంటి కుటుంబం నుంచి అలాంటి నేపథ్యం నుంచి వచ్చిన నాకు ఈ అవార్డు నిజంగానే ఒక అద్భుతం. భారతదేశంలో సెక్యులరిజం అనే మాటకు రూపమనేది ఏదైనా ఉంటే అది మా ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామీణ ముస్లిమని నేను గర్వంగా చెబుతాను. వాళ్ల జీవితాలనే నేను కథలుగా రాశాను కాబట్టి, వాళ్ల జీవితాలకే ఈ అవార్డు ఇచ్చారని నమ్ముతున్నాను కాబట్టి దీన్ని వాళ్లకే అంకితం చేస్తున్నాను.

# జుమ్మా ముబారక్

'జుమ్మా'కథలసంపుటిలోని కథలు సున్నితంగా, హృదయానికి హత్తుకునేటట్లు గానూ, ఆలోచింపజేసేటట్లు గానూ ఉన్నాయి. రాయలసీమలోని పేద ముస్లింల జీవన విధానాన్ని, సంస్కృతిని అందరికీ తెలిసేటట్లు ఆర్ద్రంగానూ, అందంగానూ రాశారు. ఎక్కడా కసి, కక్షలాంటి వాటిని ప్రదర్శించకుండా, మానవత్వాన్ని మేల్కొల్పే టట్లుగా ఉన్నాయి. ఇటువంటి మంచికథా వస్తువులను తీసుకుని, చదివించే సరళమైన శైలిలో, మంచి శిల్పనైపుణ్యంతో కథలు రాసినందుకు నా హృదయపూర్వక అభినందనలు.

**అబ్బూరిఛాయాదేవి**

*11 డిసెంబరు 2011, హైదరాబాద్*

వస్తువు, శిల్పమూ సమతూకం చెంది, సఫలం పొందిన కథగా చెప్పుకోదగ్గ కథ వేంపల్లె షరీఫ్ పర్దా. ఇందులో మనం చూడవలసిన, సహానుభూతితో అర్థం చేసుకో వాల్సిన జీవిత దృశ్యముంది. దాన్ని ఏమేరకు చెప్పాలో, ఎక్కడ వదిలిపెట్టాలో తెలిసిన నేర్పుతో కథ చెప్పాడు కథకుడు. రచయిత పేరు లేకుండా ఈ కథ చదివి ఉంటే నేను బహుశా ఇది 'ప్రేమ్‌చంద్' కథ అనుకునేవాణ్ని.

**వాడ్రేవు చినవీరభద్రుడు**

*21 నవంబరు 2010, సాక్షి ఫండే*

హైదరాబాద్‌లో మక్కా మసీదులో జరిగిన పేలుళ్ల నేపథ్యంలో వేంపల్లె షరీఫ్ రాసిన 'జుమ్మా' కథ చరిత్రలో ఒక నల్లమచ్చ. ఇలాంటి సమకాలీన సంఘటనల్ని కథారూపంలో ఎప్పకటిప్పుడు అక్షరబద్ధం చేయడం రచయితల బాధ్యత కూడా.

**గొరుసు జగదీశ్వర్ రెడ్డి**

*14 డిసెంబరు 2008, ఆదివారం ఆంధ్రజ్యోతి*

ముస్లింల అస్తిత్వ వేదనను ఆవిష్కరిస్తూనే మానవతా స్ఫూర్తిని రగిలించే ముచ్చటైన కథల సంపుటి 'జుమ్మా'.

**మల్లంపల్లి ధూర్జటి**

*19 మే 2012, ఇండియాటుడే రివ్యూ*

హిందువులు ముగ్గును ఇంటిముందు వేసుకుంటే ముస్లిములు అరచేతుల్లో గోరింటాకుల రూపంలో వేసుకుంటారు. ఒక మతానికి మరో మతానికి మధ్య తేడా ఇంతేనా? ఇంతమాత్రం దానికేనా... ఇన్ని మతఘర్షణలు జరుగుతుంటాయి. 'ఆకుపచ్చ ముగ్గు' కథ ఆద్యంతం ఆలోచింపజేస్తుంది. 'జుమ్మా'లోని కథలన్నీ షరీఫ్ ప్రతిభను, ప్రత్యేకతను పట్టిస్తాయి. వస్తువు, శిల్పము, శైలి, నిర్మాణము షరీఫ్ మట్టిమనిషి అని నిరూపిస్తాయి.

***గంటేడ గౌరునాయుడు***

*11 నవంబర్ 2013, వివిధ, ఆంధ్రజ్యోతి దినపత్రిక*

ముస్లిం స్వరాన్ని తెలుగు కథలోకి ఒక గొప్ప శక్తితో లాక్కొచ్చిన కథకుడు వేంపల్లె షరీఫ్. చెప్పాలనుకున్న వస్తువు మీద సాధికారతా, దానికి తగిన అనువైన భాషా రెండూ కలగలసిన కథనం అతన్ని ఒక భిన్నమైన రచయితగా నిలబెడుతోంది. నిర్మోహమాటంగా చెప్పాలంటే తెలుగులో మైనార్టీ కథనం ఇంకా అంతగా బలపడలేదు. మైనారిటీ రాజకీయాల గురించి, సంవాదం (discourse) గురించి, ముఖ్యంగా కథలో మైనార్టీ స్వరాన్ని ఏస్థాయిలో వినిపించాలన్న విషయంలో ఇంకా స్పష్టత రాలేదు. కానీ, షరీఫ్ కథ చదివాక ఈ రచయిత ఒక బలమైన వ్యక్తిత్వ స్వరంతో తన ఉనికిని చెబుతున్నాడని వెంటనే అర్థమైపోతుంది. 'ఆకు పచ్చముగ్గు' లాంటి కథల్లో ముస్లిం వాస్తవికతను పట్టుకునే ప్రయత్నంతో పాటు, ఆ వాస్తవికతను ఎంతవరకు వ్యాఖ్యానించవచ్చు.. అనే స్పృహ చైతన్య స్థాయికి చేరుకుని కనిపిస్తుంది. కథనంలో తానెంత వరకు జోక్యం చేసుకోవాలో గుర్తెరిగిన రచయిత షరీఫ్. మిగిలిన ముస్లిం కథకులు ఈ విధంగా షరీఫ్ నుంచి నేర్చుకోవాల్సింది చాలానే ఉంది.

**అఫ్సర్**

*2012 -కథావార్షిక పుస్తకానికి ముందుమాట*

ఈ పుస్తకంలోని డజను కథలు కూడా మనకు ఎదురయ్యే డజను కోణాలే. ప్రధానంగా తెలుగు సమాజంలో ఇమిడిపోయిన ముస్లిం కుటుంబాల జీవనలోతుల్ని

సునాయాసంగా కథలుగా రూపొందించాడు రచయిత. రెండు భిన్న సంస్కృతుల మధ్య వైరుధ్యాల్ని భిన్నకథలుగా మలిచిన తీరు ఆశ్చర్యం, ఆనందమూ కలిగిస్తుంది.

**వొరప్రసాద్**

*డిసెంబరు 2012, దసండే ఇండియన్ మాసపత్రిక*

సమస్యను పక్కదారి పట్టించి మూక మనస్తత్వంమీద ఆడుకునే స్వార్థం, ట్రాప్‌లోకి బాధ్యత గల సాహిత్యకారులు పడిపోకూడదు. భయంకర సామాజిక వాస్తవ ముఖ చిత్రాన్ని గీస్తున్నా, మనిషి జీవన విషాద చిత్రపటాన్ని వేస్తున్నా ఉత్తమ కథకుడు మానవ హృదయ ప్రకంపనల్ని మర్చిపోకూడదు. ఈ దృష్ట్యా చూసినప్పుడు వేంపల్లె షరీఫ్ నిక్కంగా ఉత్తమ కథకుడు.

**విహారి**

*27 జనవరి, 2008, ఆదివారం ఆంధ్రప్రభ*

'జుమ్మా'లోని పన్నెండు కథల్లో పది కథలు నాకు నచ్చాయి. నచ్చనివి రెండే- అవి చాపరాయి, అయ్యవారి చదువు. బోధించాలనే ఉబలాటం తెలుగు రచయితలకు చాలాకాలంగా ఉన్న జబ్బు. అది షరీఫ్‌కి కూడా సోకిందని ఈ రెండు కథలు చెబుతాయి. నాకు బాగా నచ్చిన కథ 'పర్దా'. ఇది ప్రపంచస్థాయిలో మంచి కథగా గుర్తించదగింది అని చెప్పగలను. నిజమైన పాత్రలంటే ఈ కథలో జేజిలాగ ఉండాలి.

**ఆరి సీతారామయ్య**

*30 ఆగస్టు 2012, ఈమెయిల్*

అయ్యవారి చదువు, పలక పండగ కథల్లో, బళ్లో చదువుకుంటున్న పిల్లల చిన్న చిన్న అవసరాలు తీర్చడానికి కూడా ఒక్కోసారి తల్లితండ్రులకు ఎంత కష్టమో వర్ణిస్తాడు రచయిత. అయ్యవారిచదువులో పిల్లవాడికి కావాల్సిందల్లా చిన్న సీసాబుడ్డి. సీసామూతికి బొరక బెట్టి, ఒత్తి తొడిగి, ఒక్కరూపాయి కిర్సనాయిలు పోసి ముట్టించి హాయిగా ఒక మూల కూర్చుని చదువుకోవటం. అదీ కలగానే మిగిలిపోతుంది. ఐనా ఆ కుర్రవాడు ఏమీ డీలాపడిపోలేదు. ఈ కథలో తండ్రీ కొడుకుల సంబంధం చాసో 'ఎందుకు పారేస్తాను నాన్న' కథను గుర్తుచేసింది. మనలో చాలామందికి ఎక్కువగా పరిచయం లేని జీవితాలను దగ్గరగా చూపిస్తాయి ఈ కథలు.

**జంపాలచౌదరి**

*7 డిసెంబర్ 2011, పుస్తకం డాట్ నెట్*

ఇంత అచ్చమైన ముస్లిం జీవితం ఉన్న కథలు నేను కన్నడలోనూ చదవలేదు. ఉన్న దున్నట్టు జీవితాన్ని పచ్చిగా చిత్రించిన కథలు జుమ్మా. ఎలాంటి ముసుగు, మొహమాటం లేకుండా స్వచ్ఛంగా నేల మీద నిలబడి మాట్లాడే గొంతు నాకు నచ్చింది. మామూలుగా చదువుదామని తీసుకున్న కథలు తర్వాత నన్ను మామూలుగా ఉండనివ్వలేదు. మతం కన్నా మానవత్వం ముఖ్యమని చెప్పిన జుమ్మా, మతాల మధ్య అంతరాలు చాలా చిన్నవని, ఇంత చిన్న వాటికోసం ఇంతింత పెద్ద గొడవలు ఎందుకని చెప్పిన ఆకుపచ్చముగ్గు..ఒక్కటేమిటి ప్రతికథ అద్భుతం. ఇందులో ఉన్నవి పన్నెండు కథలు కాదు పన్నెండు జీవితాలు.

**సృజన్**

*జుమ్మా కథల కన్నడ అనువాదకుడు*

Shariff has provided voice to a section of the society rich in legend but poor in visibility. I would love any day to talk to his rebellious grandma and return fulfilled. Rupayi kodi Pilla is a moving children's story. It is difficult not to open a conversation with the One-rupee-Chicks, like Nakata conversing with cats in Murakami's Kafka On The Shore. A mother's anxiety borne of parental love compels the reader to share her angst for her son praying at the Jumma masjid rocked by blasts in the neighborhood. Shariff has evolved a style that, like the metaphor, accentuates the understanding of his tracts.

***Dasu Krishnamoorty***

Translator of JUMMA stories

'ఆకుపచ్చ ముగ్గు' కథలో విశ్వజనీనత ఉంది. చిన్నచిన్న మాటల్లో ఘాటైన సందేశం ఉంది. ఈ కథలోని అక్క పాత్ర తెనాలి రామలింగకవి కావ్యంలోని నిగమశర్మ అక్క పాత్రను గుర్తుకు తెస్తుంది. నిగమశర్మ అక్క అనేక అంశాలపై ఉద్బోధలు చేస్తుంది. కానీఈ కథలో అక్క పాత్ర సందేశసారాన్ని జీవితంలోకి ఇంకించుకుని మసలుతుంది. సాదాసీదా జీవితంలో కొండంత అవగాహన చూపుతుంది. ఆనందాలు, చిన్నచిన్న సంతోషాలు మతాలకు, కులాలకు అతీతమని నమ్మడమే కాదు అందరూ నమ్మేలా ప్రవర్తిస్తుంది. ఈ కథ ఒకటికి పదిసార్లు చదివి ఉంటాను. ఎందుకో ఈ కథ దాటి ముందుకెళ్లాలంటే మనసొప్పదు.

***సాయిబ్రహ్మానందం గొర్తి***

*13 మార్చి 2013, ఫేస్‌బుక్*

# రేడియో అభిప్రాయాలు

(నవంబరు 22, 2013 - ఫిబ్రవరి 14, 2014)

*వారం వారం వివిధ ప్రముఖుల అభిప్రాయాలతో నా కథల్ని వరుసగా నాలుగు నెలలపాటు సీరియలైజ్ చేసి నన్ను మా ఊరికి సరికొత్తగా పరిచయం చేసిన కడప ఆలిండియా రేడియో మిత్రులు ఏ. విజయభాస్కర్‌రెడ్డికి, అక్కడి సిబ్బందికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు...*

# మతాన్ని మానవీయ కోణంలో చూపే కథలు

## సింగమనేని నారాయణ

ముస్లిం మైనార్టీల జీవితం కేంద్రంగా విభిన్న సామాజిక పార్శ్వాలను ఆవిష్కరించిన కథలు ఇవన్నీ. ఇటీవలి కాలంలోనే ముస్లిం మైనార్టీ సాహిత్య పాయ తెలుగు సాహిత్యంలోకి ప్రవేశించింది. ప్రవేశించగానే దూసుకుపోయింది. కవిత్వంతో ప్రారం భమై కథగా విస్తరించింది ఈ పాయ. తొలి తెలుగు ముస్లిం మైనార్టీ కథకుడు షేక్ హుస్సేన్ సత్యాగ్నితో కథా ప్రారంభం జరిగి కొంత నిశ్శబ్దం తర్వాత గత పది సంవత్సరాలుగా కథ విస్తృతం కావటం ఆహ్వానించదగ్గ పరిణామం. ముస్లిం కుటుంబాల జీవితాలు, ఆచార వ్యవహారాలు, తిండీ తీర్థం, కట్టుబాట్లు, సంస్కృతీ సంబంధాలు ఇలాంటివేమీ చాలామందికి ఇప్పటికీ తెలియవు. ఒక నిర్దిష్టమైన వృత్తివారికి లేకపోవటం వల్ల వృత్తిగతంగా కూడా వాళ్లను అంచనా గట్టడానికి వీల్లేని పరిస్థితి ఇప్పుడు ఉంది. ఇవన్నీ బహిర్గతం కావాలంటే ఆ పని ఆ ముస్లిం కుటుంబాల నుంచి వచ్చిన రచయితల వల్లే సాధ్యమవుతుంది. ఆ పనిని వేంపల్లె షరీఫ్ జుమ్మా కథల ద్వారా చేయగలిగినాడు.

ముస్లిం కుటుంబాల పేదరికం ఒక సామాజిక శాపం. జీవితాలను పేదరికం శాసిస్తుంది, శపిస్తుంది. మానవ సంబంధాలను మంటగలుపుతుంది. హిందూ కుటుం బాల పేదరికానికి ముస్లిం కుటుంబాల పేదరికానికి ఒక మౌలికమైన వ్యత్యాసం ఉంది. ఆ వ్యత్యాసాన్ని ఈ కథలు బహిర్గతం చేస్తాయి. పాత ఆచారాలకు కట్టుబడి ఉండటం, కొత్త ఆచారాలను స్వీకరించలేకపోవడం ఇదంతా ఒక మనోవేదన. ఈ వేదనను 'జుమ్మా' కథలు మనకు అర్థమయ్యేలా చెబుతాయి. మనకు ఇప్పటికీ లౌకిక భావనలు వంటబట్టడం లేదు. ముస్లిములను పరాయి మతస్తులుగా భావించే లేదా పరాయి మనుషులుగా భావించే ఒక దౌర్భాగ్య మనస్తత్వం ఇప్పటికీ చాలామందిలో ఉంది. జుమ్మాలోని

కథలు వింటే లౌకిక భావనల అవసరం సమాజానికి ఎంత ఉన్నదో అర్థమవుతుంది. మతం పేరుతో జరిగే విధ్వంసాలను చూడవలసిన దృష్టిని కూడా ఈ కథలు నిర్దేశిస్తాయి. మతాన్ని మానవీయకోణం నుంచి చూడాల్సిన చూపును ఈ కథలు ప్రసాదిస్తాయి. రాయలసీమ ప్రాంతానికి చెందిన ముస్లిం రైతులు ఎదుర్కొనే వ్యవసాయ సంక్షోభాన్ని కూడా ఈ కథలు ఒక కొత్త కోణం నుంచి చూపెడతాయి.

సామాజిక, సామూహిక, సత్ప్రవర్తనను అలవర్చు కోవాల్సిన వర్తమాన స్థితిని ఈ కథలు గుర్తుచేస్తాయి. ఒక మహా సమూహంలో ఉండి కూడా ఒంటరిగా జీవితాలను వెళ్లబుచ్చాల్సిన ఒక దౌర్భాగ్యస్థితి ఈ దేశంలో ముస్లిములకు ఉండటాన్ని ఈ కథలు ప్రశ్నిస్తాయి. ఈ కథలన్నీ విన్న తర్వాత శ్రోతల మానసిక ప్రపంచం విశాలమవుతుంది. ఒక సామాజిక, సాంస్కృతిక వారధి మీద మనం ప్రయాణం చేస్తాం. 'మతం వేరైతేనేమోయ్.. మనసులొక్కటై మనుషులు ఉంటే' అన్న మహాకవి గురజాడ మాటలను జుమ్మా కథలు నిజం చేస్తాయి.

*నవంబరు 22, 2013*

# మురికిని కడిగేస్తాయి

## రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి

రాయలసీమ ముస్లింమైనార్టీ కథను బలోపేతం చేస్తాయి 'జుమ్మా' కథలు. సత్యాగ్ని, శశిశ్రీల తర్వాత ఆ కథానికను సుసంపన్నం చేస్తున్న రచయిత వేంపల్లె షరీఫ్. షరీఫ్ ప్రపంచాన్ని విమర్శనాత్మకంగానే చూస్తున్నారు. 'జుమ్మా' కథే ఇందుకు మంచి ఉదాహరణ.

ఈ రచయిత తనదైన ముస్లిం మైనార్టీ జీవితాన్ని చిత్రిస్తూనే తన చుట్టూ వున్న ఇతరుల జీవితాన్ని కూడా చిత్రించడం అభినందించాల్సిన విషయం. 'రజాక్ మియా సేద్యం' కథలో ముస్లిం రైతును, 'జీపొచ్చింది' కథలో హిందూ రైతును చిత్రించారు. మతాలు వేరైనా రైతుల జీవితం మాత్రం ఒకలాగే ఉంటుందన్న సత్యాన్ని ఈ రెండు కథలు చాటి చెబుతాయి. విశాల దృక్పథం ఉన్న రచయిత మాత్రమే ఈ పని చేస్తాడు.

మతం మనుషుల మనుగడకు అపాయకరంగా మారేదైతే, ఆ మతంపట్ల మనుషుల అభిప్రాయాలు ఎలా ఉంటాయో చెబుతుంది 'జుమ్మా' కథ. 'తెలుగోళ్ల దేవుడు', 'పర్దా' అనే రెండు కథలు షరీఫ్ మతాన్ని కూడా విమర్శనాత్మకంగానే చూస్తాడు అని తెలియజేస్తాయి. 'ఆకుపచ్చముగ్గు' కథ మత సామరస్యానికి ప్రతీక. 'పలక పండుగ', 'అయ్యవారి చదువు' ఈ రెండు కథలు అవసరాలకు, అభిలాషలకు మధ్య ఏర్పడే ఖాళీని చిత్రించాయి.

'అంజనం' అనే కథ మూఢనమ్మకాలకు, అవసరాలకు గల సంబంధాన్ని ఆవిష్కరించింది. సమాజం పరివర్తన చెందాలి అనేది కథారచయితగా షరీఫ్ లక్ష్యం. అందుకు ఆయన కథను గొప్పసాధనంగా చేసుకున్నారు. షరీఫ్ కథలు ఆలోచనను కలిగిస్తాయి తప్ప ఆవేశాన్ని పెంచవు. పాఠకుడి లేదా శ్రోత సంస్కారంలో గొప్పమార్పును తీసుకొస్తాయి షరీఫ్ కథలు. 'జుమ్మా' కథలు చదివితే మనల్ని మనం స్వచ్ఛం చేసుకోవడానికి మురికిని కడుక్కోవడానికి అవకాశం కలుగుతుంది.

*నవంబరు 29, 2013*

# సహానుభూతిని రగిలించే కథలు

## కుప్పిలి పద్మ

వేంపల్లె షరీఫ్ కథలు చదివినప్పుడు నాకు స్పష్టంగా అర్థమైంది ఏందంటే ఈయన అసలు సిసలైన అచ్చమైన రాయలసీమ తెలుగు జీవితాన్ని కథలుగా మలుస్తున్నాడని. ఎవరి అస్తిత్వం గురించి వాళ్లు, ఎవరి కథలను వాళ్లు రాసుకో వడం అనేది మొదలై చాలా సంవత్సరాలే అయింది. ఆ క్రమంలోనే ముస్లిం అస్తిత్వం గురించి చాలా కథలు మన తెలుగు కథా ప్రపంచంలోకి వచ్చాయి. అయితే షరీఫ్‌కు ఒక స్పష్టమైన గొంతు ఉంది. అందుకే ఈయన కథలు అసలు సిసలైన తెలుగు కథలుగా అనిపిస్తాయి. ఈ కథల్లోని పాత్రలు, వాటి ముఖాలు మనకు బాగా తెలిసిన వాళ్లవిగా అనిపిస్తాయి. అయితే మనం రోజూ చూస్తూ మనకు బాగా తెలుసు అను కునేవాళ్ల అంతరంగం గురించి మనకేమీ తెలీదనే సత్యాన్ని కూడా ఈ కథలు చెబుతాయి.

'పర్దా' చదివితే అందులో జేజి పాత్రకి ఒక స్త్రీ స్వేచ్ఛాజీవితం మీద ఎంత మమకారం ఉంది అనే విషయం తెలుస్తుంది. ఉగ్రవాదం అంటే మనం అది చాలా పెద్ద పెద్ద విషయాల్లో ఉంటుందని అనుకుంటాం. కానీ 'జుమ్మా' కథ చదివాక చాలా సింపుల్‌గా కనిపించే రోజువారీ జీవితాల్లో ఉగ్రవాదం అనేది ఎంతగా పెనవేసుకుపోయింది అన్న విషయం బోధపడుతుంది. అలాగే మనం కలసిమెలసి ఒక చోట బతుకుతున్నప్పుడు ఒకరి సంస్కృతీ సంప్ర దాయాల ప్రభావం మరొకరిపై పడుతుంది. 'ఆకుపచ్చ ముగ్గు' కథ చదివినప్పుడు అది స్పష్టంగా తెలుస్తుంది.

షరీఫ్ రాయలసీమ నుంచి వచ్చిన మనిషి. అక్కడి పల్లె ప్రాంతాలు బాగా తెలిసిన మనిషి. 'రజాక్‌మియాసేద్యం' కథలో కరువు మీద రాయడం,

‘జీపొచ్చింది’ కథలో సేద్యం మీద రాయడం చూస్తే మనకి మన ప్రాంతం పట్ల, మనం పెరిగి వచ్చిన వాతావరణంపట్ల మంచి పట్టు, ప్రేమ ఉన్నప్పుడు కథలు ఎంత బలంగా వస్తాయన్నది అర్థమవుతుంది. అలాగే ఈయన కథల్లో ఎక్కువ భాగం పేద ముస్లింపిల్లలకి చదువు ఒక సమస్యగా పరిణమించడం కనిపి స్తుంది. ఈ రచయితకి కొత్తతరం పిల్లలపట్ల ఆ పిల్లలకివ్వాల్సిన చదువుపట్ల ఎంత ఆసక్తి ఉందనేది అర్థమవుతుంది.

అసలు ఏ కథకులైనా సరే చిన్నచిన్న విషయాల నుంచే పెద్దపెద్ద ప్రపంచ విషయాలు మనకు అవగాహన చేస్తుంటారు. షరీఫ్ కూడా చిన్న కథల్లో పెద్ద విషయాలను చాలా సునాయాసంగా రాసేస్తారు.

అంతేకాకుండా అస్తిత్వాల మీద రాస్తున్నప్పుడు చాలాసార్లు మనం ఎదుటి వాళ్ల మీద దాడి చేస్తుంటాం. కానీ షరీఫ్ అలా చేయరు. ‘ఇది నా కథ... నా జీవితం... ఇలాంటి జీవితాలు చాలా ఉన్నాయి..ఈ విషయాల మీద మీరూ ఆలోచిం చండి’ అని మృదువుగా చెబుతారు. కానీ చెప్పే విషయాన్ని చాలా స్పష్టంగా, సీరియస్‌గా చెబుతారు.

తర్వాత ఈయన కథల్లో మనకి బాగా ముద్దొచ్చే విషయం ఏంటంటే ఆయన భాష. ఏమీ తడుముకోకుండా అలాగ హాయిగా చదువుకుని వెళ్లిపోతూ ఉండొచ్చు. కచ్చితంగా షరీఫ్ కథాప్రపంచంలో ఒక మంచి రచయిత. ఆయన కథలు చదవడం వల్ల మానసికంగా కూడా మనకు ఒక యాక్టివిటీ మొదలవుతుంది.

*డిసెంబర్ 6, 2013*

# సమాజపు సమతౌల్యాన్ని కాపాడుతాయి

మధురాంతకం నరేంద్ర

వాదం కోసం కాకుండా తన జీవితంలోంచి వచ్చిన సంఘటనల ఆధారంగా సమాజపు సమతౌల్యాన్ని కాపాడుతూ రాస్తున్న అతికొద్దిమంది మంచి కథకుల్లో వేంపల్లె షరీఫ్ కూడా ముఖ్యుడు. భారతదేశపు సంప్రదాయమైనటువంటి ఒక గొప్ప సూఫీమతపు వారసుడిలాగ షరీఫ్ కనిపిస్తాడు. ఆయన రాసిన కథలన్నింటిలోనూ సహజీవన సౌభాగ్యమే వెల్లి విరుస్తుంది. ఆయన మనిషినే ప్రేమిస్తాడు. మనిషి ముందొచ్చాడు. మతం తర్వాత వచ్చింది. మతంకన్నా మనిషే ముఖ్యమైనవాడు.

'జుమ్మా' అనే కథలో ఆయన ఒక తల్లి పడే బాధల్ని చిత్రీకరించారు. ముస్లిమైనా హిందువైనా, క్రిస్టియన్ అయినా ఎవరైనా తల్లి తల్లే. తల్లి తన బిడ్డనే కాపాడుకోవాలనుకుంటుంది. అలాగే ఆయన అనేక కథల్లో ముస్లిం భారతీయ సంప్రదాయాలు రెండూ కలసిపోవడం వల్ల వచ్చేటటువంటి ఒక గొప్ప సంప్రదాయపు విలువల్ని ప్రతిష్టించేలాగ కథలు రాస్తాడు. అయితే ఇవి నినాదభరితంగా, ఏదో ఒక నీతి చెప్పే కథల్లాగ ఉండవు. జీవితంలోంచి తీసుకోవడంవల్ల ఆ కథలు చాలా సహజంగా చాలా ప్రతిభావంతంగా ఉంటాయి.

నిజానికి హిందూ ముస్లిముల సహజీవన సౌభాగ్యం మన రాయలసీమలో బాగా కనిపిస్తుంది. అటువంటి ప్రాంతం నుంచి వచ్చినటువంటి షరీఫ్ రాసే కథలన్నీ ఈ ప్రాంతపు జీవితానందాన్ని, వాళ్ల కష్టాల్ని, వాళ్ల మంచి చెడులన్నింటినీ స్పష్టంగా ప్రతిఫలిస్తూ వస్తున్నాయి. ఆయన నడుస్తున్న దారి చాలా మంచి దారి. ఆ దారిలో ఆయన మరింత రాణించి మరింత బాగా కథలు రాయగలడనే ఆశ, ఆకాంక్ష నాకున్నాయి.

*డిసెంబర్ 13, 2013*

# సామాన్యంగా అనిపించే అసామాన్య కథలు

ఇంద్రగంటి జానకీబాల

ఏ కథావస్తువు తీసుకున్నా తనదైన శిల్పం, శైలితో అద్భుతంగా కథను నడిపే నేర్పుగల రచయిత వేంపల్లె షరీఫ్. మధ్యతరగతి, ఇంకా దిగువన వున్న ముస్లిం కుటుంబాలలోని అనేక అంశాలు ఆయన ఈ కథల్లో బాగా చెప్పారు. జుమ్మా, పర్దా, పలక పండుగ ఇలా అన్నిట్లోనూ ఏదో ఒక విషయాన్ని లోతుగా చెప్పి పాఠకుల్ని ముగ్ధుల్ని చేస్తారు. ఈయన శైలిలో ఆర్భాటం ఉండదు, అతిశయోక్తి ఉండదు. సామాన్యుడి మనసులాగ అతి సామాన్యంగా, స్వచ్ఛంగా ఉండి అత్యంత లోతులను చూపిస్తుంది. గోరింటాకు పెట్టే అక్క, దానిమీద ఆమె మక్కువ. ముసలి జేజి పర్దాను తిరస్కరించే విధానం, దస్తగిరి చెట్టులోని పిల్లాడు అల్లాను ప్రార్థించే తీరు- ఇవన్నీ చాలా చిన్నగా చెబు తున్నట్టుగానే ఉండి పెద్దగా మనసును హత్తుకుంటాయి. వాటి గురించి ఆలో చించేటట్టు చేస్తాయి. రచయిత ఏ విషయం చెప్పినా బలంగా చెబుతారు. వేంపల్లె షరీఫ్ రాసిన కథలన్నీ చాలా చాలా అద్భుతంగా ఉన్నాయని నాకు అనిపించింది.

*డిసెంబరు 20, 2013*

# హిందూ ముస్లిముల కథలు

*బా రహమతుల్లా*

ముస్లిం- నాన్ ముస్లిం జీవితాలను కలగలిపి వైవిధ్యభరితంగా కథలు చేస్తున్న యువకుడు వేంపల్లె షరీఫ్. ఇతని కథలు వాస్తవికతకు, సహజత్వానికి దగ్గరగా ఉంటాయి. కథల నిండా ఆరోగ్యకరమైన ఆలోచనలు, సామరస్యపూరితమైన వ్యక్తీకరణలు కనిపిస్తాయి. ఈ కథల్ని చదువుతున్నప్పుడు, వింటున్నప్పుడు మనకు తెలియకుండానే వాటిల్లో లీనమవుతాం.

షరీఫ్ కథలు చాలా వరకు యవ్వనోద్వేగంలో రాసినట్టుగా ఉంటాయి. అతని కథావస్తువుల ఎన్నిక, కథల్లో చూపించిన శిల్ప నైపుణ్యం అతనిలో ఉన్న మంచి రచయితను మనకు చూపిస్తాయి. ముగ్గు హిందూ సంప్రదాయానికి, ఆకుపచ్చరంగు ముస్లిం సంప్రదాయానికి ప్రతీకలు. షరీఫ్ కథల సారాంశం ఆకుపచ్చముగ్గే. షరీఫ్‌కథల నేపథ్యం ఆకుపచ్చముగ్గే. ముస్లిం జీవిత కథల్ని ముస్లిం సామాజిక వర్గంలోనుంచి రాసిన, రాస్తున్న కథకులంతా ఆకుపచ్చ ముగ్గులే. కులం, మతం, ప్రాంతం మొదలైన వాటి ప్రభావాలకు అతీతంగా జీవితం యొక్క ఆత్మ ఒక్కటే ఈ కథల్లో ఉంది. ముస్లిం నేపథ్యం ఉన్న పాత్రలు, విషయాలు కథల్లో బాహ్యంగా అలా కనిపిస్తున్నప్పటికీ అంతర్గతంగా సారాంశం ఒక్కటే. బిన్నత్వంలో ఏకత్వం ఉన్న ఆకుపచ్చముగ్గులు ఈ కథలు.

*డిసెంబరు 27, 2013*

# పాజిటివ్ దృక్పథాన్ని కలిగిస్తాయి

## వినోదిని

'జుమ్మా'లోని పన్నెండు కథల్లో కొన్ని కథలు కొన్ని స్వభావాల్ని మరికొన్ని కథలు ఇంకొక స్వభావాన్ని కలిగి ఉన్నాయి. వాటిల్లో మొట్టమొదటివరుసలో చెప్పుకోవాల్సిన కథలు రెండు. అవి పర్దా, ఆకుపచ్చముగ్గు. ఇదే వరుసలో చెప్పుకోవాలనుకుంటే మరో కథ దస్తగిరి చెట్టును కూడా ఇక్కడ చేర్చవచ్చు. ఈ మూడు కథల్లో రచయిత సాంస్కృతిక సంఘర్షణను ఎలా వెలువరించాడో చూడవచ్చు. మైనార్టీ మతస్తులు మెయిన్ స్ట్రీమ్ మతమైన హిందూ మతస్తులతో కలసి జీవించేటప్పుడు వాళ్ల సాంస్కృతిక అంశాలతో ఇమడలేక పోవడం, ఒకవేళ ఇమడాలని అనుకున్నా సమాజం వీళ్లని ఇమడనివ్వక పోవడం అనేది ఈ కథల్లో ప్రధానంగా కనిపిస్తుంది.

ఇక పలక పండగ, రూపాయి కోడిపిల్ల, జీపొచ్చింది, అయ్యవారి చదువు వంటి కథల్లో పేదరికం బాగా కనిపిస్తుంది. ముస్లిం జీవితాల్లో ఉన్న పేదరికం, దాని వలన పడే కష్టనష్టాలు అవి తన పసి జీవితంలో ముద్రించుకుపోయిన విధానాన్ని రచయిత పెద్దయ్యాక ఆవిష్కరిస్తున్నట్టు మనకు అనిపిస్తుంది.

అలాగే ఈ కథల్లో అభద్రత అనే అంశం మీద వచ్చినవీ ఉన్నాయి. వాటిల్లో బాగా చెప్పుకోవాల్సింది 'జుమ్మా'. రెండవది 'తెలుగోళ్ల దేవుడు'. అభద్రత మనుషుల్లో ముఖ్యంగా మతం కారణంగా క్రైస్తవులు, ముస్లిముల్లో ఎక్కువగా కనిపిస్తూ ఉంటుంది. ఎక్కడ బాంబు పేలినా తామే ఆ బాంబు పెట్టినట్టు ముస్లిములు వణికిపోతూ ఉంటారు. ఎక్కడ తమమీద ఇతర మెజార్టీ మతస్తులు దాడి చేస్తారోనని అభద్రతతో కొంతమంది క్రైస్తవ మైనార్టీలు కూడా ఉన్నట్టుగా వాళ్ల సాహిత్యం చదివితే అర్థమవుతుంది.

వేంపల్లె షరీఫ్ కథల్ని పరిశీలించినప్పుడు అతని టోన్ చూస్తే డౌన్ టోన్‌గా మనకు అర్థమవుతుంది. తనను తాను సబ్‌మిట్ చేసుకుంటూ ఎదురుగా ఉన్న సమాజాన్ని సెన్సెటైజ్ చేసే దిశగా ఇతను కథని ప్రయాణింప జేస్తున్న ట్టుగా మనకు అనిపిస్తూ ఉంటుంది. అంటే హక్కుగా కొన్నింటిని సాధించుకోవాల్సి వస్తే వాటిని హక్కుగా కాకుండా ఎదుట వాళ్ల హృదయాల్లో సున్నితపు పొరల్ని నిద్రలేపి ఆ సున్నితత్వపు పొరల వైపు నుంచి సమాజ సమానత్వాన్ని సాధించడం కోసం ప్రయత్నం చేసే దిశగా వేంపల్లె షరీఫ్ కథలు ప్రయాణం చేస్తున్నాయని చెప్పొచ్చు. ఈ కథలు పాజిటివ్ ఆలోచనల్ని, పాజిటివ్ దృక్పథాలను ప్రజల్లో కలిగిస్తున్నాయి.

*జనవరి 10, 2014*

# కథారచయిత యవ్వనదశను చూపుతున్న కథలు

కొలకలూరి ఇనాక్

షరీఫ్ తన జుమ్మా కథల సంకలనంలో మహమ్మదీయ సంస్కృతిని, వారి కుటుంబాల జీవన విధానాన్ని చాలా చక్కగా చిత్రించారు. ఆర్ద్రమైన రచన, కరుణ రసాత్మకమైన భావన, సుకుమారమైన లిపి, సుకుమారమైన వ్యక్తిత్వం ఈ కథల్లో ఉన్న గుణాలు. దయనీయంగా ఉన్న మహమ్మదీయుల జీవితం పట్ల శ్రోతలకు దయ, కరుణ, ప్రేమ, అనుకంప కలిగేటట్టుగా కథలు వున్నాయి. వీటిల్లో ఆవేశం గానీ, కోపం కానీ, కసి గానీ లేవు. పీడింపబడే వాళ్లు సాధారణంగా కోపతాపాలు చూపించడం సహజం. అటువంటి ధోరణి లేకుండా సుకుమారంగా సామరస్యంగా  కథలను అల్లిన వేంపల్లె షరీఫ్‌ని నేను హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను. అతనికి కేంద్రసాహిత్య అకాడెమి 'యువరచయిత పురస్కారం' అందించడం చాలా ముదావహమైన విషయం. కథరచయితగా, కథారచనశిల్పం తెలిసిన సాహితీ మర్మజ్ఞుడుగా గొప్ప భవిష్యత్తుని, గొప్ప అభ్యుదయాన్ని షరీఫ్ పొందుతాడని హృదయ పూర్వకంగా భావిస్తున్నాను. తెలుగు సాహిత్యం మంచి కథారచయిత యవ్వనదశను చూస్తూ ఉంది. మున్ముందు బండబారిన వయసులో అద్భుతమైన సాహిత్యాన్ని అతను సృష్టిస్తాడని నేను ఆశిస్తున్నాను. కథలో ఉన్న విషయాల జోలికి పోవడం లేదు. భాషా రచన కూడా చెప్పడం లేదు. ఎందుకంటే శ్రోతలు వింటారు... వారే అభిప్రాయాలు ఏర్పరచుకుంటారు.

*జనవరి 17, 2014*